# క్రాంతి


### లోపలి పేజీల్లో


ధరల పెరుగుదల..........5
రిజర్వేషన్ల పై..........11
మేధావులకు విజ్ఞప్తి..........18
ఎ.ఓ.బి నిర్బంధం..........20
వరద బాధితులు..........28
ఆజాద్ ఇంటర్వ్యూ..........మధ్యపేజీ
పంచాయితీ ఎన్నికలు..........42
విద్యార్థులపై లాఠీ-ఛార్జి..........46
బాక్సైట్ వ్యతిరేక పోరాటాలు..........47
ఎర్రబోరు ఘటన..........56



సి.పి.ఐ (మావోయిస్టు) ఎ.పి, ఎన్.టి, ఎ.ఒ.బి కమిటీల అధికార పత్రిక

సంపుటి : 30    సంచిక : 4    జూలై - ఆగస్టు 2006    వెల: ఐదు రూపాయలు


## కార్మికరాజ్య స్థాపనకై కదన రంగాన ఒరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కామ్రేడ్ బుర్రా చిన్నయ (మాధవ్), ఇతర నల్లమల కామ్రేడ్స్ వీరోచిత అమరత్వాన్ని ఎత్తిపట్టండి!

పాలక వర్గాలు తమ దోపిడీ ప్రయోజనాలను కాపాడుకోవడంలో భాగంగా దేశవ్యాప్తంగా మావోయిస్టు ఉద్యమం పై తీవ్ర అణచివేతను ప్రయోగిస్తున్నాయి. అందులో భాగంగా సామ్రాజ్యవాదానికి కావలి కుక్కగా మారిన వై.ఎస్ ప్రభుత్వం, దాని కనుసన్నలలో ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టు ఉద్యమంపై మునుపెన్నడూ లేనంత అణచివేతను ప్రయోగిస్తోంది. రకరకాల కుటిల ఎత్తుగడలతో, ఆధునిక ఆయుధాలతో పకడ్బంధీగా సమకూర్చుకున్న సమాచార వ్యవస్థతో విచ్చల విడిగా పెంచుకున్న పోలీస్, సి.ఆర్.పి.ఎఫ్ బలగాలతో విప్లవకారులపై హత్యాకాండకు పాల్పడుతోంది. ఈ హత్యాకాండలో భాగంగా కొద్ది రోజుల క్రితం అరెస్టయిన ఒక దళ సభ్యుడు ఇచ్చిన సమాచారంతో జూలై 23వ తేదీన నల్లమల అటవీ ప్రాంతంలో నెక్కంటి-దారబైలు గ్రామాల మధ్యన మకాం వేసిన రాష్ట్ర కమిటీ రక్షణ ప్లటూన్‌పై 800 మంది గ్రేహౌండ్స్ బలగాలు విచక్షణా రహిత దాడికి పాల్పడ్డాయి. ఈ దాడిని వీరోచితంగా తిప్పికొట్టే ప్రయత్నంలో హోరా హోరీగా పోరాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కా॥ మాధవ్ అమరుడయ్యాడు. ఈ దాడిలో కామ్రేడ్ మాధవ్‌తో పాటు ఆయన గార్డు కా॥ రమేష్, ఎ.సి సభ్యురాలు కా॥ సుశీల, సెక్షన్ కమాండర్ కా॥ శ్యామల, జె.ఎన్.ఎం.సభ్యురాలు కా॥ పార్వతి, దళ సభ్యులు కామ్రేడ్స్ మల్లికార్జున్, మమత, సీత (పార్వతి)లు కూడా వీరమరణం పొందారు. మన దేశ గడ్డ నుంచి సామ్రాజ్యవాదం, భూస్వామ్యం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారి విధానాలను



కూలదోసి నూతన ప్రజాస్వామిక సమాజం నెలకొల్పడం కోసమూ, సోషలిజం, కమ్యూనిజాలు సాధించడం కోసమూ జరుగుతున్న ప్రజాయుద్ధ క్రమంలో తమ జీవితాలను అర్పించారు. ఈ కామ్రేడ్స్ మరణానికి బదులు తీర్చుకుంటామనీ, వర్గరహిత సమాజాన్ని నెలకొల్పడం కోసం వారు కన్న కలలను పరిపూర్తి చేస్తామని ప్రతినబూనుదాం.

కా॥ మాధవ్(54) కదనానికి మారుపేరైన కరీంనగర్ జిల్లా మంగపేట గ్రామంలో పుట్టాడు. తన సొంత పేరు బుర్రా చిన్నయ్య. రైతు కుటుంబంలో పుట్టిన కా॥ మాధవ్ పెద్ద చదువులు చదువుకోలేక పోయాడు. 7వ తరగతి వరకు చదువుకొని వ్యవసాయ వృత్తిని చేపట్టాడు. అతను నవయువ్వనంలోకి అడుగుపెడుతుండగా 1978లో ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో

రైతాంగ పోరాటాలు ఉవ్వెత్తున లేచాయి. శతాబ్దాలుగా పాతుకుపోయిన భూస్వామ్య వ్యవస్థను కుదిపివేస్తూ ఆ జ్వాలలు ఉత్తర తెలంగాణా అంతటికీ కార్చిచ్చుల వ్యాపించాయి.

ముందుకు సాగుతున్న ఉత్తర తెలంగాణా సాయుధ వ్యవసాయ విప్లవోద్యమం పవనాలు కామ్రేడ్ మాధవ్‌ను సహజంగానే ఆకర్షించాయి. క్రమంగా తాను ఉద్యమాల్లో భాగమయ్యాడు.

1980లో రాడికల్ యువజన సంఘంలో చేరి భూస్వాముల పెత్తనానికీ, ఆగడాలకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేస్తూ పోరాటాలను నిర్వహించాడు. అతని పోరాట సామర్థ్యం అతి తొందరలోనే అతన్ని యువజన సంఘం నాయకుడిగా మలిచింది అతన్ని. ప్రజా పోరాటాలతో పిచ్చెక్కిన ప్రభుత్వం తీవ్రమైన నిర్బంధాన్ని తీసుకువచ్చింది. అందులో భాగంగా ఇంద్రవెల్లిలో ఆదివాసీ ప్రజానీకంపై అమానుష హత్యాకాండకు పాల్పడింది. ఈ కాలంలోనే 1983లో కా॥ మాధవ్‌ను అరెస్టు చేసి 6 నెలలు జైల్లో పెట్టింది. ఈ నిర్బంధం కా॥ మాధవ్‌లోని విప్లవకారుడిని మరింత పదునెక్కించింది. ఏ సామాజిక మార్పును సహించలేక ప్రభుత్వం ఇంద్రవెల్లిని జలియన్‌వాలాబాగ్‌గా మార్చిందో ఆ సామాజిక మార్పు బాధ్యతను భుజాన వేసుకొని, జైల్ నుంచి విడుదలైన కా॥ మాధవ్ పూర్తికాలం పార్టీ కార్యకర్తగా మరింత ముందుకు నడిచాడు.

చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజా పోరాటాలను లేవదీశాడు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ రైతుకూలీలనూ, యువజనులనూ, సంఘాలను సంఘటితపర్చాడు. కూలీ రేట్ల పోరాటాలకూ, భూ పోరాటాలకు నాయకత్వం వహించాడు. భూస్వాముల ఆక్రమణ కింద వున్న భూముల్లోకి ప్రజలను కదిలించి పంపిణీ చేయించాడు. ఇంతలో రాష్ట్రంలో అధికారం పార్టీలు మారింది. నక్సలైట్లే దేశభక్తులంటూ అధికారంలోకి వచ్చిన ఎన్.టి రామారావు అతి త్వరలోనే మాట మార్చి ఉద్యమంపై నిర్బంధ నిప్పులను కురిపించాడు. కామ్రేడ్స్ హరిబూషణ్, ఆత్రం అశోక్, పల్లె కనకయ్యలను నక్సలైటు వ్యతిరేక దళాలచే హత్య చేయించాడు. ఈ క్రమంలో కా॥ మాధవ్‌పై సహితం నిర్బంధం పెరిగింది. తీవ్ర నిర్బంధం నుంచి ఉద్యమాన్ని రక్షించుకోవడంలో భాగంగా ఉద్యమాన్ని విస్తరింప చేయాలని పార్టీ నిర్ణయించింది. పార్టీ పిలుపునందుకున్న కా॥ మాధవ్ వెంటనే దక్షిణ తెలంగాణకు మారాడు. 1985 చివరలో మహబూబ్‌నగర్ జిల్లాకు వెళ్లాడు. జిల్లా ఉద్యమ వ్యవస్థాపకుల్లో ఆయన ఒకడు. అక్కడ మల్లన్న పేరుతో ఆర్.ఎం.పి డాక్టర్‌గా పరిచయమై ప్రజలతో సన్నిహిత సంబంధాలను పెట్టుకున్నాడు. అక్కడి ప్రజల సమస్యలను అర్థం చేసుకుంటూ వాటిని పరిష్కరిస్తూ ప్రజా పునాదిని ఏర్పరిచాడు. ఆదివాసీ ప్రజలను వివిధ సమస్యల పరిష్కారానికి పోరాటాల్లోకి కదిలించాడు. 1987లో మన్ననూర్‌లో 5 వేల మంది ఆదివాసీ ప్రజలతో ర్యాలీని విజయవంతం చేశాడు. రాష్ట్రమంతా తీవ్ర నిర్బంధంతో అట్టుడుకుతున్న కాలంలో జరిగిన ఈ ర్యాలి ప్రజల్లో నైతిక స్థైర్యాన్ని పెంచింది.

ఇలా పలు పోరాటాలతో ఉద్యమాన్ని విస్తరింపచేస్తూ నల్లమలలో చెంచు ఆదివాసుల్లో బలమైన స్థానాన్ని నెలకొల్పుతున్న క్రమంలో జిల్లా ఆర్గనైజర్ కా॥ కిరణ్ 1989లో అమరుడయ్యాడు. దానితో జిల్లాలో అనుభవం కలిగిన సీనియర్ కా॥ మల్లన్ననే అవడం వల్ల జిల్లా ఆర్గనైజర్ బాధ్యతలను పార్టీ అతనికి అప్పగించింది. జిల్లా ఆర్గనైజర్‌గా నల్లమల, అచ్చంపేట, పానగల్, లింగాల ఏరియాలను సమన్వయిస్తూ ఫారెస్టు, మైదాన దళాలుగా ఏర్పర్చాడు. కల్వకుర్తి, సరళాసాగర్‌లలో ప్రజా సమస్యలు తీసుకొని అనేక పోరాటాలు నిర్వహించాడు. ఫారెస్ట్ అధికారుల వేధింపులకు వ్యతిరేకంగా, సారా ధర తగ్గింపు కోసం, మేకపుల్లెర బందుపెట్టాలని పోరాటాలు నిర్వహించాడు. అన్యాక్రాంత భూముల, ఫారెస్టు భూముల, భూస్వాముల ఆక్రమణలో వున్న భూముల స్వాధీన పోరాటంలో ప్రజలను కదిలించి ఉద్యమాన్ని బలోపేతం చేశాడు. కొల్లాపూర్ మండలంలో ప్రజాకంటకుడైన చింతపల్లి భూస్వామి, మాజీ ఎం.ఎల్.ఎ రంగదాసు దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలను కదిలించి కోల్పోయిన తమ భూముల్ని తిరిగి భూస్వామి నుండి స్వాధీనం చేసుకోవడానికి నాయకత్వం వహించాడు. ఉద్యమంపై కత్తిగట్టి పోలీసుల అండతో ప్రజలను నరకయాతనలు పెట్టిన కర్కోటకుడు రంగదాసు పీడ వదిలించుకోవడానికి అక్కడి గ్రామాల ప్రజలకు నేతృత్వం వహించాడు. ఆనాడు జిల్లాలో బలంగా వున్న సి.పి.ఐ, సి.పి.ఎం పార్టీల రివిజనిజాన్ని ఎండగడుతూ వాటి ప్రభావం నుండి బయటకు తీసుకువచ్చి ప్రజల్ని చైతన్యవంతం చేయడంలో కా॥ మల్లన్న ముఖ్య భూమికను పోషించాడు. ఉద్యమ నిర్మూలనకు ఒకవైపు అణచివేతను కొనసాగిస్తూ, మరొకవైపు సంస్కరణలను కొనసాగించడంలో భాగంగా ఎన్.టి రామారావు లొంగుబాట్లను ఒక క్యాంపెయిన్‌గా ప్రోత్సహించాడు. ఈ క్యాంపెయిన్‌లను నిర్వీర్య పర్చడంలో కా॥ మాధవ్ ముందు పీఠిన నిలబడ్డాడు. ఈ గందరగోళం నుండి క్యాడర్‌ను నిలబెట్టడంలో ఎంతో కృషి చేశాడు. ఆనాడు వున్న రాజకీయపరిస్థితిని వుపయోగించుకుంటూ ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్ నిర్వహింపచేశాడు. 1989 డిసెంబర్ ఎన్నికల్లో ఎన్.టి రామారావు ఓడిపోయి చెన్నారెడ్డి అతి కొద్ది మెజారిటీతో సాధించిన

విజయంలోని రాజకీయ సంక్షోభాన్ని వినియోగించుకుంటూ 1990లో హైదరాబాద్‌లో జరిగిన విరసం, జననాట్య మండలి, రైతుకూలీ సంఘం మూడవ మహాసభలకు ప్రజలను తరలించడంలో చురుకైన పాత్ర వహించాడు. జిల్లాలో అమరుల స్థూపాల నిర్మాణం చేసి వివిధ సమస్యలపై బహిరంగ సభలు నిర్వహించి ప్రజా సమస్యలను ముందుకు తెచ్చాడు. భూస్వాముల పట్టా భూములను ఆక్రమించి, కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో కింగ్ మేకర్స్‌గా ఉన్న పెద్ద పెద్ద భూస్వాములను ఉద్యమానికి లొంగి వుండేలాగా చేశాడు. వెసులుబాటులోనూ, నిర్బంధంలోనూ వేల ఎకరాల భూములను ప్రజలు ఆక్రమించుకోవడానికి నాయకత్వం వహించాడు. రైతాంగ సమస్యలు ముందుంచుతూ అచ్చంపేటలో బహిరంగ సభ నిర్వహిస్తే బెంబేలు పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సభను వేలాది బలగాలు దింపి నిర్వీర్యం చేసింది. దీని కొనసాగింపుగానే భూస్వాముల, కాంట్రాక్టర్ల, రాజకీయ నాయకుల ఒత్తిడి మేరకు ప్రభుత్వం పెరుగుతున్న ప్రజా ఉద్యమాలనూ, సంఘటిత శక్తిని నిర్వీర్యపరిచే క్రమంలో 1990 చివరిలో గ్రామాలపై పదుల సంఖ్యలో దాడులు నిర్వహించింది. వేలాది మందిని అక్రమంగా అరెస్టు చేసింది. సంఘ సభ్యులను లొంగిపోవాలని హెచ్చరిస్తూ వారి ఆస్తులను ధ్వంసం చేసింది. కుటుంబ సభ్యులపై వేధింపులకు పాల్పడింది. చిత్రహింసలు పెట్టి అనేక మందిని మానసికంగా, శారీరకంగా వికలాంగులను చేసింది. అంతేగాక గ్రామాలకు గ్రామాలను సమావేశపరిచి బలవంతంగా ప్రజలను సంఘాలకు వ్యతిరేకంగా నిలబెట్టడానికి ప్రయత్నించింది. సి.ఆర్.పి.ఎఫ్, ఎ.పి.ఎస్.పి, ఎస్.ఎస్.ఎఫ్ బలగాలు కూంబింగ్స్ చేస్తూ ఎన్‌కౌంటర్లు చేశాయి. దళ సభ్యులు, సంఘ సభ్యులు, సానుభూతిపరులు ఒకరనేమిటి 1992 వేసవిలో రోజుకొక బూటకపు ఎన్‌కౌంటర్‌తో పోలీసుమూకలు దారుణ హత్యాకాండను కొనసాగించాయి. ఖాకీమూకల దూకుడుకు అడ్డుకట్ట వేస్తూ జిల్లాలో మొట్టమొదటగా సరళసాగర్ ఏరియాలో పోలీసు క్యాంపుపై జరిగిన దాడికి కా॥ మాధవ్ నాయకత్వం వహించి, పోలీసులను మట్టి కరిపించి, తుపాకులను స్వాధీనం చేసుకొని గెరిల్లా బలగాల ఆత్మస్థైర్యాన్ని పెంచాడు. ఎస్.పి. పరదేశీనాయుడి నాయకత్వంలో హంతక పోలీసుమూకలు జిల్లాలో ప్రజలపై, దళాలపై విచ్చలవిడిగా దాడులకు పాల్పడ్డాయి. నిషేధాన్ని విధించి విప్లవకారుల కాలూ చెయ్యి ఆడనియ్యకుండా చేశామని విర్రవీగాడు. దానితో కా॥ మాధవ్ నేతృత్వంలో సోమశిల వద్ద మందుపాతర పేల్చగా ఎస్.పి. పరదేశీనాయుడుతో సహా అతని బలగాలు కుక్కచావు చచ్చాయి.

మహబూబ్‌నగర్, నల్లగొండ ఉద్యమాలు బలపడడంతో పార్టీ ఈ రెంటినీ కలిపి 1993లో ఉమ్మడి జిల్లా కమిటీగా చేసింది. దానితో మహబూబ్‌నగర్ నుండి ఈ జిల్లా కమిటీలో కా॥ మాధవ్ ప్రాతినిధ్యం వహించాడు. ఉమ్మడి జిల్లా కమిటీని ఆయా జిల్లా ఉద్యమాలు బలపడటం మూలంగా తరువాత రెండు వేరు వేరు కమిటీలుగా చేయగా మహబూబ్‌నగర్ జిల్లా కమిటీ కార్యదర్శిగా కా॥ మాధవ్ ఎన్నికయ్యాడు. 1994లో జరిగిన రాష్ట్ర ప్లీనంలో కా॥ మాధవ్ ప్రతినిధిగా పాల్గొన్నాడు. 1995లో జరిగిన జిల్లా కాన్ఫరెన్స్‌లో జిల్లా కార్యదర్శిగానూ ఆ తర్వాత జరిగిన రీజనల్ మహాసభలో రీజనల్ కమిటీ సభ్యుడిగానూ ఎన్నికయ్యాడు. రీజనల్ కమిటీలో వుంటూ కొంత కాలం మహబూబ్‌నగర్‌లోనూ, మరికొంత కాలం నల్లగొండ జిల్లాలోనూ కేంద్రీకరించి ఆ జిల్లా ఉద్యమాలలో ఉన్న అంతర్గత సమస్యలు పరిష్కరించడానికీ, దళాల పని పద్ధతులు మెరుగుపర్చడానికి కృషి చేశాడు. శత్రు దాడులను తిప్పి కొట్టడంలో భాగంగా వీరవెల్లి మైక్రోవేవ్ స్టేషన్‌పై దాడి చేసి ఆయుధాలు స్వాధీనం చేసుకోవడానికి నాయకత్వం వహించాడు. రాష్ట్ర కమిటీ సభ్యుడు కా॥ మహేందర్, రాష్ట్ర కమిటీ సభ్యుడూ రీజనల్ కమిటీ కార్యదర్శి అయిన కా॥ సంజీవ్ అమరులు కావడం వల్ల కా॥ మాధవ్ బాధ్యత మరింతగా పెరిగి మెదక్ జిల్లాకు కూడా మార్గదర్శకత్వం అందించాడు. నిరంతరం ఫీల్డులో వుంటూ తను నేర్చుకుంటూ క్యాడర్‌కు నేర్పడంలో క్రియాశీలక భూమికను నిర్వహించాడు. ఎన్నో ఎన్‌కౌంటర్లలలో శత్రువును ప్రతిఘటించడంలో ముందున్నాడు.

దీనితో శత్రువు కా॥ మాధవ్‌పై మరింతగా కేంద్రీకరించి అతన్ని హత్య చేయడం కోసం దళ సభ్యుడు సోమ్లా నాయక్‌ను కోవర్టుగా ప్రయోగించాడు. ఈ కోవర్టు చేసిన హత్యా ప్రయత్నంలో క్యాడర్ అసమాన త్యాగనిరతి వల్ల కా॥ మాధవ్ తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు (ఈ కోవర్టు దాడిలో ముగ్గురు కామ్రేడ్స్ అమరులయ్యారు).

నిరంతరం ప్రజల్లో వుంటూ వారికి నేర్పుతూ, నేర్చుకుంటూ కా॥ మాధవ్ రాజకీయంగా, సైద్ధాంతికంగా ఎంతో పరిణితిని సాధించాడు. పార్టీలో సత్యమూర్తి, కె.ఎస్‌లు సృష్టించిన రెండు సంక్షోభాలను ఈ పరిణితివల్లే సరిగ్గా అర్థం చేసుకున్నాడు. ఈ సంక్షోభాల పరిష్కారానికి జరిగిన అంతర్గత పోరాటంలో క్రియాశీలకంగా వున్నాడు. క్యాడర్‌ను గందరగోళం నుండి బయటపడవేసి ఉద్యమంలో నిలబెట్టాడు.

కా॥ మాధవ్‌కు ఉద్యమంలోకి రాకముందే పెళ్లయింది. ఒక బాబు కూడా పుట్టాడు. తన సహచరిని ఉద్యమంలో తీసుకురావడంలో విశేషంగా కృషి చేశాడు. ఆమెలోని శక్తిని వెలికితీసి ఫీల్డులో నిలదొక్కుకునేలా చేయడంలోనూ,

ఉద్యమవసరాలకు అనుగుణంగా ఆమెను ఎదిగించడంలోను అతని కృషి చెప్పుకోదగినది.

అతను మంచి కవి కూడా. చెంచన్న పేరుతో పలు కవితలు, పాటలు రాసాడు. కళపట్ల మంచి అభినివేశం ఉన్నవాడు. చిన్నప్పుడు వేసిన వీధి బాగోతాల అనుభవంతో క్యాంపుల్లో, ప్రజల్లో పలు సందర్భాల్లో ఉత్సాహంగా ప్రదర్శనలు ఇచ్చేవాడు, పాటలు పాడేవాడు, కళను ప్రోత్సహించేవాడు.

ఇలా క్యాడర్, ప్రజల విశ్వాసాన్ని పొందుతూ అంచెలంచెలుగా ఎదుగుతూ 1999లో జరిగిన రాష్ట్ర ప్లీనంలో రాష్ట్ర కమిటీలోకి ప్రత్యామ్నాయ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. ఉద్యమం ఎదుర్కొంటున్న బలహీనతలను ప్లీనం గుర్తించి వాటి నుండి బయటపడటానికి విద్యా, దిద్దుబాటు ఉద్యమాన్ని చేపట్టింది. దక్షిణ తెలంగాణాలో ఈ ఉద్యమం ద్వారా క్యాడర్‌కు విద్యగరపడమే గాక, ప్రజలలోకి తీసుకెళ్లేలా చేయడంలో కా॥ మాధవ్ మార్గదర్శకత్వం వహించాడు. తీవ్ర నిర్బంధం వల్ల, ఉద్యమంలో చోటు చేసుకొన్న అన్యవర్గ ధోరణుల వల్ల ప్రజల్లో బలహీనపడిన స్థానాన్ని దిద్దుబాటు ఉద్యమం ద్వారా మళ్లీ బలోపేతం చేయడంలో కృషి చేశాడు.

భౌతిక శిక్షలు, ఖతం కార్యక్రమాలు నిర్వహించడాన్ని రాజకీయంగా అర్థం చేయించడంలో, దోపిడీ వర్గాలతో సంబంధాలను వదులుకోవడంలో మొత్తంగా ప్రజలలో పునాదిని, రాజకీయ స్పృహను పెంచడంలో తన కృషి క్రియాశీలకమైనది. ఈ క్రమంలో తీవ్ర అనారోగ్యానికి గురవుతూనే మరింత దృఢత్వంతో ఉద్యమ ఎగుడుదిగుడులను అర్థం చేసుకుంటూ అందుకు అనుగుణమైన ఎత్తుగడలు రూపొందించడంలో, ఎత్తుగడల ఎదురుదాడుల ద్వారా ప్రజల, కార్యకర్తల మనోబలాన్ని పెంచడంలో, శత్రువును నిర్మూలించడంలో, శత్రువు మనోస్థైర్యాన్ని దెబ్బతీయడంలో తన వంతు పాత్రను నిర్వహించాడు. ఈ క్రమంలో 2000 సంవత్సరంలో రాష్ట్ర కమిటీలోకి కోఆప్ట్ అయ్యాడు. 2002లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికై రాజకీయ, మిలటరీ నిర్మాణపరమైన నిర్ణయాలలో కీలకపాత్ర నిర్వహించాడు. 2003లో ప్లీనం నిర్వహణలో చురుకైన పాత్ర వహించాడు. చర్చల నిర్వహణ కాలంలో వచ్చిన వెసులుబాటును వినియోగించుకుంటూ ఉద్యమాన్ని విస్తరింప చేస్తూ, రిక్రూట్‌మెంట్‌ను పెంపొందిస్తూ సమయానుకూలంగా కేంద్రీకరణ, వికేంద్రీకరణలు చేశాడు. ప్రభుత్వ కుటిల విధానాల మూలంగా చర్చలు విఫలం కావడంతో పెరిగిన నిర్బంధాన్ని తిప్పికొట్టడానికి ఉద్యమానికి మార్గదర్శకత్వం వహిస్తూ 2005 సెప్టెంబర్‌లో రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. మారిన పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర కమిటీని, జిల్లా కమిటీలను మల్చడం, శత్రు ఎత్తుగడలను తిప్పికొట్టడంలో కేంద్రీకరించాడు.

కా॥ మాధవ్ ఎల్లప్పుడూ సాదాసీదా ఆర్గనైజర్. నిరాడంబరత, కఠిన శ్రమ, అందరిపట్లా కామ్రేడ్లీ వైఖరి, శత్రువు ఎదురైనప్పుడు నిర్భయంగా ఉండడం, కష్టకాలంలో ఆయన ఇచ్చే నిరంతర ప్రోత్సాహాలతో కామ్రేడ్‌ల, ప్రజల ప్రేమనూ, ఆప్యాయతనూ పొందాడు. కామ్రేడ్ మాధవ్ అమరత్వం యావత్తు పార్టీకీ, భారత విప్లవానికీ, ముఖ్యంగా ఎ.పి. విప్లవోద్యమానికి గొప్ప నష్టం.


కా॥ మాధవ్ వర్గ స్పృహా, చొరవా, ముందు చూపూ, క్రియాశీలతా, పట్టుదల విప్లవ శ్రేణులందరికీ ఆదర్శం. కా॥ మాధవ్ నెలకొల్పిన ఆదర్శ కమ్యూనిస్టు విలువలు పార్టీ సభ్యులందరికీ అనుసరణీయం. ఆయన అమరత్వం వాడిపోదు. పార్టీ శ్రేణుల, వీరోచిత పి.ఎల్.జి.ఎ. యోధుల, విప్లవ ప్రజాసంఘాల సభ్యుల, విప్లవ ప్రజానీకపు నిశ్చయాన్నీ మరింతగా రాటుదేలుస్తుంది. ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయడం ద్వారానూ ఎ.పిలో ఫాసిస్టు శత్రు దాడిని ఓడించడం కోసం పోరాటాన్ని కొనసాగించటానికి రెట్టించిన స్ఫూర్తితో, మరింత దృఢత్వంతో ఆయన ఆశయ సాధనకై ముందుకు నడుద్దాం.

**క్షమాపణలు**

గత సంచికలో శ్రీకాకుళం డివిజనల్ కమిటీ సభ్యుడు కా॥ చందు అమరుడయ్యాడని రాశాం. నిజానికి అమరుడయింది ఈస్ట్ డివిజన్‌లో పని చేస్తున్న దళ సభ్యుడు కా॥ చందు. వార్తా పత్రికలు చూసి రాయడం వల్ల ఈ పొరపాటు జరిగింది.

# ఏం కొనేటట్టు లేదు - ఏం తినేటట్టు లేదు

ఐక్య ప్రగతిశీల కూటమి(యు.పి.ఎ) సాధించిన 'ఘనతల' జాబితాలో ఈ మధ్యకాలంలో విచ్చలవిడిగా పెరిగిన ధరలు కూడా చేరిపోయాయి. నిజానికి ధరల భయం సామాన్య ప్రజానీకాన్ని నిరంతరం వెంటాడుతూ వున్నదే. ఏ పార్టీ అధికారంలో వున్నా రోజు రోజుకూ ధరలు పెరుగుతూ ప్రజల బతుకులు దిన దిన గండంగా మారాయి. అయితే ఈ మధ్య కాలంలో ఒక్కసారే అన్ని ధరలూ, అదీ అధిక శాతంలో పెరగడంతో ప్రజల బతుకులు మరింత దుర్భరమయ్యాయి. మనుషులు బతకాలంటే తిండీ, బట్టా, నీడ వంటి కనీస అవసరాలన్నా తీరాలి. కానీ పెరుగుతున్న ధరలు కనీసం తిండి కూడా తినలేని పరిస్థితుల్లోకి నెడుతూ ప్రజల జీవించే హక్కునే ప్రశ్నార్థకం చేస్తున్నాయి.




నిత్యావసర సరుకుల ధరలు పెరగడానికి కారణం చమురు ధరలు పెరగడమనీ, చమురు ధరలు పెరగడానికి కారణం ప్రపంచ విపణిలో దాని ధరలు పెరడగమేననీ ప్రభుత్వాలు మాట్లాడుతున్నాయి. ధరలు పెరగడం మాకూ బాధాకరమే అయితే అవి పెరగడం అనివార్యమనీ, అందులో తమ బాధ్యత ఏమీ లేదనీ ప్రకటనల మీద ప్రకటనలు ఇస్తున్నాయి. నిత్యావసర సరుకుల ధరలు పెరగడానికి కారణం 'పెట్రో' ధరలు పెరగడం మాత్రమే కాకపోయినా, అది ఒకానొక కారణమే. మరి పెట్రో ధరలు పెరగడం అనివార్యమేనా? ఇందులో ప్రభుత్వం చేయగల్గింది ఏమీ లేదా అన్నది చూడాలి.

**పెరిగిన చమురు ధరలు;**

**ప్రజలకు మంట - పాలకులకు పంట**

జూన్ 5వ తేదీన ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచేసింది. యు.పి.ఎ. అధికారంలోకి వచ్చాక ఇలా పెట్రోల్ ధరలు పెరగడం ఏడవసారి. అయితే ఈసారి పెట్రోల్ ధరను లీటర్‌కు 4 రూపాయలు, డీజిల్ ధరను లీటర్‌కు 2 రూపాయలకు పెంచి ప్రజలపై ఒక్కసారిగా అధిక భారాన్ని వేసింది. ఈ పెంపుదల ఎన్.డి.ఎ. కాలంలోని ధరలతో పోల్చితే 33 శాతం ఎక్కువ. ప్రభుత్వరంగ చమురు కంపెనీలను నష్టాల నుండి కాపాడాలంటే పెట్రోల్ ధర లీటర్‌కు 8రూ.లు, డీజిల్ ధర లీటర్‌కు 10 రూ.లు, కిరోసిన్ ధర లీటర్‌కు 14 రూ.లు, వంటగ్యాస్ సిలిండర్ ధర 140 రూపాయలు పెంచవల్సి వస్తుందని మే నెలలోనే ప్రభుత్వం ప్రకటించింది. దాంట్లో భాగంగా మొదటి విడతగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది.

మన దేశ వినియోగ అవసరాలలో 70 శాతం చమురు కోసం ప్రపంచ విపణిపైనే ఆధారపడుతున్నప్పుడు, ప్రపంచ విపణిలో ధరలు పెరగడం అనేది మన దేశంపై తప్పక ప్రభావాన్ని వేస్తుంది. అయితే ఆ ప్రభావం నేరుగా సామాన్య వినియోగదారులపై పడవల్సిందేనా? ఇందులో ప్రభుత్వాలు చేయగల్గిందేమీ లేదా?

ప్రపంచ విపణిలో పెరిగిన చమురు ధరలకనుగుణంగా దేశంలో ధరలు పెంచకపోవడం వల్ల గత ఏడాది చమురు కంపెనీలు 10 వేల కోట్లు నష్టపోయాయనీ, ఈ ఏడాది ఇప్పటికే 73,512 కోట్లు నష్టపోయాయని ప్రభుత్వం చెప్తోంది. అయితే ప్రభుత్వం చెప్తున్నది వాస్తవం కాదనే వాదన వుంది. ఇది చమురు కంపెనీలు నష్టపోవడం కాదనీ ఆదాయం తగ్గడం మాత్రమేననేది ఈ వాదన. చమురు కంపెనీలు చూపిస్తున్న లెక్కల ప్రకారం అవి చమురును దిగుమతి చేసుకుంటున్న ధరకంటే తక్కువ ధరకే అమ్ముతున్నాయి. అయితే ప్రభుత్వం ఇస్తోన్న సబ్సిడీలను గానీ, ఓ.ఎన్.జి.సి. ఇస్తున్న తగ్గింపులను గానీ ఈ లెక్కల్లో చూపించడం లేదని ఈ వాదన వివరిస్తోంది.

ఇక కొంచెం దిగ్భ్రాంతికరమైన విషయమేమంటే పెరిగిన ప్రతిసారీ సామాన్య ప్రజల గుండెల్లో గుబులు పుట్టిస్తోన్న చమురు ధర, ప్రభుత్వానికి మాత్రం కాసుల పంటను పండిస్తోంది. ఒకవైపు ప్రపంచ విపణి, చమురు ధరలను పెంచుతూ ప్రజలపై భారాన్ని వేస్తుంటే, మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎడాపెడా పన్నులు వేస్తూ ప్రజలను దోచుకుంటున్నాయి. చమురు ధరలో 60 శాతం కేవలం పన్నుల వడ్డింపే. కేంద్రం విధిస్తోన్న కస్టమ్స్, ఎక్సయిజ్ సుంకాలు, రాష్ట్రాలు విధిస్తోన్న వ్యాట్ /అమ్మకం పన్ను ఇందులో ప్రధానమైనవి. చమురు కొనుగోలు, శుద్ధి, రవాణా, సరఫరాలకు అయ్యే ఖర్చుకు, కస్టమ్స్ సుంకం కూడా కలిపితే అయ్యే ఖర్చు ధరలో 49 శాతమే. ఒక్క పెట్రోల్‌నే తీసుకుంటే దాని ధరలో 31.9 శాతం ఎక్సయిజ్ సుంకం, 16.2 శాతం అమ్మకం పన్ను కల్సిపోయి వుంది. అమ్మకం పన్ను ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా వుంది. ఆంధ్రప్రదేశ్‌లో అది ప్రస్తుతం 33 శాతం వుంది.

ప్రభుత్వాలు విధిస్తోన్న అధిక పన్నుల వల్ల మన దేశంలోనే పెట్రోల్ ధర ఎక్కువగా వుంది. మన దేశంలో సగటు ధర లీటర్‌కు 47 రూపాయలు వుంటే అమెరికాలో 34 రూపాయలు, థాయ్‌లాండ్‌లో 30 రూ.లు వుంది. మన పొరుగున వున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో మన దేశంతో పోలిస్తే సగం ధరకే పెట్రోల్ దొరుకుతుంది. మిగితా దేశాలతో పోలిస్తే మన దేశంలో పెట్రోల్ ధర అధికంగా వుంటే మిగతా రాష్ట్రాలతో పోలిస్తే పెట్రోల్ ధరల్లో మహారాష్ట్ర తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానిదే అగ్రస్థానం. ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 46.84లు వుంటే ఆంధ్రప్రదేశ్‌లో రూ.53.20లు వుంది. మహారాష్ట్రలో దీని ధర రూ. 53.50లు. కాగా అమ్మకం పన్ను వడ్డింపులో మాత్రం ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానం. ఢిల్లీలో ఈ పన్ను 20 శాతం వుంటే, ఎ.పిలో 33శాతం వుంది. కాగా మహారాష్ట్రలో ఇది 31 శాతం. ఇంత భారీ పన్నుల మూలంగా రూ. 23.52లు అసలు ధర వున్న పెట్రోల్ ఆంధ్రప్రదేశ్‌లో రూ. 53.26లకు దొరుకుతున్నది. అంటే లీటర్ పెట్రోల్‌కు రూ. 29.74లు పన్నులే అన్నమాట. ఇది దాదాపు 60 శాతం.

ప్రభుత్వాలు అవలంభిస్తోన్న ప్రస్తుత పన్నుల విధానం వల్ల చమురు ధరలు పెరిగినప్పుడల్లా పన్ను శాతం పెంచకపోయినా ప్రభుత్వ చమురు పన్నుల ఆదాయం పెరుగుతూ వుంటుంది. అందువల్ల 2004-05 సంగలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చమురుపై 1,20,000 కోట్ల ఆదాయాన్ని పొందాయి. చమురుపై కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాల ద్వారా కేంద్ర ప్రభుత్వం రోజుకు 160 కోట్లు ఆదాయాన్ని పొందుతుంటే, రాష్ట్రాలన్నీ కల్సి అమ్మకం పన్ను ద్వారా రోజుకు 110 కోట్లు సంపాదిస్తున్నాయి. ప్రపంచ విఫణిలో ధరలు పెరిగితే మేమేం చేయగలం అంటున్న ప్రభుత్వాలు ధరలు పెరిగినప్పుడల్లా పన్నుల శాతాన్ని తగ్గిస్తే ప్రజలపైన అధిక భారం పడకుండా చూడవచ్చు. దీనివల్ల వాటి గత ఆదాయం కూడా తగ్గేదేం వుండదు. కానీ అటువంటి చర్యలేమి తీసుకోకుండా ధరల్ని పెంచి ఇదే అవకాశంగా తన ఆదాయం కూడా పెంచుకుంటూ ప్రభుత్వం ప్రజలపై మరింత భారాన్ని వేస్తోంది.

ప్రభుత్వం విధిస్తోన్న ఈ భారీ పన్నుల వల్ల కేంద్ర ఎక్సయిజ్ ఆదాయంలో 44 శాతం చమురు ఉత్పత్తులనుంచే వస్తోంది. రాష్ట్రాలకు అమ్మకం పన్ను ఆదాయంలో 30 శాతం పెట్రోల్, డీజిల్ అమ్మకాల నుంచే వస్తోంది. ఇక కేంద్ర రెవెన్యూ వసూళ్లలో 21 శాతం చమురు రంగంపై లెవీలు, పన్నులు, డివిడెండ్ల ద్వారానే వస్తోంది. మొత్తంగా దేశీయ ఆదాయంలో 34 శాతం చమురునుండే వస్తోంది. ఇట్లా పన్నులు వేయడం ప్రజలకు మోయలేని భారం అవుతుందనేది ఒక అంశమైతే, ఇట్లా ఆదాయం కోసం ఒకే రంగంపై దేశం ఆధారపడ్డం అనేది ఆర్థిక వ్యవస్థకు చేటును కల్గిస్తుందనేది మరో అంశం. మన దేశంలో ఉత్పత్తయ్యే ఒక ప్రధాన వనరుపై అధికంగా ఆధారపడ్డమనేది సహజమైన విషయమే. కానీ మన దేశంలో అతి తక్కువగా ఉత్పత్తి అయ్యే, దిగుమతులపైనే ప్రధానంగా ఆధారపడుతున్న చమురు నుంచి మూడు వంతుల ఆదాయాన్ని పొందుతున్నదంటే ప్రభుత్వం కేవలం దళారీ పాత్ర వహిస్తున్నదని స్పష్టంగా అర్థమవుతుంది.

చమురు కంపెనీలు దివాళా తీస్తున్నాయని మొత్తుకుంటున్న ప్రభుత్వం, కస్టమ్స్ సుంకం కొంచెం తగ్గించుకోవడం ద్వారా చమురు కంపెనీలకు కొంత భారాన్ని (నిజంగా వుంటే) తగ్గించవచ్చు. లేదంటే కొన్ని లాభాల్ని సంపాదించి పెట్టవచ్చు. కానీ ప్రభుత్వం తనకూ, చమురు కంపెనీలకూ అధిక ఆదాయం చేకూరే విధంగా ధరలను పెంచుతూ సామాన్య ప్రజలను దోచుకుంటోంది.

ఉపాధి హామీ పథకం, సర్వశిక్షా అభియాన్ వంటి పథకాలను అమలు చేయాలంటే ఈ పన్నులు విధించడం తప్పదని ప్రభుత్వం సమర్థించుకుంటుంది. కానీ పెద్ద పెద్ద పెట్టుబడిదారులకు ఇచ్చే రాయితీలను ఎత్తివేస్తే ఇటువంటి ఎన్ని పథకాలకైనా నిధులు సమకూర్చవచ్చు. కానీ ప్రభుత్వాలు అటువంటి వారి జోలికి ఎందుకు పోతాయి? పేద ప్రజల ప్రయోజనాలనే అది ఎల్లప్పుడూ లక్ష్యంగ చేసుకుంటుంది.

## ప్రజలతో పరిహాసమాడుతున్న కంటితుడుపు చర్యలు

పెరిగిన చమురు ధరలపై సర్వత్రా వచ్చిన వ్యతిరేకత వల్ల కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను పన్నులు తగ్గించుకోమని వత్తిడి చేసింది. తాను పన్నులు తగ్గించుకోకుండా రాష్ట్రాలపై వత్తిడి చేయడం గర్హనీయం. అయితే కేంద్ర ప్రభుత్వ వత్తిడిమేరకు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలన్నీ, మరికొన్ని రాష్ట్రాలూ అత్యంత నామమాత్రంగా అమ్మకం పన్ను తగ్గించాయి. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం డీజిల్‌పై 0.75శాతం, పెట్రోల్‌పై 1 శాతం అమ్మకం పన్ను తగ్గించింది. దీనివల్ల రెండు రూపాయలు పెరిగిన డీజిల్ ధర 23 పైసలు, రూ. 4లు పెరిగిన పెట్రోల్ ధర 40 పైసలు తగ్గుతుంది. ఇంతకు ముందు డీజిల్‌పై 22.25 శాతం, పెట్రోల్‌పై 33 శాతం పన్ను వుండేది. గత సంగ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచినప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర

**రెండేళ్ళుగా పెరిగిన ధరలు** (కిలోకు రూపాయలు)

| వస్తువు | 2004 | 2005 | 2006 | సిఎం చెప్పింది |
|---|---|---|---|---|
| మినపపప్పు | 28 | 32 | 55 | 47.45 |
| పెసరపప్పు | 25 | 28 | 48 | 45.69 |
| కందిపప్పు | 28 | 29 | 36 | 27.69 |
| శనగపప్పు | 27 | 28 | 36 | 30.85 |
| బియ్యం (మేలురకం) | 17 | 18 | 21 | 16.77 |
| బియ్యం | 11 | 11 | 14 | 11.15 |
| చింతపండు | 23 | 40 | 50 | 40.52 |
| పల్లీనూనె | 43 | 46 | 58 | 52.00 |
| కారంపొడి | 35 | 40 | 68 | 46.91 |
| చక్కెర | 18 | 19 | 22 | 20.00 |
| ఉల్లిగడ్డలు | 5 | 40 | 6 | 4.89 |
| మిరపకాయలు | 30 | 40 | 60 | -- |

ప్రభుత్వం పనిలో పనిగా అమ్మకం పన్నును డీజిల్‌పై 23 శాతమూ, పెట్రోల్‌పై 34 శాతం పెంచి తన వంతు భారాన్ని రాష్ట్ర ప్రజలమీద వేసింది. ఇప్పుడు కేంద్రం వత్తిడి మేరకు ప్రజలకు బిక్ష వేసినట్టుగా గత సం॥ పెంచిన 0.75 శాతం, 1 శాతాన్ని తగ్గించింది. ఇక అంతకంటే తగ్గించలేమని వై.ఎస్ తెగేసి చెప్పాడు. ఇప్పుడు ఈ మాత్రం తగ్గించడం వల్ల 134 కోట్ల ఆదాయం కోల్పోతున్నామని వాపోతున్నాడు. కానీ తాజాగా పెంచిన ధరల వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి 192 కోట్ల ఆదాయం వస్తుంది. అంటే ఇప్పుడీ అమ్మకం పన్నును తగ్గించినప్పటికీ ఇంకా 58 కోట్ల ఆదాయం వస్తుందన్న మాట. ప్రజలపైన ఒక్కసారిగా ఇంత భారం పడిన సందర్భంగానైనా ఈసారి తన ఆదాయం పెంచుకోకుండా పన్నుల శాతాన్ని కొంచెం తగ్గిద్దామని ఆలోచించలేదు ప్రభుత్వం.

## భవిష్యత్‌లో మరిన్ని 'మంటలు'

ఇప్పటికే 'పెట్రో' ధరలు ఇంతగా మండిపోతుంటే వీటి ధరలను నెలకోసారి సవరించే స్వేచ్ఛను చమురు కంపెనీలకు ఇస్తూ కేబినెట్ నిర్ణయించింది. జూన్ 5నే ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ ప్రజా వ్యతిరేకతకు వెరచిన ప్రభుత్వం దాన్ని అమలుచేయనని ప్రకటించింది. కానీ ఆ మాటను ఎన్నో రోజులు నిలబెట్టుకోకుండా ఇప్పుడు అధికారాన్ని కంపెనీలకు కట్టబెట్టింది. దీనివల్ల ఇక ముందు ముందు 'పెట్రో' ధరలు మరెంత భగ్గుమంటాయో ఊహించలేనిదేం కాదు. ఇకపోతే 'స్వాతంత్ర్య' వేడుకల సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రసంగిస్తూ మన్మోహన్ సింగ్ కిరోసిన్, వంటగ్యాస్‌లపై సబ్సిడీలు కొనసాగించడం సాధ్యం కాదని సెలవిచ్చాడు. అంటే మే నెలలో ప్రకటించిన స్థాయిలో పెట్రోల్, డీజిల్, కిరోసిన్, వంటగ్యాస్ ధరలను పెంచే రోజు మరెంత దూరమో లేదన్నది స్పష్టం.

## 'పెట్రో' ధరలతో పాటే ఎగిసిన నిత్యావసర సరుకు ధరలు

దేశంలో నిత్యావసరాల ధరలు అసాధారణ రీతిలో పెరిగిపోయాయి. బియ్యం, పప్పు, మిరపకాయలు, చింతపండు, వంటనూనె, చక్కెర, టీ, కాఫీ పొడులు..... ఒకటేమిటి అన్నింటి ధరలూ పెరిగిపోయాయి. ప్రస్తుత స్థితిని 60 లలో వచ్చిన ఆహార సంక్షోభంతో ప్రజలు పోల్చుకుంటున్నారంటే ఈ ధరల తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. చిన్నదో చితకదో ఓ సొంత యిల్లు కట్టుకోవాలనే కల మధ్య తరగతి ప్రజలందరికీ వుంటుంది. కానీ ఆ కలను కల్లలు చేస్తూ సిమెంట్, ఇటుక, ఇనుము ధరలన్నీ విపరీతంగా పెరిగాయి. సిమెంట్ ధరయితే రెట్టింపయింది. పెట్రో ధరలు పెరగడమే ఈ ధరల పెరుగుదలకు కారణమని ప్రభుత్వాలు నమ్మబలుకుతున్నాయి. పెట్రో ధరలు పెరిగినప్పుడల్లా మిగతా సరుకుల ధరలు పెరగడం ప్రతిసారీ మన అనుభవంలోకి వస్తున్నదే. అలాగే ఈసారి కూడా భగ్గుమన్న పెట్రో ధరలు మిగతా సరుకుల ధరలనూ ఎగదోశాయి. అయితే ఇదొక్కటే ఇప్పటి ధరల పెరుగుదలకు కారణం కాదు.

## ప్రపంచ బ్యాంకు నిర్దేశిత విధానాల ఫలితమే

వ్యాపార, వాణిజ్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో ప్రభుత్వం అవలంభిస్తోన్న విధానాల ఫలితమే ఈ అసాధారణ ధరల పెరుగుదల. గత కొన్నేళ్లుగా వ్యవసాయ రంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్థిక సంస్కరణల్లో భాగంగా రైతులకు సబ్సిడీలను ఎత్తివేసింది. రుణాలను నిరాకరిస్తోంది. ఫలితంగా రైతులు ప్రయివేటు వడ్డీ వ్యాపారస్తుల బారినపడి అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. దీనికి తోడు కల్తీ విత్తనాలు, కల్తీ పురుగు మందులు, లేదంటే మన దేశ భౌగోళిక, స్థితిగతులకు సరిపడని విత్తనాల వల్ల కూడా రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నది. చేసిన కష్టానికి ఫలితం లేకపోవడానికి, తీర్చలేని అప్పులు కూడా తోడవడంతో అనేక మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 98-2003 సంవత్సరాల మధ్య కాలంలో దాదాపు లక్షమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు వ్యవసాయ మంత్రి శరద్‌పవార్

పార్లమెంటులోనే ప్రకటించాడంటే ఈ ఆత్మహత్యల తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రభావం వ్యవసాయ రంగం మీద ఎంతగానో వుంటుంది. ఫలితంగా కొన్ని పంటల్లో దేశ అవసరాలకు తగినంత దిగుబడి వుండడం లేదు. అంతేగాక ఆహార పంటల్ని నిరుత్సాహపరుస్తూ బహుళజాతి కంపెనీలకు అవసరమైన వాణిజ్య పంటలను ప్రోత్సహించడం వల్ల కూడా దేశంలో ఆహార పంటల దిగుబడి తగినంత ఉండడం లేదు. ఫలితంగా వాటి ధరలు పెరుగుతున్నాయి.

అయితే తగినంత దిగుబడి వున్న ఆహారపు ఉత్పత్తుల ధరలు కూడా ఎందుకు పెరుగుతున్నాయి? వాటికి కూడా కొరత ఎందుకు ఏర్పడుతున్నది? అనే ప్రశ్న వస్తుంది. దీనికి సమాధానాన్ని రైతాంగం పండించిన ఉత్పత్తులు వినియోగదారులకు చేరే ప్రక్రియలో చూడాలి. రైతులు పండించిన పంటలను ప్రయివేటు వ్యాపారులు కొనడంపై, రవాణా చేయడంపై గతంలో కొన్ని ఆంక్షలు వుండేవి. కానీ నూతన ఆర్థిక విధానాల్లో భాగంగా వాటిని సడలిస్తూ వస్తోన్న ప్రభుత్వం ఈ సంవత్సరం పూర్తిగా ఎత్తి వేసింది. దానితో ప్రయివేటు వ్యాపారులూ, బహుళజాతి సంస్థలు అడ్డూ అదుపు లేకుండా రైతుల దగ్గర ఉత్పత్తుల్ని కొంటున్నారు. రైతుల వద్ద పంటల్ని కొని దేశ అవసరాల కోసం నిల్వ చేయాల్సిన బాధ్యత భారత ఆహార సంస్థ (ఎఫ్.సి.ఐ - ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) మీద వుంది. కానీ ప్రభుత్వం ఎఫ్.సి.ఐ.కి చెందిన నిధులను ఇతర రంగాలకు తరలిస్తూ ధాన్యం కొనడానికి దాని దగ్గర నిధులు లేకుండా చేస్తోంది. లేదంటే ఎఫ్.సి.ఐ కొనుగోలు ధరను తక్కువగా నిర్ణయిస్తోంది. దానితో ఎఫ్.సి.ఐ కంటే అతికొద్ది ధరను ఎక్కువగా చూపించి ప్రయివేటు వ్యాపారులు రైతుల వద్ద నేరుగా కొంటున్నారు. ఒక్కోసారి ఎఫ్.సి.ఐ ఇంకా ధరను నిర్ణయించకముందే ప్రయివేటు వ్యాపారులు కళ్ళాల నుంచే పంటను కొనుక్కుపోతున్నారు. ఇట్లా ప్రభుత్వం కావాలనే, ప్రపంచ బ్యాంకు షరతుల్లో భాగంగా ఎఫ్.సి.ఐని క్రమంగా బలహీనపరుస్తూ ప్రయివేట్ మార్కెట్‌ను బలోపేతం చేస్తోంది. దీనివల్ల ప్రభుత్వం దగ్గర ఆహార నిల్వలు బాగా తగ్గిపోతున్నాయి. ఇదే అదనుగా ప్రయివేటు సంస్థలు అక్రమ నిల్వలు చేసి, కృత్రిమ డిమాండ్‌ను సృష్టించి ధరల్ని పెంచుతున్నాయి. లేదంటే దేశ అవసరాల్ని పట్టించుకోకుండా విదేశాలకు ఎగుమతులు చేస్తున్నారు. ఈ విధంగా రైతులు పండించిన పంటలను రిటైల్ మార్కెట్‌కు నేరుగా పోకుండా ఈ దళారీలు అడ్డుకుంటున్నారు.

ఇకపోతే ఫార్వార్డ్ లావాదేవీలు కూడా ధరలు కొండెక్కడానికి కారణమవుతున్నాయి (భవిష్యత్తులో ఒక సరుకు ధర ఎంత వుండవచ్చో అంచనా వేసి, ఆ ధర ప్రకారం ముందే చేసుకునే ఒప్పందాన్ని ఫార్వార్డ్ లావాదేవీ అంటారు). సరుకుల్లో ఫార్వార్డ్ లావాదేవీలపై నాలుగు దశాబ్దాల పాటు వున్న నిషేధాన్ని ఎన్‌డిఎ ప్రభుత్వం ఎత్తివేసింది. ఈ ముందస్తు లావాదేవీల వలన వ్యవసాయ ఉత్పత్తుల ధరల్లో ఒడిదుడుకులు వుండవని, రైతులకు గిట్టుబాటు ధరలు దొరుకుతాయని ఆనాడు ప్రభుత్వం చెప్పింది. అప్పటి నుంచీ ఏడాదికేడాది ఫార్వార్డ్ లావాదేవీలు భారీగా పెరుగుతున్నాయి. అయితే ఇలా పెరగడంలో స్పెక్యులేటర్ల విన్యాసాలున్నాయి. దీన్ని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైంది. వీటిని అరికట్టే ప్రయత్నాలు చేయకుండానే ఈ లావాదేవీలకు అనుమతించే సరుకుల జాబితాను తాజాగా మరింత పెంచింది యు.పి.ఎ. ప్రభుత్వం. ప్రభుత్వం ఏ మాటలు చెప్పి ఫార్వార్డ్ లావాదేవీలకు అనుమతినిచ్చిందో ఆ మాటలు - రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తాయనేది - ఇప్పటికీ ఎక్కడా రుజువు కాలేదు. కానీ వినియోగదారులకు ధరలు మాత్రం విపరీతంగా పెరుగుతున్నాయి. అటు రైతులను ఇటు వినియోగదారులను దోచుకుంటూ స్పెక్యులేటర్లు పబ్బం గడుపుకుంటున్నారు. షేర్ మార్కెట్లో రకరకాల విన్యాసాలు చేస్తూ ఆర్థిక వ్యవస్థను అస్థిరత పాలు చేస్తున్న స్పెక్యులేటర్లు ఇప్పుడు సరుకుల మార్కెట్‌లోనూ విన్యాసాలు చేస్తూ వినియోగదారుల బతుకులతో ఆడుకుంటున్నారు.

ప్రపంచ బ్యాంకు షరతుల్లో భాగంగా సంక్షేమ బాధ్యత నుంచి తప్పుకుంటున్న ప్రభుత్వం ఎఫ్.సి.ఐ.ని బలహీనపర్చడమే గాక, పౌర పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. నిత్యావసర వస్తువుల జాబితాను కుదించింది. ఈ చర్యలన్నీ ధరలు పెరగడానికి కారణమే.

ప్రభుత్వాల పన్నుల వడ్డింపు కూడా ధరలు తడిసి మోపెడవడానికి కారణం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమైతే మరింతగా పన్నులు విధిస్తోంది. ఇతర రాష్ట్రాల్లో 4 శాతం ఉన్న వ్యాట్ మన రాష్ట్రంలో 12.5 శాతం వుంది. ఫలితంగా ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో ధరలు 10 శాతం అధికం.

మొత్తంగా ఒక్కమాటలో చెప్పుకోవాలంటే దేశానికి ఆహార భద్రతను కల్పించడం అనే అతి ముఖ్యమైన బాధ్యత నుంచి ప్రభుత్వం వైదొలిగిన ఫలితమే ధరల పెరుగుదలకు కారణం.

### దిగుమతులు ఎవరి ప్రజయోజనానికి?

ధరలను తగ్గించడం కోసం ప్రభుత్వం అక్రమ నిల్వలను వెలికి తీయడం గానీ, నల్ల బజారును అరికట్టడం గానీ, విదేశాలకు ఎగుమతుల పేరిట తరలి పోతున్న ఆహార ధాన్యాలను

అడ్డుకోవడం గానీ చేయలేదు. అది చేపట్టిన ఏకైక చర్య దిగుమతులు చేసుకోవడం అన్నదే. మనకు అవసరమైన సరుకులు మన దేశంలో లభించని పక్షంలో దిగుమతుల మీద ఆధారపడ్డం తప్పు కాదు. కానీ మనది వ్యవసాయ దేశం. ఆహార ధాన్యాల పంటకు అనువైన దేశం. మరి ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకుంటున్నామంటే ఎటువంటి దుస్థితిలో వున్నట్టు? మన దేశంలోని ఉత్తరాది రాష్ట్రాల ప్రజల ప్రధాన ఆహార ధాన్యం గోధుమ. మరి గోధుమలు కూడా దిగుమతి చేసుకోవాల్సి వస్తుందంటే దేశాన్ని ఆహార అభద్రత ఎంతగా పట్టి పీడిస్తున్నట్టు? మనది గోధుమ పంటకు అనువైన దేశం కాదా అంటే ఉత్తరాది రాష్ట్రాలు గోధుమ పంటకు పెట్టింది పేరు. 'హరిత విప్లవాలు' సాధించిన రాష్ట్రాల్లో కూడా ప్రస్తుతం తినడానికి తిండిలేదు. మన రైతుల దగ్గర రూ॥ 700లకు (వంద కిలోలకు) కొన్న గోధుమలను ఇప్పుడు విదేశాల దగ్గర నుంచి రూ॥ 900లకు కొంటోంది ప్రభుత్వం. ఇలా దిగుమతి చేసుకోవడం వల్ల ధరలు ఎంతమేరకు ఉపశమిస్తాయన్నది సందేహమే. ఎందుకంటే దేశంలో ప్రస్తుతం పెరిగిన ధర ప్రకారమే 22 రూపాయలున్న చక్కెరను ప్రభుత్వం విదేశాల నుంచి 24 రూపాయలకు దిగుమతి చేసుకొంటోంది. దీనివల్ల ధరలు తగ్గకపోగా మళ్లీ పంట దిగుబడులు వచ్చేప్పటికి దేశంలో దిగుమతి చేసుకున్న నిల్వలు వుండడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించదు. అప్పుడు ప్రయివేటు సంస్థలకు రైతుల దగ్గర చౌకగా కొనే అవకాశం మళ్లీ వస్తుంది. ఆ తర్వాత షరా మామూలే...... కృత్రిమ డిమాండ్, ధరల పెరుగుదల. అటు రైతులకు అమ్మబోతే ధర వుండదు, ఇటు వినియోగదారులకు మాత్రం కొనబోతే ధరలు మండిపోతాయి. నడుమ సొమ్ము చేసుకుంటున్నది మాత్రం బహుళజాతి సంస్థలూ, ప్రయివేటు వర్తకులు. అంతేకాదు గిట్టుబాటు ధరలు లేకపోవడం అన్నది పంట దిగుబడులను కూడా తగ్గిస్తుంది. రైతాంగానికీ, వ్యవసాయానికీ ఇంత నష్టదాయకంగా వున్నప్పటికీ ఎం.ఎన్.సి.లకు దళారీగా వ్యవహరిస్తోన్న ప్రభుత్వం మాత్రం దిగుమతుల వైపే మొగ్గు చూపుతోంది. ఒక్కోసారి మన దేశంలో నిల్వలు సరిపడా వున్న సరుకును కూడా దిగుమతి చేసుకుంటోంది. దీన్ని ఎలా సమర్థించుకుంటుందో శరత్‌పవార్ మాటల్లోనే చూద్దాం. ఈ విషయం ఒక పత్రికతో మాట్లాడుతూ "నేను హర్యానాలో గోధుమ సేకరించి హైదరాబాద్‌లోనో, చెన్నైలోనో విక్రయించాలంటే టన్నుకు రూ॥ 11,150లు ఖర్చవుతుంది. అదే విదేశాల నుంచి నేరుగా చెన్నైకి గోధుమ దిగుమతి చేసుకొని దక్షిణాది రాష్ట్రాలకు విక్రయించడానికి అయ్యే ఖర్చు రూ॥ 9,500 మాత్రమే. కారణం రవాణా, నిల్వ, వడ్డీ ఖర్చులు నాకు మిగలడమే" అన్నాడు. ఈ వాదనలో మారుబేరగాడి లాభనష్టాల బేరీజు తప్ప వ్యవసాయ మంత్రిగా వ్యవసాయం, రైతాంగపు సంక్షేమాన్ని పట్టించుకునే ధోరణి ఏమన్నా వుందా? అయినా నూతన ఆర్థిక విధానాలను అమలు చేయాలంటే ప్రజా సంక్షేమాన్ని మరిచిపోవడం మొదటి షరతు కదా!

## ప్రజల బతుకులు మరింత దుర్భరం

విపరీత స్థాయిలో పెరిగిన ఈ ధరల ప్రభావం సమాజంపై ఆందోళనాకరంగా వుంటుంది. ఇప్పటికే పాలకులు అమలు చేస్తున్న విధానాల వల్ల దేశంలో పేదరికం పెరిగిపోతోంది. పేద ప్రజలు మరింత పేదలుగా మారుతూ కనీసావసరాలు కూడా తీర్చుకోలేక దుర్భరమైన బతుకులను నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం అధిక ప్రజలను పట్టి పీడిస్తున్న జబ్బు ఆకలి. దేశ ప్రజలకు ఉన్న ఆహార భద్రతను బట్టి దేశాలకు ర్యాంకులను ఇచ్చేటట్టయితే భారత దేశం ఇథియోపియాతో పాటు అట్టడుగు స్థానంలో వుంటుంది. యునిసెఫ్ లెక్కల ప్రకారం మన దేశంలోని సగం మంది బాలలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఇప్పటికే పరిస్థితి ఇంత దారుణంగా వుంటే, ఇప్పుడు పెరిగిన ధరలు ఇంకెందరి జీవితాలను ఆకలి మయం చేస్తాయో? మరెంత మందిని పోషకాహార హీనులుగా చేస్తాయో? మరెంత మందికి భవిష్యత్తును లేకుండా చేస్తాయో? మధ్యతరగతి ప్రజానీకం పరిస్థితి కూడా పెద్దగా భిన్నంగా లేదు. పెట్రో, ఆహార పదార్థాలూ, విద్యా, వైద్య ఖర్చులన్నీ పెరగడం వల్ల నిజవేతనాలు దారుణంగా పడిపోయి బతుకులు మరింత భారంగా మారుతున్నాయి.

పెరిగిన పెట్రోల్ ధరల ప్రభావం ప్రత్యక్ష వినియోగదారులైన మధ్యతరగతి ప్రజలపైనే కాక, బస్, ఆటో ఛార్జీలు పెరిగి పేదల పైనా పడుతుంది. పెట్రో ధరల వల్ల పెరిగిన నిత్యావసరాల ధరల ప్రభావం మధ్యతరగతి, పేద వర్గాలపై పడటం ఇప్పటికే చూస్తున్నాం. అంతేకాదు డీజిల్ పంపుసెట్ల మీద ఆధారపడి జరుగుతున్న వ్యవసాయం గణనీయమైన స్థాయిలోనే వుంది. కనుక ఈ ధరల పెంపు ప్రభావం రైతాంగం మీద, అంతిమంగా వ్యవసాయరంగం మీద కూడా పడుతుంది.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా వచ్చిన వరదలు కొన్ని కోట్ల ప్రజల ఆర్థిక స్థితిగతిని చిన్నాభిన్నం చేశాయి. లక్షలాది ప్రజలు పంటల్నీ, ఇండ్లనూ, సర్వస్వాన్ని కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. పెరిగిన ధరలు వీరి పరిస్థితిని మరింత దుర్భరం చేస్తాయి.

## ధరలపై ఏ పార్టీ ఏమంటోంది?

పెరిగిన ధరల పట్ల ప్రజల్లో వ్యక్తమైన తీవ్ర వ్యతిరేకతను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి, అన్ని బూర్జువా పార్టీలూ

తాపత్రయపడుతున్నాయి. ముందుగా పెట్రో ధరల గురించి చూస్తే - అన్ని పార్టీలూ వ్యతిరేకించడం విశేషం కాదు గానీ కాంగ్రెస్ పార్టీ కూడా వ్యతిరేకించడమే కొంచెం విశేషం. అయితే దాని వ్యతిరేకత ధరలపై కాదు, మన్మోహన్‌పై కాంగ్రెస్ (సోనియా)కు వున్న అసమ్మతిని వ్యక్తం చేయడానికి దీన్నొక సాకుగా అది ఉపయోగించుకుంది. తన హయాంలోనే పెట్రోల్ ధరల నియంత్రణా వ్యవస్థను తొలగించిన బి.జె.పి. ఇప్పుడు పెరిగిన ధరల మీద యు.పి.ఎ.ను ఏకి పారేస్తోంది. తాము నిరంతరాయంగా రాజ్యమేలుతున్న పశ్చిమ బెంగాల్‌లో అమ్మకం పన్ను ఆదాయంలో 22 శాతాన్ని చమురు నుంచి పొందుతున్న వామపక్షం(సి.పి.ఎం) పన్నులు తగ్గించమని కేంద్రాన్ని మాత్రం డిమాండ్ చేస్తున్నది.

నిత్యావసర సరుకుల ధరల విషయానికొస్తే ఒకవైపు ధరల మంటలకు ప్రజలు గగ్గోలు పెడుతుంటే ప్రభుత్వ నేతలు మాత్రం ధరలు పెరగనే లేదని ఏసి గదుల్లో కూర్చొని ప్రకటిస్తున్నారు. ధరల పరిస్థితిపై మన్మోహన్ ఆధ్వర్యంలో జరిగిన మంత్రివర్గ సమావేశం ధరలన్నీ అదుపులోనే ఉన్నాయని తీర్మానించిందంటే ప్రజలను ఎంత వెర్రిబాగుల వాళ్ళుగా అది జమకడ్తున్నట్టు? ఇక సోనియా అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ పాలిత ముఖ్యమంత్రుల సమావేశం ధరల పెరుగుదలకు గతంలో ఎన్.డి.ఎ అవలంభించిన విధానాలే కారణమని తీర్మానించింది. మరి అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఆ విధానాలను వీళ్లెందుకు మార్చలేదని ప్రజలు ఆలోచిస్తారేమో అనయినా వీళ్లనుకోలేదు (ఎన్.డి.ఎ. అయినా యు.పి.ఎ. అయినా అవలంభించేది ప్రపంచబ్యాంకు విధానాలనేనని ప్రజకెప్పుడో అర్థమయిందనేది వేరే సంగతి). ఈ సమావేశంలో వై.ఎస్., రాష్ట్రంలో ధరలన్నీ గత రెండేళ్లుగా స్థిరంగా ఉన్నాయని, రాష్ట్ర జనాభాలో 85 శాతం మందికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసరాలు సరఫరా చేస్తున్నామని నోటికొచ్చిన అబద్ధాలు చెప్పాడు. ఈ సమావేశం జరిగిన పదిహేను రోజులకు గానీ పౌర సరఫరా మంత్రి ధరలు పెరిగాయని ఒప్పుకోలేదు. ధరలు పెరిగాయని ఒప్పుకుంటూ ఏ మేరకు పెరిగాయో ఒక ప్రకటన చేశాడు. అయితే ఈ ప్రకటనలో పేర్కొన్న ధరలు వాస్తవ ధరల కంటే తక్కువగా ఉన్నాయి. ధరలు పెరిగాయని ఒప్పుకోవడానికే సిద్ధంగా లేని ప్రభుత్వాలు, ధరల తగ్గింపుకు ఏం పరిష్కారాలు తీసుకుంటాయి?

ఫార్వర్డ్ లావాదేవీలకు అనుమతినివ్వడం వంటి చర్యలు తీసుకొని నేటి ధరల పెరుగుదలలో భాగస్వామురాలైన బి.జె.పి ఏ పాపమూ ఎరగనట్టు ఆందోళనలు చేపడుతోంది. ఇలాగైనా ఉడిగిపోతున్న తన 'శక్తి'ని తిరిగి తెచ్చుకోవాలనుకుంటోంది.

రాష్ట్రంలో ప్రపంచ బ్యాంకుకు ఏజెంట్‌గా పని చేసిన చంద్రబాబు ఇప్పటి ధరల పెరుగుదలలో తన పాత్రను మరచిపోయినట్టు నటిస్తూ ఆందోళనలు చేస్తున్నాడు. ఆందోళనల్లో భాగంగా సైకిల్ తొక్కుతూ పేద ప్రజలకు దగ్గరవ్వాలనుకుంటున్నాడు. సైకిల్ తొక్కుతున్న చంద్రబాబును చూసి హైటెక్ చంద్రబాబును ప్రజలు మరిచిపోతారని కలలు కంటున్నాడు.

ఇక కేంద్రంలో యు.పి.ఎ. ప్రభుత్వానికి, దాని పదవీకాలానికి ఏ మాత్రం ఇబ్బంది రాకుండా కాపాడుతున్న వామపక్షాలవారు రాష్ట్రంలో మాత్రం యు.పి.ఎ. వ్యతిరేకి తెలుగుదేశంతో చేతులు కలిపి ఉద్యమాలు చేస్తున్నారు. అలా తమకు పాప పరిహారం అవుతుందని భ్రమపడుతున్నారు.

కానీ ప్రజలు మాత్రం ఈ పార్టీల ద్వంద్వ అవకాశవాద వైఖరిని గమనిస్తూనే వున్నారు.

## పోరుతప్ప దారిలేని ప్రజలు

సామ్రాజ్యవాదం రోజురోజుకు మరింత బలంగా సంక్షోభంలో కూరుకుపోతున్న నేపథ్యంలో తన సంక్షోభాన్ని పరిష్కరించుకోవడంలో భాగంగా అది ప్రపంచ దేశాలన్నింటి పైనా సంక్షోభాన్ని రుద్దుతోంది. అందులో భాగంగా మన దేశంపై కూడా సంక్షోభాన్ని రుద్దుతోంది. దీనికి మన దేశ దోపిడీ పాలకవర్గాలు సమర్థవంతమైన వాహకాలుగా పని చేస్తున్నాయి. ఫలితంగా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు సంక్షోభంలో పడి ధరలు పెరిగి ప్రజల బతుకులు దుర్భరమౌతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా అవి అవలంభించేది సామ్రాజ్యవాద అనుకూల విధానాలే కనుక ధరల సమస్య రోజురోజుకు పెరుగుతుందే తప్ప శాశ్వతంగా పరిష్కారం కాదు. ప్రజా సంక్షేమానికి పాటుపడే ప్రజా ప్రభుత్వం మాత్రమే ధరల సమస్యను పరిష్కరించగలదు. కనుక ధరల పెరుగుదల వ్యతిరేక ఉద్యమాలు దోపిడీ పాలక వర్గాల వ్యతిరేక ఉద్యమాలుగా రూపం తీసుకోవాలి. దేశంలో ప్రజారాజ్య స్థాపన కోసం జరిగే పోరాటాలతో అనుసంధానం కావాలి. అప్పుడే ధరల సమస్య పరిష్కారం అవుతుంది. ❑

# రిజర్వేషన్లు ఒక సంస్కరణ; భూమి, సంపదలు, ఆస్తుల పునఃపంపిణీతోనే
# పీడిత కులాల మౌలిక సమస్యలకు పరిష్కారం

ఉన్నత విద్యా సంస్థలైన ఐ.ఐ.టి., ఐ.ఐ.ఎం. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే మెడికల్ ఇంజనీరింగ్ కాలేజీలలో కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఓ.బి.సి. విద్యార్థులకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించగానే అగ్రకుల విద్యార్థులు మరోసారి రిజర్వేషన్ వ్యతిరేక పోరాటానికి దిగారు. అగ్రకుల బ్రాహ్మణవాదులు, హిందుత్వ శక్తులు ఈ రిజర్వేషన్ వ్యతిరేక మంటను రాజేస్తే, ఇంగ్లీష్ పత్రికలు, టి.వి ఛానళ్లు పనిగట్టుకొని ఈ ప్రతిపాదనకు వ్యతిరేకంగా ప్రచారం చేసి, అగ్రకుల విద్యార్థుల ఆందోళనకు ఆజ్యం పోస్తున్నాయి. తెరవెనుక జరిగిన అంగీకారంతో ప్రభుత్వం చూసీ చూడనట్లు వ్యవహరించింది. వివిధ రాజకీయ పార్టీలు తమ ప్రత్యర్థుల మీద ఎత్తుకు పైఎత్తులు వేయడానికి ఈ నిరసనలను ఉపయోగించుకుంటున్నాయి.

ముఖ్యంగా ఢిల్లీ, ముంబాయి, కోల్‌కత్తా ఇంకా దేశంలోని కొన్ని నగరాలు, పట్టణాల్లో ఆందోళన జరుపుతున్న విద్యార్థులపై పోలీసులు దుర్మార్గంగా లాఠీ చార్జీ చేయటంతో విద్యార్థుల ఆగ్రహావేశాలు తీవ్రమై పెద్ద సంఖ్యలోనే ఈ ఆందోళనలో చేరారు. దీనితో ఇది జాతీయ వార్తగా పార్లమెంటులో చర్చనీయాంశమైంది. మండల్-2గా పిలవబడుతున్న ఈ రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనను ప్రస్తుత నిర్దిష్ట సామాజిక, రాజకీయ పరిస్థితుల్లో ఎలా అర్థం చేసుకోవాలి?

మనువు కాలం నుంచి వేల సంవత్సరాలుగా అగ్రకులాలు దళిత, బి.సి కులాల ప్రజలనూ, ఆదివాసులను మనుషులుగా గుర్తించలేదు. శూద్రులుగా, అంటరానివారిగా పరిగణించి వారిని వెట్టిచాకిరీకి, అనేక కుల వృత్తులకే పరిమితం చేశారు. కుల వృత్తులు మాని విద్యా ప్రభుత్వ ఉద్యోగాల వైపు రావాలని ప్రయత్నించిన దళితుల్ని, బి.సిలను, ఆదివాసీలను అగ్రకులాలు రాకుండా అణగదొక్కాయి. ఈ అణచివేతకు వ్యతిరేకంగా బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన పోరాటాల వల్ల ఎస్.సి, ఎస్.టిలకు రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగంలో పొందుపరిచారు. 1947 తర్వాత వివిధ పోరాటాల ద్వారా బి.సిలు వివిధ రాష్ట్రాల్లో రిజర్వేషన్లు సాధించుకున్నారు. 1980 నాటికి కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఓ.బి.సి ఉద్యోగులు కేవలం 12.55 శాతం మాత్రమే వున్నారు. ఎస్.సి., ఎస్.టి ఉద్యోగులు 18.72 శాతం వున్నారు. అంటే సుమారు 70 శాతం అగ్రకుల ఉద్యోగులు వున్నారు. అలాగే క్లాస్-1 ఉద్యోగాల్లో ఓ.బి.సిలు 5 శాతం వుండగా 90 శాతం మంది అగ్రకులాల వాళ్లే వున్నారు. జనాభాలో 50 శాతంగా వున్నా ఓ.బి.సిలకు తగినంత ప్రాతినిధ్యం లేని కారణంగానే రిజర్వేషన్ల అవసరం ఏర్పడింది.

ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓ.బి.సిలకు రిజర్వేషన్లు కల్పించాలన్న బిపి మండల్ సిఫార్సులను అమలు చేయాలని 1990లో అప్పటి విపి సింగ్ ప్రభుత్వం నిర్ణయించిన సందర్భంగా దేశంలో అగ్రకుల విద్యార్థులు మండల్ వ్యతిరేక ఆందోళనలు నడిపారు. ఈ ఆందోళనలు ఇప్పటికంటే ఎక్కువగానే, ఆత్మాహుతి వరకు వెళ్లాయి. వాస్తవానికి ఈ ఆత్మాహుతి సంఘటనలో అగ్రకుల విద్యార్థులు అమాయకుడయిన ఒక విద్యార్థిని ఆత్మాహుతి చేసుకునేటట్లు నటించమని, నిజంగానే కిరోసిన్ పోసి తగులబెట్టి నిండు ప్రాణాన్ని బలిచేశారు. అప్పట్లో మండల్ వ్యతిరేక ఆందోళన విఫలమైంది. ఓ.బి.సిలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలవుతున్నాయి. మండల్ అనుకూల ఉద్యమం నుంచి ఓ.బి.సిలు ఒక రాజకీయ శక్తిగా ఎదిగారు. విద్య, ఉద్యోగ రంగాల్లో ఓబిసిలకు 'తగిన' ప్రాతినిధ్యం (జనాభా ప్రాతిపదికన కాదు) కల్పించడమే రిజర్వేషన్ విధానపు ప్రధాన ఉద్దేశ్యం.

మండల్ ఉద్యమ సందర్భంలో భారత సమాజంలో కులం, దాని ప్రభావంపై విస్తృతంగానే చర్చ జరిగింది. సామాజిక, ఆర్థిక అసమానతలు వున్న భారత సమాజంలో దళితులు, ఓ.బి.సిలు అగ్రకులాల పీడనకూ, అణచివేతకు గురవుతున్నందున కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడం సరైందేనని ప్రజలు, మేధావులు, చివరకు సుప్రీం కోర్టు కూడా అంగీకరించింది. ఆ విధంగా రిజర్వేషన్లు అమలు చేయడం సాధారణ విషయంగా మారింది. దక్షిణాది రాష్ట్రాలలో ఓ.బి.సిలకు రిజర్వేషన్లు ఎంతో సాధికారతను ఆమోదాన్ని పొందాయి. అటువంటిది ఇప్పుడు మళ్ళీ ఎందుకు వివాదాస్పదమయ్యాయి?

### మొన్నటి అగ్రకుల విద్యార్థుల రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన

1990 నాటి మండల్ వ్యతిరేక ఉద్యమంలాగా, రూపంలో కన్పిస్తుంది. కానీ సారంలో ఇప్పటి ఆందోళన చాలా భిన్నమైనది. అందుకే దీని నేపథ్యం గురించి పరిశీలించవల్సిన అవసరం వుంది.

1990ల నాటి మండల్ వ్యతిరేక ఆందోళన మొన్నటి అగ్రకుల విద్యార్థుల రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనా రూపంలో ఒకేలా కన్పించడానికి వాళ్ళు చేస్తున్న పాత వాదనలు, పాత ఆందోళనా రూపాలు, మీడియా, కొంతమంది మేధావుల మద్దతూ, సినీ తారలూ క్రికెటర్ల సంఘీభావం, సంపన్న శ్రేణి (క్రిమీలేయర్) వాదనలూ, ఆర్థిక ప్రాతిపదిక ప్రతిపాదనలు వంటివన్నీ కారణాలుగా చెప్పవచ్చు. అగ్రకుల విద్యార్థులూ, వారికి మద్దతు పలుకుతున్న మేధావులూ, మీడియా ఓ.బి.సిలకు రిజర్వేషన్లు ఇవ్వరాదని సూటిగా చెప్పరు. ఓ.బి.సిలు సామాజికంగా వెనుకబడిన వారు కాదని, వారు సామాజికంగా అణచివేతకు గురికాలేదని అగ్రకుల విద్యార్థులు, మేధావులు, ఇంగ్లీష్ పత్రికలూ, చానళ్లు బహిరంగంగా చెప్పవు, చెప్పలేవు. ఓ.బి.సిలు వెనుకబడి వున్నారని అంగీకరిస్తూనే వారికి విద్యారంగంలో రిజర్వేషన్లు ఇవ్వరాదని అగ్రకులాల విద్యార్థులు వాదిస్తున్నారు. కారణమేమంటే, ఓ.బి.సిలకు ప్రతిభలేదని అంటున్నారు.

## 'ప్రతిభ' ఒక కల్పన, అది అగ్రకుల ఆధిపత్యమే!

పుస్తక పరిజ్ఞానం, బట్టీ పట్టడంలో తమకు తామే సాటియని, ఆ 'ప్రతిభ' ఓ.బి.సిలకు లేదని చెబుతున్నారు. లక్షలు చెల్లించి కార్పోరేట్ కాలేజీల్లో సీటు సంపాదించటమే వీరి దృష్టిలో ప్రతిభ. దళితుల్ని, బి.సి కులాల ప్రజలను ఏండ్ల తరబడి పుస్తక జ్ఞానానికీ, సంపదకూ అధికారానికి దూరం చేసిన అగ్రకులాలు తమ దోపిడీనీ,అణచివేతనూ, వివక్షను ప్రతిభ సిద్ధాంతం పేరుతో సమర్థించుకుంటున్నారు. 'ప్రతిభ' ముసుగులో అగ్రకుల విద్యార్థులు విద్యా రంగంలో ముఖ్యంగా వృత్తి విద్యా రంగంలో తమ గుత్తాధిపత్యాన్ని కాపాడుకోవాలని తాపత్రయ పడుతున్నారు. కార్పోరేట్ కాలేజీల్లో ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో, ప్రైవేట్ ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీల్లో అగ్రకుల విద్యార్థులు సాధించే మార్కులు ఈ రోజు ప్రతిభగా చెప్పుకుంటున్నారు. ఉన్నత విద్యా సంస్థల్లోని కోర్సుల్లో తక్కువ సీట్లకు ఎక్కువ మంది పోటీపడుతున్న ఫలితంగా మెరిట్ అనేది ర్యాంకుగా మారిపోతున్నది. 0.5 శాతం మార్కులు తక్కువ వచ్చిన వాళ్ళు ర్యాంకు రాకపోతే మంచి ఇంజనీరింగ్ లేదా మంచి డాక్టర్ కాలేరని ఎవరయినా చెప్పగలరా? వడపోతలాంటి పరీక్షా విధానం మెరిట్‌ను పరీక్షించేది కాదు. విద్య వ్యాపారంగా మారి, ర్యాంకుల వేలంవెర్రి మొదలయిన తర్వాత, ఆ ర్యాంకుల కోసం కోచింగ్ సెంటర్లు వేలకు వేలు డబ్బు ఖర్చుపెట్టేవారు ఎన్ని అడ్డదారులు తొక్కుతున్నారో ప్రతి సంవత్సరం కండ్ల ముందు కనిపిస్తోనే వుంది. మొదటి ర్యాంకు వచ్చిన వారే ఆ తర్వాత ర్యాంకును అడ్డ దారుల్లో సంపాదించారని తేలిన సంఘటనలు వున్నాయి.

ప్రతిభ ఏ ఒక్కరి సొత్తుకాదు. పీడిత కులాల్లో పుట్టిన వారెందరో ప్రతిభావంతులయ్యారనేది చరిత్రను గమనిస్తే అర్థం అవుతుంది. ప్రతిభ అనేది కులం ఆధారంగా వుంటుందని ఎక్కడా శాస్త్రీయంగా నిరూపించబడలేదు. తక్కువ కులంలో పుట్టిన వారికి ప్రతిభ వుండదని ఎవరూ చెప్పలేరు. అందుకే ప్రతిభ అనేది కేవలం కల్పితం. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమాన వాటా ఉన్నప్పుడు పీడిత కులాల విద్యార్థులు కూడా తమ ప్రతిభను ప్రదర్శించగలరు. ఆరుగాలం కష్టించి, పంటతీసి దేశానికి అన్నం పెడుతున్న రైతుకు ప్రతిభ లేదా? మట్టిని కుండగా మలచడంలో ప్రతిభ లేదా? పత్తిని బట్టగా మార్చడంలో ప్రతిభ లేదా? ఇటుకపై ఇటుక పేర్చి ఆకాశ హర్మ్యాలను నిర్మించడంలో ప్రతిభ లేదా? సర్వ మలినాలను ఎత్తిపోసి అద్దంలాగా రోడ్లను వూడ్చడంలో అసహ్యం కనిపిస్తున్నది వీళ్ళకు. 'ప్రతిభ' మత్తు నెత్తికెక్కిన అగ్రకుల విద్యార్థుల ఆందోళనా రూపాలు (రోడ్లు వూడ్చటం, రిక్షా లాగటం) వాళ్ళ అగ్రకుల సంస్కృతి అహంకారానికి అద్దం పట్టాయి. ఈ ప్రతిభను సాకుగా చూపి సమాజంలో విద్యకు, సంపదకు దూరం చేసిన వర్గాలను విద్యా రంగంలోకి రానీయకుండా చేయడమే దీని వెనక వున్న వుద్దేశం. ఈ అర్థంలో ప్రతిభ అంటే అగ్రకుల ఆధిపత్యం మాత్రమే.

## మొన్నటి రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన

ఉన్నత విద్యా రంగంలో ఓ.బి.సిలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ సాగిన ఆందోళనకు ఢిల్లీలోనూ ఇతర పట్టణాల్లో మెడికల్ విద్యార్థులు నాయకత్వం వహించారు. అగ్రకుల మెడికోల ఆందోళన సారంలో భిన్నమైనది. ఈ ఆందోళనలో 90ల నాటి మండల్ వ్యతిరేక ఆందోళనా వాదనలే ప్రధానంగా వున్నప్పటికీ ఇప్పటి ఆందోళనను నిర్దిష్టంగా పరిశీలించవల్సిన అవసరం వుంది.

మెడికోలు నాయకత్వం వహిస్తున్న ఈ ఆందోళనలో వివిధ వృత్తి విద్యా సంస్థల నుండి అగ్రకుల విద్యార్థులు ఎక్కువగా కదిలారు. పోలీసు లాఠీ ఛార్జీతో ఇది మరింత ఎక్కువైంది. ఇక అగ్రకులాల ఆధిపత్యం కొనసాగుతున్న మీడియా దీన్ని పైకెత్తి పట్టడటంతో గంటల్లో అది దేశమంతటా చర్చనీయాంశంగా మారింది. ఈ ఆందోళనలో మొట్టమొదటిసారిగా అత్యున్నత ఇంజనీరింగ్ విద్యా సంస్థలైన ఐ.ఐ.టి, మేనేజ్ మెంట్ సంస్థలైన ఐ.ఐ.ఎంలలో అగ్రకుల విద్యార్థులు అధికంగా వుండటంపైన చర్చ జరుగుతున్నది. ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీల్లో, యూనివర్సిటీల్లో, ఐ.ఐ.టి, ఐ.ఐ.ఎంలలో మొత్తంగా వృత్తి విద్యారంగంలో అగ్రకులాల ఆధిపత్యం వున్నట్లు స్పష్టమైంది. వృత్తి విద్యారంగంలో

27 శాతం సీట్లు ఓ.బి.సిలకు రిజర్వ్ చేస్తే ఈ రంగంలో తమ గుత్తాధిపత్యానికి దెబ్బ తగులుతుందని అగ్రకులాల విద్యార్థులకు అర్థమైంది. అందుకే వాళ్ళు రోడ్లమీదికొచ్చి తమ ఆధిపత్యం కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఒక పక్క 'ప్రతిభ' కాపాడాలని అని అంటూనే మరోపక్క తమను తాము 'యూత్ ఫర్-ఈక్వాలిటీ'(సమానత్వం కోరే యువత)గా చెప్పుకుంటున్నారు. వృత్తి విద్యలో సమానత్వం కల్పించే ఓ.బి.సి రిజర్వేషన్‌ను వ్యతిరేకించే వీళ్ల సమానత్వాన్ని కోరటం లేదు. తమ గుత్తాధిపత్యాన్ని ప్రతిభ పేరుతో అగ్రకుల విద్యార్థులు సమర్థించుకుంటున్నారు. వాళ్ల చెప్పే ప్రతిభకు సమానత్వానికి గల వైరుధ్యాన్ని కూడా వీళ్ల పట్టించుకోరు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమాన వాటా వుంటే పీడిత కులాల విద్యార్థులు కూడా ప్రతిభలో సమానంగానే పోటీ పడగలరు. దీని గురించి ఈ అగ్రకుల విద్యార్థులకు అవసరం లేదు. వున్నత విద్యా సంస్థల్లో ఆధిపత్యమే వీళ్లకు కావాలి. అందుకు 'ప్రతిభ' అనే సాకు కావాలి. అసలు వీళ్ల ప్రతిభ ఏమిటో ఢిల్లీలో రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలో ముందున్న ఏ.ఐ.ఐ.ఎం.ఎస్ మెడికల్ విద్యార్థుల ప్రతిభ గురించి వాస్తవాల్లోకి వెళితే తెలుస్తుంది. పి.జి కోర్సులో తమ వద్ద గ్రాడ్యుయేషన్ చేసిన విద్యార్థులకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్న ఏఐఐఎంఎస్ సంస్థ అడ్మిషన్ పద్ధతిని సుప్రీం కోర్టు తప్పు పట్టింది. అఖిల భారత స్థాయి ప్రవేశ పరీక్షలో 14 లేదా 19 లేదా 22 శాతం మార్కులు వచ్చిన ఎఐఐఎంఎస్ గ్రాడ్యుయేట్స్‌కి పి.జి కోర్సుల్లో సీట్లు రాగా ఇంత కంటే ఎక్కువ మార్కులు వచ్చిన ఎస్.సి, ఎస్.టి విద్యార్థులకు వారి కోటాలో సీట్లు రాలేదు. ఎస్‌సి, ఎస్‌టిలకు కేటాయించిన సీట్లను మంచి మార్కులు తెచ్చుకున్న ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులను పట్టించుకోకుండా సంస్థాపరమైన రిజర్వేషన్ల పేరుతో ఎఐఐఎంఎస్ కి చెందిన వారికే సీట్లివ్వడాన్ని ప్రతిభ అందామా? లేక అగ్రకుల గుత్తాధిపత్య విధానమందామా? ఎ.ఐ.ఐ.ఎం.ఎస్ మెడికల్ విద్యార్థులు ప్రతిభ పేరుతో గొంతు చించుకునే ముందు తమ ప్రతిభ గురించి ఆలోచించుకుంటే మంచిది.

## రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనకు వివిధ సెక్షన్ల మద్దతు

ఐ.ఐ.టి, ఐ.ఐ.ఎంలలో తమ గుత్తాధిపత్యాన్ని కాపాడుకోవడానికి మండల్ ఆందోళన సందర్భంగా చేసిన అనేక అసమంజసమైన వాదనలనే నేడు అగ్రకుల విద్యార్థులు చేస్తున్నారు. ఇంగ్లీషు మీడియా, కొంత మంది మేధావులు ఈ వాదనలనే వల్లె వేస్తున్నారు. వేల సంవత్సరాల నుండి అసహ్యకరమైన కుల వ్యవస్థ కులాధారిత పీడన భారత ప్రజల్ని విభజిస్తున్నదనే కఠిన వాస్తవాన్ని మరుగుపర్చడానికి ప్రయత్నిస్తూ పైగా రిజర్వేషన్ల వల్ల యువత చీలిపోతుందనీ, దేశం ముక్కలౌతుందనీ, వృత్తి నైపుణ్యతా ప్రమాణాలు, నాణ్యత పడిపోతాయని ప్రతిభగల విద్యార్థులకు అవకాశాలు దొరకవని, ఒబిసి రిజర్వేషన్లు నిజమైన ఒబిసి పేదలకు అందవని, రిజర్వేషన్లు ఒక తరం వారికే ఇవ్వాలని, సంపన్న శ్రేణి వర్గాన్ని రిజర్వేషన్‌కు అనర్హులుగా ప్రకటించాని, రిజర్వేషన్ వ్యతిరేక పండితులు తమ వర్గ స్వభావపు వాదనలు ఎక్కుపెడుతున్నారు. ఈ వాదనలు ఒబిసి రిజర్వేషన్లు వ్యతిరేకించడానికి చేస్తున్నవే తప్ప దేశంపై, ఒ.బి.సి పేదలపై ప్రేమతో కాదు. రిజర్వేషన్లు అంగీకరించకుండా పరిమితులు, షరతుల గురించి మాట్లాడే నైతిక హక్కులేదని వీరు గ్రహించాలి.

పీడిత కులాలకు ఆర్థికంగా మద్దతు కల్పించాలని, అందుకు ప్రత్యేక పథకాలు రూపొందించాలని ఈ 'ఉదారశీల' రిజర్వేషన్ వ్యతిరేకులు మొసలి కన్నీరు కార్చుతూ సానుభూతి వాఖ్యాలు వల్లిస్తున్నారు గానీ ఉన్నత విద్యా సంస్థల్లో స్థానం ఇవ్వడానికి మాత్రం ససేమిరా ఒప్పుకోరు.

అగ్రకులాల మానస పుత్రులు ఆందోళనకు దిగినప్పుడల్లా నిస్సిగ్గుగా తమ కులతత్వాన్ని, అహంకారాన్ని బయటపెట్టుకునే అగ్రకుల సామాజిక శాస్త్రవేత్తలు, క్రికెటర్లు, సినీ తారలు, మీడియా సంస్థలు ఈసారి కూడా తమ పాత్రను నిర్వర్తించారు. ఇంగ్లీషు పత్రికలు, టి.వి.ఛానళ్ళు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐ.ఎం.ఎ), జాతీయ విజ్ఞాన కమీషన్ సభ్యులు, కొందరు రాజకీయ నాయకులు బహిరంగంగానే తమ కుల స్వభావాన్ని ప్రదర్శించారు. ఒ.బి.సి రిజర్వేషన్లను కుంటిసాకులతో వ్యతిరేకించారు. ఈ రకంగా విభిన్న రంగాల్లోని అగ్రకులాలు ఏకం కావటం గతంలో కూడా జరిగినదే. తమ కులాల గుత్తాధిపత్యం వృత్తి విద్యారంగంలో కొనసాగించటానికే అగ్రకుల మెడికల్ విద్యార్థులు నిరాహారదీక్షలు, ఆందోళనలు, అహంకారంతో పీడిత కులాలను అవమానించే ఆందోళనా రూపాలు చేపడుతున్నారు. వీరికి మీడియా నుంచి, ఐఎంఎ, జాతీయ విజ్ఞాన కమీషన్ లాంటి ప్రభుత్వ సంస్థల నుంచి వచ్చే మద్దతు మన సమాజంలో అగ్రకుల ఆధిపత్యానికి సాక్ష్యాలుగా వుంటాయి. ఇక రెసిడెంట్ డాక్టర్లను రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సమ్మె చేయడానికి అగ్రకుల దురహంకారం నరనరాన జీర్ణించుకున్న ఎ.ఐ.ఐ.ఎం.ఎస్ డైరెక్టర్ వేణుగోపాల్ ప్రత్యక్షంగానే ప్రోత్సహించాడు. ఇటువంటి అగ్రకుల దురహంకారులు ఉన్నత విద్యా సంస్థల్లో రిజర్వేషన్లను వ్యతిరేకించడమే కాకుండా రిజర్వేషన్ విద్యార్థులను మానసికంగా నానా హింసలుపెట్టి వేధిస్తున్నారు.

ఈ ఉన్నత విద్యా సంస్థల్లో అగ్రకులాల, విదేశాల్లో నివసించే వర్గాల గుత్తాధిపత్యమే కొనసాగుతున్నది.

## రిజర్వేషన్లపై దళారీ బడా పెట్టుబడిదారుల వ్యతిరేకత

ఈసారి రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలో కార్పోరేట్ రంగ పెట్టుబడిదారులు బహిరంగంగా అగ్రకుల విద్యార్థుల్ని వెనుకేసుకొచ్చారు. పారిశ్రామిక, వ్యాపార ప్రముఖులు, మల్టీ మిలియనీర్లు అయిన టాటాలు, బిర్లాలు, అంబానీలు, బజాజ్‌లు, నారాయణమూర్తి, ప్రేమ్‌జీ లాంటి దళారీ నిరంకుశ బూర్జువాలు కూడా వెనుకబడిన కులాల పీడిత సెక్షన్ల ప్రజలకు రిజర్వేషన్లను తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ దళారీ నిరంకుశ బూర్జువాలకు, వృత్తి విద్యకు చాలా దగ్గరి సంబంధం వుంది. అనేక వృత్తి విద్యా సంస్థలను కార్పోరేట్ రంగమే నిర్వహిస్తుంది. ప్రభుత్వ సొమ్ముతో నడిచే ఐ.ఐ.టి గ్రాడ్యుయేట్‌ను తమ సంస్థల కోసం ఎగురవేసుకుపోవడానికి గోతికాడి నక్కల్లా కార్పోరేట్ సంస్థలు కాచుకు కూర్చుంటాయి. విప్రో నారాయణమూర్తి ప్రభుత్వ రంగంలో అహ్మదాబాద్ ఐఐఎం గవర్నింగ్ కౌన్సిల్‌కు చైర్మన్‌గా వున్నాడు. వీళ్లే విద్యపై ప్రైవేటీకరణ, సామ్రాజ్యవాద అనుకూల విద్యకు మార్గం సుగమం చేశారు. అధిక ఫీజులు, ఎన్ఆర్ఐ కోటా లాంటి విధానాలు రూపొందించారు. రిజర్వేషన్ల వల్ల భారత దేశం సాధిస్తున్న ప్రస్తుత 'ప్రగతి' మందగిస్తుందని విద్యారంగంలో 'నాణ్యత' గురించి మాట్లాడుతున్నారు. డబ్బుతో సీటు కొనుక్కొని చదువుకుంటే వృత్తి విద్య 'నాణ్యత' తగ్గదు గానీ ఓబిసిలకు సీట్లు రిజర్వు చేస్తే 'నాణ్యత' తగ్గుతుందట. ఈ ఉన్నత బోధనా సంస్థల్లో బి.సిలకు రిజర్వేషన్లు ఇంత వరకు అమలు కాలేదు. అవి లేకుండానే ఈ సంస్థలు ఎప్పటికీ దళారీ బడా వ్యాపారవర్గాల,సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కొరకు సేవలందించానుకుంటున్నాయి.

ప్రపంచీకరణ వేళ్ళూనుకుంటున్న నేపథ్యంలో ప్రజాధనంతో స్థాపించిన ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటు పరం అవుతుండగా దళితులు, బిసిలు ప్రైవేటు రంగంలో కూడా తమ వాటా గురించి అడుగుతున్నారు. కార్పోరేట్ రంగంలో రిజర్వేషన్లు కావాలని గత రెండు మూడు ఏండ్లుగా వత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వ సబ్సిడీలు, సహకారంతో ఎదుగుతున్న కార్పోరేట్ పరిశ్రమల్లో దళితులు, బిసిలు వాటా అడిగితే పరిశ్రమాధిపతులు తట్టుకోలేక పోతున్నారు. నేడు ప్రభుత్వం ప్రతిపాదించిన ఒబిసి రిజర్వేషన్లు వృత్తి విద్యలో అగ్రకులాల గుత్తాధిపత్యాన్ని దెబ్బతీయటమే కాదు పరిశ్రమల్లో ఒబిసిల ప్రవేశానికి, వారి వత్తిడికి అవకాశాలు పెరుగుతాయి. ఇది గమనించే, సమాజంలో వివిధ రంగాల్లో ఏమి జరుగుతున్నా తమకు ఏమీ పట్టని దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు ఈ రోజు అగ్రకుల విద్యార్థుల ఆందోళనను వెనుకేసుకొస్తున్నారు. ప్రపంచీకరణ వల్ల పారిశ్రామిక రంగంలో మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యం సాధించిన దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు వారి వర్గ, కుల ప్రయోజనాలు కాపాడుకోవడానికి సామాజిక వెనుకబడిన వర్గాలకు చదువుకునే అవకాశం లేకుండా చేయాలని చూస్తున్నారు.

## రిజర్వేషన్ల వ్యతిరేకతకు ఆజ్యం పోస్తున్న కార్పోరేట్ మీడియా

మీడియా సంస్థలు ముఖ్యంగా టైమ్స్ ఆఫ్ ఇండియా, ఎన్.డి టి.వి, సి.ఎన్.ఎన్, ఐ.బి.ఎన్, టైమ్స్ నవ్ లాంటి ఛానళ్ళు అగ్రకుల విద్యార్థులను వెనుకేసుకురావడం పరిపాటే. మీడియాలో అగ్రకుల ఆధిపత్యం ముఖ్యంగా బ్రాహ్మణ కుల ఆధిపత్యం వున్నదనే సంగతి అందరికీ తెలిసిందే. అందుకే ఈ పత్రికల్లో, ఛానళ్ళలో విలేకర్లు తమకే నష్టం జరుగుతున్నట్లు తెగ బాధపడిపోతూ అగ్రకుల విద్యార్థులను మించిన ఆవేశం, కోపంతో రిపోర్టులు చేస్తూ కన్పిస్తారు. మీడియా సంస్థల్లో అగ్రకుల ఆధిపత్యంతో పాటు ప్రపంచీకరణ నేపథ్యంలో మీడియా సంస్థలు బలమైన కార్పోరేట్ సంస్థలుగా ఎదిగాయి. ఈ కార్పోరేట్ మీడియా బహుళజాతి సంస్థలు, నయా సంపన్న వర్గాలకు, ఎగువ మధ్యతరగతి ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. దళితులకు, ఒబిసిలకు ఈ కార్పోరేట్ ప్రపంచంలో చదువుకునే హక్కు మాత్రమే కాదు, కనీసం మనుషులుగా బతికే పరిస్థితి లేదు.

## బి.సిలు బలపడుతుండగా పెరుగుతున్న రిజర్వేషన్ వ్యతిరేకత

90లతో పోలిస్తే ఈరోజు రిజర్వేషన్ల విధానానికి సాధికారత బాగా పెరిగింది. దక్షిణాది రాష్ట్రాల్లో స్థూలంగా రిజర్వేషన్లపై ఒక ఏకాభిప్రాయం ఏర్పడటం వల్ల రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన నామమాత్రంగా వుంది. ఉత్తర భారతదేశంలో ఒబిసిలు ఒక రాజకీయ శక్తిగా ఎదిగారు. ఉత్తరాది రాష్ట్రాల్లో 1994లో 11 శాతంగా వున్న ఒ.బి.సి ప్రజా ప్రతినిధుల సంఖ్య 1996 నాటికి 25 శాతమైంది. అదే కాలంలో 47 శాతం వున్న అగ్రకులాల ప్రజా ప్రతినిధుల సంఖ్య 35 శాతానికి తగ్గింది. ఉత్తరాది రాష్ట్రాల్లో నేడు ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా బిసి కులానికి చెందిన వ్యక్తే ముఖ్యమంత్రి అయ్యే స్థితికి వచ్చింది. ఇక్కడ రాజకీయ, ఉద్యోగ రంగాల్లో సాంప్రదాయ అగ్రకులాల ప్రాబల్యం తగ్గుతూ వుంది. ఈ నేపథ్యంలో వచ్చిన ఒబిసిలకు 27 శాతం రిజర్వేషన్ల

ప్రతిపాదనకు ఉత్తరాది రాష్ట్రాల అగ్రకుల విద్యార్థులు, వారి తరఫున తల్లిదండ్రులు, వ్యాపారులు అందరూ ఆందోళనకు దిగారు. కనీసం ఉన్నత విద్యా రంగంలో తమ ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి ఆందోళన చేస్తున్నారు. వారి ఆందోళన దేశంలో బలపడిన అగ్రకుల భావాజాలానికి, అగ్రకుల శక్తికి గుర్తుగా చూడరాదు. దేశంలో జరుగుతున్న ప్రజాస్వామీకరణకు, కుల వ్యవస్థ బలహీనపరిచే చర్యలకు అగ్రకులాల ఉక్రోషంగా మాత్రమే నేటి ఆందోళనల్ని చూడాలి. రాబోయే రోజుల్లో మొత్తం సమాజంలోని వివిధ రంగాలలో ఒబిసిలు ప్రవేశిస్తారని, తమను స్థానభ్రంశం చేస్తారనే భయంతోనే అగ్రకులాల విద్యార్థులు ఈ ఆందోళన చేస్తున్నారు.

90లలో ఐక్యంగా పోరాడి రిజర్వేషన్లు సాధించుకున్న రిజర్వేషన్ అనుకూల వర్గాలు ఈనాడు రిజర్వేషన్ల గురించి చేసిన ఆందోళన నామమాత్రమే. రిజర్వేషన్లతో పైకెదిగిన వర్గాలు, ముఖ్యంగా ఒబిసిలు, ఐటి, విదేశాలకు వెళ్ళటం, ఐదంకెల వేతనాలు వంటి కలల్లో మునిగి తేలుతూ, న్యాయంగా తమకు దక్కాల్సిన వాటాను సాధించుకోవడానికి చేయవల్సిన పోరాటాలను విస్మరించాయి. ఇక ప్రపంచీకరణ నేపథ్యంలో బలపడి, దేశ ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యం సాధించిన దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గం మీడియాను గుప్పిట్లో పెట్టుకుని రిజర్వేషన్ వ్యతిరేక అగ్రకుల విద్యార్థులకు తెరచాటు నాయకత్వం అందించి ఆందోళనను ఉధృతంగా సాగించారు.

## తెర వెనుక నాటకాలాడుతున్న రాజకీయ పార్టీలు

బూర్జువా పార్లమెంటరీ పార్టీలు రిజర్వేషన్ విధానానికి వ్యతిరేకంగా బహిరంగంగా ముందుకు రావు. కానీ, ఆ పార్టీలన్నీ రిజర్వేషన్ వ్యతిరేకోద్యమాన్ని ప్రోత్సహించేవే. రిజర్వేషన్, మైనారిటీ వ్యతిరేక సెంటిమెంట్లు రెచ్చగొట్టి ప్రజల్ని విభజించి పాలించాలని పాలకవర్గాలు వాంఛిస్తుంటాయి.

90ల నాటి మండల్ కమీషన్ నివేదిక అమలుకు వ్యతిరేకంగా బి.జె.పి., కాంగ్రెస్ పార్టీలు తమ విద్యార్థి సంఘాల్ని ఉసిగొలిపి, బహిరంగంగా వ్యతిరేకతను తెలిపాయి. నేడు అన్ని పార్టీలు ఆమోదం తెలిపినట్టుగా ఉండటం విశేషం. గత డిసెంబర్‌లో అన్ని రాజకీయ పార్టీల ఆమోదంతో పార్లమెంటు 93వ రాజ్యాంగ సవరణ ద్వారా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు లేదా ఎస్.సి, ఎస్.టిలకు ప్రైవేట్, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ విద్యా సంస్థలో రిజర్వేషన్లు కల్పించవచ్చనే క్లాజుని ఆమోదించింది. ఆ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం తర్వాత ఒ.బి.సి.లకు ఉన్నత విద్యారంగంలో రిజర్వేషన్లు కల్పించటానికి మార్గం సుగమమైంది. ఇప్పుడు వ్యతిరేకంగా మాట్లాడదలుచుకున్న పార్టీలకు ఈ బిల్లు అడ్డు వస్తుంది. ఇప్పుడు అన్ని పార్టీల్లో ఒ.బి.సిల ప్రాబల్యం పెరిగింది. మండల్ రిజర్వేషన్ల అమలు తర్వాత ఒ.బి.సిలు రాజకీయ శక్తిగా, ఓటు బ్యాంకుగా ఎదిగారు. సమాజంలో ఒబిసిలు 50 శాతం పైగా వున్నారు. ఒ.బి.సిలను వ్యతిరేకం చేసుకోవటానికి ఏ రాజకీయ పార్టీ కూడ సిద్ధంగా లేదు. అక్కడక్కడా కొంత మంది బి.జె.పి, కాంగ్రెస్ నాయకులు అగ్రకుల విద్యార్థులతో గొంతు కలిపినా, అది వారి వరకే పరిమితం. ఎస్.సి, ఎస్.టి, బి.సి రిజర్వేషన్లకు పార్లమెంటులో ఏకాభిప్రాయం, రాజకీయ పార్టీల ఆమోదం బట్టి చూస్తే సామాజిక న్యాయసూత్రాన్ని కాదనలేని స్థితి ఈరోజు వుంది. అగ్రకుల విద్యార్థుల ఆందోళనను పట్టించుకోకుండా యు.పి.ఎ ప్రభుత్వం జూన్ నుంచి ఒ.బి.సి. రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించటం గత 15 ఏళ్ళుగా ఎస్.సి, ఎస్.టి, ఒ.బి.సి.లు చేసిన పోరాటాల ఫలితంగా రిజర్వేషన్లపై వివిధ వర్గాల మధ్య ఏర్పడిన ఏకాభిప్రాయం కారణం.

ఒ.బి.సి. రిజర్వేషన్లపై సి.పి.ఎం పార్టీ వైఖరిని ప్రత్యేకంగా పరిశీలించాలి. 90ల నాటి మండల్ ఆందోళనల సందర్భంగా ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని మాట్లాడిన సి.పి.ఎం. నేడు కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలంటున్నది. కాని దాని సంపన్న శ్రేణి వాదన చూస్తే కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు అనేది పైపై మాట అనేది అర్థమౌతుంది. ఒ.బి.సి.లకు మద్దతుగా సి.పి.ఎం తన సంఘాలను, శ్రేణుల్ని కదిలించకపోవటం, అగ్రకుల విద్యార్థులకు సీట్లు పెంచాలని కోరటం లాంటివన్నీ పరిశీలిస్తే ఒక ఎన్నికల పార్టీగా, ఓట్ల దృష్టితో ఆలోచిస్తున్నదనేది అర్థమౌతుంది. నోటితో నవ్వుతూ, నొసటితో వెక్కిరించే బూర్జువా పార్టీల వైఖరి సి.పి.ఎంది. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘాలు పెట్టి దళితులకు దేవాలయాల ప్రవేశం కల్పిస్తే, రెండు గ్లాసుల గురించి పరిమిత పోరాటాలు చేస్తూ, పీడిత కులాల రిజర్వేషన్ విషయంలో సంపన్న శ్రేణి వాదనను ముందుకు తేవటం అంటేనే అది ఎవరి ప్రయోజనాల కొరకు పని చేస్తుందో అర్థమౌతుంది. పరిమిత పోరాటాల వల్ల భూముల పంపకం, పరిశ్రమల్లో వాటా వల్ల ఎస్.సి, ఎస్.టి, ఒ.బి.సిలు ఆర్థికంగ అభివృద్ధి చెందుతారు. కానీ ఆ చర్యల వల్ల పీడిత కులాన్ని హీనంగా, తక్కువగా చూసే ధోరణులు, అంటరానితనం, వివక్ష, చిన్న చూపు భౌతిక దాడులు తగ్గవు. అగ్రకులాల గుత్తాధిపత్యానికి, బ్రాహ్మణీయ భావజాలానికీ, అహంకారపూరిత ధోరణులకు వ్యతిరేకంగా మాట్లాడే చైతన్యం రిజర్వేషన్ విధానం వల్ల, దాని కోసం జరిగిన పోరాటాల వల్ల ఎస్.సి, ఎస్.టి, బి.సిలకు వచ్చింది. మన దేశంలో రిజర్వేషన్

అనుకూల ఉద్యమాల నుంచి, దళిత ఉద్యమాల నుంచి కుల వ్యతిరేక చైతన్యం వచ్చింది. కుల సమస్య పట్ల చైతన్యం వచ్చింది. సి.పి.ఎం సంపన్న శ్రేణి వాదన పీడిత కులాలకు ప్రయోజనకారి కాకపోగా రిజర్వేషన్లను నీరుగార్చటానికి, అగ్ర కులాలకు ప్రయోజనాలు నెరవేర్చటానికి ఉపయోగపడుతుంది.

## క్రిమీలేయర్ (సంపన్న శ్రేణి) వాదన

ఒకస్థాయి ఆదాయం కలవాళ్ళు, కుటుంబంలో ఒకరు ఉద్యోగం చేస్తుంటే, తదితర ప్రమాణాలతో సంపన్న శ్రేణిని నిర్ణయించారు. రిజర్వేషన్లను ఉద్యోగాలు కల్పించే స్కీంగా, పేదల నిర్మూలన పథకంగా, సంపూర్ణ సమానత్వాన్ని సాధించే ప్రభుత్వవ్యూహంగా తప్పుడు ప్రచారం చేస్తున్న అగ్రకుల విద్యార్థులు,మేధావులు రిజర్వేషన్లను వ్యతిరేకించటానికి ఉపయోగించుకుంటున్నారు. సంపూర్ణ సమానత్వాన్ని సాధించేవైతే ఇప్పటికే రిజర్వేషన్లు పొందుతున్న ఒ.బి.సిలు ఆర్థికంగా బలపడి వాటిని వాళ్ళే వాడుకోవటం వల్ల ఒ.బి.సిలలోని పేదలు పైకిరారని, ఒ.బి.సిలోనే అంతరాలు మరింత పెరుగుతాయని అగ్రకుల మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒ.బి.సి, ఎస్.సి, ఎస్.టిలలోని ధనిక వర్గాన్ని రిజర్వేషన్ పరిధి నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. సి.పి.ఎం కూడా ఇదే వాదన చేస్తున్నది. చూడటానికి ఇది నిజమేననిపించినా దీని వెనుక వున్న వుద్దేశం వేరు.

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన కులాల్లో చదువుకున్న వారే తక్కువ. మొదటి తరగతిలో చేరిన పిల్లల్లో ఎస్.సి, ఎస్.టిల్లో 70 నుంచి 80 శాతం మంది పదవ తరగతి చేరకముందే బడి మానేస్తున్నారు. ఇంటర్మీడియట్ పాస్ అవుతున్నవారు 4 నుంచి 7 శాతం మాత్రమే. ఇక ఉన్నత విద్య వరకు రావడమే గగనం. ఉన్నత విద్య కోర్సుల్లో, క్లాస్-1 ఉద్యోగాలకు అర్హత కలిగిన ఒ.బి.సి.లు దొరకరు. ఉన్నత శ్రేణి ఉద్యోగాల్లో బి.సిల శాతం పెరగదు. అర్హులైన ఒ.బి.సి. అభ్యర్థులు లేరని ఉన్న పోస్టులన్నీ అగ్రకులాల అభ్యర్థులే తన్నుకుపోతారు. ఆ విధంగా సంపన్నశ్రేణి వాదన రిజర్వేషన్‌ను కుదించటానికి, క్రమంగా ఎత్తివేయటానికి, ఓ.సి పేదలను రిజర్వేషన్ పరిధిలోకి తేవటానికి, రిజర్వేషన్లను నీరుగార్చటానికి దోహదం చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో 27 శాతం ఒ.బి.సి. రిజర్వేషన్లు అమలులో సంపన్న శ్రేణి పేరుతో తెచ్చిన ఆదాయ పరిమితి బి.సిలు ఉద్యోగాలు పొందటానికి అడ్డంకిగా తయారయ్యాయి. దీనివల్ల బి.సి కులాల ప్రాతినిధ్యం పెరుగదు. అగ్రకుల పేదలకు రిజర్వేషన్ ఇవ్వటం వల్ల అగ్రకుల పెత్తనం వివిధ రంగాల్లో కొనసాగుతుంది. ప్రభుత్వం గానీ, బి.జె.పిగానీ అగ్రకులాల పేదలకు న్యాయం జరగాలనుకుంటే ఓపెన్ కేటగిరిలో ఉద్యోగాలు, సీట్లు అగ్రకులాల పేదలకే చెందాలనే నిబంధన విధించవచ్చు. ఆశ్చర్యంగా వారికి ఇలా నిబంధనలు రూపొందించాలని అనిపించదు. బహుశ ఇక్కడ పార్టీలు ప్రభుత్వం 'ప్రతిభ' ప్రాతిపదిక అనుకుంటాయి కాబోలు. ఇదే అగ్రకుల భావజాలం.

## రిజర్వేషన్లు ఒక సంస్కరణ

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 65 శాతం, క్లాస్-1 ఉద్యోగాల్లో 90 శాతం ఉద్యోగాలు అగ్రకులాలు అనుభవిస్తుండటం వల్ల ఒ.బి.సి.లకు కూడ కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో 27 శాతం రిజర్వేషన్ కల్పించాలనే ప్రతిపాదనను వి.పి.సింగ్ ప్రభుత్వం ముందుకు తెచ్చింది. ఇది ఒ.బి.సి.లను సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయటానికి ఉద్దేశించింది కాదు. ప్రభుత్వ విధాన నిర్ణయంలో కీలకపాత్ర వహించే బ్యూరోక్రసీ అధికార వ్యవస్థలో ఒ.బి.సి.లకు స్థానం కల్పించటం దీని ఉద్దేశం. అగ్రకులాల ఆధిపత్యంలో వున్న పాలనారంగం, విద్యా వ్యవస్థలలో ఒ.బి.సి.లకుకూడా ప్రాతినిధ్యం కల్పించటం వల్ల అరకొరగా వున్న ఉద్యోగాల్లో వారికి కొన్ని దొరికి ఒబిసిలలో కొందరు ఉన్నతాధికారులుగా వివిధ హోదాల్లో ప్రభుత్వోద్యోగులుగా ఎదుగుతారు. ఆవిధంగా వారు రాజకీయంగా సంఘటితం కావడానికి రిజర్వేషన్లు దోహదపడతాయి. విద్యా, ఉద్యోగ రంగాల్లోని అగ్రకులాల ఆధిపత్యం తగ్గించటమే ఒ.బి.సి. రిజర్వేషన్ల లక్ష్యం. ఒ.బి.సి.లకు గానీ, ఎస్.సి, ఎస్.టిలకుగానీ రిజర్వేషన్లు ప్రభుత్వ ఉద్యోగ విద్యారంగాల్లో కొంత ప్రాతినిధ్యం కల్పించడానికి ఉపయోగపడతాయి. ఆమేరకు రిజర్వేషన్లు కుల వ్యవస్థను బలహీనపరచటానికి, అగ్రకులాల ఆధిపత్యాన్ని తగ్గించటానికి ఉపయోగపడే పరిమితమైనది మాత్రమే.

ఈరోజు అగ్రకులాలను ఇబ్బంది పెడుతున్నది ఇదే. అగ్రకులాధిపత్యానికి గండి కొడుతుండటం వల్లనే రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం ఇంత తీవ్రంగా ఒ.బి.సిలను, ఎస్.సి, ఎస్.టిలను ప్రతిభ లేనివాళ్ళని, రోడ్లు ఊడ్వటానికి, రిక్షా లాగటానికి, చెప్పులు కుట్టటానికి తప్ప ఎందుకూ పనికిరాని వాళ్ళనీ అగ్రకుల అహంకారంతో నిందిస్తున్నది. రిజర్వేషన్లు ఈ అగ్రకుల అహంకారాన్ని బ్రాహ్మణీయ భావజాలాన్ని ఏమాత్రం దెబ్బతీసినా ఆ మేరకు ఆ ప్రభావం ఎస్.సి, ఎస్.టి, ఒ.బి.సిలు ఆత్మగౌరవంతో ముందుకు పోవటానికి, వివిధ రంగాలలో రాణించటానికి దోహదం చేస్తాయి.

అయితే రిజర్వేషన్లు ఉద్యోగాలు కల్పించే స్కీముగా, అభివృద్ధి ఫలాలను పేదలకు సమంగా పంపిణీ చేసే కార్యక్రమంగా, పేదరిక నిర్మూలనా పథకంగా, సంపూర్ణ సమానత్వం సాధించే ప్రభుత్వ వ్యూహంగా చాలా మంది భావిస్తున్నారు. రాజకీయ పార్టీలు, సి.పి.ఎం లాంటి వామపక్ష పార్టీలు కూడా ఈరకమైన వాదనలు ముందుకు తెస్తున్నాయి. అగ్రకుల విద్యార్థులు, మేధావులు వీటిని ప్రచారం చేస్తున్నారు. రిజర్వేషన్ల వల్ల సంపూర్ణ సమానత్వం రావాలని భావించటం, అలా రాకపోతే రిజర్వేషన్లు వుండరాదనే వాదన కేవలం కుల వ్యవస్థపై దాడిని సహించలేని అగ్రకులతత్వ వాదుల వ్యూహంలో భాగమే.

అదే విధంగా ఒ.బి.సిలకు ఉన్నత విద్యారంగంలో రిజర్వేషన్లు కల్పించడాన్ని అగ్రకుల విద్యార్థులూ, కార్పోరేట్ రంగం తీవ్రంగా వ్యతిరేకించటానికి అనేక కారణాలున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కావాలని ఎస్.సి, ఎస్.టిలు డిమాండ్ చేస్తున్నారు. 93వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రైవేట్ విద్యా సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించే వీలు కలిగింది. ఒ.బి.సిలకు రిజర్వేషన్లు ఇస్తానని ప్రభుత్వం ప్రకటించింది. ఈ చర్యలు రాబోయే రోజుల్లో ప్రైవేట్ పరిశ్రమల్లో రిజర్వేషన్లు కల్పించే అవకాశం వుందని దళారి నిరంకుశ పెట్టుబడిదారులు అర్థం చేసుకున్నారు. అందుకే అగ్రకుల విద్యార్థుల్ని వెనుకేసుకొచ్చి, తమ మీడియా సంస్థల ద్వారా రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనల్ని రెచ్చగొట్టి, ఈ దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు ప్రభుత్వంపై చాలా ఒత్తిడి తెస్తున్నారు. మొత్తంగా రిజర్వేషన్లు, సబ్సిడీలు లేని స్వేచ్ఛా మార్కెట్, ఆర్థిక వ్యవస్థ కోరుకునే కార్పోరేట్ రంగం ఒ.బి.సి రిజర్వేషన్ల ప్రతిపాదనతో కలవరం చెందుతున్నది.

## ముగింపు

రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన ఉధృతంకాక పోయినా, ఆ ఆందోళన వెనుక బలమైన శక్తులున్నాయి. కనుక ఒ.బి.సి రిజర్వేషన్లను ఏదో రకంగా నీరుగార్చే అవకాశం వుంది. ప్రభుత్వం ఇప్పటికే అగ్రకులాలకు సీట్లు పెంచుతామని ప్రకటించి, కొంతమేరకు అగ్రకులాల విద్యార్థుల ఆందోళనకు దిగి వచ్చింది. పార్లమెంటు చట్టాన్ని, ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రభావితం చేయగల వర్గాలు నడుపుతున్న రిజర్వేషన్ ఆందోళనకు దళిత, ఆదివాసీ, ఒ.బి.సి ప్రజల సంఘటిత పోరాటమే అడ్డుకట్ట వేయగలదు.

భారతదేశంలో కుల వ్యవస్థ ఒక వాస్తవం. కులాధారిత పీడన ఇంకా వాస్తవం. కొనసాగుతున్న సామాజిక పీడన, అసమానతల నేపథ్యంలో ఉద్యోగాలు, విద్యలో రిజర్వేషన్ల డిమాండ్ న్యాయమైనది, ప్రజాస్వామికమైనది.

అయితే, రిజర్వేషన్ ఒక సంస్కరణ మాత్రమే. భారతదేశంలోని పీడిత కులాల మౌలిక సమస్యలను రిజర్వేషన్లు ఒక్కటే పరిష్కరించలేవనేది దృష్టిలో వుంచుకోవాలి. పేద, పీడిత ప్రజలకు, పీడిత కులాల మెజారిటీ ప్రజలకు అనుకూలంగా భూమి, సంపద, ఇతర ఆస్తుల పున:పంపిణీ వల్ల ఈ సమస్య పరిష్కారమౌతుంది. అంతకంటే ముఖ్యంగా కార్మికవర్గ నాయకత్వంలో అన్ని కులాల పీడిత ప్రజలతో కలిసి వారు రాజకీయాధికారాన్ని సాధించగలగాలి.

---

*( .....55వ పేజీ తరువాయి)*

నిర్వహించింది. అప్పటికే కోపోద్రిక్తులైన ప్రజలు మిలీషియా పంచాయితీలో ఈ హంతకుడిని ప్రశ్నించి, నిలదీశారు. పంచాయితీలో బహిరంగంగా ఇతను తన తప్పును ఒప్పుకున్నాడు. చివరకు ప్రజల తీర్పుమేరకు మిలీషియా పుల్లయ్యకు దేహశుద్ధి చేసి వదిలేసింది.

## పెత్తందారికి దేహశుద్ధి చేసిన ప్రజలు

గుర్తేడు ఏరియా అల్లూరిగడ్డ గ్రామానికి చెందిన సాదాల రామయ్య (మాజీ పంచాయితీ సభ్యుడు) పెత్తందారిగా వుంటున్నాడు. నిరంతరం ప్రజల్ని వేధించడం, మహిళలను బలవంతం చేయటం ఇతని నిత్య వ్యాపకం. వ్యతిరేకించిన, ఎదురుతిరిగిన ప్రజల్ని దౌర్జన్యంగా కొట్టడం, బెదిరించడం ఇతని ఆనవాయితి. ఇతని కొడుకు కూడా ఇటువంటి కోవకు చెందినవాడే. కనుక వీరి విషయంలో చర్చించి తండ్రికొడుకులకు ప్రజలు దేహశుద్ధి చేశారు.

## భార్యా హంతకుడికి దేహశుద్ధి:

గుర్తేడు ఏరియా రావిడి కోట గ్రామంలో ఒక వ్యక్తి తన భార్యను రోజూ హింసించేవాడు. ఒకసారి దళం ఈ సమస్యను ప్రజల ముందు పెట్టి మాట్లాడింది. ఆ సందర్భంలో ఇక మీద భార్యను మంచిగా చూసుకుంటానని చెప్పాడు. అయితే ఇది జరిగి నెల తిరగకముందే భార్యను పక్కవూరి వారి పొలాల దగ్గర ముక్కలు ముక్కలుగా నరికి మృతదేహాన్ని రాళ్లతో కప్పిపెట్టాడు. ఆమె రెండు రొమ్ములను అత్యంత పాశవికంగా కోసి బుట్టలో పెట్టుకొని వచ్చి వూరువారందరికీ చూపించి వీటిని కల్లులో నంజుకొని తింటానని చెప్పుకుంటూ తిరిగాడు. నన్ను ఎవరూ ఏమీ అనలేరని సవాల్ చేశాడు.

ప్రజా పంచాయితీలో దళం ఈ హంతకుణ్ణి విచారించింది. కొంతమంది ప్రజలు చంపేయాలని మాట్లాడారు. కానీ ఇతన్ని బాగా కొట్టి వదిలేశారు.

విజ్ఞప్తి

## మేధావులారా, ప్రజాస్వామికవాదులారా, ప్రగతిశీల శక్తులారా, రచయితలారా, కళాకారులారా, ఆదివాసీ హితోభిలాషులారా!

## మాపై పాలకవర్గాలు సల్వాజుడూం అనే సంస్థను సృష్టించి కొనసాగిస్తున్న పాశవిక దాడిని ఖండిస్తూ మాకు అండగా నిలవండి.

గత 25 సం॥రాలుగా మేము దండకారణ్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) నాయకత్వంలో సంఘటితమౌతూ పోరాడుతున్నాం. దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘటన్, క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్, చేతన నాట్యమంచ్ తదితర ప్రజాసంఘాలలో మేము వేలాది స్త్రీ పురుషులం సంఘటితమై మా దైనందిన, మౌలిక సమస్యలపై దోపిడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాం. గ్రామాల్లో కాలం చెల్లిన తెగ పెద్దల, భూస్వాముల ఆధిపత్యాన్నీ, దోపిడీని కూడా వ్యవతిరేకిస్తూ పోరాడుతున్నాం. మా పిల్లలు ఆదివాసీ బాలల సంఘాలలో సంఘటితమౌతూ వారి చక్కని భవిష్యత్తు కోసం, వారి కనీస అవసరాల - ఉచిత విద్య, పౌష్టికాహారం, వైద్యం కోసం ప్రభుత్వంతో పోరాడాల్సి వస్తోంది. ఈ దేశంలోని యావత్తు పీడిత ప్రజలలాగే మేమూ బాధలను అనుభవిస్తున్నాం. అందులో మేం ఆదివాసీలవడం, లోతట్టు అడవుల్లో విసిరివేయబడ్డట్టున్న పల్లెల్లో జీవిస్తుడంతో మా సమస్యలు కడు దారుణంగా వున్నాయి. మా పోరాటాల ద్వారా మేం కొన్ని విజయాలు సాధించాం. దోపిడీ ప్రభుత్వ అటవీ శాఖ జులూం, జబర్దస్తీని తగ్గించుకోగలిగాం. విచ్చలవిడి షావుకార్ల దోపిడీని ప్రశ్నించగలుగుతున్నాం. కారుచౌకగా మా అడవుల నుండి తరలించుకుపోయే తునికి ఆకు కూలీ రేట్లను కొంత పెంచుకోగలిగాం. మేం స్వాధీనం చేసుకున్న కాస్తో కూస్తో అటవీ భూములను మేం సాగుచేసుకోగలుగుతున్నాం. మేం సహకార శ్రమ పద్ధతిలో భూములకు స్వల్పంగా నీటి పారుదల సౌకర్యాలను ఏర్పర్చుకోవడం ప్రారంభమైంది. మా మహిళలపై తెగ, భూస్వామ్య, హిందూ, పితృస్వామ్య అణచివేత విధానాల వేటు తగ్గింది. మేం మా సంఘటిత శక్తితో, పోరాటాల ద్వారా మా కాళ్లపై మేము నిలబడి జీవించడం, జీవిక సంపాదించడం నేర్చుకుంటున్నాం.

మరోవైపు మేం 'అడవిపై ఆదివాసీలకే అధికారం' అనే నినాదం ప్రాణంగా అపారమైన అటవీ సంపదలపై అధికారం కోసం పోరాడుతున్నాం. దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు, బహుళజాతి కార్పోరేషన్లు, సామ్రాజ్యవాదులు నిరాటంకంగా తరతరాలుగా మా ఆస్తులను, మా సంపదలను తరలించుకుపోవడాన్ని మేం అడ్డుకుంటున్నాం, ఇక్కడి సంపదలు మాకూ, మా దేశ ప్రజలకే చెందాలని మేం బలంగా కోరుకుంటున్నాం. 1825లో బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరు శంఖం ఊదిన మా వీర గేండ్ సింగ్ నుండి 1962లో నెహ్రూ సైన్యాలతో పోరాడి వీర మరణం పొందిన రాజా బాంజదేవ్ వరకు మా చరిత్ర అంతా దళారీ, విదేశీ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన చరిత్రే. ఆ పరంపరలోనే మేం ఇప్పుడూ పోరాడుతున్నాం. ముఖ్యంగా గత దశాబ్దిన్నర కాలంగా దేశంలో వేగంగా అమలవుతున్న ప్రపంచీకరణ ఆర్థిక విధానాల ఫలితంగా ఆదివాసీ ప్రాంతాలలో దోపిడీ తీవ్రమైంది. దళారీ పెట్టుబడిదారులతో, విదేశీ సంస్థలతో ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయల పెట్టుబడుల ఒప్పందం పై సంతకాలు చేసింది. టాటా, రిలయన్స్, జిందాల్, ఎస్.ఆర్, రాయపూర్ అలయన్స్, గోదావరి, నిక్కో, టెక్సాస్ పవర్ కార్పోరేషన్ మొదలైన అనేక ఘరానా కార్పోరేట్ సంస్థలతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాల ఫలితంగా మా అడవులు, మా గ్రామాలు, మా పంట భూములు, మా ఇండ్లు మావి కాకుండా పోతున్నాయి. అరకొర పునరావాస ప్యాకేజీలు ప్రకటించి మమ్మల్ని మా యాజమాన్య హక్కుల నుండి వంచిస్తూ విస్థాపితులను చేయడానికి భారీ కుట్రలు జరుగుతున్నాయి. ఒక్క దండకారణ్య ఆదివాసీ ప్రజల దుస్థితి మాత్రమే కాదిది యావత్తు భారత దేశంలోని ఆదివాసీ ప్రజల అస్తిత్వమే ఒక సవాల్‌గా మారింది. ఈ దుష్ట దోపిడీ ప్రభుత్వాల విధానాలను ఖండిస్తూ మా అస్తిత్వం కోసం మేం పోరాడుతుంటే ఎక్కడైనా మమ్మల్ని పిట్టల్లా కాల్చి చంపుతున్నారు. కాశీపురం, కళింగపట్నం, నగర్‌నార్ అందుకు తాజా సజీవ ఉదాహరణలు. మేం దళారీ పెట్టుబడిదారుల విదేశీ దోపిడీ సంస్థల ప్రయోజనాల కోసం మా అడవులను ఖాళీ చేసేది లేదని స్పష్టంగా ప్రకటించాం.

పైన పేర్కొన్నట్టు ఒకవైపు స్థానిక పెద్దలకు, దుష్ట భూస్వామ్య పెత్తందార్లకు వ్యతిరేకంగా, మరోవైపు ప్రభుత్వ బడా పెట్టుబడిదారుల, విదేశీ సంస్థల ప్రయోజనాలకు వ్యతిరేకంగా రెండు రంగాల్లో మూడు శక్తులతో పోరాడక తప్పడం లేదు. మా అస్తిత్వం కోసం మేం సమరశీల పోరాటాలు చేస్తుంటే పైన పేర్కొన్న శక్తులన్నీ కుమ్మక్కై మాపై అణచివేత యుద్ధాన్ని ప్రకటించాయి.

తొలి నుండి మేం ప్రభుత్వ అణచివేత విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే వస్తున్నప్పటికీ, గత సంవత్సర కాలంగా ఈ యుద్ధాన్ని అది మరింత తీవ్రం చేసింది. పది మాసాల క్రితం (జూన్ 5) స్థానిక భా.జా.పా ప్రభుత్వం, ప్రతిపక్ష కాంగ్రెస్, పోలీసులు, సివిల్ ఉన్నతాధికారులు అందరూ కుమ్మక్కై ఒక ప్రమాదకరమైన రాజకీయ ఉగ్రవాద సాయుధ సంస్థను నెలకొల్పడానికి సల్వాజుడూం - శాంతి యాత్ర - గా పేరు పెట్టారు. ఈ సంస్థ శాంతిని అహింసా పద్ధతిలో నెలకొల్ప పూనుకున్నదనీ, ఆదివాసీ ప్రజలు నక్సలిజంపై స్వచ్ఛందంగా తిరుగుబాటుకు పూనుకున్న ఫలితం ఇదనీ తప్పుడు ప్రచారంతో ప్రపంచాన్నీ, తమను తాము వంచించుకుంటున్నారు. ఇది గతంలో ఎన్నడూ ప్రజలు కనీ వినీ ఎరుగని రీతిలో విధ్వంసాన్ని సృష్టిస్తున్నది. 'సర్వం విధ్వంసం' అనే నినాదాన్ని చేపట్టి గ్రామాలపై, ప్రజలపై పాశవిక దాడులను కొనసాగిస్తోంది. దీని దాడుల మూలంగా ఇప్పటికీ 500లకు పైగా గ్రామాలు వల్లకాడులయినాయి. వేలాది కుటుంబాలు విచ్ఛిన్నమై 50 వేల మంది పేద జనాలు నిర్బంధంగా ప్రభుత్వ 'సహాయ' శిబిరాల పాలయ్యారు. 200 మందికి పైగా అమాయకపు ఆదివాసీ ప్రజలు హతమయ్యారు. చాలా మంది శవాలు కూడా దొరకకుండా పోయాయి. 10 కోట్ల రూపాయలకు పైగా ప్రజల ఆస్తులు ధ్వంసం అయ్యాయి. వందలాది మహిళలు అత్యాచారాలకు బలవుతున్నారు. గూండాల, పోలీసులచే నికృష్టమైన యాతనను, వేధింపులను అనుభవిస్తున్నారు. రాయడానికి వీలులేని విధంగా మహిళలు అవమానాలు భరిస్తున్నారు. ఒక విశాల భూభాగంలోని ఆదివాసీ ప్రజా జీవితం అస్తవ్యస్తమౌతోంది. వారి అస్తిత్వమే పెను ప్రమాదకరంగా మారింది. అయితే ఈ ఏ ఒక్క దారుణం కూడా ఉన్నదున్నట్లుగా బయటి ప్రపంచానికి తెలువకుండా 'రాజ్యం' పూర్తి కట్టుదిట్టం(దిగ్బంధనం) చేసింది. పేద ఆదివాసీ ప్రజల వాస్తవిక గోడు వారి వద్దకు చేరి తెలుసుకునే అవకాశమే లేకుండా దారులన్నీ మూసేశారు. ఇక్కడి జుడూం, పీడిత ప్రజల జీవితాలను తెలుసుకోవడానికి ఎవరు వచ్చినా వారిని ప్రభుత్వ శిబిరాల వరకే పోలీసులు అనుమతిస్తూ అక్కడి వారి 'మనుషులచే' విప్లవోద్యమంపై విషం కక్కింప చేస్తున్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో సహితం కొన్ని పార్టీలు, కొందరు వ్యక్తులు, కొన్ని సంస్థలు విషయాలు కనుక్కొని ఇక్కడ ప్రజల అవస్థలను అర్థం చేసుకొని ఆమేరకైనా వాస్తవాలను ప్రపంచం ముందు వుంచగలిగారు. సి.ఆర్.పి, నాగా బలగాలను వెనక్కి పిలవాలనీ, సల్వాజుడూంను రద్దు చేయాలని బలంగా డిమాండ్ చేశారు. వారందరికీ మేమెంతో రుణపడి ఉన్నాం.

మేం ఆత్మరక్షణ కోసం ఎక్కడ ఏ చిన్న ప్రతిఘటనకు సిద్ధపడినా 'రాజ్యం' భయంకర విధ్వంసకాండ జరుగుతున్నట్టు మీడియా ద్వారా నీచంగా ప్రచారం చేస్తోంది. అమాయకపు గ్రామీణులను హతమారుస్తున్నామని హంగామా చేస్తోంది. మా దాడుల మూలంగా వేలాది జనం నిరాశ్రయులై గ్రామాలు ఖాళీ చేసి శిబిరాల్లోకి వెళుతున్నట్లు అన్నీ అబద్ధాలే ప్రచారం చేస్తోంది. మేం ఎక్కడా అమాయకపు జనాలను హతమార్చలేదు. మా గూడాలకు నిప్పు పెట్టి, మా మహిళలపై అత్యాచారాలు జరిపి, మా రైతాంగాన్ని ఊచకోత కోసి, మా పంటలను, చిరు ఆస్తులను నాశనం చేసిన గూండాలనే మేం ఎదుర్కొన్నాం. జుడూం గూండాల్లో నుండి కరుడుగట్టిన వాళ్లతో ఏర్పరిచిన ప్రత్యేక పోలీసు అధికారులను మేం అడ్డుకున్నాం. ఈ ప్రతిఘటనలో కొందరు ప్రాణాలు కోల్పోయారు. వేలాది మందితో కూడిన ప్రజా కోర్టులు శిక్షలు ప్రకటించిన నీచులను మేం అంతమొందించక తప్పలేదు. అది దర్భాగూడెంలోనే కావచ్చు, గంగలూరు, బాసగూడెం, మణికుంట, వింజరం మరెక్కడయినా కావచ్చు. మేం అనివార్యంగా దాడులు చేయాల్సి వచ్చిన చోట కూడా ప్రజల ప్రాణాలకు ఎలాంటి హాని తలపెట్టకుండా పోలీసుల రక్షణలో విర్రవీగుతున్న జుడూం గూండాలను, ఎస్.పి.ఓలను ప్రధానంగా శిక్షించాం. వీరెవరూ సాధారణ ప్రజలు కాదు. దూరంగా వున్న మీకు భయంకర నిర్బంధ పరిస్థితుల మధ్య ఇక్కడ వాస్తవాలను వెంట వెంట అందివ్వలేకపోతుండడంతో మీకు నిజాలు తెలువకుండా పోతున్నాయి. అయినా మీరు మాపై గట్టి విశ్వాసంతో వుండండి. మేం ఎప్పుడూ, ఎక్కడా, కావాలని చెప్పి సాధారణ ప్రజలను అమెరికా సామ్రాజ్యవాదులు ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ తదితర ప్రాంతాల్లో టార్గెట్లుగా చేసినట్లుగానో, ఈ దేశంలో ఎక్కడ ప్రజలు తమ సమస్యలపై ఏ మాత్రం వీధుల్లోకి వచ్చినా నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపుతున్న పోలీసుల్లాగానూ చంపడం లేదు. చంపమనేది మీకూ తెలుసు. మీ విశ్వాసాన్ని మేమెన్నటికీ వమ్ము చేయం. ఇంతటి భయంకర యుద్ధంలో పొరపాటున మా మూలంగా ఏ చిన్న తప్పు జరిగినా అందుకు మేము జవాబుదారీ వహిస్తూ మన ప్రజలను క్షమాపణలు వేడుకుంటున్నాం. ఇలాంటివి జరగకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటూనే వున్నాం.

ఇక్కడికి యిప్పటికే వేలాది అదనపు బలగాలు చేరాయి. మరిన్ని వేల బలగాలను దించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటి సంఖ్య ఏనాటికానాడు పెరుగుతూనే వుంది. ఇవి ఎంతగా పెరుగుతుంటే అంతగా ప్రజలపై వీటి ఉత్పాతం పేట్రేగిపోతోంది. అలాగే

*(తరువాయి 22వ పేజీలో.....)*

# ఏ.ఓ.బిలో పెరుగుతున్న నిర్బంధం

ఏ.ఓ.బి ప్రాంతంలో కేంద్ర, రాష్ట్ర పాలసీల్లో భాగంగా నిర్బంధం రోజు రోజుకీ పెరుగుతోంది. జె.ఒ.సిలో భాగంగా రెండు రాష్ట్రాలూ సమన్వయాన్ని పెంచుకుంటూ దాడులు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయోగించిన అన్ని రకాల నిర్బంధ పద్ధతుల్ని ఒరిస్సాలో కూడా అమలు చేస్తున్నారు. ఒరిస్సాలో కూడా రాష్ట్ర ప్రభుత్వం సి.పి.ఐ(మావోయిస్టు)ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిషేధం ప్రకటించిన తర్వాత ఒరిస్సాలో మరింతగా కేంద్రీకరణ పెరిగింది. ఎ.ఒ.బి ప్రాంతంలో మల్కన్‌గిరి, శ్రీకాకుళం జిల్లాల్లో అమలవుతున్న నిర్బంధ రూపాలను మీ ముందు వుంచుతున్నాం.

**మల్కన్‌గిరి జిల్లా:**

మల్కన్‌గిరి జిల్లాలో శత్రువు ఇన్‌ఫార్మర్ మెకానిజాన్ని పెంచుకోవడం ద్వారా అక్కడి పార్టీని దెబ్బకొట్టాలని ప్రయత్నిస్తున్నాడు. పోలీసులు సివిల్‌లో చిన్న తుపాకులు తీసుకుని ఒకరు లేదా ఇద్దరు చొప్పున గ్రామాలకు రావటం, దారులు చూడటం, సంఘ నాయకుల యిళ్ళు చూడటం, సమాచారం సేకరించటం వంటివి చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో మోటర్ సైకిళ్ళపై వస్తున్నారు. కొన్నిసార్లు బోరింగులు రిపేరు చేసే వారిగా, చిన్న చిన్న సామాన్లు అమ్ముకునే వారిలాగా వచ్చి తిరిగి సమాచారాన్ని సేకరిస్తున్నారు. అరెస్టు అయి శత్రువు చేతికి చిక్కిన వారిని నయాన, భయాన లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

కలిమెల ప్రాంత ప్రజలకు 2006 జనవరి 1న నూతన సంవత్సరం శత్రు దాడులు, అరెస్టుల మధ్య మొదలయింది. జనవరి 1న ఇంకా తెల్లవారక ముందే నాలుగు గంటలకు టేకుగూడ కాలనీని చుట్టుముట్టి 10 మందిని, కొరుబులో ఐదుగురుని అరెస్టు చేసి, కొట్టి కలిమెల పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్ళారు. తర్వాత వరసగా మూడు, నాలుగు బ్యాచీలు ఒకేసారి వచ్చి మొత్తం ఏరియాని కూంబింగ్ చేశారు. బొడిగట్ట గ్రామంలో నాలుగు రోజులు పోలీసు క్యాంపు పెట్టి, మర్రిగట్ట సంఘ నాయకుని ఇంటి మీద దాడి చేసి భార్యని, పిల్లల్ని కొట్టారు. బొడిగట్ట గ్రామంలోని ప్రజల్ని రాత్రి 7 గంటల నుంచి వెళ్ళకుండా నిర్బంధించారు. కూలి పనుల కోసం వలసకు వెళ్ళి వచ్చిన వాళ్ళని క్యాంపులో నిర్బంధించి, పేర్లు రాసుకుని పిలిచినప్పుడు రావాలని కండీషన్ పెట్టి వదిలారు. ఆ వూరు నుంచి వెళ్ళేటప్పుడు 'నాగా బెటాలియన్ వస్తుంది. మీ ఇళ్ళని తగులబెడుతుంది' అని భయపెట్టి వెళ్ళారు.

ఈ విధంగా ప్రభుత్వం, నిర్బంధంతో ప్రజల్ని భయపెడుతూనే మరోవైపు 'జన సంరక్షక్ శిబిర్' పేరుతో భ్రమల్లో ముంచే ప్రయత్నం చేస్తోంది. కలిమెల ఏరియాలో గంపకొండ పంచాయితీ పరిధిలో ఎస్‌పి నాయకత్వంలో 40 మంది పోలీసులు ఐదు గ్రామాల ప్రజల్ని కలిపి 4,5 వందల మందికి వైద్య శిబిరాలు నిర్వహించారు. అందులో ఆదివాసీ నృత్యాలు, రికార్డు డాన్సులు, వాలీబాల్ పోటీలు పెట్టి గెలిచిన వారికి బహుమతులు యిచ్చారు. గ్రామానికి నాలుగు వందల రూపాయలు ఉచితంగా గ్రామ పెద్దలకు యిచ్చారు. గ్రామ పెద్దలకు గొడుగులు, శాలువాలు, తువ్వాళ్ళు యిచ్చారు. ప్రజలకు కోళ్ళు, మేకలు కోసి భోజనం పెట్టారు. ఇదే విధంగా పొట్టేరు, మోటు ఏరియాలలో కూడా వైద్య శిబిరాలు పెట్టారు. ఈ సందర్భంలో పార్టీపై దుష్ప్రచారం చేశారు.

దళాలను మట్టుపెట్టాలనే ప్లాన్‌లో భాగంగా ఇన్‌ఫార్మర్ల సమాచారంతో దళాలపై దాడులు పెరిగాయి. కలిమెల ఏరియా గంపకొండలో దళం మీటింగ్ చేసి రాత్రి 12.30 గంటలకు వెళుతుంటే దారిలో మాటుగాసిన పోలీసులు ఒక్కసారిగా కాల్పులు జరిపారు. ఆ దాడి ఎటువంటి నష్టం లేకుండా దళం తప్పించుకుంది. దీని తర్వాత సంతకు వెళుతున్న ముగ్గురు రైతుల్ని అరెస్టు చేసి గంపకొండ ఆంబుష్‌లో ముగ్గురు చనిపోయారని, వారి చేత కన్నెగూడ, చిన్నటేకుగూడ గ్రామాల్లోని స్మశానాల్లో తవ్వించి చూశారు.

మే నెలలో మర్రిగట్ట వద్ద సాయంత్రం 5.30 గంటలకు సివిల్లో వచ్చిన ఇద్దరు పోలీసులు పని మీద వెళ్ళి వస్తున్న ఇద్దరు కామ్రేడ్స్‌ను చూసి ఫైర్ చేశారు. ఒకరికి చిన్న గాయం అయింది. ఇవే కాకుండా వేసవి కాలంలో ఇన్ఫార్మర్లు యిచ్చిన సమాచారంతో పొట్టేరు, మోటు, కలిమెల ఏరియాల్లో దళాన్ని చుట్టుముట్టటానికి రాగా ప్రజల సహకారంతో 4,5 సార్లు దళం తప్పుకున్న సందర్భాలు వున్నాయి.

సీలేరు యాక్షన్ తర్వాత ఆంధ్రా గ్రేహౌండ్స్, ఒరిస్సా సి.ఆర్.పి.ఎఫ్ పోలీసులు నాలుగు బ్యాచ్‌లుగా ఒకేసారి కలిమెల, పప్పులూరు ఏరియాల్లో కూంబింగ్ చేశారు. పప్పులూరు ఏరియాలో కూంబింగ్ చేస్తున్న పోలీసులకు, సివిల్‌లో వూరికి వెళ్ళిన చంద్ర అనే దళ సభ్యురాలు కనిపిస్తే, అనుమానించి పట్టుకున్నారు. సివిల్‌లో వున్న మరో దళ సభ్యురాలిపై కాల్పులు జరిపారు. ఆమె తప్పుకుని వెళ్ళి పోయింది. కా॥ చంద్ర దళ సభ్యురాలు అని అర్థం కావటంతో దళం సమాచారం చెప్పమని

చిత్రహింసలకు గురిచేసి, అత్యాచారం చేశారు. తర్వాత జైలుకి పంపారు.

పై సంఘటన జరిగిన మర్నాడు ఉదయం 11 గంటలకు టేకుగూడ కాలనీకి వచ్చిన ఆంధ్రా గ్రేహౌండ్స్ పోలీసులు దళానికి నీళ్ళు తీసుకుని వెళుతున్న వూరి వారిని చూసి, రెండు వైపుల నుంచి దళం వున్న డేరాని చుట్టుముట్టుతుండగా, దళం వాళ్ళే ముందుగా చూసి ఫైర్ చేశారు. ఫైర్ చేసి రిట్రీట్ అవుతున్న క్రమంలో కా॥ కుమారి, కా॥ బిమల అమరులైనారు. అదే రోజు సాయంత్రం ఎన్‌కౌంటర్ చేసి కలిమెలకి వెళుతున్న పోలీసులకు మరొక దళం ఎదురుపడటంతో మళ్ళీ ఫైరింగ్ అయింది. అయితే, యిందులో ఎవరికీ ఏమీ కాలేదు. జూలై నెలలో పప్పులూరు గ్రామం వద్ద సమాచారంతో దళం వచ్చిన దారినే మోటర్ సైకిళ్ళపై పోలీసులు వచ్చి దళంపై దాడి చేశారు. దళం ప్రతిఘటిస్తూ తప్పుకుంది.

ఇలా మొత్తంగా మల్కన్‌గిరిలో శత్రు కేంద్రీకరణ, కూంబింగ్‌లూ, దాడులు పెరగటం అనేది కనిపిస్తోంది. ఇంతే కాకుండా గ్రామాలలోని పెత్తందార్లను దళానికి విషాహారం పెట్టమని ప్రోత్సహిస్తున్నారు.

అరెస్టు అయి జైళ్ళలో వున్న వాళ్ళని ఎంత చిన్న కేసైనా విడుదల చేయకుండా సంవత్సరాల తరబడి జైల్లో వుంచటం ఒరిస్సా ప్రభుత్వం ఒక పాలసీగానే పాటిస్తుంది. ఈ మధ్య కాలంలో, జైళ్ళలో వున్న వాళ్ళని ప్రలోభపెట్టి లొంగదీసుకోవాలనే ప్రయత్నాలు కూడా ప్రభుత్వం మొదలుపెట్టింది.

## శ్రీకాకుళం డివిజన్

బహుముఖ దాడిలో భాగంగా ప్రభుత్వం అనేక రకాల ఎత్తుగడలను డివిజన్‌లో అమలుచేస్తున్నది. అనేక పథకాలను స్వచ్ఛంద సంస్థలతో కల్సి అమలు చేస్తున్నది. ఈ పథకాలను అమలు చేసే గ్రామాలను పోలీసులే ఎంపిక చేయడం గమనించాల్సిన విషయం.

విప్లవకారులను భౌతికంగా నిర్మూలించడానికి తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నది. దానిలో భాగంగా ఎవరికి తెలియకుండా ఏరియాలోకి ఒకేసారి మూడు నుంచి ఆరు బ్యాచుల వరకు వచ్చి దారులు కాస్తున్నారు. ప్రతి బ్యాచ్‌లో 25 నుండి 30 మంది వరకూ ఉంటారు. పొద్దున్నే లేదా సాయంత్రం ప్రజలకు కనిపించి తిరిగి వెళ్ళిపోతున్నట్లు భ్రమింపచేసి ఏరియాలోనే కాపు వేస్తున్నారు. రాత్రి వేళ లారిల్లో, జీపుల్లో, బస్సుల్లో వస్తున్నారు. పగలైతే ప్రజలు ప్రయాణించే బస్సులెక్కి వస్తున్నారు. ప్రజలు వ్యతిరేకించినట్లైతే దిగిపోయి మళ్ళీ దారిలో ఆపి ఎక్కుతున్నారు. ప్రజలు మధ్యలో దిగిపోలేని పరిస్థితిని కల్పించి వారితో కల్సి ప్రయాణిస్తున్నారు.

సంతలకు ప్రతిసారీ హాజరవుతూ ఇన్ఫార్మర్లను తయారు చేసుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. సంతలను అరెస్టులకు అనువుగా ఎంచుకుంటున్నారు. కొన్నిసార్లు సంతలను జరగనివ్వడం లేదు. జిసిసి డిపోలను కూడా మూసి వేయాలని ఆదేశిస్తున్నారు. సంఘాలున్న గ్రామాలకు ప్రభుత్వ పరమైన వసతులు బంద్ చేస్తామని మాట్లాడుతూ, దానిలో భాగంగా (కొన్ని చోట్ల) జిసిసి డిపోలను మూసివేయించారు. డివిజన్ వ్యాప్తంగా ఈ కాలంలో 110 మందికి పైగా అరెస్టు చేసారు. అందులో నాగావళి ఏరియా పరిధిలో 40 మంది, కాగా మిగతా వారు కొండబారిడి ఏరియా పరిధిలోని వారు.

వై.ఈ.ఎస్ (యూత్ ఎంప్లాయిమెంట్ స్కీమ్) పథకంలో భాగంగా 200 వందలకు పైనే యువకులను హోంగార్డ్ శిక్షణకు తీసుకున్నారు. వీరిలో చాలా మందిని ఎత్తు సరిపోలేదని, శారీరక నిర్మాణం సరిగా లేదని వెనక్కు పంపించి ఏరియాల్లో ఇన్ఫార్మర్లుగా వుంచారు. మరికొందరు అది తమకు నచ్చలేదని కనుక తిరిగి వచ్చామని చెప్తున్నారు. మరికొందరు హోంగార్డులుగా రిక్రూట్ అయ్యారు. వీరందరు కూడా సవర, కువ్వి తెగల యువకులే. ఇంకా ఈ రిక్రూట్‌మెంట్ కొనసాగుతూనే వుంది.

వడ్రంగం, రంగులు వేయడం, అగ్నిమాపకం వంటి పనుల్లో తాత్కాలికంగా ఉద్యోగాలు ఇస్తున్నారు. తర్వాత వీరిని ఏరియాలకు పంపిస్తున్నారు.

డ్వాక్రా పథకంలో భాగంగా కొద్ది మంది మహిళలను ఎంపిక చేసి కుట్లు, అల్లిక, ఎంబ్రాయిడరీ, కాగితపు కవర్లు తయారీ వంటి పనుల కోసం శిక్షణ కోసం తీసుకెళ్ళి వారాల తరబడి తమతో వుంచుకుంటున్నారు. వాస్తవంలో వీరు ఇళ్ళ దగ్గర ఖాళీగానే వుంటున్నారు. లేదా డ్వాక్రా సంఘం పనుల్లో వుంటున్నారు.

ఇళ్ళ రేకులు, లోన్లు ఇవ్వడం, రోడ్లు వేయడం వంటి ప్రభుత్వ పనులకు గ్రామాలను పోలీసులే ఎంపిక చేస్తున్నారు. రోడ్ల కోసం (ముఖ్యంగా తారు రోడ్ల కోసం) మావోయిస్టు ఉద్యమంపై ఒత్తిడి తెచ్చే విధంగా రివిజనిస్ట్ పార్టీలను ఉపయోగించుకుంటున్నారు. సంఘాలున్న గ్రామాలకు ఇలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. గతంలో బట్టలు, బిందెలు, బొట్టుబిళ్ళలు పంచిన పోలీసులు ప్రస్తుతం కలర్ టీవిలు, సిడి ప్లేయర్లు, మహిళలకు సౌందర్య సాధనాలు, దుప్పట్లు పంచుతున్నారు. పార్టీ వైద్య శిబిరాలు, ఆటల పోటీలు నిర్వహిస్తే వెంటనే పోటీగా పోలీసులు కూడా వైద్య

శిబిరాలు, ఆటల పోటీలు నిర్వహించి యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

అదే సమయంలో కౌన్సిలింగ్‌లు నిర్వహించడం, పార్టీపై చెడు ప్రచారం చేయడం జరుగుతుంది. ఇక అరెస్టు అయిన ప్రతి ఒక్కరిని ఉద్యమ సమాచారం కోసం కొట్టడం సర్వసాధారణం అయింది. వారినే దారులు చూపించమని ఏరియాల్లోకి తీసుకురావడం వారి ద్వారా డెన్‌లను చూడడం ప్రధానంగా వుంటున్నది.

శ్రీకాకుళం, విజయనగరం, రాయగడ(సిఆర్‌పిఎఫ్) బలగాలు సమన్వయంతో ఏరియాల్లోకి వస్తున్నాయి. ఒక్కోసారి ఒక్కో ఏరియా వ్యాప్తంగా వరుసగా 10 రోజులపాటు కూంబింగ్ చేస్తున్నారు.

బిన్నిడి, గొసాడా, దేరువాడ, కుస, వనకబడి, బాలేసు, వండిడి, చాపరాయిగూడ, బొడ్లమానుగూడ, ఆగంగూడం(ఎగువ,దిగువ) వెలగమానుగూడ, జాల్ల, ఉలిపిరి వలస తదితర గ్రామాల్లో ప్రజలను అరెస్టులు చేశారు. జాల్ల, ఉలిపిరివలస గ్రామాల యువకులను తీవ్రమైన హింసలకు గురి చేశారు. వనకాబడిలో మిన్నరావు అనే అతన్ని తీవ్రంగా కొట్టారు.

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కూడా ఏరియాలో అరెస్టులు చేశారు. ఈ క్రమంలో గాంద్ర, కూనంపాడు, గుండం, రాతులగూడల వద్ద శత్రువుతో ఎదురుబొదురు ఫైరింగ్స్ జరిగాయి. వలానకోట సమీపంలోనూ, ఇంకొకచోట ఎదురెదురుపడి కాల్పులు తప్పిపోయాయి. చాలాసార్లు కొద్దిలో తప్పిపోయాయి. ఇలా ఉద్యమ అణచివేతకు ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తోంది. ❑

***(...19వ పేజీ తరువాయి)***

ఒక్కరో, ఇద్దరో వ్యక్తులు ఎంతటి ప్రజా ఉద్యమాలనైనా అంతమొందిస్తారన్న దుర్భ్రమల్లో ఉన్న ప్రభుత్వం కరడుగట్టిన రిటైర్డ్ పోలీస్ ఉన్నతాధికారి గిల్‌ను దిగుమతి చేసుకుంది. బలగాలకు 'ఫ్రీ హ్యాండ్' ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు బూటకపు ఎన్‌కౌంటర్లలో ఆరితేరిన ఆంధ్రప్రదేశ్ గ్రేహౌండ్స్ లాంటి బలగాలను ప్రత్యేకించి తయారు చేయాలని కూడా నిర్ణయించారు. ఆంధ్ర - ఛత్తీస్‌ఘడ్ సరిహద్దుల్లో సంయుక్త దాడులను ముమ్మరం చేశారు. అన్ని విధాలుగా బహుముఖ దాడిని తీవ్రం చేసి ఇక్కడి ప్రజలను, విప్లవోద్యమాన్ని అంతం చేయడానికి చురుగ్గా చర్యలను చేపడుతున్నారు. వీటిని మీరు ముక్తకంఠంతో ఖండించి మాకూ, మా జనాలకు అండగా నిలవాలని మనసారా కోరుకుంటున్నాం.

ప్రభుత్వం కేవలం సైనిక దాడులకే పరిమితం కాలేదు. దాని బహుముఖ దాడిలో భాగంగా నూతనంగా అణచివేత చట్టాలను ముందుకు తెస్తోంది. అత్యంత పాశవిక చట్టమని భారత ప్రజానీకం గర్హించి తమ నిరసన తెలిపి, రద్దుకై ఉద్యమించిన టాడా, పోటాలకన్నా భయంకరమైన ఛత్తీస్‌ఘడ్ ప్రజా భద్రతా చట్టాన్ని తెచ్చింది. ఇది టాడా, పోటా, రౌలట్ చట్టాలకన్నా ప్రమాదకరమని ప్రతిపక్ష కాంగ్రెసే ఖండిస్తోంది. తప్పుడు కేసుల్లో ఇరికించబడిన రైతాంగానికి కఠిన కారాగార శిక్షలు, యావజ్జీవిత శిక్షలు విధించడం పెరుగుతోంది. జైళ్లలో తీవ్ర హింసలు, యాతనలు అనుభవిస్తున్నారు. ఇలా చట్టాలు, కోర్టులు రైతాంగాన్ని విప్లవ మార్గం నుండి తప్పించడానికి దారుణ చర్యలకు ఒడిగడుతున్నాయి. వీటిని మీరంతా ఖండించాలి.

మేం నిరుపేద ఆదివాసులం, అర్ధాకలి, అర్ధనగ్న జీవితాలు మావి. అటవీ ఉత్పత్తుల సేకరణ మాకు ప్రాణం పోస్తోంది. ఇలాంటి మమ్మల్ని పూర్తిగా హతమార్చ సాగుతున్న సల్వాజుడూంను ఖండించండి. ప్రజల్లో చీలికలు తెచ్చే దోపిడీ విధానాలను ఖండించండి. మమ్మల్ని మా అడవుల నుండి ఖాళీ చేయించడానికి ఈ 500 వందల కోట్ల రూ॥ల భారీ పెట్టుబడులతో రోడ్‌సైడ్ కొత్త గ్రామాలను నిర్మిస్తున్నారు. వీటి నిలుపుదలకోసం దయచేసి పోరాడండి. పోలీసు, గూండాల దాడుల్లో క్షతగాత్రులవుతున్న మా ప్రజలకు వైద్య సహాయాన్ని అందించండి. ఫాసిస్టు నిర్బంధ శిబిరాలకు సహాయ శిబిరాలని పేరు పెట్టి మమ్మల్ని గూండాలకు, పోలీసులకు మానవ కవచాలుగా మార్చడాన్ని ఖండిస్తూ మా గ్రామాలకు, మా ఇండ్లకు మేం వెళ్లేలా మమ్మల్ని ఇక్కడి నుండి బంధ విముక్తులను చేయండి. మా గ్రామాలకు రండి, మా బాధలు తెలుసుకోండి. ఎలాంటి ప్రజాస్వామ్య పౌరహక్కులు లేకుండా తుపాకీ సన్నీలతో అణచబడుతున్న మా జీవితాలను చూడండి. మీరు మా పక్షం నిలుస్తారనీ, మమ్మల్ని అన్ని విధాలుగా ఆదుకుంటారని ఆశిస్తున్నాం.

*విప్లవాభివందనాలతో*

**దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘటన్, క్రాంతికారి ఆదివాసీ మహిళా సంఘటన్**

**చేతన నాట్యమంచ్ ,ఆదివాసీ బాల సంఘటన్, జనతనా సర్కార్**

# మీ రక్తం వృధాకాదు-మీ త్యాగాల జ్యోతి ఆరిపోదు

**కా॥ రమణ**

వై.ఎస్ ప్రభుత్వం చర్చల నాటకానికి అధికారికంగా తెర దించకుండానే విప్లవోద్యమంపై హత్యాకాండకు పాల్పడింది. దీంట్లో భాగంగా 2005 ఏప్రిల్ 17వ తేదీన ఈస్ట్ డివిజన్‌లోని కోరుకొండ దళాన్ని గునుకురాళ్ల గ్రామం వద్ద పోలీసులు చుట్టుముట్టి విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. దళ కమాండర్ అయిన కా॥ రమణ ఈ దాడిని వీరోచితంగా ప్రతిఘటిస్తూ కామ్రేడ్స్ అనిత, నిర్మల, శాంతిలతో పాటు అమరుడయ్యాడు.

కా॥ రమణది హైదరాబాద్ నగరం. మధ్యతరగతి కుటుంబంలో పుట్టాడు. నలుగురి సంతానంలో చిన్నవాడు. చిన్నప్పుడే తండ్రి చనిపోవడంతో అతని తల్లి అన్నీ తానే అయి పెంచింది. కా॥ రమణ ఇంటర్మీడియట్ చదువుతుండగా ఆనాటికి నగరంలో బలంగా వున్న విప్లవ విద్యార్థి రాజకీయాలు పరిచయం అయ్యాయి. క్రమంగా ఆ రాజకీయాలతో మమేకం అయ్యాడు. విద్యార్థి ఉద్యమ అవసరాల కోసం పాలిటెక్నిక్ కళాశాలలో చేరి విద్యార్థి పోరు నాయకుడయ్యాడు. ఆ తర్వాత ఆర్గనైజర్‌గా మారి విద్యార్థి యువజన, కార్మిక పోరాటాలకు నాయకత్వం వహించాడు. విస్తరిస్తున్న ఉద్యమాన్ని దెబ్బతీయాలని అప్పటి తెలుగుదేశ ప్రభుత్వం నగర ఉద్యమంపై తీవ్ర హింసను ప్రయోగించింది.

ఆ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఆనాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కొన్ని శక్తులను గ్రామీణ ప్రాంతానికి పంపించింది. అందులో భాగంగా కా॥ రమణ మెదక్ జిల్లాకు వెళ్లి ఇందూప్రియాల్ దళంలో డిప్యూటీ కమాండర్‌గా ఆరు నెలల కాలంపాటు పని చేసాడు. ఈ కాలంలో తెలుగుదేశం పార్టీలో పనిచేస్తూ పోలీస్ ఇన్‌ఫార్మర్‌గానూ, గూండాగాను వ్యవహరిస్తున్న ఒకడిని మెదక్ పట్టణంలో ఖతం చేసి ప్రజల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాడు.

ఆ తర్వాత పార్టీ నిర్ణయం మేరకు 1996వ సంవత్సరంలో ఈస్ట్ డివిజన్ ఉద్యమంలో భాగమయ్యాడు. 1997లో అరకు దళంలో డిప్యూటీ కమాండర్‌గా వుంటూ ఆదివాసీ ప్రజలతో మమేకమై విద్యార్థి, సిమెంట్ కార్మికుల, సున్నపు రాయి కార్మికుల పోరాటాలకు నాయకత్వం వహించాడు. 2002లో ఎల్లవరం దళ కమాండరు అయ్యాడు. దారకొండ, బొడిగడ్డ, బొడపాడ వంటి అనేక మిలటరీ దాడుల్లో చురుగ్గా పాల్గొన్నాడు.

చర్చల కాలం నాటికి కోరుకొండ దళ కమాండర్‌గా వున్నాడు. చర్చల వెసులుబాటు కాలంలో చురుగ్గా పనిచేసి ఏరియాలో నిర్బంధంలో దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించాడు. కాఫీ కార్మికుల పోరాటాలనూ, భూస్వామ్య, షావుకార్ల వ్యతిరేక పోరాటాలను సమర్థవంతంగా నిర్వహించాడు. భూ ఆక్రమణ, కాఫీ తోటల ఆక్రమణ పోరాటాలను విజయవంతం చేసాడు. ప్రభుత్వ భూమిలో పోలీస్ ఫైర్ రేంజ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఆ భూమిని ఆక్రమించాలనే పోరాటంతో ప్రభుత్వానికి సవాల్‌గా మారాడు. దీనితో ఈ దళంపై ప్రత్యేకంగా కేంద్రీకరించి ప్రభుత్వం హత్యాకాండకు పాల్పడింది. ఈ ఎన్‌కౌంటర్‌లో చివరి రక్తం బొట్టు వరకు పోరాడుతూ కా॥ రమణ అమరుడయ్యాడు.

**కా॥ బొత్రాల్**

మల్కన్‌గిరి జిల్లా కలిమెల బ్లాక్ చిన్నటేకుగూడ గ్రామంలో కొండరెడ్ల కుటుంబంలో పుట్టిన కా॥ బొత్రాల్(19) మొదట మిలిషియా సభ్యుడిగా చేరి ఆ తర్వాత కొత్తగా ఏర్పాటు చేసిన జన మిలీషియాలో సభ్యుడయ్యాడు. గ్రామాల్లో ప్రచారం చేయడంలో భాగంగా బోదేల్ గ్రామంలో మీటింగ్ పెట్టిన సందర్భంలో కా॥ ప్రసాద్ గ్రెనెడ్ తూడుస్తున్నప్పుడు దాన్ని పరిశీలిస్తున్న క్రమంలో 2005 జూలై 30న ప్రమాదవశాత్తు గ్రెనెడ్ పేలి కామ్రేడ్స్ ప్రసాద్, మారాల్‌లతో పాటు కా॥ బొత్రాల్ అమరుడయ్యాడు.

కా॥ బొత్రాల్ అనేక కరువు దాడుల్లో, గిట్టుబాటు ధరల పోరాటాల్లో క్రియాశీలకంగా పాల్గొన్నాడు. దళంలోకి రిక్రూట్ అయ్యే క్రమంలో అమరుడయ్యాడు.

**కామ్రేడ్ మారాల్**

కా॥ మారాల్(42)ది మల్కన్‌గిరి డివిజన్ కలిమెల బ్లాక్ బోదెల్ గ్రామం. ఇతను పేద కుటుంబానికి చెందినవాడు. సంఘంలో చురుగ్గా పని చేస్తూ అధ్యక్షుడయ్యాడు. గ్రామంలో జరిగిన భూపోరాటాలకూ, పెద్దాల్ పెత్తనానికి వ్యతిరేకంగా జరిగిన పలు పోరాటాలకు నాయకత్వం వహించాడు. దళానికి ఎంతో ఆధారపడదగిన ప్రజా నాయకుడిగా వుంటూ బోదెల్ గ్రామంలో జరిగిన గ్రెనెడ్ ప్రమాదంలో 2005 జూలై 30న అమరుడయ్యాడు.

**కా॥ సాణా(ప్రభాకర్)**

2005 అక్టోబర్ 23న ఈస్ట్ డివిజన్‌లోని నల్లబెల్లి అటవీ ప్రాంతంలో ఒక జె.ఎన్.ఎం శిక్షణా శిబిరంపై పోలీసులు చేసిన దాడిలో, క్యాంపు రక్షణ బాధ్యతల్లో వున్న కా॥ సాణా(ప్రభాకర్), కా॥ సత్యవతితో పాటు అమరుడయ్యాడు.

కా॥ ప్రభాకర్(20) ఈస్ట్ డివిజన్‌లోని విశాఖ జిల్లా కొయ్యూరు మండలం కునుకూరు గ్రామంలో పేద ఆదివాసీ కువ్వి కుటుంబంలో పుట్టాడు. మొదట బాలల సంఘంలో చురుగ్గా పని చేశాడు. పెద్దయ్యాక మిలీషియాగా మారి, చీడిగొంది గ్రామంలో ఆదివాసీ భూస్వామి భాస్కర్ రావు ఇంటిపై దాడి చేసి అతని ఆస్తిని స్వాధీనపర్చుకున్న సంఘటనలో చురుగ్గా పాల్గొన్నాడు.

అక్టోబర్ 23వ తేదీన అతను సెంట్రీలో వుండగా పోలీసులు దాడి చేసారు. శత్రువు విచ్చలవిడిగా వందలాది తూటాలను కురిపిస్తున్నప్పటికీ తన దగ్గరున్న ఎస్.బి.ఎల్ తుపాకీతో వీరోచితంగా ప్రతిఘటిస్తూ గాయపడి పోలీసులకు దొరికాడు. కనికరంలేని గ్రేహౌండ్స్ హంతకులు కా॥ ప్రభాకర్‌ను చిత్రహింసలు పెట్టి పాశవికంగా గొడ్డలితో చంపారు.

కా॥ ప్రభాకర్ తల్లిదండ్రులు పోలీసులతో కొట్లాడి కన్న కొడుకు మృతదేహాన్ని తెచ్చుకొని విప్లవ సాంప్రదాయంతో అంత్యక్రియలు జరిపారు. అమరవీరుల సంస్మరణ వారం సందర్భంగా కా॥ ప్రభాకర్ తల్లి తన ఇంటి ముందే తన కొడుకు స్థూపాన్ని కట్టుకొని స్వయంగా ఆవిష్కరించింది.

**కా॥ గంగాల్ (రామాల్)**



కామ్రేడ్ గంగాల్ (25)ది చిన్నటేకుగూడ గ్రామం. ఇది ఒరిస్సా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా, కలిమెల బ్లాక్ బొడిగట్ట పంచాయితీలో వున్నది. మొదట కా॥ గంగాల్ బాలల సంఘంలో సభ్యుడయ్యాడు. 2000లో మిలీషియాలో చేరాడు. 2001లో దళంలోకి రిక్రూటై ఎల్‌జిఎస్‌లో సభ్యుడిగా కొనసాగాడు. కా॥ రామాల్ ప్రజా శత్రువులపట్ల కసిగా వ్యవహరించే వాడు. పోలీస్ ఇన్‌ఫార్మర్, మాజీ నక్సలైట్ అయిన భాస్కర్‌ను ఖతం చేయడంలో ముఖ్యపాత్ర వహించి ప్రజా శత్రువులకు దడ పుట్టించాడు.

అతనిలోని శత్రువుపట్ల కసీ, క్రమశిక్షణ పట్టుదలలను దృష్టిలో వుంచుకొని పార్టీ తనను ఈస్ట్ డివిజన్ యాక్షన్ టీం సభ్యుడిగా పంపినపుడు ఎంతో సంతోషంతో ఆ పనిలో భాగమయ్యాడు. ఈస్ట్ డివిజన్‌లో శత్రువు దూకుడును అరికట్టడం కోసం కొయ్యూరు పోలీస్ స్టేషన్‌పై చేసిన డమ్మీ రైడ్‌లో కా॥ రామాల్ అనారోగ్యంగా వున్నప్పటికీ క్రియాశీలకంగా పాల్గొన్నాడు.

ఈ అనారోగ్యం కొనసాగి మలేరియాతో పాటు పచ్చకామెర్లు వచ్చి పరిస్థితి విషమించింది. వైద్యం కోసం తీసుకువెళుతున్న క్రమంలో, మార్గమధ్యంలోనే 2005 నవంబర్‌లో కా॥ రామాల్ అమరుడయ్యాడు.

## ఉదయగిరి అమరులకు జోహార్లు

ప్రభుత్వ బహుముఖ దాడిని తిప్పికొట్టడానికి గానూ పి.ఎల్.జి.ఎ సాయుధ శక్తిని మరింతగా పెంచడం కోసం ఒరిస్సా రాష్ట్రం గజపతి జిల్లాలోని ఆర్.ఉదయగిరి పట్టణంలో పోలీస్ స్టేషన్, ఓ.ఎస్.ఎ.పి క్యాంపు వంటి పలు శత్రు దుర్గాలపై దాడులు చేసి ఆయుధాలు స్వాధీనం చేసుకోవాలని పార్టీ నిర్ణయించింది. అందులో భాగంగా 2006 మార్చి 24న జరిగిన దాడిలో వీరోచితంగా పోరాడుతూ కా॥ కిరణ్, కా॥సతీష్ అమరుడయ్యారు.

**కా॥ మోహన్ (సతీష్)**

కా॥ సతీష్ (25) సొంత పేరు మోహన్. ఇతనిది ఈస్ట్ డివిజన్‌లోని విశాఖ జిల్లా జి.మాడుగుల మండలం నురిమెట్ట గ్రామం. ఆదివాసీ కొండకాపు తెగలోని సాధారణ మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన మోహన్ అమ్మానాన్నలకు చిన్న కొడుకు. ఆరవ తరగతి వరకు చదువుకున్నాడు.

2001లో పార్టీ పరిచయాల్లోకి వచ్చి, మిలీషియా నిర్మాణ క్యాంపెయిన్‌లో భాగంగా వాళ్ల వూరిలో సాయుధ మిలీషియా యూనిట్ ఏర్పాటులో కీలక పాత్ర వహించాడు. గ్రామాల్లో శత్రు కూంబింగ్ బ్యాచ్‌లపై ఆంబుష్‌లూ, చికాకుపరిచే చర్యలు చేయడంలోనూ, ప్రజా ద్రోహులనూ, హోంగార్డ్సును శిక్షించడంలోనూ తన వంతు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాడు. గొందిపల్లి ఎన్‌కౌంటర్‌కు బాధ్యుడైన బుతారి

రంగడిని గొడ్డలితో నరికి హతమార్చి మిలీషియా సత్తాను చూపించి విద్రోహుల గుండెల్లో గుబులును పుట్టించాడు.

దానితో పెరిగిన శత్రువు కేంద్రీకరణను దృష్టిలో పెట్టుకొని పూర్తి కాలం కార్యకర్తగా మారి ప్లటూన్ సభ్యుడైనాడు. అనతి కాలంలోనే పార్టీ సభ్యుడిగా ఎదిగాడు. మిలటరీ విషయాల్లో అతని నైపుణ్యాన్నీ, చొరవను దృష్టిలో పెట్టుకొని 2003లో పార్టీ అతన్ని స్పెషల్ యాక్షన్ టీం సభ్యుడిని చేసింది. యాక్షన్ టీంలో వుంటూ పలు ఘటనల్లో చురుకైన పాత్రను వహించాడు. ఆ తర్వాత 2004 అక్టోబర్‌లో మళ్లీ ప్లాటూన్‌లోకి వచ్చి ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యుడైనాడు.



జోన్‌లో నిర్వహించిన పలు ప్రతిఘటన దాడుల్లో కా॥ సతీష్ చురుగ్గా పాల్గొన్నాడు. ప్రతి దాడిలో తనకు అప్పగించిన బాధ్యతను ఆత్మవిశ్వాసంతో స్వీకరించడం, దృఢ సంకల్పంతో పోరాడి టార్గెట్‌ను ఛేదించడంలో త్యాగాలకు వెనుకడుగు వేయకుండా ముందున్నాడు. కలిమెల, అనకాపల్లి, కోరాపుట్, ఉదయగిరి విజయాల్లోనూ, గూడెం, కొయ్యూరు, బొడపాడు వంటి డమ్మీ రెయిడ్‌లలోనూ తన పాత్ర కీలకంగా వుంది. పి.ఎల్.జి.ఎ పోరాట వారసత్వాన్ని, త్యాగాల సాంప్రదాయాన్ని ఎత్తిపడుతూ ఆర్.ఉదయగిరిలో త్యాగానికి సిద్ధమయ్యాడు.

ఈ దాడిని విజయవంతం చేయడం కోసం తన కర్తవ్య నిర్వహణలో భాగంగా ఒ.ఎస్.ఎ.పి క్యాంపులో ప్రధాన సెంట్రీ పోస్టును ఛేధించడం కోసం అసాల్ట్ టీంలో వుండి వీరోచితంగా పోరాడుతూ శత్రు తూటాలు తలలో దూసుకుపోయి అమరుడయ్యాడు. అలా కా॥ సతీష్ ఆర్.ఉదయగిరి దాడి విజయానికి అక్షరాల తన నెత్తుటితో బాటను వేశాడు.

### కా॥ మల్లేష్ (కిరణ్)

ఆర్.ఉదయగిరి దాడిని విజవంతం చేయడం కోసం కా॥ సతీష్‌తో పాటు తన ప్రాణాన్ని తృణప్రాయంగా అర్పించిన మరో వీర కిషోరం కా॥ మల్లేష్ (కిరణ్).

కా॥ కిరణ్ వీరతెలంగాణా ప్రాంతంలోని మహబూబ్‌నగర్ జిల్లా, కల్వకుర్తి మండలం అజిలాపురం గ్రామంలో పుట్టాడు. ఉద్యమ ప్రభావం బలంగా వున్న ప్రాంతం కనుక కా॥ కిరణ్‌కు ఊహ తెలిసినప్పటి నుండి ఉద్యమం పరిచయమే. ఆ పరిచయం అతన్ని అతి చిన్న వయసులోనే రాడికల్ బాలల సంఘ నాయకుడిని చేసింది. బాలల సంఘంలో వుంటూనే దళానికి ఎంతో చేదోడువాదోడుగా వుండేవాడు. లొంగిపోయిన కొందరు కా॥ కిరణ్ గురించి పోలీసులకు చెప్పడంతో అతనిపై పోలీసుల దృష్టి పడింది. పోలీసులు అతని ఇంటిపైన అనేకసార్లు దాడులు చేశారు. ఒకసారి పట్టుకొని పోలీస్ స్టేషన్లో పెట్టి తీవ్రంగా కొట్టారు. అప్పుడతను 7వ తరగతి చదువుతున్నాడు. పరీక్షలు రాయాలనే వంకతో బడికి వచ్చి బయట కావలావున్న పోలీసుల కండ్లుగప్పి తప్పించుకున్నాడు. ఆ తర్వాత దళంలో చేరాడు.అలా కా॥ కిరణ్ దళంలోనే పెరిగి పెద్దయ్యాడు.



గట్టి పట్టుదలతో మిలటరీ తర్ఫీదును నేర్చుకున్నాడు. ప్రపంచ రాజకీయాలను అర్థం చేసుకోవడంలో చురుగ్గా వుండేవాడు. క్రమంగా ఎసి స్థాయికి ఎదిగి కమాండరయ్యాడు. ప్లాటూన్‌లో సెక్షన్ కమాండర్‌గా బాధ్యతలను నెరవేర్చాడు. పార్టీ రూపొందించిన ప్రతిఘటనా దాడుల్లో భాగంగా బ్యాంకులపై చేసిన దాడుల్లో, ఇన్‌ఫార్మర్లను ఖతం చేయడంలో, అభివృద్ధి పేరిట నిర్మిస్తున్న పర్యాటక రంగ భవనాలను పేల్చి వేయడంలో, అమ్రాబాద్ పోలీస్ స్టేషన్‌పై చికాకుపర్చే చర్యలో.... ఇలా అనేక ఘటనల్లో చురుగ్గా పాల్గొన్నాడు. ఒక కంపెనీ బలగాల రక్షణలో వున్న అచ్చంపేట పోలీస్ స్టేషన్ ముందు నలుగురు పోలీసులను హతమార్చిన వీరోచిత ఘటనకు నాయకత్వం వహించాడు. మరొక ఘటనలో ఒక కంపెనీ ఫార్మేషన్‌తో కూంబింగ్‌కు వస్తున్న సి.ఆర్.పి.ఎఫ్ బలగాలపై మరొక కామ్రేడ్‌తో కలిసి వెళ్లి కాల్పులు జరిపి రిట్రీట్ అయ్యాడు. పార్టీ నిర్ణయించిన ఆర్.ఉదయగిరి దాడిలో పాల్గొనడానికి నల్లమల నుండి ఎ.ఒ.బి ప్రాంతానికి వచ్చాడు. దాడిలో భాగంగా వెనుక బంకర్‌ను క్లియర్ చేయాల్సిన కర్తవ్య నిర్వహణలో శత్రు తూటా గుండెలో దూసుకుపోయి నేలకొరిగాడు.

## కా॥ ఇర్మే (కుమారి)

మే 28వ తేదీన సీలేరు పోలీస్ క్యాంపుకు కూతవేటు దూరంలో సిఆర్‌పిఎఫ్‌పై పి.ఎల్.జి.ఎ. చేసిన వీరోచిత దాడిలో ఒక పోలీసు చనిపోయి మరో పోలీసు తీవ్రంగా గాయపడ్డాడు. దీనితో మతిపోయిన ఆంధ్రా-ఒరిస్సా ప్రత్యేక బలగాలు అధునాతన ఆయుధాలతో వందలాదిగా మల్కన్‌గిరి డివిజన్‌లో కూంబింగ్ చేశాయి. ఇందులో భాగంగా మే 30వ తేదీన కలిమెల ఏరియా కాలనీ టేకుగూడ గ్రామ సమీపాన వున్న గెరిల్లా శిబిరాన్ని చుట్టుముట్టి విచక్షణా రహితంగా జరిపిన కాల్పుల్లో కా॥ కుమారి, కా॥ బిమలతో పాటు వీరోచితంగా పోరాడుతూ అమరురాలైంది.

కా॥ కుమారిది ఒరిస్సా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా కలిమెల బ్లాక్ పెద్దటేకుగూడ గ్రామం. కోయ ఆదివాసీ తెగలో పుట్టిన కా॥ కుమారికి తల్లిదండ్రులు పెట్టిన పేరు ఇర్మే. వీరిది మధ్య తరగతి కుటుంబం. ఆదివాసీ తెగ సాంప్రదాయం ప్రకారం చిన్న వయసులోనే కా॥ కుమారికి పెళ్లి చేశారు. ముగ్గురు పిల్లలు పుట్టిన తర్వాత భర్త వేరే ఆమెతో తిరుగుతున్నాడని అతనికి విడాకులిచ్చింది.

తర్వాత ప్రభుత్వం ఏర్పర్చిన స్వయం సహాయక బృందంకు కార్యదర్శిగా వుంటూ ఆర్థిక సహాయం పొంది దుకాణం నడుపుకుంటూ కొన్నాళ్లు గడిపింది. 2004లో ఆదివాసీ విప్లవ మహిళా సంఘం కార్యకలాపాల పట్ల ఆకర్షితురాలైంది. క్రమంగా తను కార్యదర్శిగా వున్న బృందాన్ని రద్దుచేసి, దుకాణాన్ని మూసేసి మహిళా సంఘంలో చేరింది. త్వరలోనే పార్టీ సభ్యత్వం పొంది వారి గ్రామ సెల్ నిర్మాణంలో భాగమైంది.

2005 ఫిబ్రవరిలో కొత్తగా రిక్రూట్ అయ్యేవారి కోసం పూజారిగూడ వద్ద జరిపిన మిలటరీ క్యాంపులో చురుగ్గా పాల్గొంది. మిలటరీ క్యాంపు చివరి రోజున పక్కా సమాచారంతో వందలాది గ్రేహౌండ్స్ బలగాలు క్యాంపును చుట్టుముట్టి మూకుమ్మడి దాడి చేసాయి. ఈ దాడిలో తీవ్రంగా గాయపడి, స్పృహ కోల్పోయిన కా॥ అనిల్‌ను భుజాలమీద మోసుకెల్లి రక్షించింది.

తర్వాత దళ సభ్యురాలై, తన సాహసం, చైతన్యం, రాజకీయ పరిణతి కారణంగా అత్యంత వేగంగా 2006 ఏప్రిల్‌లో ఏరియా కమిటీ సభ్యురాలైంది.

మరింత చురుకైన పాత్ర నిర్వహించవల్సిన సమయంలో కామ్రేడ్ కుమారి అమరత్వం మల్కన్‌గిరి డివిజన్ ఉద్యమానికి అందులోనూ మహిళా వుద్యమానికి తీవ్ర నష్టం.

## కా॥ కేసే (బిమల)

కామ్రేడ్ బిమల, 2006 మే 30వ తేదీన మల్కన్‌గిరి డివిజన్ కలిమెల ఏరియా, కాలనీ టేకుగూడ గ్రామ సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కా॥ కుమారితో పాటు అమరురాలైంది.

కా॥ బిమల ఒరిస్సా మల్కన్‌గిరి జిల్లా బొడిగట్ట పంచాయితీ, చిన్నటేకుగూడ గ్రామంలో కోయ ఆదివాసీ తెగలో, పేద కుటుంబంలో సుమారు 18 ఏళ్ళ క్రితం పుట్టింది. కా॥ బిమలకు తల్లిదండ్రులు పెట్టిన పేరు కేసే.

తమ ఊరిలో జరుగుతున్న పార్టీ కార్యక్రమాలతో ప్రభావితమై మిలీషియాలో చేరి ఆరు నెలల కాలం పని చేసింది. ఆ తర్వాత 2005 డిసెంబర్‌లో జరిగిన, పి.ఎల్.జి.ఎ ఆవిర్భావ దినం సభ సందర్భంగా దళంలోకి భర్తీ అయింది. పొట్టేరు దళంలో ఉంటూ పార్టీ అప్పగించిన బాధ్యతలు నిర్వహిస్తూ నిబద్ధతతో పని చేసింది. తరచుగా వస్తున్న మలేరియాతో అనారోగ్యం పాలైనా, తల్లి నుండి ఇంటికి రమ్మని ఒత్తిడి వున్నా ఉద్యమంలో దృఢంగా నిలబడింది.

మే 30న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏ మాత్రం గందరగోళ పడకుండా వీరోచితంగా పోరాడుతూ కా॥ కుమారితో పాటు అమరురాలయింది.

## సింగన్నకోట అమరులకు జోహార్లు

కామ్రేడ్స్ అనిల్, గణపతి, చందూలను మల్కన్‌గిరి డివిజన్ నుండి ఈస్ట్ డివిజన్‌కు పార్టీ ఒక కాంటాక్టు కోసం పంపింది. ఈ కామ్రేడ్స్ తమ కర్తవ్య నిర్వహణలో భాగంగా వెళ్తూ మార్గమధ్యంలో ఒక కాల్వ వద్ద తుపాకులు పక్కనపెట్టి కాళ్లూ, చేతులు కడుక్కుంటుండగా దారికాచిన పోలీసులు మూకుమ్మడిగా వారిపై కాల్పులు జరిపారు. ఈ దాడిలో ఈ ముగ్గురు కామ్రేడ్స్ అమరులయ్యారు. ఈ సంఘటన 2006 జూన్ 6వ తేదీన ఈస్ట్ డివిజన్‌లోని తూర్పు గోదావరి జిల్లా వై.రామవరం మండలం పాతకోట పంచాయితీ సింగన్నకోట గ్రామ సమీపంలో జరిగింది.

## కా॥ ఉంగాల్ (అనిల్)

విముక్తి ప్రాంత లక్ష్యంతో ముందుకు పోతున్న దండకారణ్యా విప్లవోద్యమ వనంలో పుట్టిన పోరు మొలక కామ్రేడ్ ఉంగాల్(20). ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలోని కొంట తాసిల్ పరిధిలోని ఎండం గ్రామంలో 1986లో కోయ ఆదివాసీ కుటుంబంలో కామ్రేడ్ ఉంగాల్ పుట్టాడు.

తన 17వ ఏట మిలిషియాలో చేరి, 2003లో పూర్తి కాలం విప్లవకారుడయ్యాడు. వెంటనే ఆయుధాలు తయారు చేసే టెక్నికల్ టీంకు రక్షణ బాధ్యతలు నిర్వర్తించడానికి ఎ.ఒ.బికి వచ్చాడు. ఒక సంవత్సరం తర్వాత ఎ.ఓ.బి ఉద్యమంలో భాగమయ్యాడు.

కా॥ అనిల్‌ది ఎవరితోనైనా చొరవగా కలిసిపోయే స్వభావం. చదువు నేర్చుకోవడంలోనూ, ఒడియా, తెలుగు భాషలు నేర్చుకోవడంలో పట్టుదలను ప్రదర్శించాడు. అతనికి కంబాట్ బలగాల్లో పని చేయాలని బలంగా వుండేది. ఎ.ఒ.బి ఉద్యమంలో భాగమయ్యాక కొన్నాల్లు మల్కన్‌గిరి డివిజన్‌లో ఎల్‌జిఎస్‌లో సభ్యుడిగా పని చేశాడు. ఆ తర్వాత ఎస్.జడ్.సి సభ్యుడికి గార్డుగా పని చేశాడు. 2005 ఫిబ్రవరిలో పూజారిగూడ గ్రామం వద్ద క్యాంపుమీద ఆంధ్ర ఒరిస్సా బలగాలు దాడి చేసిన సందర్భంలో తన కళ్లముందే కామ్రేడ్స్ దూలాల్, శ్వేతలు అమరులైపోగా కామ్రేడ్ అనిల్ వీరోచితంగా పోరాడుతూ కామ్రేడ్స్ అందరూ రిట్రీట్ అయ్యేవరకు శత్రువును నిలువరించాడు. ఆ క్రమంలో రెండు చేతులకూ, రెండు కాళ్లకు తూటాలు తగిలి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడినప్పటికీ 20 ఏండ్లన్నా నిండని ఈ కామ్రేడ్ ఏమాత్రం బెంబేలు పడలేదు. పైగా మరింత రాటుదేలాడు.

గాయాల నుంచి కోలుకొన్న వెంటనే ఎసి స్థాయి బాధ్యతలను చేపట్టాడు. ఆర్.ఉదయగిరి దాడిలో కమాండర్ టీంలో వుంటూ తన కర్తవ్యాన్ని నెరవేర్చాడు. 2006 మే 28న సీలేరు పోలీస్ స్టేషన్‌కు అతి సమీపంలో, సంతకు వచ్చిన 10-12 మంది సిఆర్‌పిఎఫ్ ముష్కరులు స్వైర విహారం చేస్తుండగా వారిలోని ఇద్దరి మీద యాక్షన్ టీం గురిపెట్టి కాల్చింది. ఆ ఇద్దరు పోలీసులు తూటాలు తగిలి పడిపోయారు. యాక్షన్ టీంలో సభ్యుడిగా వున్న కా॥ అనిల్ ఇద్దరి పోలీసుల దగ్గర వున్న ఎ.కె.47 తుపాకులను వెంటనే స్వాధీనం చేసుకున్నాడు.

ఇలా తన మూడేండ్ల గెరిల్లా జీవితంలో మిలీషియా నుండి ఎసి సభ్యుడిగా ఎదిగి ఎ.ఒ.బి ఉద్యమంలో ముఖ్యమైన పాత్రను పోషించి జోన్ వ్యాప్తంగా ప్రజల్లో, పార్టీ శ్రేణుల్లో కా॥ అనిల్ చెరిగిపోని ముద్రను వేసాడు.

### కా॥ గెమ్మెల పుయ్యు (గణపతి)

కా॥ గణపతిది(25) ఈస్ట్ డివిజన్‌లోని విశాఖ జిల్లా కొయ్యూరు మండలం పిట్టలపాడు గ్రామం. ఇతని సొంత పేరు పుయ్యు. పేద ఆదివాసీ కువ్వి తెగలో పుట్టిన ఈ కామ్రేడ్‌కు చిన్న వయసులోనే పెళ్లి అయింది. ఒక బాబు పుట్టాడు. కా॥ గణపతి విప్లవాచరణ రైతుకూలీ సంఘంలో చేరడంతో మొదలైంది. 2002 చివరలో మిలీషియా నిర్మాణంలోకి వచ్చాడు. ఆ తర్వాత జన మిలీషియా దళం బాధ్యుడిగా 6 నెలల కాలం పాటు పనిచేసి, 2003 జూన్‌లో గెరిల్లా దళంలోకి వచ్చాడు. వచ్చిన కొద్ది రోజులకే ఆయుధాల తయారీ క్యాంపు ప్రొటక్షన్ బాధ్యతలను స్వీకరించాడు. 2004లో ఆయుధాల తయారీకి సంబంధించి టెక్నికల్ దళంలో సభ్యుడిగా చేరాడు. టెక్నికల్ దళంలో సభ్యుడిగా వుంటూనే బోల్షివిక్ స్పిరిట్‌తో ఎస్.జడ్.సి. సభ్యుడికి గార్డు బాధ్యతలను కూడా స్వీకరించాడు. అమరుడయ్యే వరకు ఇవే బాధ్యతల్లో కొనసాగాడు.

ఆయుధాల తయారీలో భాగంగా కష్టభరితమైన పనుల్ని, అంటే బరువుల్ని మోయడం, డంపుల్ని చేయడం వంటి పనులను ఎంతో బాధ్యతగా చేశాడు. శత్రుదాడుల నుంచి క్యాంపులను రక్షించడంలో తన వంతు పాత్రను పోషించాడు. ఎప్పుడూ క్యాంపులో వుండటం వల్ల ప్రజలకు దూరంగా వుండవల్సి వచ్చే మానసిక కష్టాన్ని కూడా చైతన్యంతో అధిగమించాడు.

తన సహచరి వైవాహిక జీవితానికి సహకరించకపోవటంతో విప్లవోద్యమంలో కొనసాగడమే లక్ష్యంగా ఆమెతో విడాకులు తీసుకున్నాడు. అతికొద్ది కాలంలోనే విప్లవోద్యమంలో ముఖ్యమైన పాత్రను వహించిన కామ్రేడ్ గణపతి జూన్ 6వ తేదీన సింగన్నకోట వద్ద జరిగిన పోలీసు దాడిలో అమరుడైనాడు.

### కా॥ రమేష్ (చందు)

కామ్రేడ్ చందు (18) ఈస్ట్ డివిజన్‌లోని తూర్పు గోదావరి జిల్లా అడ్డతీగల మండలం పనకరాతిపాలెం గ్రామంలో పేద ఆదివాసీ కొండరెడ్డి తెగలో పుట్టాడు. అడ్డతీగలలోని గురుకుల పాఠశాలలో 7వ తరగతి వరకు చదువుకున్నాడు. చిన్న వయసులోనే మిలీషియాలో చేరాడు. 2005 జనవరిలో రిక్రూటై గాలికొండ దళంలో చేరాడు. అతని చురుకుదనాన్ని చూసి 2006 జనవరిలో పార్టీ అతన్ని డివిజన్ యాక్షన్ టీంలో సభ్యుడిగా నియమించింది. ఈ టీంలో చురుకైన పాత్ర వహిస్తూ హోంగార్డులూ, మాజీలు అయిన మండపల్లి చంటి, బాలరాజు, అరుణ్‌లను శిక్షించిన చర్యల్లో వర్గ కసిని ప్రదర్శించాడు. శత్రువు గుండెల్లో గుబులు పుట్టించిన, విప్లవ ప్రజానీకంలో ఉత్సాహాన్ని నింపిన సీలేరు ఘటనలో సమర్థవంతంగా రెక్కీ నిర్వహించి కీలకమైన పాత్ర పోషించాడు.

# పోరు తప్ప దారిలేని వరద బాధితులు

తుఫానుల కారణంగా, రుతుపవనాల కారణంగా కురిసిన భారీ వర్షాల వల్ల ఈసారి దాదాపు దేశమంతటినీ వరదలు ముంచెత్తాయి. అందులో భాగంగా మన రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర, తెలంగాణా సహా మొత్తం పదహారు జిల్లాలను వరదలు ముంచెత్తాయి. ఏదో ఒకసారి వచ్చిపోవడం కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల్లోనయితే వెంట వెంటనే నాలుగైదు సార్లు వచ్చిన వరదలు ప్రజలను తీవ్ర అభద్రతలో ముంచెత్తాయి. గత యాభై ఏళ్లలో మన రాష్ట్రంలో ఇంత భారీగా వరదలు రావడం ఇది రెండవసారి. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 108 మంది చనిపోయారు. 15,547 ఇండ్లు పూర్తిగా కూలిపోగా, 55,200 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. 5 లక్షల 42 వేల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. 2 లక్షల 12 వేల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. పూలతోటల రైతులు దారుణంగా నష్టపోయారు.

ఇంతమంది ప్రాణాలను తీసిన, నిరాశ్రయులను చేసిన, ఆర్థిక స్థితిని దిగజార్చిన వరదలను ప్రకృతి వైపరీత్యం మాత్రమేనని ఎంత మాత్రం సరిపెట్టుకోలేం. ప్రకృతి వైపరీత్యాలకు మానవ తప్పిదాలు కూడా తోడయితే ఫలితాలు మరింతగా విషమిస్తాయి. అంతేకాదు మానవ తప్పిదాలు ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తాయి కూడా. ఇది ఎన్నోసార్లు, ఎన్నో రూపాల్లో మన అనుభవంలోకి వస్తున్నదే. ఇప్పుడు వరదల రూపంలో మరోసారి వచ్చిందంతే. సామ్రాజ్యవాద, బహుళజాతి కంపెనీల లాభాపేక్ష వల్ల పర్యావరణం దెబ్బతిని అతివృష్టి, అనావృష్టి వంటివి చోటు చేసుకున్నాయి. అడవులు తరిగిపోవడం వల్ల భూమికోతకు గురై మట్టి నదుల్లో కలుస్తుండడం వల్లా, పరిశ్రమలు నదుల్లో వదులుతున్న వ్యర్థాల వల్లా నదుల లోతు తగ్గి వరదలకు దారితీస్తున్నాయి. ఇక రియల్ ఎస్టేట్ వ్యాపారులు పట్టణాల్లోని చెరువులు, కుంటలను విచ్చలవిడిగా ఆక్రమించి వాటిని పూడ్చి పెద్ద పెద్ద భవనాలు కడుతూ ప్రకృతి సమతుల్యతను నాశనం చేస్తున్నారు. ఫలితంగా నాలుగు చినుకులు పడినా పట్టణాల్లో వరదలు వచ్చే దుస్థితి నెలకొన్నది. దీనికి తోడు ప్రజల శ్రేయస్సు ఏమాత్రం పట్టని ప్రభుత్వాలు నదులు, చెరువుల గట్లను సకాలంలో మరమ్మత్తు చేయించకపోవడం, పటిష్టపరచకపోవడం వల్ల గట్లు తెగి వరదలు సంభవిస్తున్నాయి. అంతేగాక వరద ముంపు ప్రమాదం వున్న ప్రాంతాల ప్రజలను ముందు చూపుతో ఇతర ప్రాంతాలకు తరలించకపోవడం కూడా ప్రజలు ఇంత నష్టపోవడానికి కారణం.

అది అనుసరిస్తున్న విధానాల కారణంగా దాని అలసత్వం కారణంగా వరదల్లో మునిగిన ప్రజలను ఆదుకోవడంలో, కనీస పునరావాసాన్ని కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమయింది. సర్వం కోల్పోయి తిండిలేక, తాగే నీళ్లు లేక కప్పుకోను బట్టల్లేక వర్షంలో తడుస్తూనే రోజుల తరబడి గడిపిన ప్రజలకు కనీసం తిండీ, నీళ్లు అందించడంలో విఫలమయింది. హెలీకాప్టర్ల ద్వారా అన్నం నీరు అందిస్తున్నామని ప్రభుత్వం అట్టహాసంగా ప్రచారం చేసుకుంది. కానీ, హెలీకాప్టర్ల ద్వారా జారవిడిచిన అన్నం పొట్లాలు సగం నీళ్లలోనే పడిపోయాయి. దక్కిన పొట్లాల్లో ఉన్న పాసిపోయిన అన్నం ప్రజల ఆకలిని పరిహసించింది. అసలే పారిశుధ్యం లోపించి అతిసారం వంటి రోగాల బారిన పడిన ప్రజలకు వైద్య సహాయం అందించడంలో ఘోరంగా విఫలమవడమే గాక పాసిపోయిన అన్నాన్ని పంచి రోగాల్ని మరింత పెంచింది. అత్యవసర సహాయ చర్యల్ని చేపడుతున్నామని ఎంతో గొప్పగా ప్రచారం చేసుకున్న ప్రభుత్వం బాధితులకు సహాయ చర్యల్లో భాగంగా 20 కిలోల బియ్యం, 5 లీటర్ల కిరసనాయిల్‌ను ఇచ్చింది. పప్పు, నూనె, చిన్న పిల్లలకు పాలు వంటి కనీస ఆహార పదార్థాలు కూడ ఇవ్వలేదని మహిళలు రాజకీయ నాయకులను దుమ్మెత్తి పోశారు. ఇక పునరావాస చర్యల్లో భాగంగా ఇండ్లు పూర్తిగా కూలిపోయిన వాళ్లకి రూ. 2,500లు, పాక్షికంగా కూలిపోయిన వాళ్ళకి రూ. 1,750లు, ఇంట్లో సామాగ్రిని కోల్పోయిన వారికి 750 రూపాయలు ఇచ్చింది. ఇప్పటి పెరిగిన ధరలను పరిగణనలోకి తీసుకుంటే ఈ నష్టపరిహారంతో చిన్న పూరిల్లు కూడా వేసుకోలేరు. ఈమాత్రం సహాయం కూడా బాధితులందరికీ అందిందని అనుకుంటే పొరపాటే. అధిక సంఖ్యలోని బాధితులకు ఎటువంటి సాయమూ అంద లేదు.

ప్రజల్ని ఆదుకోవడంలో ఆసక్తి చూపని ప్రభుత్వం ప్రజల్ని అడుగడుగునా భ్రమల్లో ముంచెత్తడంలో మాత్రం ఎంతో శ్రద్ధ చూపింది. సోనియా, మన్మోహన్, రాజశేఖర్ రెడ్డిల పర్యటనలు, ఏరియల్ సర్వేలు ఇందులో భాగమే. సహాయం కోసం ఎంతగానో ఎదురుచూస్తున్న ప్రజల వద్దకు సోనియాను తీస్కెల్లి "మిమ్మల్ని తప్పక ఆదుకుంటాం, మా ప్రభుత్వం వున్నదే మిమ్మల్ని ఆదుకోవడానికి" అని గాలికబుర్లు చెప్పించి, కడుపు నింపే ప్రయత్నం చేసింది. తాము చేస్తున్నది పెద్ద సహాయం వలె 'బియ్యం, కిరోసిన్ అందాయా మీకు' అని తనను కల్సిన ప్రతి వారినీ అడిగింది సోనియా. ఆమె రావడం వల్ల ప్రజల్లో నైతిక బలం కల్గిందని కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు. అంటే తమల్నేదో ఉద్ధరిస్తారన్న భావనను ప్రజల్లో కల్పించడంలో సఫలమయ్యారన్న మాట. ఇక ప్రధాని పర్యటించి 200 కోట్ల

తొలివిడత సహాయాన్ని ప్రకటించాడు. ప్రభుత్వ అంచనా ప్రకారమే ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే 200 కోట్ల నష్టం జరిగింది. మరి ప్రధాని ఇస్తానన్న సాయం ఏ మూలకి వస్తుంది? సోనియా, ప్రధాని, ఇంకా రకరకాల మంత్రులు, ఎమ్మెల్యేల పర్యటనల ఖర్చును బాధితులకు అందించినా కొంత ప్రయోజనం కల్గి వుండేది.

ఇక ప్రజలకు చావు బతుకుల సమస్యను తెచ్చిపెట్టిన వరదలు రాజకీయ నాయకులకు మాత్రం తమ ప్రయోజనాలను నెరవేర్చే మంచి అవకాశంగా మారాయి. బాధితులను పరామర్శించడం పేరుతో రాష్ట్రానికి వచ్చిన సోనియాను కలువడానికి హైదరాబాద్‌కు వెళ్ళి ఆమెకు కండువాలు కప్పడంలో పోటీ పడ్డారు కాంగ్రెస్ నాయకులు. అట్లా ఆమె దృష్టిలో పడి తమ పరపతిని పెంచుకోవాలని తాపత్రయపడ్డారు. బాధితులకు ఎటూ ఉపయోగపడని సోనియా పర్యటన కాంగ్రెస్ నాయకులకు ప్రాబల్యం పెంచుకోవడానికి ఉపయోగపడింది. ఇక మరికొంత మంది నాయకులు, నష్టపరిహారం కింద విడుదలైన డబ్బులనూ, బియ్యం, కిరసనాయిలునూ బాధితులందరికీ పంచకుండా తమ రాజకీయ స్థానాన్ని బలపర్చుకోవడం కోసం తమ వర్గీయులకే పంచిపెట్టారు. అంతేకాదు సహాయ చర్యల్లో భాగంగా స్వచ్ఛంద సంస్థలు అందించిన వస్తువులను తామే ఇస్తున్నట్టు ప్రచారం చేసుకున్నారు మరికొందరు. ఇక వీటన్నింటి కంటే నీచమైనది ఏంటంటే, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఇచ్చిన నామమాత్రమైన సహాయాన్ని కూడా బాధితులకు అందకుండా చేసి తామే స్వాహా చేసిన నాయకులు ఎంతోమంది. ఇట్లా ప్రజలను ఎంతగానో నష్టపరచిన వరదలు రాజకీయ నాయకులకు మాత్రం ఎన్నో లాభాలను తెచ్చిపెట్టాయి.

ప్రభుత్వం కూడా వరదలను తన ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి ఉపయోగించుకుంది. రాజశేఖర్‌రెడ్డి ముందుకు తెస్తోన్న కొన్ని ప్రాజెక్టులను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయితే రాజశేఖర్‌రెడ్డి తన ప్రాజెక్టుల పథకానికి సాధికారతను తెచ్చుకోవడానికి ఈ వరదలను ఉపయోగించుకునే ప్రయత్నం చేశాడు. వరదలు రాకుండా ఉండాలంటే తాను తలపెట్టిన ప్రాజెక్టులను పూర్తి చేయడమే మార్గమని ప్రచారం చేశాడు. అంతేగాక తాను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలవరం ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న పలు గ్రామాల ప్రజలను ఈ వరదల సందర్భంగా కనీసం పట్టించుకోలేదు. ఆ గ్రామాలను ఏ అధికారులూ సందర్శించలేదు. అట్లా కక్షసాధింపు చర్య ద్వారా ఆ ప్రజలను లొంగదీసుకొని తాను తలపెట్టిన ప్రాజెక్టులకు ప్రజల అంగీకారాన్ని పొందాలని చూశాడు.

ఇటువంటి చర్యలతో విసిగిపోయిన బాధితులు రాజకీయ నాయకులను నిలదీశారు. కొందరిపై దాడికి దిగారు. అయితే బాధితుల ఆగ్రహాన్ని సానుభూతితో అర్థం చేసుకోవాల్సిన ప్రభుత్వం ప్రతిఘటిస్తోన్న బాధితుల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రజల ప్రతిఘటనను ఎదుర్కోవడానికి ప్రతి మండలంలో డిఎస్‌పిల పర్యవేక్షణలో విస్తృతంగా పోలీసులను మోహరించారు. ప్రతిఘటిస్తోన్న ప్రజలను గుర్తించి వారిని అరెస్టులు చేస్తూ, బెదిరిస్తూ పోలీసులు వేధింపులకు పాల్పడ్డారు. ప్రజల సమస్యలను పరిష్కరించలేని ప్రభుత్వాలు ఎప్పుడయినా, ఎక్కడయినా అణచివేతనే ఆశ్రయిస్తాయనే సత్యం ఇక్కడ మరోసారి నిరూపితమయింది.

ఈ సమస్యను సమగ్రంగా అర్థం చేసుకొని పరిష్కరించుకోవాలంటే ఇందుకు మూలమైన రాజకీయ కారణాలను లోతుగా పరిశీలించాలి. ఈ దేశ పాలకవర్గాలకు, సామ్రాజ్యవాదుల సేవ చేయటమే పరమ లక్ష్యంగా వుంటుంది. ఈ లక్ష్యంలో భాగంగానే ఈ దేశ, రాష్ట్ర ఆర్థిక విధానాలు, 'అభివృద్ధి' వుంటాయి. అంటే దేశంలోని సర్వసంపదలను సామ్రాజ్యవాదులు కొల్లగొట్టడానికి తలుపులు బార్లా తెరిచి, ఇక్కడి పాలకవర్గాలు వీలైన మేరకు తమ బొక్కసాలు నింపుకుంటుంటాయి. వీరికి ప్రజల ఆకాంక్షలు పట్టవు ప్రజల ప్రయోజనాలు నెరవేర్చే ఒక దీర్ఘకాలిక దృష్టి పథకాలు వుండవు. ఎప్పుడూ ఏ విపత్తు సంభవించిన మొసలి కన్నీరు కారుస్తూ కంటితుడుపు కార్యక్రమాల్ని చేపడుతుంటారు. వరద బాధితుల సమస్యలను పరిష్కరించడంలో వై.ఎస్ ప్రభుత్వం చేస్తున్న హంగామా అంతా కూడా ఈ తంతులో భాగంగానే చూడాలి.

దేశంలోని పీడిత ప్రజల మౌలిక సమస్యల పరిష్కారంతో పాటు, ప్రకృతి వైపరీత్యాల వంటి సమస్యలను అధిగమించాలంటే ఈ దేశ అధికారం పీడిత వర్గాల చేతుల్లోకి రావాలి. అంటే నిరంకుశ దళారీ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు వారి యజమానులైన సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలి. అప్పుడు మాత్రమే విద్యా, వైద్యం, కరువుల నివారణ, వరదల నివారణ వంటి సమస్యలకు పరిష్కారంగా యుద్ధ ప్రాతిపదికపై పథకాలు రూపొందించబడుతాయి. దేశ ప్రజలు యావత్తూ సమిష్టి కార్యాచరణలోకి దూకి తమ సమస్యలను పరిష్కరించుకుంటారు. అప్పటిదాకా ప్రజలు చేసే వివిధ దైనందిన రాజకీయ పోరాటాలన్నింటిని విప్లవ లక్ష్యంలో భాగంగా కొనసాగించాలి. ❐

*నేపాల్ పరిణామాల గురించి భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ప్రతినిధితో ప్రత్యేక ఇంటర్వ్యూ*

# ప్రస్తుత ఎత్తుగడల పట్ల అప్రమత్తంగా ఉండడం అవసరం

# రాజ్యాంగబద్ధ శాసనసభ ద్వారా ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లడం సాధ్యమన్నది సీ.పీ.ఎన్ (మావోయిస్టులు) అతిగా నొక్కి చెబుతుండవచ్చు

*(నేపాల్‌లో ఇటీవలి పరిణామాలు, సీపీఎన్(మావోయిస్టు) పార్టీ ముందుకు తీసుకువస్తున్న ఎత్తుగడలూ వ్యూహం, నేపాల్ మావోయిస్టుల నుంచి నేర్చుకోవాలని భారతీయ మార్క్సిస్టులూ రివిజనిస్టులూ భారత మావోయిస్టులకు చేస్తున్న నిరంతర విజ్ఞప్తుల నేపథ్యంలో పీపుల్స్‌మార్చ్ పత్రిక **2006** జూన్ చివరిలో భాకపా(మావోయిస్టు) సీసీ ప్రతినిధి కామ్రేడ్ ఆజాద్‌ను చేసిన ఇంటర్వ్యూను ఇక్కడ ఇస్తున్నాం.)*

**పీపుల్స్‌మార్చ్ - నేపాల్ ప్రస్తుత పరిణామాలను గురించి మీరు ఏమనుకుంటున్నారు?**

**ఆజాద్** - నేపాల్‌లో జరుగుతున్న పరిణామాల గురించి భారతదేశంలో వున్న మేం చాల ఆసక్తితో గమనిస్తున్నాం. ఏప్రిల్ నెలలో రాజు జ్ఞానేంద్ర ప్రతీఘాతుక, రాచరిక పాలనకు వ్యతిరేకంగా శక్తివంతమైన సాయుధ పోరాట నేపథ్యంలో జరిగిన నేపాల్ ప్రజల మిలిటెంట్ ప్రజా ఆందోళన నిజంగా చారిత్రాత్మకమైనది. ఫాసిస్టు రాజును మొండి వైఖరి విడిచిపెట్టి పార్లమెంటుకు అధికారం కట్టబెట్టే విధంగా నెట్టిన నేపాల్ ప్రజలు నేపాల్ చరిత్రలో ఒక గొప్ప అధ్యాయాన్ని రచించారు. ముఖ్యంగా జూన్‌లో కాట్మండులో లక్ష మందితో జరిగిన బలమైన సమీకరణా, జిల్లాలలో కదిలిన లక్షలాది మంది ప్రజలూ ఆ దేశంలో మావోయిస్టులకు పెరుగుతున్న ప్రభావాన్ని తెలియజేస్తున్నారు. వారి ప్రభావం పట్టణ ప్రాంతాలను కూడా చుట్టుముడుతున్నది. ప్రజాస్వామ్యం కోసం, మెరుగైన సమాజం కోసం నేపాల్ ప్రజల చారిత్రాత్మక పోరాటాన్ని మా పార్టీ ఎత్తి పడుతుంది. అయితే, రాజునూ, పార్లమెంటుగా చెలామణీలో వున్న దానినీ కూలదోసి, విప్లవ, ప్రజాస్వామిక శక్తులు అధికారాన్ని స్వాధీనం చేసుకునే వరకూ నేపాల్‌లో పోరాటం కొనసాగాలని భారతదేశంలో విప్లవకారులు ఆశిస్తారు. జరుగుతున్న రాజకీయ పరిణామాలకు మార్గదర్శకత్వం వహించే విధంగా మావోయిస్టులు తమ చొరవను నిలబెట్టుకోగలుగుతారని ఆశిస్తాం. సెవెన్ పార్టీ అలయెన్స్(ఎస్‌పీఏ)తో పొత్తు పట్ల వారు అప్రమత్తంగా ఉండడం అవసరం. రాజుతో రాజీ పడి ప్రజల ఆకాంక్షలకు విద్రోహం చేయాలని సెవెన్ పార్టీ అలయెన్స్ భావిస్తున్నది.

**పీమా - మధ్యంతర ప్రభుత్వంలో చేరి, రాజ్యాంగబద్ధ శాసనసభ తీర్పుకు కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చిన సీపీఎన్(ఎం) ఎత్తుగడలను మీరు ఎలా అర్థం చేసుకుంటున్నారు?**

**ఆజాద్** - నేపాల్‌లోనూ ప్రపంచంలోనూ పరిస్థితి క్లిష్టంగా వుంది. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో బలహీనత వల్ల దశాబ్దాలుగా అనేక ప్రజాయుద్ధాలు మనుగడ కోసం పోరాటంలో కూరుకుపోయాయి. ఈ పరిస్థితిలో నేపాల్ పార్టీ, ప్రజలు చారిత్రాత్మక పురోగమనాలు సాధించారన్నది నిస్సందేహం. అయితే ప్రస్తుత ఎత్తుగడల పట్ల అప్రమత్తంగా వుండటం అవసరం అని మేం భావిస్తున్నాం. ప్రతీఘాతుక నేపాలీ కాంగ్రెస్, రివిజనిస్టు సీపీఎన్(యుఎంఎల్) మొదలుకుని పాలకవర్గ దళారీ బూర్జువా-భూస్వామ్య పార్టీలతో కలిసి మావోయిస్టులు సంయుక్తంగా ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఆచరణ సాధ్యం కాదని మేం భావిస్తున్నాం. ఎందుకంటే ఈ రెండూ పరస్పర విరుద్ధ వర్గ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. రాజ్యాంగబద్ధ శాసనసభ నుంచీ నూతన ప్రజాస్వామిక విప్లవానికి శాంతియుత పరిణామం సాధ్యం అనుకోవడం నేపాల్‌లో రాజ్యం గురించిన తప్పుడు అన్వయం అవుతుంది. కొన్ని పైపై సంస్కరణలు తీసుకువచ్చి పేదరికంలో ఉన్న కొన్ని సెక్షన్‌లను సంతృప్తిపరచవచ్చు. ఆడంబరం కోసం ఏమేమో చేర్చవచ్చు. కానీ పాత రాజ్యాన్ని ఉపయోగించుకుని నేపాల్‌లో భూస్వామ్యాన్ని ధ్వంసం చేయలేరు. సామ్రాజ్యవాదాన్ని కూలదోయలేరు. అందుకని అది ప్రజల మౌలిక సమస్యలను ఎంత మాత్రం పరిష్కరించలేదు. ప్రజల విప్లవ వెల్లువ తప్ప మరేదీ ఈ లక్ష్యాన్ని సాధించలేవు. దేశవ్యాపిత భారీ ప్రజా సమీకరణలు, మరింత విస్తృతమైన వెల్లువను సృష్టించడానికి జరుగుతున్న కృషీ విప్లవాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి అనుకూల సన్నాహాలు. అయితే సీపీఎన్(మావోయిస్టు)లు ఇంటర్వ్యూలలో ఇస్తున్న కొన్ని ప్రకటనలు చూస్తే, వారు రాజ్యాంగ శాసనసభ, సెవెన్ పార్టీ అలయెన్స్‌ల ద్వారా ఉద్యమాన్ని పురోగమింపచేసే అవకాశం గురించి అతిగా నొక్కి చెబుతున్నారన్న అభిప్రాయం కలిగించే విధంగా ఉన్నాయి. ఇది ప్రమాదకరమైన పరిణామాలకు దారి తీయవచ్చు.

ముఖ్యంగా ఇరవై ఐదు వేల మందితో ప్రజా సైన్యాన్ని, బేస్ ఏరియాలనూ ఐక్య సంఘటననూ నూతన అధికార అంగాలనూ అద్భుతంగా నిర్మించి, అధికారం స్వాధీనం చేసుకునే వ్యూహాత్మక

దాడి దశలో ఉన్నామని ప్రకటించిన తరువాత, సీపీఎన్(ఎం) నొక్కి చెబుతున్న ఈ విషయాన్ని ప్రత్యేకించి జాగ్రత్తగా పరిశీలించాలి. ఈ క్రమంలో తమను అణిచివేయడానికి పోలీసులూ ఆర్ఎన్ఏ చేస్తున్న అన్ని రకాల కృషినీ వాళ్లు సమర్థవంతంగా ఓడించారు. సైనిక, రాజకీయ చొరవను నిలబెట్టుకున్నారు. కానీ ఇప్పుడు వ్యూహాత్మక దాడి గురించి కానీ అది ఎలా పురోగమింపచేయాలన్న దాని గురించి కానీ ఏమీ ప్రస్తావన లేదు. ఇది ఫిబ్రవరి విప్లవం అనీ అక్టోబరు విప్లవం కోసం సన్నాహాలు చేయాలనీ అంటున్నారు. అయితే ఇది వారి వ్యూహాత్మక దాడి పథకంలో భాగమన్నది మాకు తెలీదు.

**పీమా - విప్లవ అధికార అంగాలను రద్దు చేసి, రెండు సైన్యాలనూ విలీనం చేయటం గురించి ఏమంటారు?**

**ఆజాద్** - ఈ అంగాలు పాత రాజ్యానికి వ్యతిరేకంగా చేసిన దీర్ఘకాలిక ప్రజాయుద్ధ ఫలితం. సీపీఎన్(ఎం) పార్టీ నిర్మించిన స్థానిక స్థాయి జనతా ప్రజాస్వామిక నియంతృత్వానికి ఇవి ప్రకాశవంతమైన ఉదాహరణలుగా నిలుస్తాయి. ఈ అంగాలను పటిష్టం చేసి వాటిని విప్లవ రష్యా, చైనాలలో సోవియట్‌ల మాదిరిగా తిరుగుబాటు అంగాలుగా మలచడం తక్షణ కర్తవ్యంగా, ఎత్తుగడలుగా వుండాలి. ఈ అధికార అంగాలను సంఘటితం చేస్తూ మనం ప్రజలను తిరుగుబాటులకు పెద్ద ఎత్తున సమీకరించడానికి కృషి చేయాలి. పట్టణాలను స్వాధీనం చేసుకోవటానికి కృషి చేయాలి. అవకాశం దొరికినప్పుడు అంతిమంగా అధికారం స్వాధీనం చేసుకోవాలి. నిజానికి నేపాల్‌లో నేటి నిర్దిష్ట పరిస్థితిలో మావోవాదులకు రెండే విప్లవకర అవకాశాలు ఉన్నాయి. ప్రజా వెల్లువను తీవ్రతరం చేసి, జాతీయ/ అఖిల నేపాల్ స్థాయిలో రాజకీయాధికారం గుంజుకోవడానికి అనుకూలమైన రాజకీయాధికార నిర్మాణ రూపాలను రూపొందించాలి. లేదా వర్గ శక్తుల బలాబలాలు అనుకూలంగా లేక అది సాధ్యం కాదనుకుంటే, ఇప్పుడు వున్న బేస్ ఏరియాలను సంఘటితం చేసి, పటిష్టం చేసి, ప్రజాస్వామిక కర్తవ్యాలు పరిపూర్తి చేసి, సోషలిస్టు కర్తవ్యాల దిశగా పురోగమించడానికి చర్యలు తీసుకోవాలి. ఈ క్రమంలో రెండు నేపాల్‌లు ఉద్భవించవచ్చు. కాట్మండు, మరి కొద్ది నగరాలు కేంద్రంగా ప్రతీఘాతుక రాజ్యం, గ్రామీణ ప్రాంతం కేంద్రంగా విప్లవ నేపాల్.

పునరుద్ధరించిన రాజ్య సైన్యంలో సైన్యాన్ని విలీనం చేయడం మరింత ప్రమాదకరమైనది. ప్రజా సైన్యం లేకుండా ప్రజలకు ఏమీ లేదని మావో అన్నాడు. వర్గ పాలనలో సైన్యం ఒక ప్రధాన సాధనం. రెండు పరస్పర విరుద్ధ వర్గాలు ఒకే సైన్యంగా ఎలా ఉంటాయి. ప్రజా సైన్యాన్ని పాలకవర్గాల (ఇప్పటి వరకూ రాజుకు విధేయ సేవకులుగా ఉన్న) ప్రతీఘాతుక సైన్యంలో విలీనం చేస్తే, శత్రు ప్రతీఘాతుక సాయుధ దాడి జరిగినప్పుడు ప్రజలకు రక్షణ లేకుండా అయిపోతుంది. కమ్యూనిస్టు పార్టీ తప్పుడు పంథా వల్ల శ్రామిక ప్రజానీకం భారీగా నష్టపోయిన అనుభవాలు అనేక దేశాలలో చూశాం. ఇండోనేషియాలో ప్రతీఘాతుక పాలకవర్గాలను జాతీయవాదులుగా ప్రజాస్వామిక శక్తులుగా భావించే వారితో కలవాలన్న పంథా అవలంబించారు. దీని వల్ల కమ్యూనిస్టులనూ వారి సానుభూతిపరులనూ క్రూరంగా ఊచకోతలు కోయడాన్ని మనం చూశాం. చిలీ, నికరాగువా మొదలయిన అనేక దేశాల ఉదాహరణలుకూడా మనకు ఉన్నాయి. విప్లవ శక్తులు గణనీయంగా నిరాయుధులై బలహీనపడిన అవకాశం చూసుకుని, ప్రతీఘాతుక పాలకవర్గాలు తిరుగుబాటు నిర్వహించి రాజకీయాధికారంమీద తమ గుత్తాధిపత్యాన్ని పునరుద్ధరించుకునే అవకాశాన్ని ఎవరూ కాదనలేరు. రెండో ప్రపంచ యుద్ధం తరువాత ఫ్రాన్స్, గ్రీస్ మొదలయిన అనేక దేశాలలో అనుభవం కూడా ఇదే విధంగా వుంది. అయితే - మావోయిస్టులు సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాల (సీబీబీ) ప్రయోజనాలకు ముప్పుగా లేకపోతే, ఆ వ్యవస్థలో ఇమిడిపోతే, పాలకవర్గాలు వారిని ఆర్ద్రంగా స్వీకరిస్తాయి. కాల్పుల విరమణను పర్యవేక్షించమనీ, ప్రజా సాయుధ బలగాల రద్దును పరిశీలించమనీ ఐక్యరాజ్యసమితిని ఆహ్వానించడం కూడా ప్రమాదకరమైనది. ఐక్యరాజ్యసమితి సామ్రాజ్యవాదానికి, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదానికి అత్యవసరమైన సాధనం. అది నేపాల్ ప్రతీఘాతుక పాలకవర్గాల, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు కట్టుబడి పని చేస్తుంది. మొత్తంగా గ్రామీణ ప్రాంతంలో విప్లవకర ప్రజా ప్రభుత్వాలను రద్దు చేయాలనీ పీఎల్ఏను ప్రతీఘాతుక సైన్యంలో విలీనం చేయాలన్న సీపీఎన్(ఎం) నిర్ణయం, ఇంతకాలంగా సాధించుకున్న సమస్త విప్లవ విజయాలనూ తిరిగి పొందలేని విధంగా పోగొట్టుకునేందుకు దారి తీస్తుంది.

**పీమా - నేపాల్ మావోవాదులు మధ్యంతర ప్రభుత్వంలోనూ పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలోనూ పాలుపంచుకునే పంథాను భారతదేశంలో సీపీఐ, సీపీఐ(ఎం) వంటి వామపక్ష పార్టీలే కాక అనేక పార్లమెంటరీ పార్టీలు ఎత్తిపడుతున్నాయి. ఇది భారతదేశంలో మావోయిస్టు ఉద్యమం మీద అనుకూల ప్రభావం వేస్తుందని అంటున్నాయి. ఈ ప్రభావాన్ని మీ పార్టీ ఎలా అంచనా వేస్తున్నది?**

**ఆజాద్** - మన దేశంలో మావోయిస్టు ఉద్యమం మీద నేపాల్ పరిణామాలు అనుకూల (వాళ్ల దృష్టిలో అనుకూలం అంటే, మావోవాదులు సాయుధ పోరాటాన్ని నిలిపివేసి, ప్రధాన స్రవంతిగా చెలామణీలో ఉన్న పార్లమెంటరీ రాజకీయాలలో చేరడం) ప్రభావం వేస్తాయన్నది భారతదేశంలో ఈ పార్టీల స్వీయాత్మక ఆలోచన. నక్సల్బరీ తరువాత నాలుగు దశాబ్దాలలో భారతదేశ మావోయిస్టు ఉద్యమం చవిచూసిన అనేక ఎగుడు దిగుడుల చరిత్రతో పరిచయం ఉన్నవారికి మా ఉద్యమం ఎంత గట్టిదో తెలుసు. విప్లవకారులకు వ్యతిరేకంగా ఎన్నో జరిగినప్పుడు, గొప్ప కష్టాలు ఎదురయినప్పుడూ భారతదేశంలో నిజమైన మావోయిస్టులు ఎన్నడూ ఊగిసలాడలేదు. నూతన ప్రజాస్వామిక విప్లవ పంథా నుంచీ, ఈ విప్లవాన్ని దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా ద్వారా సాధించాలన్న దాని నుంచీ పక్కకు మళ్ల

లేదు. పార్లమెంటరీ పంథాను నిరాకరించడమే కాక, ఎత్తుగడల పేరుతో ఎన్నికలలో పాలుపంచుకోవాలనుకున్న పార్టీలకు వ్యతిరేకంగా కూడా పోరాడారు. అయితే పార్లమెంటరీ పార్టీలుగా దిగజారిపోయిన సీపీఐ(ఎంఎల్)- లిబరేషన్ వంటి కొన్ని బూటకపు విప్లవ పార్టీలు ఉన్నాయి. కానీ ఇవి ఎంఎల్ఎం ముసుగులో ఉన్న రివిజనిస్టు పార్టీలుగా ప్రజలకు బహిర్గతమయ్యాయి.

కామ్రేడ్ ప్రచండ నేతృత్వంలో సీపీఎన్(ఎం) వైఖరిలో వచ్చిన మార్పుకు భారతదేశంలో వివిధ పాలకవర్గ పార్టీలూ, వామపక్షంగా చెప్పుకుంటున్న పార్టీలూ సంతోషించడంలో ఆశ్చర్యం లేదు. సీపీఎన్(ఎం)ను అవి ఎత్తిపట్టడం సహజమే. సాయుధ పోరాటం నిరుపయోగమైనదని భారతదేశంలో మావోయిస్టులు గుర్తించాలని వాళ్లు పిలుపునిస్తున్నారు. నేపాల్ మావోవాదులను అనుసరించి, భారతదేశంలో పార్లమెంటు పందుల దొడ్డిలో పాలు పంచుకోమని చెబుతున్నారు. విప్లవానికి గట్టి శత్రువులుగా ప్రత్యర్థులుగా వున్న ఈ పార్టీలన్నీ భారతదేశంలో జరుగుతున్న ప్రజాయుద్ధాన్ని అణిచివేయడంలో అగ్ర భాగాన ఉన్నాయి. ప్రతీఘాతుక పార్టీలతో పాటుగా ప్రభుత్వంలో పాలు పంచుకోవాలన్న సీపీఎన్(ఎం) నిర్ణయం, భవిష్యత్తు రాజ్యాంగ చట్టానికి కట్టుబడి ఉంటామనీ రాజ్యాంగ శాసనసభ ఎన్నికల తరువాత జరిగే పార్లమెంటరీ ఎన్నికల తతంగంలో పాలుపంచుకుంటామన్న వారి ప్రకటనా, నేపాల్ పాలకవర్గ పార్టీలకూ భారతదేశంలో పార్లమెంటరీ వ్యవస్థకూ వెసులుబాటు కల్పిస్తుంది.

నిజానికి గడిచిన ఫిబ్రవరిలో ది హిందూకు ఇచ్చిన ఇంటర్వ్యూలో, భారతదేశ మావోయిస్టు ఉద్యమం మీద తన బహుళ పార్టీ ప్రజాస్వామ్యం వేయగలిగే అనుకూల ప్రభావం గురించి కామ్రేడ్ ప్రచండ స్వయంగా ప్రస్తావించాడు. బహుళ పార్టీ ప్రజాస్వామ్యానికి తన పార్టీ కట్టుబడి ఉన్నదంటూ నేపాల్‌లో బహుళ పార్టీ ప్రజాస్వామ్యాన్ని విజయవంతంగా నెలకొల్పి భారతదేశ నక్సలైటు ఉద్యమానికి సందేశం ఇవ్వాలని చూస్తున్న కామ్రేడ్ ప్రచండ మాటలు భారత పాలకవర్గాలకు గొప్ప హాయిని కలిగించి వుంటాయి.

భారతదేశ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ కలిస్తే ఏం మాట్లాడతారని అడిగినప్పుడు కామ్రేడ్ ప్రచండ ఇలా అన్నారు-

మేం నిజమైన బహుళ పార్టీ ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్నాం. కానీ వాళ్లక్కడ పాట్నాలో, సిలిగురిలో, చెన్నైలో ఖైదులో వున్నారు. వాళ్లందరినీ విడుదల చేస్తే ఒక సందేశం ఇచ్చినట్టు అవుతుంది. భారతదేశంలో నక్సలైటు ఉద్యమాన్ని మీరు సమస్యగా భావిస్తుంటే, నేపాల్‌లో సమస్యల పట్ల మేం నూతన పద్ధతిలో వ్యవహరిస్తున్నామని మేం భావిస్తున్నాం. అందుకని మీరు మా కామ్రేడ్స్‌ను విడుదల చేసి, మేం నేపాల్‌లో బహుళ పార్టీ ప్రజాస్వామ్యాన్ని విజయవంతంగా నెలకొల్పితే, అది భారతదేశంలో నక్సలైటు ఉద్యమానికి చాలా పెద్ద సందేశం అవుతుంది. మరో మాటలో, ఒక నూతన రాజకీయ పద్ధతిలో ఆలోచించడానికి వాళ్లకు రంగం సిద్ధం అవుతుంది. మాటలు చాలవు. ఆ ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పి, మనం చెప్పేదానికి చట్టబద్ధత కల్పించడం అవసరం.

నేపాల్ అంతర్గత వ్యవహారాలలో ఏ రకంగానూ జోక్యం చేసుకోరాదనీ కల్పించుకోవద్దనీ విస్తరణవాద భారత పాలకవర్గాలను డిమాండ్ చేయడానికి బదులు కామ్రేడ్ ప్రచండ కేవలం వాళ్ల ఎత్తుగడలు భారతదేశంలో మావోయిస్టుల దృష్టిలో ఏ రకంగా మార్పు తీసుకువస్తాయో వాళ్ల ఎత్తుగడలు భారతదేశంలో మావోయిస్టుల దృష్టిలో ఏరకంగా మార్పు తీసుకువస్తాయో మాట్లాడడం చాలా తీవ్రంగా ఆలోచించవలసిన విషయం. దిగజారిపోయిన పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థను చూసిన మన దేశ విప్లవ ప్రజానీకం ఈ మాటలను గాఢంగా నిరసిస్తారు. అంతేకాదు, ఈ మాటలు పూర్తిగా తప్పని వారి విప్లవ కార్యాచరణే నిరూపిస్తుంది.

**పీమా - మావోయిస్టులకూ ఎన్‌పీఏకూ మధ్యవర్తిత్వం వహించడానికి సీపీఎం, దాని అగ్ర నాయకుడు సీతారాం ఏచూరిని భారతదేశం నుంచీ దూతగా ముందుకు తీసుకువచ్చారు. భారత్‌కు తిరిగి వచ్చిన తరువాత భారత మావోయిస్టులు కూడా సీపీఎన్(ఎం) పంథాను అనుసరించాలంటూ ఆయన సలహా ఇచ్చాడు. ఇక్కడి మావోయిస్టుల పట్ల శత్రుపూరితంగా ఉన్న వాళ్లు ఇలా చేయడాన్ని మీరు ఎలా వివరిస్తారు? పైగా భారత మావోయిస్టులు తనను చంపడానికి ప్రయత్నించారని, ఈ నిర్ణయానికి సంబంధించిన రహస్యాన్ని నేపాల్ మావోయిస్టులు తనకు తెలియజేశారనీ ఏచూరి పత్రికల వాళ్లకు చెప్పాడు. మీ వ్యాఖ్యానం-**

**ఆజాద్** - సీపీఎం భారత పాలక వర్గాల పార్టీ. సామ్రాజ్యవాద, భూస్వామ్య, భారతదేశ సీబీబీ(దళారీ నిరంకుశ బూర్జువా)ల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నది. నేపాల్ మావోవాదులను పార్లమెంటరీ ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడం వారి ప్రాథమిక కర్తవ్యంగా కనిపిస్తున్నది. వాళ్లు భారతదేశంలో మాకు బోధించేది కూడా అదే. మేం అందుకు నిరాకరించినప్పుడు మా మీద పశ్చిమ బెంగాల్‌లో మాదిరిగా ఘోరమైన రాజ్య బీభత్సాన్ని ప్రయోగించారు. ఈ రెండు దేశాలలోనూ వారి లక్ష్యం ఒకటే - భారతదేశంలో మావోవాదులను తూటాలతో మెత్తపరచడం, నేపాల్ మావోవాదులను చక్కెర పూత పూసిన తూటాలతో మెత్తపరచడం. కాంగ్రెస్ కరన్ సింగ్ గొడవలో ఇరుక్కుపోయినప్పుడు ఏచూరీ, సీపీఎం, భారత పాలకవర్గాలకు మరింత ప్రభావవంతమైన పాత్ర వహించారు. అయితే అతను తన దౌత్యాన్ని అతిగా చేసినప్పుడు అతన్ని పక్కన పెట్టారు. అప్పుడతను భారత మావోయిస్టులు తనను చంపడానికి ప్రయత్నిస్తున్నారన్న కుట్ర సిద్ధాంతం పుట్టించి పోయిన పేరును తిరిగి

పొందాలని చూశాడు. ఈ రెండు మావోయిస్టు పార్టీల మధ్యనూ అవిశ్వాస బీజాలు నాటాలని చూశాడు.

**పీమా - సీపీఎన్(ఎం) ప్రతిపాదిస్తున్న బహుళ పార్టీ ప్రజాస్వామిక ఎత్తుగడలను మీరు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?**

**ఆజాద్** - మొదటగా, తమ పార్టీ బహుళ పార్టీ ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉందనీ, ఇది కార్మికవర్గం అధికారాన్ని విప్లవకరంగా స్వాధీనం చేసుకున్న తరువాత కాక అర్ధ వలస, అర్ధ భూస్వామ్య సమాజంలోనే ఆచరిస్తామనీ కామ్రేడ్ ప్రచండ అనేక ఇంటర్వ్యూలలో ముందుకు తీసుకువచ్చిన ప్రతిపాదన మమ్మల్ని ఎంతో కలతపెట్టింది. బహుళ పార్టీ ప్రజాస్వామ్యం, లేదా రాజకీయ పోటీ, అంటే, విప్లవ పార్టీ అధికారం స్వాధీనం చేసుకున్న తరువాత ఆచరించగలిగినదా లేక ముందుగానేనా అన్న దాని పట్ల సీపీఎన్(ఎం) అవగాహన గురించి 2003 ప్లీనం డాక్యుమెంటు చాలా అస్పష్టంగా ఉంది, భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజాస్వామిక రాజ్యం, రాజ్యాంగబద్ధ పరిమితులలో రాజకీయ పోటీని నిర్వహించడం సాధ్యమని మాత్రమే అది చెప్పింది. అయితే, సీపీఎన్(ఎం), సెవెన్ పార్టీ అలయెన్స్‌ల మధ్య 2005 నవంబరులో జరిగిన 12 సూత్రాల ఢిల్లీ ఒప్పందం తరువాత సమస్త ప్రకటనలూ ఇంటర్వ్యూలూ డాక్యుమెంటులూ కూడా ప్రస్తుత వ్యవస్థలో రాజ్యాంగబద్ధ శాసనసభ ఎన్నిక తరువాత పోటీ అవసరం అని పేర్కొంటాయి.

ఇటువంటి రాజకీయ పోటీని నిర్వహించవలసిన పార్టీల వర్గ స్వభావం గురించి గందరగోళం కూడా వుంది. ఈ శక్తులు భూస్వామ్య వ్యతిరేక సామ్రాజ్యవాద వ్యతిరేక స్వభావాన్ని కలిగి వుంటాయని 2003 డాక్యుమెంటు స్పష్టంగా చెప్పినప్పటికీ 2005 నవంబరు తరువాత సీపీఎన్(ఎం) డాక్యుమెంటులూ ఇంటర్వ్యూలూ చూస్తే, రాచరికానికి వ్యతిరేకంగా, ఇంకా నిర్దిష్టంగా చెప్పాలంటే రాజు జ్ఞానేంద్ర నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పాత్ర వహించినప్పటికీ మౌలికంగా దళారీ, బూర్జువా భూస్వామ్య స్వభావం కలిగిన ఎస్‌పీఏ భాగస్వాములతో అటువంటి పోటీకి అవకాశం ఇస్తాయి.

నిజానికి 2003 మే నెలలో కామ్రేడ్ ప్రచండ సమర్పించి, సీపీఎన్(ఎం) కేంద్ర కమిటీ సమావేశం ఆమోదించిన ప్రస్తుత పరిస్థితి, మన కర్తవ్యాలు అన్న డాక్యుమెంటు నేపాల్‌లో పార్లమెంటరీ పార్టీల స్వభావాన్ని గురించి సరిగా ఇలా వివరించింది-

*'రూపంలో ఇది రాచరికం, పార్లమెంటరీ శక్తులూ విప్లవ శక్తుల మధ్య త్రికోణపు పోరాటంగా కనిపించవచ్చు. కానీ సారంలో వర్గ దృష్టి నుంచి చూస్తే, ఈ పోరాటంలో రెండే శక్తులు (ప్రతీఘాతుక, ప్రజాస్వామిక శక్తులు) ఉన్నాయని అర్థమవుతుంది. నిరంకుశ రాచరిక, పార్లమెంటరీ గ్రూపుల మధ్య విభేదాలు పాత రాజ్యంలో అధికారంలో వాటా సంపాదించుకోవడానికి తప్ప మరేమీ కాదని ఆచరణలో రుజువయింది. ఒకే వర్గ పునాదితో, జాతీయవాదం (బూటకపు) పేరుతో రాచరికం, ప్రజాస్వామ్యం(బూటకపు) పేరుతో పార్లమెంటరీ శక్తులూ అధికారం సంపాదించుకుని జాతికీ ప్రజలకూ ద్రోహం చేయాలని చూస్తున్నాయన్న విషయం నేపాల్‌లో అనేకసార్లు రుజువయింది'.*

మేం వర్గ, సైద్ధాంతిక దృష్టికోణం నుంచీ చెబుతున్నదీ, ప్రస్తుత కాల్పుల విరమణ, చర్చల ప్రక్రియల ద్వారా మరింతగా బహిర్గతం అయినదీ ఏమంటే, నేపాల్‌లో వివిధ ప్రతీఘాతుక గ్రూపుల మధ్య పరస్పర ఆరోపణలూ వైరుధ్యాల వెనుక వివిధ అంతర్జాతీయ ప్రతీఘాతుక కేంద్రాల ప్రయోజనాల మధ్య ఘర్షణ వున్నది. రాయల్ సైన్యాన్నీ రాజభవనం శక్తులనూ పాశ్చాత్య సామ్రాజ్యవాదం, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదం పరిరక్షిస్తున్నది. ప్రధాన పార్లమెంటరీ శక్తులను దక్షిణాసియాలో ప్రత్యేక ఆధిపత్యాన్ని కోరుకుంటున్న భారత పాలకులు పరిరక్షిస్తున్నారు. ఈ రెండింటి మధ్య నిరంతర యుద్ధం వుంటున్నది. అందుకని, ముఖ్యంగా రాజభవనపు ఊచకోత తరువాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో, నేపాల్‌లో రాచరికపు, లేదా పార్లమెంటరీ శక్తులలో ఒక దానిని మరో దానికంటే మరింత ప్రజాస్వామికమైనదిగానూ లేదా మరింత జాతీయవాదిగానూ చూడడం ప్రత్యేకించి హానికరమూ, తప్పూ అవుతుంది. ఒక ప్రత్యేక పరిస్థితిలో వైరుధ్యాలను పరిష్కరించుకోవడం మినహా రాచరికపు గ్రూపుతో కానీ పార్లమెంటరీ గ్రూపులతో కానీ సైద్ధాంతిక, రాజకీయ సంబంధం ఎప్పటికీ సాధ్యం కాదని నేటి నేపాల్ మరింత స్పష్టంగా తెలియజేస్తున్నది.

పార్లమెంటరీ పార్టీల వర్గ స్వభావం, వారి బూటకపు ప్రజాస్వామ్యం, వివిధ సామ్రాజ్యవాద శక్తుల పట్ల వారి విధేయతల గురించిన విశ్లేషణ మౌలికంగా సరిగా వుండి, సీపీఎన్(ఎం) ఈ విశ్లేషణకు వ్యూహాత్మక, వర్గ దృక్పథం నుంచీ గట్టిగా కట్టుబడి వుండక పోవడం చాలా దురదృష్టకరం. ఈ పార్లమెంటరీ శక్తులతో కానీ సామ్రాజ్యవాదులలో ఒక సెక్షన్‌తో కానీ పొత్తుకు పరిస్థితులు పరిపక్వం అయినప్పుడు ప్రధాన శత్రువుకు వ్యతిరేకంగా సర్దుబాటులూ అవగాహనలూ ఎత్తుగడల ఐక్యతా కుదుర్చుకోవచ్చన్నది ఒక అంశం. కానీ ఈ పార్టీల స్వభావం పట్ల భ్రమలు సృష్టించడం కానీ సామ్రాజ్యవాదులతోనూ భారత విస్తరణవాదులతోనూ వారి సంబంధాలను చూడకపోవడం కానీ దీర్ఘకాలంలో విప్లవానికి ఎంతో హాని చేస్తుంది.

అంతేకాక కామ్రేడ్ ప్రచండ, సీపీఎన్(ఎం), ఎత్తుగడలను 21వ శతాబ్దంలో ప్రపంచ విప్లవ వ్యూహం, పంథా స్థాయికి మార్చారని అర్థమౌతున్నది. అందుకనే ది హిందూకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కామ్రేడ్

ప్రచండ, బహుళ పార్టీ ప్రజాస్వామ్యం పట్ల మావోవాదుల నిబద్ధత ఎత్తుగడలపరమైనది కాదనీ పార్టీలో మూడు సంవత్సరాలుగా జరుగుతున్న సుదీర్ఘ సైద్ధాంతిక చర్చ ఫలితం అని నొక్కి చెప్పాడు. ఆయన ఇలా అన్నాడు- 'బహుళ పార్టీ ప్రజాస్వామ్యం పట్ల మా నిర్ణయం వ్యూహాత్మకంగా, సైద్ధాంతికంగా అభివృద్ధి చెందిన వైఖరి, మీ అందరితో శాంతియుత పోటీకి మేం సిద్ధంగా వున్నాం అని పార్లమెంటరీ పార్టీలకు చెబుతున్నాం.'

తమ పార్టీ శాంతియుత పోటీకి సిద్ధంగా ఉన్నదని సీపీఎన్(ఎం) నాయకుడు దళారీ బూర్జువా భూస్వామ్య పార్లమెంటరీ పార్టీలన్నింటికీ నేరుగా హామీ ఇచ్చాడు. బహుళ పార్టీ ప్రజాస్వామ్యం గురించిన ఈ నిర్ణయం వ్యూహాత్మకంగా, సైద్ధాంతికంగా అభివృద్ధికర వైఖరి అంటూ కామ్రేడ్ ప్రచండ ఒక ప్రమాదకరమైన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకువచ్చాడు - విప్లవం ద్వారా కూలదోయడం కాకుండా, పాలకవర్గ పార్టీలతో శాంతియుత సహజీవన సిద్ధాంతం, పార్లమెంటరీ ఎన్నికలుగా చెబుతున్న దానిలో సామ్రాజ్యవాదానికీ లేదా విదేశీ ప్రతీఘాతుకతకూ చెంచాలయిన పాలకవర్గ పార్టీలతో సహా ఇతర అన్ని పార్లమెంటరీ పార్టీలతోనూ శాంతియుత పోటీ అనంతకాలం వరకూ సోషలిజం నిర్మాణ లక్ష్యాన్ని విడిచిపెట్టడం. ప్రజల వెనుకబాటుతనాన్నీ దేశ విదేశీ ప్రతీఘాతకుల భారీ దన్నుతో అధికారంలోకి రావడానికి భూస్వామ్య, దళారీ ప్రతీఘాతకులకు తలుపులు బార్లా తెరవడం, లేదా దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య పెటీ బూర్జువా శక్తులు ప్రజాస్వామ్యం, జాతీయవాదం పేరుతో సమాజ యావత్తు అభివృద్ధి క్రమాన్నీ సోషలిస్టు దిశ నుంచీ మళ్లించి ప్రస్తుత వ్యవస్థను నిలబెట్టడం (కొత్త రూపంలోనే కావచ్చు). మరింత ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించటానికి మనకు మంచి ఉద్దేశాలు ఉన్నప్పటికీ వర్గ పోరాట నియమాలు అటువంటి వ్యవస్థకు అంగీకరించవు. పారిస్ కమ్యూన్ రోజుల నుంచీ ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో ప్రారంభ విప్లవాల వరకూ చరిత్ర ఈ విషయాన్ని పదే పదే రుజువు చేసింది.

**పీమా - అయితే అధికార స్వాధీనం తరువాతయినా మీరు బహుళ పార్టీ ప్రజాస్వామ్యానికి అనుకూలమేనా? కాకపోతే, విప్లవానంతరం ప్రభుత్వం ఏ రకంగా ఉంటుందని మీరు భావిస్తున్నారు?**

**ఆజాద్** - కార్మికవర్గానికి అత్యంతగా సరిపోయే ప్రభుత్వ రూపం కమ్యూన్, లేదా సోవియట్, లేదా విప్లవ సమితి. ఇది కార్మికవర్గానికీ అత్యధిక విశాల ప్రజానీకానికి అత్యుత్తమంగా ఉపయోగపడుతుందన్నది మార్క్సిస్టు లెనినిస్టు మావోయిస్టు అవగాహన. ఇవి కేవలం మాటలు చెప్పే సంస్థలు కావు. కేవలం శాసనసభలు కావు. శాసన, నిర్వాహక సంస్థలుగా పని చేస్తాయి. ఈ సంస్థలకు ప్రతినిధులను ఎన్నుకుంటారు. తమ ప్రయోజనాలు నెరవేర్చడం లేదని ప్రజలు భావించినప్పుడు వాళ్లను తొలగించవచ్చు. దీర్ఘకాలిక ప్రజాయుద్ధ క్రమంలో, కార్మికవర్గనాయకత్వం కింద, బేస్ ఏరియాలలో, గ్రామసభలు ప్రజాస్వామికంగా ఎన్నుకున్న సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక సమస్త శక్తుల ప్రజాస్వామిక అధికారాన్ని నెలకొల్పుతుంది. వారిని తొలగించే హక్కు కూడా గ్రామసభలకు ఉంటుంది. ఇక్కడ అధికార స్వరూపాలకూ ప్రజల ఇష్టానికీ మధ్య సన్నిహిత సంబంధం ఉంది. అందుకని అవి నిజంగా ప్రజాస్వామికంగా ఉంటాయి. అఖిల భారత స్థాయిలో అధికారం స్వాధీనం చేసుకున్న తరువాత సోషలిస్టు దశకు మారేంతవరకూ సమస్త సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పార్టీలూ నూతన అధికారంలో భాగంగా ఉంటాయి. కార్మికవర్గ నియంతృత్వంలో వర్గ పోరాటాన్ని కొనసాగించడం ద్వారానే సోషలిజంలోకి మార్పు జరుగుతుంది. ఇది ప్రజలకు ప్రజాస్వామ్యం లేకుండా చేయదు. అయితే లెనిన్ అన్నట్టు చిన్న తరహా ఉత్పత్తి ప్రతి రోజూ ప్రతీ గంటా ఒక బూర్జువాను తయారు చేస్తూ వుంటుంది. ఈ శక్తులు పార్టీతో సహా రాజ్యాధికారంలో అన్ని రంగాలలోనూ ప్రతినిధిని వెతుక్కుంటాయి. నిజమైన అర్థంలో ఇంతకంటే మెరుగైన ప్రభుత్వ రూపాన్ని కానీ మెరుగైన ప్రజాస్వామిక రూపాన్ని కానీ ఎవరైనా ఊహించగలరా?

కొద్ది సంవత్సరాలకు ఒకసారి పాలక వర్గంలో ఎవరు ప్రజలను పార్లమెంటు ద్వారా అణిచివేసి, తొక్కివేయాలో నిర్ణయించడం - పార్లమెంటరీ రాజ్యాంగబద్ధ రాచరికాలలోనే కాక అత్యంత ప్రజాస్వామిక రిపబ్లిక్‌లలో కూడా బూర్జువా పార్లమెంటరిజానికి నిజమైన అర్థం అన్నాడు లెనిన్.

లెనిన్ ఈ మాట శతాబ్దం క్రితం చెప్పాడు. ఆనాటి నుంచీ ముఖ్యంగా మొదటి ప్రపంచ యుద్ధం నుంచీ పార్లమెంటు, దాని సంబంధిత సంస్థలూ మరింత లంచగొండిగా తయారయ్యాయి. పూర్తిగా దిగజారిపోయాయి.

నూతన అధికారం ఎలా నిర్మాణమయిందనడానికి పారిస్ కమ్యూన్ నుంచి ఉదాహరణ, ఇక్కడ ఆచరించిన సూత్రాలను యూఎస్ఎస్ఆర్‌లో సోవియట్‌లు, చైనాలో కమ్యూన్‌లు, మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ ప్రయోగాలలో మరింతగా అమలు చేశారు. ప్రపంచంలో వివిధ ప్రాంతాలలో మావోయిస్టులు నెలకొల్పుతున్న బేస్ ఏరియాలలో ఆచరించేందుకు ప్రయత్నిస్తున్నారు.

అత్యంత ప్రజాస్వామిక రిపబ్లిక్‌లలో కూడా పార్లమెంటు ఎలా పని చేస్తుందో కామ్రేడ్ లెనిన్ చాలా స్పష్టంగా వివరించాడు. అందుకు విరుద్ధంగా కమ్యూన్ గురించి చెప్పి, కమ్యూన్‌లు (రష్యాలో సోవియట్‌లు, చైనాలో విప్లవ సమితులు) కార్మికవర్గానికి శ్రామిక ప్రజానీకానికి అత్యంత అనుగుణమైన ప్రభుత్వ రూపాలు ఎలా అవుతాయో చూపించాడు.

పార్లమెంటరీ బూర్జువా రిపబ్లిక్ ప్రజల స్వతంత్ర రాజకీయ జీవితాన్ని, రాజ్యపు ప్రజాస్వామిక సంస్థలో కింది నుంచీ పై వరకూ

నేరుగా పాలు పంచుకోవడాన్నీ ఆటంకపరుస్తుంది. తొక్కిపడుతుంది. సోవియట్‌లు అందుకు విరుద్ధం.

అయితే పార్లమెంటరిజం నుంచీ బయటపడటానికి ప్రాతినిధ్య సంస్థలనూ ఎన్నిక సూత్రాన్నీ నిర్మూలించడం మార్గం కాదు. ఆ ప్రాతినిధ్య సంస్థలను మాటల సంస్థల నుంచీ పని చేసే సంస్థలుగా మార్చడం అవసరం. కమ్యూన్ ఆచరించే సంస్థ. పార్లమెంటరీ, కార్యనిర్వాహక, శాసన సంస్థ కాదు.

బూర్జువా సమాజపు పాత, కుళ్లిపోయిన పార్లమెంటరిజం స్థానంలో కమ్యూన్ వస్తుంది. ఇందులో అభిప్రాయ స్వేచ్ఛ, చర్చించే స్వేచ్ఛా మోసపూరితం కావు. ఎందుకంటే పార్లమెంటేరియనులు స్వయంగా పని చేయాలి. తమ చట్టాలను అమలు చేయాలి. ఆచరణలో ఫలితాలను పరీక్షించాలి. తమ భాగస్వాములకు నేరుగా జవాబుదారీగా ఉండాలి. కార్మికవర్గ ప్రజాస్వామ్యాన్ని కూడా ప్రాతినిధ్య సంస్థలు లేకుండా ఊహించుకోలేం. కాని బూర్జువా సమాజాన్ని కేవలం మాటల్లో విమర్శించి ఊరుకోకుండా ఉంటే, బూర్జువా వర్గ పాలనను కూలదోయడం మన నిజమైన, నిజాయితీ అయిన ఆకాంక్షగా వుంటే, మెన్షివిక్కులూ సోషలిస్టు విప్లవకారుల మాదిరిగా కేవలం కార్మికుల వోట్లు సంపాదించడానికి చేసే ఎన్నికల నినాదం కాకపోతే, పార్లమెంటరిజం లేకుండా ప్రజ్యాస్వామ్యాన్ని ఊహించుకోగలం....

**పీమా - ఇతర పార్టీలతో రాజకీయ పోటీని మీరు ఎలా తీసుకువస్తారు? రాజకీయ పోటీని నిర్వహించడం ద్వారానూ ప్రత్యామ్నాయ విప్లవ పార్టీని నెలకొల్పడానికి ప్రజల హక్కును వ్యవస్థీకృతం చేయడం ద్వారానూ మాత్రమే ప్రతీఘాతుక విప్లవాన్ని ప్రభావవంతంగా అరికట్టగలమని సీపీఎన్(ఎం) అంటున్నది.**

**ఆజాద్** - పెట్టుబడిదారీ వ్యవస్థ నుంచీ సోషలిస్టు వ్యవస్థకు మార్పుకు సంబంధించి కార్మికవర్గానికి సుసంపన్నమైన వైవిధ్యమైన అనుభవాలు ఉన్నాయి. సాంస్కృతిక విప్లవం అనే ఒక తగిన రూపం,పద్ధతి, ఆయుధం ఉన్నాయి. పార్టీ, సైన్యం, రాజ్యం దిగజారుడును అరికట్టడాన్ని గురించీ, పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణను నివారించడం గురించీ, నూతన రకపు రాజ్యాన్నీ సమాజాన్నీ నిర్మించడం గురించీ మన మహోపాధ్యాయులైన మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్, మావోల రచనలు, అనేక మంది మార్క్సిస్టు రచయితల రచనలు అపారంగా ఉన్నాయి. ఇంత ఉన్న తరువాత కూడా సీపీఎన్(ఎం) ఇటువంటి నిర్ధారణకు రావడం ఆశ్చర్యకరంగా వుంది. రాజకీయ పోటీ అంటున్న దానిని నిర్వహించడం ద్వారానో ప్రత్యామ్నాయ విప్లవ పార్టీనో లేక రాజ్యం నాయకత్వాన్నో నెలకొల్పడం కోసం ప్రజల హక్కును వ్యవస్థీకృతం చేయడం ద్వారానో కమ్యూనిస్టు పార్టీని నిరంతరం కార్మికవర్గీకరించగలమనీ విప్లవీకరించగలమనీ, విప్లవ ప్రతీఘాతుకతను ప్రభావవంతంగా అరికట్టగలమనీ ఆలోచించడం అంటే బూర్జువా లాంఛనవాదపు వలలో పడడమే అవుతుంది. పాత ప్రతీఘాతుక ఓటమికి గురైన వర్గాలకు వ్యతిరేకంగానూ పార్టీలోనూ సైన్యంలోనూ ప్రభుత్వంలోనూ పెంపొందుతున్న నూతన బూర్జువా వర్గానికి వ్యతిరేకంగానూ తీవ్రమైన వర్గ పోరాటం చేయడానికి ప్రజలను విస్తృతంగా సమీకరించే నిజమైన కర్తవ్యాన్ని తక్కువ చేయడం అవుతుంది. ముఖ్యంగా, వివిధ రాజకీయ పంథాలు కార్మికవర్గ దృష్టిని కానీ బూర్జువా దృష్టిని కానీ ప్రతిబింబిస్తాయని కమ్యూనిస్టు పార్టీలు ఎల్లప్పుడూ అర్థం చేసుకున్న తరువాత, ప్రత్యామ్నాయ విప్లవ పార్టీలు ఎలా ఉనికిలో ఉంటాయన్నది అర్థం చేసుకోవడం కష్టం.

ఏ బూర్జువా రిపబ్లిక్‌లోనయినా, లేక నిరంకుశ బూర్జువా భూస్వామ్య రిపబ్లిక్‌లోనయినా వుండే నియమం ఎన్నికల ద్వారా ఒక పార్టీ స్థానంలో మరో పార్టీని తీసుకురావడం. కీలకమయిన అంశం ప్రజలకు ఈ హక్కు కల్పించడం కాదు. పార్టీనీ రాజ్యాన్నీ పర్యవేక్షించడంలో వారికి చురుకయిన సృజనాత్మకమైన పాత్ర ఉండేట్టు చూడడం, నూతన నిరంకుశ వర్గం ఆవిర్భవించకుండా అరికట్టడం, వారు స్వయంగా ప్రభుత్వంలోనూ రాజ్యంలోనూ సమాజంలోనూ యావత్తు విప్లవ మార్పు క్రమంలోనూ పాలుపంచుకునేట్టు చూడడం. విప్లవ ప్రతీఘాతుకతను అరికట్టి, కార్మికవర్గ నియంతృత్వం కింద నిరంతర విప్లవం ద్వారా అన్ని రంగాలలో విప్లవ మార్పు తీసుకువచ్చే విధంగా ప్రజలకు నేతృత్వం వహించడం పార్టీ మొట్టమొదటి కర్తవ్యం. ప్రపంచ విప్లవ యావత్తు చారిత్రాత్మక అనుభవమూ, ముఖ్యంగా మహత్తర సాంస్కృతిక విప్లవం అందించిన అతి ముఖ్యమైన పాఠం ఇది.

పైగా ప్రజాస్వామిక పద్ధతిలో పోటీ పడే అవకాశం కల్పించి, ఓడిపోయిన వర్గాలు తిరిగి అధికారంలోకి రాకుండా నివారించడం కానీ శాంతియుతంగానో తిరుగుబాటు ద్వారానో విప్లవ ప్రతీఘాతుకతని అరికట్టడం కానీ కార్మికవర్గ పార్టీకి సాధ్యమేనా? అత్యంత ప్రతీఘాతుక భావాలు ఆధిపత్యంలో ఉన్న వెనుకబడ్డ, విశాల గ్రామీణ ప్రాంతంలో దాదాపు ఉనికిలో లేని పరిస్థితిలో, బోల్షివిక్ పార్టీ ఇటువంటి రాజకీయ పోటీని నిర్వహించి వుంటే, విప్లవం తర్వాత రష్యాలో జరిగే ఎన్నికలలో గెలిచి ఉండేదా? నిజానికి, రాజ్యాంగబద్ధ శాసనసభ ప్రతీఘాతుకులకు సాధనం అయింది కనకనూ విప్లవ సంస్కరణలు అమలు చేయడానికి, సోవియట్‌లలో కార్మికవర్గ నియంతృత్వాన్ని అమలు చేయడానికీ ఆటంకం అయింది కనకనూ మైనారిటీగానే ఉన్నప్పటికీ అధికారం స్వాధీనం చేసుకున్న తక్షణమే బోల్షివిక్ పార్టీ రాజ్యాంగబద్ధ శాసనసభను రద్దు కూడా చేసింది. ఇది రష్యాలో మాత్రమే కాదు. అనేక దేశాలలో ముఖ్యంగా చిన్న తరహా అమ్మకపు ఉత్పత్తి రైతాంగ ఆర్థిక వ్యవస్థా ఆధిపత్యంలో ఉన్న అర్ధవలస, అర్ధ భూస్వామ్య దేశాలలో, అత్యధిక ప్రజలలో భూస్వామ్య

భావజాలం, సంస్కృతి, సంప్రదాయాలు, అలవాటుల వల్ల భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక ముసుగులో ఇతర కార్మికవర్గేతర పార్టీలు, ప్రతీఘాతుక పార్టీలు కూడా సాపేక్షికంగా తేలికగా అధికారంలోకి రావడం సాధ్యం అవుతుంది. అందుకని, మంచి ఉద్దేశాలతోనే అయినప్పటికీ సీపీఎన్(ఎం) చేస్తున్న ఈ ఆదర్శ, స్వీయాత్మక ప్రతిపాదన, అంతిమంగా అధికారం స్వాధీనం చేసుకోవడానికి పెట్టుబడిదారీ మార్గీయుల చేతిలో సాధనంగా మారితే ఆశ్చర్యం లేదు.

ఇతర పార్టీలతో రాజకీయ పోటీకి సంబంధించి, మనకు చైనా అనుభవం ఉంది. చైనాలో డెమోక్రటిక్ లీగ్, పీసంట్స్ ఎండ్ వర్కర్స్ పార్టీ మొదలయిన అనేక ప్రజాస్వామిక పార్టీలు వివిధ అధికార అంగాల ఎన్నికలలో సి.పి.సితో పోటీ చేశాయి. విప్లవానంతరం దాదాపు దశాబ్దం పైగా ఇవి ఉనికిలో ఉన్నప్పటికీ అవి సోషలిజానికి మద్దతు ఇవ్వకుండా, చైనాను పెట్టుబడిదారీ మార్గంలోకి తీసుకుపోయేందుకు ప్రయత్నించడంతో ప్రజలు వాటిని నిరాకరించారు. చైనాలో రాజకీయ పోటీని ప్రోత్సహించారు. అయితే అవి పాశ్చాత్య రకపు బూర్జువా పార్లమెంటరీ ఎన్నికలు కాదు. వివిధ సంస్థల ఎన్నికలలో ఆ పార్టీలు పాలు పంచుకునేట్టు చేశారు. విప్లవంలో చోదక శక్తులయిన నాలుగు వర్గాలకు చెందిన ప్రజాస్వామిక పార్టీలూ సంస్థలూ వివిధ సంస్థలకు ఎన్నికలలో పాలు పంచుకోవాలి.

నూతన ప్రజాస్వామిక విప్లవంలోనూ అధికారం స్వాధీనం చేసుకుని, జనతా ప్రజాస్వామ్యాన్ని, లేదా జనతా ప్రజాస్వామిక నియంతృత్వాన్ని నెలకొల్పిన తరువాత కూడా సమస్త భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పార్టీలనూ శక్తులనూ ఐక్యం చేయడానికి సి.పి.సి కృషి చేసింది.

1957లో రాసిన ప్రజల మధ్య వైరుధ్యాలను సరిగా పరిష్కరించడం అన్న వ్యాసంలో, అధికారం స్వాధీనం చేసుకున్న తరువాత ఇతర రాజకీయ పార్టీల పట్ల సీపీసీ వైఖరి గురించి మావో ఇలా వివరించాడు-

*ప్రజాస్వామిక పార్టీలతో సుదీర్ఘ కాలం పాటు కలిసి మెలిసి ఉండాలన్నది కమ్యూనిస్టు పార్టీ ఆకాంక్ష, విధానమూ కూడా. అయితే ప్రజాస్వామిక పార్టీలు ఎంతకాలం ఉనికిలో ఉండగలవన్నది కేవలం కమ్యూనిస్టు పార్టీ ఆకాంక్ష మీద కాక, అవి ఎంత త్వరగా తమ తప్పుల నుంచీ బయటపడతాయన్న దాని మీదనూ ప్రజల విశ్వాసం పొందిన దాని మీదనూ ఆధారపడి ఉంటుంది. వివిధ పార్టీల మధ్య పరస్పర పర్యవేక్షణ దీర్ఘకాలంగా ఉన్న వాస్తవం. అంటే చాలా కాలంగా అవి పరస్పరం సలహా ఇచ్చుకుంటూ విమర్శించుకుంటూ ఉన్నాయి. పరస్పర పర్యవేక్షణ కచ్చితంగా ఏకపక్ష వ్యవహారం కాదు. కమ్యూనిస్టు పార్టీ ప్రజాస్వామిక పార్టీలను పర్యవేక్షించగలదనీ ఇవి దాన్ని పర్యవేక్షించగలవనీ దీని అర్థం.*

ప్రభుత్వంలోనూ, పార్టీలోను పెట్టుబడిదారీ పునరుద్ధరణను ఒక నూతన బూర్జువా వర్గం ఆవిర్భవించడాన్ని నివారించడానికి చైనాలో అనేక పద్ధతులు రూపొందించారు. మావో రాసిన - 'నూరు పువ్వులు వికసించనీ, వెయ్యి ఆలోచనలు సంఘర్షించని', 'ఎన్నికలు జరిగే అన్ని సంస్థల్లోనూ కమ్యూనిస్టుపార్టీ సభ్యుల సీట్లను మొత్తం మీద మూడింట ఒకవంతుకు పరిమితం చేసి, రెండు వంతులు ఇతర పార్టీల సభ్యులకు పార్టీయేతర శక్తులకు కల్పించే మూడు వంతుల ప్రజాస్వామిక ప్రాతినిధ్యం', 'ఎన్నికలలో నిలబడటానికి రాజకీయ పార్టీలకు ఆరు రాజకీయ కొలమానాలు' అన్న వ్యాసాలు వారు అవలంభించిన వాటికి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ప్రజాస్వామ్యం అంటే కేవలం లాంఛనంగా ఓటు వేయడం కాదు. సంస్థ జీవ ప్రక్రియలో అది ఉండాలి. నాయకత్వం ప్రజల, క్యాడర్ల సన్నిహిత పర్యవేక్షణ కింద ఉండాలి. ఇది కూడా పార్టీలోనూ ప్రజల్లోనూ ఎంఎల్ఎం చైతన్యం సాధారణంగా పెంపొందినప్పుడే, వర్గ పోరాటం తీవ్రతరం అయినప్పుడే సాధ్యమౌతుంది. చైనాలో విప్లవం తర్వాత అనేక పార్టీలు అధికారం పంచుకున్నాయి. అయితే ఐక్యత సూత్రబద్ధ పునాది మీద ఉన్నది. అలాగే, భూస్వామ్య సీబీబీ శక్తుల అవశేషాలకు వ్యతిరేకంగా వర్గపోరాటం తీవ్రతరం చేసే వేదికలో భాగంగా వుంది. నేపాల్‌లో భూస్వామ్య, సీబీబీ శక్తులతో ప్రభుత్వం ఏర్పాటు చేయడం వర్గ పోరాటాన్ని తేలిక చేస్తుంది.

కార్మికవర్గ, లేదా జనతా ప్రజాస్వామిక రాజ్యంలో సమస్త విప్లవ సంస్థలు ఎన్నికవుతాయి. ఇలా ఎన్నికయిన ప్రతీ వ్యక్తినీ తొలగించవచ్చు. ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కనబడదు. ఇది అత్యంత ముఖ్యమైన విషయం.

**పీమా - బూర్జువా ప్రజాస్వామిక, లేదా బహుళ పార్టీ రిపబ్లిక్ ద్వారా నూతన ప్రజాస్వామిక దశలోకి వెళ్లుతామన్న సీపీఎన్(ఎం) మాటను మీరు తప్పు పడుతున్నారా?**

**ఆజాద్** - రిపబ్లిక్ కోసం, నిరంకుశ రాచరికాన్ని కూలదోయడం కోసం పోరాడడాన్ని మావోయిస్టులు ఎవరూ తప్పుపట్టరు. అలాగే ఏ సమయంలోనైనా ప్రధాన శత్రువుకు వ్యతిరేకంగా వుండే వారందరితో కలిసి ఐక్య సంఘటన కట్టడాన్ని కూడా ఎవరూ వ్యతిరేకించరు. ఇటువంటి ఐక్య సంఘటన కేవలం ఎత్తుగడల స్వభావం కలిగి వుంటుంది. ఎటువంటి పరిస్థితుల్లోనూ కూడా విప్లవ మార్గాన్ని, దిశను తనంతట తాను రూపొందించరాదు.

నిరంకుశత్వ వ్యతిరేక పోరాటం నూతన ప్రజాస్వామిక విప్లవంలో ఉపదశ అనడంలోను ఈ ఉపదశ విప్లవ దిశనూ మార్గాన్ని నిర్ణయించే విధంగా చేసే ధోరణితోను సీపీఎన్(ఎం) చేస్తున్న సిద్ధాంతీకరణలో సమస్య వుంది. సాయుధ పోరాటం ప్రారంభించడానికి పూర్వం పార్టీ రూపొందించిన నూతన ప్రజాస్వామిక విప్లవ కార్యక్రమం, వ్యూహం,

దాని టార్గెట్లు కూలదోయడం, విప్లవం ఇంతగా పురోగమించడానికి పునాదిగా వున్న నిర్దిష్ట వర్గ విశ్లేషణ ఇప్పుడు నేపాల్ విప్లవానికి ఉపదశ అంటున్న దాని అవసరాలకు లోబరుస్తున్నారు. వాళ్ల ఇంటర్వ్యూలు, ప్రకటనలు చూస్తే, బూర్జువా ప్రజాస్వామిక రిపబ్లిక్ ఉప దశ మొత్తాన్ని నిర్ణయించే అంశంగా భావిస్తున్నట్టు కనిపిస్తుంది.

మాకు తెలిసినంత వరకు ప్రపంచంలో వున్న అనేక రకాల రాజ్య వ్యవస్థలను వాటి రాజకీయ అధికారపు వర్గ స్వభావాన్నిబట్టి మౌలికంగా మూడు రకాలుగా చెప్పవచ్చు. 1. బూర్జువా వర్గ నియంతృత్వం కింద రిపబ్లిక్‌లు (వీటికి తోడుగా వెనుకబడ్డ అర్ధ భూస్వామ్య, అర్ధ వలస దేశాల్లో సామ్రాజ్యవాద దన్నుతో సీబీబీ, భూస్వామ్య శక్తుల కింద బూటకపు రిపబ్లిక్‌లు వున్నాయి). 2. కార్మికవర్గ నియంతృత్వంలో రిపబ్లిక్ 3. అనేక విప్లవ వర్గాల సంయుక్త నియంతృత్వం కింద రిపబ్లిక్‌లు. దళారీ బూర్జువా భూస్వామ్య పార్టీలతో పాటుగా విప్లవ పార్టీ రాజ్యాధికారంలో పాలుపంచుకున్నప్పటికీ సీపీఎన్(ఎం) ఇచ్చిన బూర్జువా ప్రజాస్వామిక రిపబ్లిక్ నినాదం సారంలో ఈ మొదటి రకపు రిపబ్లిక్ కిందకు రాదు.

బీబీసీ విలేకరికి ఇచ్చిన ఇంటర్వ్యూలో కామ్రేడ్ ప్రచండ నేపాల్ భవిష్యత్ గురించి తన దృష్టిని ఈ విధంగా వివరించాడు.

*నేపాల్ ప్రజలు రిపబ్లిక్ ఏర్పాటు చేసుకుంటారని మేము నమ్ముతున్నాము. నేపాల్ పునర్నిర్మాణం శాంతియుతంగా ముందుకు సాగుతుంది.*

*ఐదేండ్లలో నేపాల్ అందమైన, శాంతియుతమైన, ప్రగతిశీలమైన దేశంగా సాగుతుంది.*

*ఐదేండ్ల కాలంలో లక్షలాది నేపాలీయులు అందమైన భవిష్యత్‌ను రూపొందించే కార్యక్రమంతో ముందుకు సాగుతూ వుంటారు. నేపాల్ నిజంగా ఒక భూతల స్వర్గంగా అవుతుంది.*

*ఈ రకంగా ఎన్నికైన ప్రజాస్వామిక రిపబ్లిక్ నేపాలీయుల సమస్యలను పరిష్కరిస్తుందని నొక్కి చెప్పాడు!!*

నేపాల్‌లో రాజ్యాంగ శాసనసభ ఎన్నికతో ప్రజాస్వామిక రిపబ్లిక్ ఏర్పడుతుందని మేము విశ్వసిస్తున్నాం. ఇది నేపాలీయుల సమస్యలను పరిష్కరిస్తుంది. దేశాన్ని మరింత ప్రగతిశీలమైన మార్గంలోకి నడిపిస్తుంది.

ఈ వాక్యాలు చదివిన వారెవరైనా ఈ భావాలు కార్మికవర్గ దృష్టిని కాక జాతీయవాద భావాలను ప్రతిబింబిస్తున్నాయని భావిస్తారు.

బూర్జువా రిపబ్లిక్ అయిన తరువాత నేపాల్ భూతల స్వర్గం ఎలా అవుతుంది? ప్రజాస్వామిక రిపబ్లిక్ ఏర్పాటు నేపాలీయుల సమస్యలను ఎలా పరిష్కరిస్తుంది? ప్రస్తుత సామ్రాజ్యవాద యుగంలో రిపబ్లిక్ అయిన తరువాత సామ్రాజ్యవాద ఉచ్చుల నుంచి బయటపడగలదా? ఎంఎల్‌ఎంను విశ్వసిస్తున్నానంటున్న సీపీఎన్(ఎం) నేపాల్ పునర్‌నిర్మాణ ప్రక్రియ శాంతియుత పద్ధతిలో ముందుకు సాగుతుందని నిజంగా భావిస్తున్నదా? ఇటువంటి శాంతియుత ప్రక్రియ ప్రపంచ చరిత్రలో ఎక్కడయినా జరిగిందా? కార్మికవర్గం అధికారం స్వాధీనం చేసుకున్న దశాబ్దాల తర్వాత కూడా తీవ్ర వర్గ పోరాటం, ఒక్కోసారి రక్తపాతంతో హింసతో సహితం జరుగుతుందని ప్రపంచ విప్లవాలు చెప్పడం లేదూ? మరి ఈ ఉపదశలో నేపాల్‌ను శాంతియుత ప్రక్రియలో పునర్నిర్మించడం గురించి కామ్రేడ్ ప్రచండ ఎలా ఆలోచించగలిగారు?

ఎస్‌పిఏకు చెందిన పార్టీలు నిజంగా నేపాల్‌లో సామ్రాజ్యవాదానికి భారత విస్తరణవాదానికీ భూస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాడుతాయా? రాజకీయంగా పోటీ పడాలనుకుంటున్న బూర్జువా భూస్వామ్య పార్టీలను సీపీఎన్(ఎం) ఎన్నికల్లో ఓడిస్తుందన్న హామీ వుందా? నేపాల్ సామ్రాజ్యవాదం, భారత విస్తరణవాదం ఉచ్చులలోకి పడిపోకుండా చూసుకోగలదా? రాజ్యాంగబద్ధ శాసనసభకు ఎన్నికలు జరిగి నేపాల్ దేశం కార్మికవర్గ పార్టీ నాయకత్వంలో కాక, బహుళ పార్టీల అస్తవ్యస్త కలయిక వున్న పొత్తు కింద, అంటే పాలకవర్గం, సీపీఎన్(ఎం) నాయకత్వంలో వున్న కార్మికవర్గమూ కలిసిన పొత్తు నాయకత్వం కిందికి వస్తే, దేశం భూస్వామ్యం నుంచి సామ్రాజ్యవాదం నుంచి విముక్తి పొంది, అందమైన, శాంతియుతమైన, ప్రగతిశీలమైన జాతిగా ఎలా రూపొందుతుంది?

కామ్రేడ్ ప్రచండ అభిప్రాయం ప్రకారం, ప్రతీఘాతుక వర్గం, దాని పార్టీలు ఈ రిపబ్లిక్‌ను బూర్జువా పార్లమెంటేరియన్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తాయి. మన కార్మికవర్గ పార్టీ దాన్ని నూతన ప్రజాస్వామిక రిపబ్లిక్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తుంది. ఈ మార్పు ఎంతకాలం కొనసాగుతుందన్నది ఇప్పుడే చెప్పలేం. అది ఆనాటి జాతీయ, అంతర్జాతీయ పరిస్థితి మీదనూ, అధికార బలాబలాల మీదనూ ఆధారపడి వుంటుంది.

బహుళ పార్టీ రిపబ్లిక్‌గా చెపుతున్నది, దాని బూర్జువా పార్లమెంటరీ రిపబ్లిక్‌గా మార్చడానికి ప్రయత్నించే ప్రతిఘాతుక వర్గం, వారి పార్టీలతో రాజకీయ పోటీ ద్వారా శాంతియుత పోరాటంతో నూతన ప్రజాస్వామిక రిపబ్లిక్‌గా మార్పు చెందుతుంది.

సీ.పీ.ఎన్(ఎం) అవలంబించే ఎత్తుగడలు ఏమైనప్పటికీ, ఈ యావత్ వ్యవహారంలో అత్యంత అభ్యంతరకర అంశం ఏమంటే, ఈ ఎత్తుగడలను 21వ శతాబ్దంలో విప్లవాలకు నమూనాగా వుండాలన్న దాని సైద్ధాంతిక వైఖరి. పిడివాద వ్యతిరేక పోరాటం పేరుతో మన సీ.పీ.ఎన్(ఎం) కామ్రేడ్స్ ప్రమాదకరమైన అంశంలోకి జారుతున్నారు.

అంతేకాకుండా, సామ్రాజ్యవాదానికీ స్థానిక ప్రతీఘాతకులకూ వ్యతిరేకంగా పార్టీ నిరంతర పోరాటం చేసినంత వరకూ, భూపంపకం, సంపత్తి పునఃపంపకం పంథాను అమలు చేసినంత వరకూ, సమస్త దళారీ, విదేశీ పరిశ్రమలూ, బ్యాంకులూ విదేశీ వ్యాపారాల జాతీయికరణ చేస్తున్నంత వరకూ ఇతర పార్లమెంటరీ పార్టీల నుంచీ వ్యతిరేకతను ఎదుర్కోవడం ఖాయం. పార్లమెంటరీ క్రీడలో భాగం కావాలనుకుంటే దాని నియమాలకు లోబడి వుండాలి. భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక విధానాలను క్షుణ్ణంగా కొనసాగించలేరు. న్యాయ వ్యవస్థ స్వతంత్రను కూడా పార్లమెంటు క్రీడలో భాగంగా చూడాలి. ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చిన తర్వాత మావోయిస్టు పార్టీ తీసుకురావాలని ప్రయత్నించే ప్రతి సంస్కరణకు అది అడ్డు చెప్పవచ్చు. ఎనిమిది సూత్రాల ఒప్పందం చట్ట వ్యతిరేకం అనడంలోనే ఇది కనిపిస్తుంది. ఆయుధాలను విడిచిపెట్టిన తరువాతనే మావోయిస్టులు రాజ్యాంగ శాసనసభలో పాలుపంచుకోవాలని అమెరికా సామ్రాజ్యవాదం ఇంకా గట్టిగా డిమాండ్ చేస్తున్నది. అమెరికా, భారత విస్తరణవాదుల ఈ వైఖరిని సీపీఎన్(ఎం) సరిగానే వ్యతిరేకించింది. ఈ విషయంలో వాళ్లు దృఢంగా వుంటారని ఆశిస్తున్నాం.

ఇక పాలక వర్గాలు ప్రారంభించిన న్యాయ వ్యవస్థ, ఎన్నికల కమీషన్, ప్రసార సాధనాలు, వివిధ కళా, సాంస్కృతిక, మతపర సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు, మానవ హక్కుల సంస్థల వంటి అనేక సంస్థలు వుంటాయి. బహుళ పార్టీ ప్రజాస్వామిక రిపబ్లిక్‌గా చెప్పుకుంటున్న మురికిలోకి జారిన తర్వాత ఈ స్వతంత్ర సంస్థలుగా చెప్పుతున్న వాటిని ఎత్తిపట్టకుండా వుండడం సాధ్యం కాదు. వీటిలో చాలా వరకు ప్రతీఘాతుక శక్తులకు స్థావరాలుగా వుంటాయి. వివిధ రహస్య పద్ధతుల్లో విప్లవ ప్రతీఘాతుకతకు పని చేస్తాయి. తూర్పు ఐరోపా దేశాల్లోనూ, గత సోవియట్ యూనియన్‌లోను ఆయా సమాజాల్లోకి పాశ్చాత్య ఏజెన్సీలు ప్రవేశించి, ఎలా లొంగదీసుకున్నారో ఎవరూ మర్చిపోలేరు.

**పీమా - తమ పార్టీ అవలంభించే ఎత్తుగడలు ప్రపంచంలో వున్న రాజకీయ సైనిక బలాబలాల నిర్దిష్టతల మీదనూ అలాగే నేపాల్‌లో ప్రత్యేక వర్గం, రాజకీయ, అధికార బలాబలాల నిర్దిష్టతల మీదనూ ఆధారపడి అవలంభించినవని కామ్రేడ్ ప్రచండ అంటున్నారు. దీని గురించి మీ పార్టీ అభిప్రాయం ఏమిటి?**

**ఆజాద్** - తన పార్టీ బహుళ పార్టీ ప్రజాస్వామ్యం గురించిన నిర్ణయానికి రావడానికి ఈ మూడు అంశాలు కారణం అని కామ్రేడ్ ప్రచండ గత ఫిబ్రవరిలో ది హిందూకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. నిజానికి ఈ ఇంటర్వ్యూకు ముందునుంచి సీ.పీ.ఎన్(ఎం) అవగాహన ఇదే. ఉదాహరణకు 2004 ఆగస్టు సి.సి సమావేశంలోనే, సామ్రాజ్యవాదంను ఎదుర్కొంటూ బలమైన విప్లవోద్యమం పురోగమించకుండా నేపాల్ వంటి చిన్న దేశంలో విజయానికి అవకాశాలు వున్నాయా లేవా అన్న అనుమానంలో పడింది.

ప్రస్తుత నేపథ్యంలో, చైనాలో పెట్టుబడిదారి విధాన పునరుద్ధరణతో పాటుగా మరెక్కడా సోషలిస్టు రాజ్యం లేనప్పుడు, భౌతిక పరిస్థితి అనుకూలంగా మారినప్పటికీ కార్మికవర్గ నేతృత్వంలో బలమైన విప్లవోద్యమ పురోగమనం అంటూ లేనప్పుడు, ప్రపంచ సామ్రాజ్యవాదం అన్ని చోట్ల గాయపడ్డ పులి మాదిరిగా దూకుతున్నప్పుడు, నిర్దిష్ట భౌగోళిక, రాజకీయ పరిస్థితి వున్న నేపాల్ వంటి ఒక చిన్న దేశంలో, విప్లవం ద్వారా కేంద్ర రాజ్యాన్ని స్వాధీనం చేసుకునేంతవరకు విజయం పొందడం సాధ్యమేనా. ఇవాళ పార్టీ ముందుకు తీసుకువస్తున్న ముఖ్యమైన ప్రశ్న ఇదే. దీనికి మార్క్సిజం-లెనినిజం-మావోయిజంలో సమాధానం దొరుకుతుంది. దీని మీదనే నేపాల్ విప్లవ భవిష్యత్ ఆధారపడి వుంది.

ఇదే ప్లీనం కాల్పుల విరమణ, చర్చలు, రాజకీయ ప్రత్యామ్నాయం వంటివి ఎందుకు చేపట్టారో కూడా వివరించింది.

నేపాల్ ప్రజాయుద్ధం ప్రస్తుత వ్యూహాత్మక సమాంతర స్థితి నుంచి వ్యూహాత్మక దాడికి సిద్ధమౌతున్న తరుణంలో సామ్రాజ్యవాద శక్తులు మరింత క్రూరమైన దాడికి సన్నాహం చేసుకుంటున్నారన్న దానిలో సందేహం లేదు. నేపాల్ విప్లవంలో యావత్ క్లిష్టతలు, అవకాశాలు, సవాళ్ళు ఈ భౌతిక పరిస్థితికి వ్యక్తీకరణలు...కానీ నేపాల్‌లో విప్లవ అభివృద్ధి, వ్యూహాత్మక దాడి సన్నాహంలో అత్యంత సున్నిత దశకు చేరుకుంది. పార్టీ చేపట్టిన కాల్పుల విరమణ, చర్చలు, రాజకీయ ప్రత్యామ్నాయం వంటి వరుస ఎత్తుగడలు ఈ వ్యూహాత్మక అనుకూల, ఎత్తుగడలపర అననుకూల ప్రపంచ పరిస్థితి మీదను దేశంలో వ్యూహాత్మక సమాంతర స్థితి మీదను ఆధారపడి వున్నాయని అర్థం చేసుకోవడం అవసరం.

అన్ని ప్రాంతాలలోను, ముఖ్యంగా చైనా వెనుకడుగు తర్వాత విప్లవాలు కఠిన పరిస్థితి ఎదుర్కొంటున్నాయన్నది నిజం. ఎత్తుగడల పరంగా చూస్తే నేటి ప్రపంచంలో శత్రువు బలగాలు బలంగా వున్నాయి. మన స్వీయాత్మక శక్తులు బలహీనంగా వున్నాయి. ప్రపంచ సామ్రాజ్యవాదం అంతటా విప్లవ శక్తుల మీదను జాతి విముక్తి ఉద్యమాల మీదను, ప్రజా ఉద్యమాల మీదను భారీ దాడిని చేపట్టింది. అయితే ఇది నాణానికి ఒకవైపు మాత్రమే. ఇదే సమయంలో భౌతిక పరిస్థితులు చాలా అనుకూలంగా వున్నాయి. సామ్రాజ్యవాదాన్ని, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ద్వేషిస్తున్నారు. సామ్రాజ్యవాదానికి, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా భారీ ప్రజా ఉద్యమాలు బద్దలవుతున్నాయి. నేటి ప్రపంచంలో ఏ విప్లవమైనా అనివార్యంగా సామ్రాజ్యవాదుల దాడులను ఎదుర్కొంటుంది.

విప్లవ శక్తుల కంటే చాలా పెద్దదైన శత్రువు శక్తిని ఎదుర్కోవడానికి ఎత్తుగడల్లో గొప్ప వెసులుబాటు అవసరం అన్న దానిలో సందేహం లేదు. ముఖ్యంగా మనం చిన్న స్థాయి శక్తిగా వున్నప్పుడు మన లక్ష్యాలను సాధించాలంటే అటువంటి వెసులుబాటును మరింత సమర్థవంతంగా అమలు చేయవచ్చు. అయితే ఇలా చేసేటప్పుడు సాయుధ బలం ద్వారా అధికారం స్వాధీనం చేసుకునే మన వ్యూహాత్మక కర్తవ్యాలను మర్చిపోయే ప్రమాదం ఎల్లప్పుడూ వుంటుంది. సీపీఎన్(ఎం) నాయకత్వ ప్రకటనలు చూస్తే ఆ ప్రమాదం వుందని అర్థమౌతుంది. అనేక ప్రకటనలూ, ఇంటర్వ్యూలూ రాజ్యం, విప్లవం వంటి కొన్ని మౌలిక మార్క్సిస్టు అవగాహనలకు భిన్నంగా వున్నాయి. ఇది దౌత్యపర నేపథ్యంలో చేసినవని అనవచ్చు. కాని దాని అంతిమ ఫలితం విప్లవ, ప్రగతిశీల శిబిరానికి తప్పుడు అవగాహన కల్పించడమే. మార్క్సిస్టు రాజనీతిజ్ఞుడు అనవల్సిన మాట కాదిది.

ఈ ఇంటర్వ్యూలో కామ్రేడ్ ప్రచండ ఎంతవరకు వెళ్లాడో చూద్దాం- ప్రజలు రాజ్యాంగబద్ధ రాచరికాన్ని కోరుకున్నా బహుళ పార్టీ ప్రజాస్వామ్యాన్ని కోరుకున్నా ఆమోదించడానికి మేము సిద్ధంగా వున్నాం. గ్రామీణ ప్రాంతాలలో చాలా వరకు అధికారం వున్న మావోయిస్టు పార్టీ అంతిమంగా ఈ రకమైన రాజకీయ వైఖరులు తీసుకోవడం గొప్ప విషాదం.

**పీమా - బహుళ పార్టీ ప్రజాస్వామ్య పంథా భారతదేశంలో మావోయిస్టు ఉద్యమానికి కూడా వర్తిస్తుందని కామ్రేడ్ ప్రచండ అంటాడు. మీ పార్టీ దీన్ని ఎలా అర్థం చేసుకుంటున్నది?**

**ఆజాద్** - ఈ విషయంలో ఆయన వ్యాఖ్యానాలను ది హిందూకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చూశాం. అందులో ఇలా అన్నారు- ఇది వారికి కూడా వర్తిస్తుందని మేము నమ్ముతున్నాం. ఈ విషయం చర్చించాలనుకుంటున్నాం. వాళ్లు దీన్ని అర్థం చేసుకొని ఈ మార్గంలో ప్రయాణించాలి. నాయకత్వం గురించి బహుళ పార్టీ ప్రజాస్వామ్యం గురించి, లేదా బహుళ పార్టీ పోటీ గురించి భారతదేశంలో విప్లవకారులుగా చెప్పుకుంటున్న వారందరూ ఆలోచించాలని నేను భావిస్తున్నాను. ఈ రకమైన ఆచరణ దిశగా సాగడం అవసరం. ఈ విషయం వారితో చర్చించాలని కోరుకుంటున్నాం. సైద్ధాంతిక అభివృద్ధి అవసరాన్ని గురించి పట్టించుకోకపోతె విప్లవకారులు ముందుకు సాగలేరు.

ఇటువంటి సలహా భారతదేశంలో వివిధ పాలకవర్గ పార్లమెంటరీ పార్టీల నుంచి చాలా కాలంగా ముందుకు వస్తున్నది. రాజ్యాధికారాన్ని సాయుధ పోరాటం ద్వారా సాధించటం అర్థం లేనిదంటూ విప్లవకర సామాజిక మార్పును సాధించడం గురించి మార్క్స్, లెనిన్‌ల మీద ప్రమాణం చేసే రివిజనిస్టు సిపిఐ, సిపిఎంలు తమ పత్రికలూ, డాక్యుమెంట్లూ, ప్రకటనల ద్వారా ఎప్పటికప్పుడు బోధిస్తూనే వున్నారు. పశ్చిమ బెంగాల్, కేరళలో మాదిరిగా ఈ మార్పు సాధించడానికి పార్లమెంటరీ బహుళ పార్టీ ప్రజాస్వామ్యం అత్యుత్తమ సాధనం అని చెప్పడానికి విపరీతంగా ప్రయత్నిస్తారు. ఎంఎల్ఎం పేరుతో సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ బహుళ పార్టీ ప్రజాస్వామ్యాన్ని బోధిస్తుంది. పార్లమెంటరీ పందుల దొడ్డికి కట్టుబడి వుండని వారినందరినీ అరాచకులనీ, దుస్సాహసికులనీ అంటుంది.

నాయకత్వం, బహుళ పార్టీ ప్రజాస్వామ్యాల గురించి వారు భారతదేశ మావోయిస్టులతో చర్చించాలనుకోవడం మంచిది. నాయకత్వం, వ్యక్తిత్వ సాంప్రదాయం, అధికారమంతా ఒక్క వ్యక్తి చేతుల్లో కేంద్రీకృతం కావడం మొదలైన అంశాల గురించి మా రెండు పార్టీల నాయకత్వాల మధ్యనూ ఆసక్తికరమైన చర్చలు జరిగాయి. అభిప్రాయాలూ, అనుభవాలూ ఇచ్చి పుచ్చుకున్నాం. పార్టీ నాయకత్వంలో ఒక గణనీయమైన సెక్షన్ ప్రజలలో కృషి చేయాలనీ అధికారం స్వాధీనం చేసుకున్న తరువాత కూడా, పార్టీ కార్యకర్తలలో వివిధ రాజ్య శాఖల అధికారులలో, ముఖ్యంగా సాయుధ బలగాలు, ఉత్పత్తి రంగం, వివిధ యూనిట్‌లు మొదలయిన వాటిల్లో దిగజారుడును నివారించడానికి వర్గ పోరాటాన్ని నిర్మించడం మీద కేంద్రీకరించాలనీ మేం ఎప్పుడూ భావిస్తూ వచ్చాం. అధికారం స్వాధీనం చేసుకోవడానికి ముందు కూడా విప్లవోద్యమ క్రమంలో పార్టీ, పార్టీ నాయకులూ చేసే తప్పులను విమర్శించడానికి మనం ప్రజలను ప్రోత్సహించాలి. ఒక వ్యక్తిని ఎత్తిపట్టడమో లేదా విప్లవ అధికారానికి ప్రాతినిధ్యాన్ని కల్పించడమో కాకుండా సమిష్టి నాయకత్వాన్ని పెంపొందించాలి. సమిష్టి నాయకత్వాన్ని పెంపొందించకుండా, యావత్తు పార్టీ సభ్యత్వాన్నీ ప్రజలనూ నిర్ణయాలు చేయడంలో భాగం చేయకుండా ఒకరిద్దరు వ్యక్తుల మీద ఆధారపడటం రష్యాలోనూ చైనాలోనూ స్టాలిన్, మావో వంటి అద్వితీయ కార్మికవర్గ నాయకుల అస్తమయం తరువాత సీ.పీ.ఎస్.యూ, సీపీసీ అంత తేలికగా రివిజనిస్టుగా మారి తిరోగమనాలకు దారి తీసింది.

20వ శతాబ్దపు కమ్యూనిస్టు రాజ్యాల గుణపాఠాల నుంచీ - మేం నాయకత్వంలో ఒక నూతన స్థాయికి వెళ్లాలని భావిస్తున్నాం - పార్టీ నాయకులుగానో రాజ్యానికి అధిపతిగానో ఒకే వ్యక్తి కొనసాగరు అన్న కామ్రేడ్ ప్రచండతో మేం ఏకీభవిస్తాం.

నిజానికి, 2004-2005 మధ్య కాలంలో సీ.పీ.ఎన్(ఎం)లో అంతర్గత పోరాటంలో ఇది ఒక ప్రధాన చర్చనీయాంశం. కామ్రేడ్ భట్టారాయ్ (లాల్‌దోజ్) 'అంతర్గత పార్టీ చర్చకు మౌలిక ప్రశ్నలు' అన్న దానిలో ఈ విషయాల గురించిన ప్రశ్నలు లేవనెత్తాడు - కార్మికవర్గ నాయకత్వం సమిష్టితత్వానికి కేంద్రీకృత వ్యక్తీకరణా, లేక వ్యక్తి కేంద్రితమా? గతితర్క ప్రధాన నియమం, అంటే ఒకటి రెండుగా విభజితం అవుతుంది అన్నది ప్రధాన నాయకత్వానికి అన్వయిస్తుందా

లేదా? ఒకే వ్యక్తి, అది కూడా జీవితాంతం, పార్టీలో సైన్యంలో రాజ్యంలో అగ్ర పదవులు చేపట్టే వ్యవస్థ విప్లవ వారసులనూ నిరంతరం విప్లవాన్నీ సృష్టించే సమస్యను, ఎలా పరిష్కరిస్తుంది? మా పార్టీ, భాకపా(మావోయిస్టు) ఈ విషయాల మీదనూ అలాగే ప్రచండా పంథా, ఆలోచనా విధానం, ఇజం అన్న సూత్రీకరణల గురించీ తీవ్రమైన చర్చ చేయాలని భావిస్తున్నది.

**పీమా - కామ్రేడ్ ప్రచండ నేతృత్వంలో ఉన్న సీపీఎన్(ఎం) ప్రతిపాదిస్తున్న 21వ శతాబ్దపు ప్రజాస్వామ్యం అన్న సూత్రీకరణ గురించి మీరు ఏమంటారు?**

**ఆజాద్** - సీ.పీ.ఎన్(ఎం) లేవనెత్తిన 21వ శతాబ్దపు ప్రజాస్వామ్యం సూత్రీకరణలో ఉన్న కొత్తదనం ఏంటి? 21వ శతాబ్దపు ప్రజాస్వామ్యానికీ దీనికీ గుణాత్మక తేడా ఏంటి? బహుళ పార్టీ ప్రజాస్వామ్యం గురించిన నిర్ణయం వ్యూహాత్మకంగా, సైద్ధాంతికంగా అభివృద్ధి చెందిన వైఖరి అని కూడా సీ.పీ.ఎన్(ఎం) చెప్పుకుంటున్నది. ఇది భారతదేశ పరిస్థితులకు కూడా అన్వయిస్తుందంటుంది. బూర్జువా ప్రజాస్వామ్యం, కార్మికవర్గ ప్రజాస్వామ్యాల గురించి మనకు తెలుసు. ప్రజాస్వామ్యానికి కూడా వర్గ స్వభావం ఉంటుంది. వర్గ విభజిత సమాజంలో ప్రజాస్వామ్యం పాలక వర్గాలకు సేవ చేస్తుంది. ఇతర ప్రజల మీద నియంతృత్వం అమలు చేస్తుంది. బూర్జువా రిపబ్లిక్‌లలో ప్రజాస్వామ్యం బూర్జువా స్వభావాన్నికలిగి వుంటుంది. అంటే, విశాల ప్రజానీకాన్ని అణిచివేసి బూర్జువా వర్గానికి సేవ చేస్తుంది. ఇది సారంలో బూర్జువా నియంతృత్వం. అలాగే జనతా ప్రజాస్వామిక రిపబ్లిక్‌లలో ప్రజాస్వామ్యం సమస్త భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక వర్గాల కోసం. ప్రజా శత్రువులూ వారి ఏజెంట్ల మీద నియంతృత్వం అమలవుతుంది. ఈ రెండు రకాల ప్రజాస్వామ్యాలకూ వున్న గుణాత్మక తేడా వాటి వర్గ స్వభావం. వర్గ స్వభావం గురించిన ప్రస్తావన లేకుండా 20, 21వ శతాబ్దాల ప్రజాస్వామ్యంలో గుణాత్మక తేడా ఉందని సీ.పీ.ఎన్(ఎం) అనడం, సమర్థనీయంగా లేకపోవడమే కాక అత్యంత స్వీయాత్మకంగా ఉంది.

21వ శతాబ్దంలో శాస్త్ర, సాంకేతిక, ముఖ్యంగా ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ సాంకేతికతలో ప్రపంచంలో ఎన్నడూ ఎరుగనంతటి అభివృద్ధి జరిగింది అన్నది వాళ్లు చెబుతున్న ఒక కారణం. ఈ ఎన్నడూ లేనంత అభివృద్ధి 21వ శతాబ్దపు విప్లవాల వ్యూహం మీద కానీ 21వ శతాబ్దపు ప్రజాస్వామ్యం స్వభావం మీద కానీ ఎటువంటి ప్రభావం వేస్తుందన్నది స్పష్టంగా లేదు.

సైద్ధాంతిక రంగంలో నేటి ప్రపంచ పరిస్థితి విశ్లేషణ మీదనూ ముఖ్యంగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, కార్మికవర్గ ఉద్యమ నూతన విశ్లేషణల పునాదిగా ప్రపంచ విప్లవ వ్యూహాత్మక చిత్రాన్ని రచించడానికి కేంద్ర కమిటీ ప్రయత్నించింది. నాయకత్వం గురించీ, విప్లవాన్ని పరిపూర్తి చేయడం గురించీ విప్లవ ప్రతీఘాతుకతను నివారించడం గురించీ పూర్తిగా నూతన అవగాహనను అందించడంలోనూ, రాజకీయ రంగంలోనూ విజయవంతం అయింది. 21వ శతాబ్దంలో నెలకొల్పిన రాజకీయ సైనిక వ్యూహం, ఎత్తుగడలకు సంబంధించి గుణాత్మక గెంతు వేసింది.

వాళ్ల బహుళ పార్టీ ప్రజాస్వామ్యం, రాజకీయ పోటీ తప్ప సీ.పీ.ఎన్(ఎం) చెబుతున్న ఈ నూతన అవగాహన, గుణాత్మక గెంతు ఏంటన్నది మాకింకా స్పష్టం కాలేదు. ఇవి చివరకు మారుతున్న బహుళ పార్టీ ప్రజాస్వామిక రిపబ్లిక్‌గా చెబుతున్న దానిలో అధికారం కోసం వివిధ ప్రతీఘాతుక, రివిజనిస్టు పార్టీలతో పోటీ పడడం తప్ప మరేమీ కాదు.

**పీమా - చివరిగా, నేపాల్ విప్లవం ఎటు వైపు దారి తీస్తున్నదని భావిస్తున్నారు?**

**ఆజాద్** - పీ.ఎల్.ఏ ఇంకా ఆయుధాలనూ అప్రమత్తతనూ నిలబెట్టుకుంటున్నదని నివేదికలలో చూస్తున్నాం. అలాగే ఇటీవలి వెల్లువ ఫిబ్రవరి విప్లవంగానూ అక్టోబరు విప్లవానికి సన్నాహాలు జరుగుతున్నాయని అంటున్నారు. విప్లవంలోకి నూతన శక్తులను గెలుచుకోవడం కోసం పట్టణ ప్రాంతాలతో సహా భారీ ప్రజా సమీకరణలు జరుగుతున్నట్టు వింటున్నాం. అలాగే అమెరికా సామ్రాజ్యవాదులూ భారత విస్తరణవాదులూ (వారి చెంచా ఏచూరి) మావోయిస్టులు ఆయుధాలు విడిచిపెట్టాలన్న ముందు షరతు పెట్టి పొత్తును ధ్వంసం చేయడానికి బహిరంగంగా ప్రయత్నిస్తున్నారు. అంతేకాక, తాము ఆయుధాలు విడిచిపెట్టం అనీ తమ శిబిరాలు కొనసాగిస్తామనీ మావోయిస్టులు ప్రకటించారు. నూతన ప్రజాస్వామిక విప్లవం వైపుగా పురోగమించడానికి మావోయిస్టులకు వున్న సంసిద్ధతకు ఇవన్నీ అనుకూల ధోరణులు. రెండు పరిస్థితుల గురించి అప్రమత్తంగా వుండాలి - పాలకవర్గాలు, వారి సామ్రాజ్యవాద, విస్తరణవాద యజమానులు వేసే వలలో పడకుండా వుండటం. రెండోది, గ్రీస్, ఇండోనేషియా, చిలీ మొదలయిన అనేక దేశాలలో మాదిరిగా హఠాత్తు తిరుగుబాటు, కమ్యూనిస్టుల ఊచకోత జరుగుతుందన్న అప్రమత్తత కలిగి వుండడం. ఈ దేశాలలో భారీ ప్రజా పునాది కూడా ఈ ఊచకోతలను ఆపలేదు. అయితే సీ.పీ.ఎన్(ఎం),

పార్టీని ముందుకు తీసుకెళుతుందనీ దేశవ్యాప్తంగా అధికారాన్ని స్వాధీనం చేసుకోవడం కోసం విప్లవాన్ని పురోగమింపజేస్తుందనీ ఆశిస్తాం.

**పీమా - ఆఖరుగా ఒక్క ప్రశ్న. నేపాల్, భారతదేశం, ప్రపంచంలో ఇతర ప్రాంతాలలో విప్లవ శ్రేణులకు మీరు ఇచ్చే సందేశం ఏంటి?**

**ఆజాద్** - మొదటగా తమ ఇటీవలి వైఖరులను గురించి మరోసారి ఆలోచించమని సీ.పీ.ఎన్(ఎం)నూ దాని నాయకత్వాన్నీ గట్టిగా కోరుతున్నాం. నేపాల్ పార్టీకీ, ప్రజలకూ గొప్ప పోరాట, త్యాగాల చరిత్ర వుంది. ప్రస్తుత ప్రజాయుద్ధ క్రమంలో దాదాపు పది వేల మంది తమ ప్రాణాలు అర్పించారు. నేపాల్, ప్రపంచ విప్లవాల్లో అమరులయిన వీరులకు జోహార్లు చెబుతున్నాం. ఉద్యమంలో అనేక మలుపులూ మెలికలూ ఎదుర్కొంటూ గొప్ప నేపాల్ ప్రజలు విప్లవాన్ని ముందుకు తీసుకువెళతారన్న విశ్వాసం మాకు వుంది. విప్లవం చిన్న విషయం కాదు. మార్గం వంకర టింకరగా వుంటుంది.

నేపాల్ విప్లవానికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని భారత ప్రజలకు మేం పిలుపునిస్తున్నాం. అయితే ఇందులో భాగంగా నేపాల్ కామ్రేడ్స్‌కు స్నేహపూర్వక సలహాలు ఇవ్వడం కూడా భారత, ప్రపంచ కార్మికవర్గం విధి. నేపాల్ విప్లవ ప్రయోజనాలు ప్రపంచ విప్లవ ప్రయోజనాలతో, ముఖ్యంగా పొరుగున ఉన్న భారత విప్లవంతో ఎంతగానో ముడిపడి వున్నాయి. నేపాల్ విప్లవానికి మద్దతుగా ఎటువంటి త్యాగానికైనా భారత విప్లవ ప్రజానీకం సిద్ధంగా వున్నారు. ఈ భరించరాని ప్రపంచ సామ్రాజ్యవాద వ్యవస్థకూ దాని స్థానిక అర్ధ భూస్వామ్య పునాదికీ వ్యతిరేకంగా మేం కలిసి ముందుకు సాగుతామని విశ్వసిస్తున్నాం.

**పీమా - పొరుగు దేశంలో ఇంత కీలక అంశం గురించి ఇంటర్వ్యూ ఇచ్చినందుకు పీపుల్స్‌మార్చ్ తరపున మీకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.**

**ఆజాద్** - కృతజ్ఞతలు

---

*( .....55వ పేజీ తరువాయి)*

ప్రజలకు అందులోనూ ఆదివాసీ ప్రజానీకానికి ఎటువంటి స్వాతంత్రం రాలేదన్నారు. అడవుల్నీ, కొండల్ని నమ్ముకొని కాయకష్టం చేసి ఈ దేశంలో వందల ఏండ్ల నుంచి జీవన యాత్ర సాగిస్తున్నది ఆదివాసులేననీ, ఇతరేతర రాజకీయ పార్టీలకన్నా, నాయకులకన్నా ఎక్కువగా ప్రాణాలకు తెగించి తెల్లవాళ్ళతో పోరాడింది ఆదివాసులేననీ, 200 ఏండ్ల తెల్లవాడి ఏలుబడిలో ఆదివాసీలు నూరు తిరుగుబాట్లు చేశారనీ, ఈ ధాటికి తట్టుకోలేకే తెల్లవాడు పారిపోయాడన్నారు.

ఈ చారిత్రక వాస్తవాన్ని మరుగున పరిచి నేటి పాలకులు ఆదివాసీలను అటవీ ఆక్రమణ దారులుగా చిత్రీకరిస్తూ ఆదివాసుల నుండి వారి భూమినీ, ఇతర సాంప్రదాయక జీవనాధారాల్ని లాగేసుకుంటున్నారనీ, దీనికి వ్యతిరేకంగా అడవిపై హక్కుకోసం, అధికారం కోసం, స్వేచ్ఛాయుత సమాజం కోసం పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

తదనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించి ప్రభుత్వానికీ, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సామ్రాజ్యవాదులా, దళారీ పెట్టుబడిదారుల దిష్టిబొమ్మలను ఉరితీసి తగులబెట్టారు.

ఇదే డివిజన్‌లోని పలకజీడి ఏరియాలో రెండు చోట్ల బూటకపు స్వాతంత్రపు దినాన్ని నిరసిస్తూ జె.ఎన్.ఎం సభలు నిర్వహించింది. నల్లజెండాలు ఎగురవేసి పలువురు సంఘ నాయకులు స్వాతంత్రంలోని బూటకత్వాన్ని వివరించారు. దశాబ్దాలైనా పీడిత ప్రజల బతుకుల్లో ఏ అభివృద్ధి లేకుండా నిరంతరం ఆకలి బతుకులతో జీవించే నేటి ప్రజల దీనావస్థకు కారణం ఈ దోపిడీ వర్గాలేననీ, నిజమైన ప్రజల స్వాతంత్ర్యం కోసం వర్గపోరాటమే ఏకైక మార్గమని పిలుపునిచ్చారు. ఈ సభకు 300 మంది ప్రజలు హాజరయ్యారు. దోపిడీ స్వాతంత్ర్యాన్ని వివరిస్తూ జె.ఎన్.ఎం సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చింది. ❍

## సెప్టెంబర్ 21 పార్టీ 3వ స్థాపన దినోత్సవాన్ని విజయవంతం చేయండి!

## సి.పి.ఐ(మావోయిస్టు) వర్ధిల్లాలి!

# పార్లమెంటరీ వ్యవస్థపై భ్రమలను నిలబెట్టలేని పంచాయితీ ఎన్నికలు

ఇవేమన్నా పార్లమెంట్ ఎన్నికలా? అసెంబ్లీ ఎన్నికలా? పంచాయితీరాజ్ ఎన్నికలే కదా అని ఎవరన్నా తేలిగ్గా అనుకుని వుంటే జూన్, జూలై నెలల్లో జరిగిన పంచాయితీరాజ్ (జిల్లా పరిషత్, మండల ప్రజా పరిషత్) ఎన్నికల్లో, నోటిఫికేషన్ నుండి 'విజేతల' ప్రమాణ స్వీకారం వరకూ జరిగిన ప్రతి తంతూ వారి 'కళ్లు తెరిపించి' వుంటుంది. ఈ ఎన్నికలను ప్రతి రాజకీయ పార్టీ ఎంత 'ప్రతిష్ఠాత్మకంగా' తీసుకుందో, చిన్న విజయం కోసం కూడా ఎంత అథమంగా దిగజారిందో చాలా స్పష్టంగా అర్థమయిందీసారి.

## వివాదస్పదమైన ప్రారంభమూ ముగింపు

ఈ ఎన్నికల్లో అడుగడుగునా అనేక చిన్నా, చితకా వివాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. అయితే ప్రారంభమూ ముగింపూ మాత్రం అత్యంత వివాదాలుగా మిగిలిపోయాయి. ఓటర్ల జాబితాలో తె.దే.పా.కు చెందిన లక్షల ఓటర్ల పేర్లను తొలగించారనే ఆరోపణతో వివాదం మొదలైంది. ఓటర్ల జాబితాను సవరించకుండా ఎన్నికలు జరుపరాదంటూ తె.దే.పా వారు కోర్టుకెక్కారు. ఓటర్ల జాబితాను రూపొందించడంలో విఫలమయిందని ఎన్నికల సంఘాన్నీ, ఎన్నికల సంఘం విధుల్ని హైజాక్ చేసిందని రాష్ట్ర ప్రభుత్వాన్ని చివాట్లు పెడుతూ ఎన్నికలను తాత్కాలికంగా నిలిపివేయాలని హైకోర్టు ఆదేశించింది. అయితే అప్పటికే ఎన్నికల నిర్వహణా క్రమం మొదలైందనీ, మధ్యలో ఎన్నికలు ఆపడంవల్ల అప్పటికి పెట్టిన కోట్ల రూపాయల ఖర్చు వృధా అవుతుందనీ, రాష్ట్ర ప్రభుత్వం వాదించడంతో తిరిగి హైకోర్ట్ ఎన్నికలకు అనుమతినిచ్చింది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి ఇదొక నైతిక ఓటమిగానే మిగిలిపోయింది. తర్వాత అభ్యర్థుల ఎన్నిక, నామినేషన్ వేయడం, ఎన్నికల ప్రచారం, పోలింగ్... ఈ క్రమమంతా చిన్న చిన్న వివాదాలు చోటుచేసుకున్నాయి. అయితే తె.దే.పాకు స్పష్టమైన మెజారిటీ వచ్చిన అనంతపూర్ జిల్లా పరిషత్‌ను కాంగ్రెస్ దొంగచాటుగా కొట్టేయడంలో అత్యంత వివాదస్పదంగా ఈ ఎన్నికల పర్వం ముగిసింది.

## పొత్తుల కోసం వెంపర్లాట

ఏ పొత్తులూ లేకుండా ఏ స్థాయిలో నయినా పోటీ చేసే స్థితి ఏ రాజకీయ పార్టీకీ లేదనేది ఎప్పుడో స్పష్టమైన విషయమే. అయితే పొత్తుల కోసం అన్ని రాజకీయ పార్టీలు ఎంత దిగజారుడుకైనా సిద్ధపడిన వైనం బహుశా ఈ ఎన్నికల్లో చాలా స్పష్టంగా అర్థమైంది. ముందుగా కాంగ్రెస్ పార్టీతో మొదలు పెట్టుకుంటే....అది అసెంబ్లీ ఎన్నికల్లోనూ, మున్సిపల్ ఎన్నికల్లోనూ అధిక మెజారిటీతో (పొత్తులతోనే సుమా!) గెలిచింది. దానికి ఏ పార్టీ మద్దతు అవసరం లేనంత మెజారిటీ వుంది. అయినప్పటికీ ఈ ఎన్నికల్లో పొత్తులకోసం అది ఎంతగానో వెంపర్లాడింది. మొదట మిత్రపక్షాలైన సి.పి.ఐ, సి.పి.ఎం, టి.ఆర్.ఎస్.లను అది చిన్న చూపు చూసింది. చిన్న పార్టీలు కనుక అవే దిగివస్తాయని భావించింది. ఆ ధీమాతోనే రెండు జిల్లా పరిషత్ (జడ్.పి)లను అడిగిన సి.పి.ఎంను ఎద్దేవా చేసింది. అయితే సి.పి.ఎం., తెదేపాతో చేతులు కలిపే సూచనలు కనబడేప్పటికి కాంగ్రెస్‌కు మతిపోయింది.(ఎంతయినా అది వామపక్షాల రాజ'నీతి'ని తక్కువ అంచనా వేసింది). దానితో తన బింకాన్ని వదిలి దాదాపు కాళ్ల బేరానికి వచ్చింది. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేశవరావు, సి.పి.ఎం నేతలైనన ప్రకాశ్‌కరత్, సీతారాం ఏచూరిల చుట్టూ ప్రదక్షిణాలు చేసి లెంపలేసుకొని తమతో పొత్తు వీడొద్దని మొక్కుకున్నాడు. సి.పి.ఎం, తెదెపాల పొత్తు చూసి భయపడ్డానికి దానికి కొన్ని కారణాలున్నాయి. ఒకటి, రాష్ట్రంలో ఆ రెండు పార్టీలూ చేతులు కలుపుతే భవిష్యత్తులో తనకు ఇక్కట్లు తప్పవని దానికి తెల్సు. ఇకపోతే ప్రస్తుతం కేంద్రంలో యు.పి.ఎ. సర్కార్ నిలబడ్డానికి సి.పి.ఎం. మద్దతు కీలకమైనది. అందుకే సోనియా సహితం ఆందోళన పడి పొత్తు వీడొద్దని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి కబురు చేసింది. వీటితో పాటు మరో బలమైన కారణం ఏంటంటే, రెండేళ్లుగా నిరంకుశ పాలనను ప్రజలపై రుద్దుతున్న కాంగ్రెస్‌కు ఓటమి భయం మొదలైంది. అందుకే సిపిఎంను తన వైపు నిలబెట్టుకోవాలని తీవ్రంగా ప్రయత్నించింది. అయినా ఫలితం లేకపోయింది. అయితే ఈ అనుభవంతో ఆ తర్వాత అది సి.పి.ఐ,

టిఆర్ఎస్‌లతో పట్టువిడుపులతో వ్యవహరించి వాటిని తనవైపు నిలబెట్టుకుంది.

అసెంబ్లీ, మున్సిపల్ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన తెదేపా ఈ ఎన్నికల్లో శాయశక్తులను ఒడ్డి తన స్థితిని మెరుగుపరుచుకోవానుకోవడం విశేషం కాదు. దాంట్లో భాగంగా తాను గతంలో అభివృద్ధి నిరోధకులంటూ తిట్టిపోసి, ఈసడించిన సి.పి.ఎంను ప్రసన్నం చేస్కోవడంలో సఫలమయింది. సి.పి.ఎం. నేతల చుట్టే చంద్రబాబు తిరిగి వాళ్లడిగిన జడ్.పి లను ఇస్తామని చెప్పి పొత్తు కుదుర్చుకున్నాడు.

మొత్తం ఈ పొత్తుల ప్రక్రియలో కొంచెం విశేషంగా చెప్పుకోవాల్సింది, సి.పి.ఎం అవకాశవాద దిగజారుడుతనాన్ని. అవకాశవాదమని ఎవరో అనడం కాదు. సి.పి.ఎం నేత, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి కూడా అయిన బుద్దదేవ్ భట్టాచార్యనే అన్నాడు. సి.పి.ఎం, తె.దే.పాలు చేతులు కలుపబోతున్నాయనే ఊహాగానాలు బయలుదేరినప్పుడు వై.ఎస్, బుద్ధదేవ్ దగ్గర ఈ విషయం ప్రస్తావిస్తే 'మేం తె.దే.పాతో పొత్తు పెట్టుకునేంత అవకాశవాదులం కాదు అన్నాడు అతను. అలా అన్న మూడు రోజులకే పొత్తు కుదిరిందన్న ప్రకటన వచ్చింది. కేంద్రంలో యు.పి.ఎ.కు బలమైన మద్దతుదారుగా ఉన్న సి.పి.ఎం రాష్ట్రంలో, యు.పి.ఎ.కు వ్యతిరేకమైన తె.దే.పాతో చేతులు కలిపి పలువురు రాజకీయ విశ్లేషకులను సహితం విస్మయపరిచింది. యు.పి.ఎ.తో రాజకీయంగానో, విధానపరంగానో విభేదించి అది టి.డి.పితో చేతులు కలపలేదు. ఇటీవల అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో పెరిగిన తన 'బలాన్ని' చూసుకుని అది నల్లగొండ, ఖమ్మం జడ్.పి లను అడిగింది. బలాన్ని మించి అడుగుతున్నారని కాంగ్రెస్ అందుకు తిరస్కరించింది. దాంతో ఆ సీట్లను ఇవ్వచూపిన టిడిపితో చేతులు కలిపింది. కేంద్రంలో కాంగ్రెస్, రాష్ట్రంలో దాని ప్రత్యర్థి అయిన టిడిపితో పొత్తు కుదుర్చుకున్నందుకే ప్రజలు ఆశ్చర్యపోతుంటే సి.పి.ఎం. మరో 'ముందడుగు' వేయదల్చుకుంది. రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో కాంగీతో, కొన్ని జిల్లాల్లో టిడిపితో పొత్తు పెట్టుకోవడానికి సిద్ధపడింది. అయితే కాంగీ సిద్ధపడకపోవడంతో ఈ విచిత్ర పొత్తు సాధ్యం కాలేదు. ఖమ్మం జడ్.పి ని పొందడానికి టిడిపితో కల్సి పోటీ చేసి, ఎన్నికలు ముగియగానే ఇక పొత్తు ముగిసిందనీ, ఇప్పుడు గద్దెనెక్కడానికి కావాలంటే కాంగీ మద్దతయినా తీసుకుంటామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవులు ప్రకటించాడు. ఖమ్మం జిల్లా పార్టీ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకించడంతో రాఘవులు ఈ ఆలోచనను మానుకున్నాడు. ఏ గడ్డి కరిచయినా అధికారాన్ని చేపట్టడం అనే వెంపర్లాట తప్ప ఏ నీతి, ఏ నియమం మచ్చుకయినా కానరాలేదు సి.పి.ఎం కుదుర్చుకున్న పొత్తులో.

సి.పి.ఐ. మాత్రం కాంగీ మైత్రిని వీడలేదు. నల్లగొండ జడ్.పిని అడిగినప్పటికీ, ఇవ్వకపోయినా సర్దుకుంటాం అని వినయంగా చెప్పింది. ఈ వినయానికి కారణం దానికి ఆ మాత్రం కూడా డిమాండ్ చేసే శక్తి లేకపోవడమే. అది కాంగ్రెస్‌కు ఎంత నమ్మిన బంటువలె వ్యవహరించిందంటే, కాంగ్రెస్‌పై తె.దే.పా చేసిన ఆరోపణలను కాంగీ తరుపున వకాల్తా పుచ్చుకుని తిప్పికొట్టింది. మొత్తంగా అది వ్యక్తిత్వాన్ని కోల్పోయి కాంగ్రెస్‌కు తోకగా మారింది.

టి.ఆర్.ఎస్ పరిస్థితి కూడా దయనీయమైనదే. ఒకవైపు ప్రత్యేక తెలంగాణా సాధనే పరమావధిగా చెప్పుకుంటూ మరోవైపు ప్రత్యేక తెలంగాణా ఏర్పాటును వ్యతిరేకిస్తోన్న వై.ఎస్ పార్టీతో పొత్తు పెట్టుకోవాల్సిన దుస్థితిలో అది వుంది. మున్సిపల్ ఎన్నికల నాటికే బలహీనపడిన దాని శక్తి దానికి స్పష్టంగా తెల్సు. అంతేగాక అంతర్గతంగా అనేక లుకలుకలతో కొనసాగుతున్న ఆ పార్టీకి స్వతంత్ర పార్టీగా మనగలిగే శక్తి ఎంత మాత్రమూ లేదు. అందుకే ఉప పార్టీల వల్ల రాష్ట్రానికి నష్టం వాటిల్లుతున్నదని వై.ఎస్. తిట్టిపోసినా, మూడు జడ్.పిలను అడిగినందుకు ఎద్దేవా చేసినా అది కాంగీతో పొత్తును వీడలేదు.

రాష్ట్రంలో కనీస ఉనికి సమస్యను ఎదుర్కొంటున్న భా.జా.పా. గురించి చెప్పుకోవాల్సింది ఏమయినా ఉందంటే పొత్తు కోసం పాపం అది కూడా చేసిన విఫలప్రయత్నం గురించి మాత్రమే. తనతో చేతులు కల్పి తే.దే.పా ఎలాగూ లెంపలేసుకుంది కనుక, ఈసారి అది తె.రా.సపై కొంచెం ఆశలు పెట్టుకుంది. కాంగీతో బంధం తెంచుకుని వస్తే తె.రా.సతో చేతులు కలుపొచ్చని ఆశించి భంగపడింది. పొత్తు కలవడానికి సిద్ధపడీ, కుదరకపోయేప్పటికి తె.రా.స పై దుమ్మెత్తి పోసింది.

ఇక నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారానే ప్రజా రాజ్యాధికారం సాధ్యమని ఒకవైపు చెప్తూ మరోవైపు ఎన్నికలలో పాల్గొంటున్న న్యూడెమోక్రసీ పార్టీ కూడా పొత్తుల వ్యవహారంలో తక్కువేం తిన్లేదు. అది కాంగ్రెస్ కూటమితో పోటీ దశలోనే ఒక అవగాహనకు వచ్చింది. కొన్ని జడ్.పి.టి.సి స్థానాల్లో ఒకరికొకరు మద్దతు నిచ్చుకునేలా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఎన్నికలను ఎత్తుగడగా వుపయోగించుకుంటున్నానని ఎన్.డి పార్టీ సమర్థించుకుంటుంది. అయితే ఒకటో రెండో జడ్.పి.టి.సి. కుర్చీలను గెలుచుకోవడానికి అధికార పార్టీతోనే చేతులు కలపడాన్ని చూస్తే ఏం చేసయినా, ఎంతకు దిగజారైనా అధికారాన్ని పొందాలని చూసే బూర్జువా పార్టీలకూ ఎన్.డి పార్టీకి తేడా ఏమీ లేదని అర్థం అవుతుంది.

## అవినీతి, ప్రలోభాలూ, దౌర్జన్యాలు

ఈ ఎన్నికల్లో అన్ని పార్టీలు అధికారం కోసం, పదవుల కోసం, అడ్డదార్లు తొక్కినప్పటికీ, అధికార పార్టీగా కాంగ్రెస్ పాల్పడిన అవినీతి, దౌర్జన్యాలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి. ముందే చెప్పుకున్నట్టు గత రెండున్నరేండ్ల ప్రజా వ్యతిరేక పాలన ఫలితం ఎలా వుంటుందోనన్న భయం దానిలో మొదలవడం వల్ల అది విజయం కోసం తొక్కని అవినీతి మార్గం లేదు. ఎన్నికల సమయంలో ప్రత్యక్ష ప్రచారానికి దూరంగా ఉన్నాడు వై.యస్. అలా దూరంగా వుంటూ తానేమీ గెలుపు కోసం పెద్దగా కష్టపడనవసరం లేదన్నట్టూ, తన రెండున్నరేండ్ల పాలనే తనకు విజయాలు తెచ్చిపెడ్తుందన్నట్టూ నటించాడు. కానీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందు ఒక నెల రోజులు రాష్ట్రమంతా అతను సుడిగాలిలా పర్యటించాడు. ఆ పర్యటనల్లో ప్రజల మీద వాగ్దానాల వాన కురిపించాడు. ఎన్నో ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశాడు. మొత్తంగా 26 వేల కోట్ల విలువైన పథకాలూ, ప్రాజెక్టులూ ఈ వాగ్దానాల్లో వున్నాయి. అట్లా ప్రజలను ప్రలోభాల్లో ముంచెత్తే ప్రయత్నం చేశాడు. ఇక ఎన్నికల సమయంలోనూ తానేమీ పట్టించుకోవడం లేదన్నట్టు నటిస్తూ తెర వెనుక సర్వశక్తులనూ ఒడ్డి అంతా తానే అయి నడిపించాడు.

నామినేషన్ ఘట్టంలోనూ అనేక అవకతవకలు చోటు చేసుకున్నాయి. పెద్ద పెద్ద నాయకులు తమ బంధువులనూ, ఆశ్రితులనూ అందలం ఎక్కించడం కోసం వారికి లేని అర్హతలను సృష్టించాడు. ఎస్.సిలను, బి.సిలను, ఎస్.టిలుగా పట్టణవాసులను పల్లెవాసులుగా మార్చిన సంఘటనలు బాగా చోటు చేసుకున్నాయి. గడువు దాటిన తర్వాత నామినేషన్లు స్వీకరించిన సంఘటనలూ జరిగాయి. డబ్బూ, సారాల ప్రవాహాలు ఈసారి వచ్చిన వరదలతో పోటీ పడ్డాయి. మన రాష్ట్రంలోని మద్యం చాలక పొరుగు రాష్ట్రాల నుంచి మద్యాన్ని దిగుమతి చేసుకున్నారు. ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని చేతిలో పెట్టుకొని ఓటర్లను భయభ్రాంతులను చేసింది. కాంగ్రెస్‌కు ఓటెయ్యకపోతే కాల్చేస్తానని ఖమ్మం జిల్లా టేకులపల్లి ఎస్.ఐ. ఆదివాసీ మహిళల్ని బెదిరించాడు. ఇక రిగ్గింగ్ ఎప్పటిలాగే నడిచింది. పోలింగ్ బూతుల గోడలను కూలగొట్టి మరీ రిగ్గింగ్‌కు పాల్పడ్డారు కాంగ్రెస్ వాళ్లు. నరసరావు పేట మండలం ఇంకూరు పోలింగ్ కేంద్రానికి బ్యాలెట్ పేపర్లు కాంగీ గుర్తుకు వేసిన ఓట్లతోనే వచ్చాయంటే రిగ్గింగ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. తన గూండాయిజంతో తె.దే.పాకు అనేక పోలింగ్ కేంద్రాలలో ఏజెంట్లను చేయగల్గింది. ఎలెక్షన్ కమిషన్‌ను కూడా తన చెప్పు చేతల్లో పెట్టుకొని తన అవినీతి, అక్రమాలను కనీసం ప్రశ్నించే వాళ్లను లేకుండా చేసుకుంది.

ఈ అవినీతి ఎన్నికలు ముగియడంతోనే ముగిసిపోలేదు. ఎన్నికల ముగిసి, ఫలితాలు వచ్చిన తర్వాత కూడా కొనసాగింది. పాలకవర్గ పార్టీలు ఎంతగా అవినీతిలో కూరుకుపోయాయో ఈసారి ఫలితాల తర్వాతి పరిణామాలను చూస్తే అర్థమవుతోంది. ఈ ఎన్నికల్లో అదిలాబాద్, అనంతపూర్, రంగారెడ్డి జిల్లాల్లో తె.దే.పాకు స్పష్టమైన మెజారిటీ వచ్చింది. కానీ ఈ మూడు జడ్.పిలలో అధికారం తమదేనని తె.దే.పా ధీమాగా ఉండలేకపోయింది. కాంగీ తమ జడ్.పి.టి.సి సభ్యులను కొనేసి తమ నోటి దాకా వచ్చిన కూడును కొల్లగొడ్తుందనే భయంతో అది చేసిన కసరత్తు అంతాయింతా కాదు. ఈ మూడు జిల్లాల్లో జడ్.పి.టి.సి సభ్యులను హైదరాబాద్‌కు తీస్కెళ్లి, ఎన్.టి.ఆర్ భవన్‌లో దాదాపు బంధించినంత పని చేసింది. వారి దగ్గర వున్న సెల్ ఫోన్లను లాక్కుంది. వారికి ఎం.ఎల్.ఎ.లను కాపలా పెట్టింది.

ఈ అభద్రత ఒక్క టి.డి.పిదే కాదు, వరంగల్, కరీంనగర్‌లలో బొటాబొటీ సీట్లతో గెల్చిన కాంగీ తన జడ్.పి.టి.సి సభ్యులను కూడా ఇటువంటి క్యాంపులకు తరలించింది. ఖమ్మం జిల్లాలో రెండు కూటములకు సమాన సీట్లు వచ్చినందున ఆ జిల్లా జడ్.పి.టి.సిలను రక్షించుకునేందుకు రెండు పార్టీలు కసరత్తులు చేశాయి. జడ్.పి.టి.సిలనే కాదు ఎం.పి.టి.సి సభ్యులను కూడా ప్రలోభాల నుండి కాపాడుకోవడానికి ఇలాగే రెండు పార్టీలు కష్టపడ్డాయి.

అయితే ఇలా బంధించినప్పటికీ అనంతపూర్ జిల్లాలోని ఇద్దరు జడ్.పి.టి.సి సభ్యులను కాంగ్రెస్ కొనేసింది. ఎన్నో ఏళ్లుగా పార్టీలో పనిచేస్తూ నాయకత్వానికి నమ్మకస్తుడైన శ్రీకాంత్‌రెడ్డి ఒక జడ్.పి.టి.సి. సభ్యుడి దగ్గర ఉన్న సెల్‌ఫోన్‌ను మాత్రం లాక్కోకుండా వదిలేసింది తె.దే.పా. ఆ ఒక్క అవకాశాన్ని వినియోగించుకుని అతన్నీ, అతని ద్వారా మరో సభ్యుడిని కొనేసింది కాంగ్రెస్. వీళ్లిద్దరికీ చెరో కోటి రూపాయలు ఇచ్చారని పత్రికలు బాహాటంగానే రాశాయి. అంటే ఈ జిల్లాలో ప్రజలు తనను తిరస్కరించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ డబ్బులు గుమ్మరించి అధికారాన్ని కొనుక్కోగలిగింది. డబ్బుకూ, అధికారానికి ఉన్న లంకె ఎంత బలమైందో దీని ద్వారా అర్థమవుతుంది.

ఈ ఎన్నికల ఫలితాలేమీ రాష్ట్రంలోని ప్రస్తుత అధికారాన్ని ప్రభావితం చేసేవి కావు. 22 జడ్.పిలకు ఎన్నికలు జరుగుతే

అందులో 18 జడ్.పిలను కాంగ్రె కూటమి గెలుచుకుంది. అయినప్పటికీ మిగతా నాలుగు జడ్.పిలనూ, జడ్.పి.టి.సిలను కొనడం ద్వారా కైవసం చేసుకోవాలని చూసింది. (ఖమ్మంలో రెండు సీట్లను గెలుచుకున్న న్యూడెమోక్రసీ పార్టీ సభ్యులను కూడా కోట్ల రూపాయలతో కొనడానికి రెండు పార్టీలూ పోటీ పడ్డాయి.) అనంతపూర్‌ను కైవసం చేసుకోవడంలో సఫలమైంది. ఇక్కడ ఖమ్మం జడ్.పి గురించి ఒక్కమాట చెప్పుకోవాలి. ఖమ్మం జడ్.పిలో కాంగ్రెస్, టి.డి.పి కూటములకు చెరిసమానమైన సీట్లు వచ్చాయి. మరో రెండు సీట్లు ఎన్.డి పార్టీకి వచ్చాయి. కనుక ఎన్.డి పార్టీ మద్దతు కోసం రెండు పార్టీలూ పోటీ పడ్డాయి. ఆ పార్టీకి కోటి రూపాయలు ఇవ్వడానికి సిద్ధపడ్డాయి. అయితే ఎన్.డి పార్టీ ఎవరికీ మద్దతునివ్వననీ తటస్థంగా ఉంటానని ప్రకటించింది. పోస్లే ఎన్నికల తర్వాత అన్ని పార్టీలు అవినీతికి పాల్పడ్డా, ప్రలోభాలు పెట్టినా, ప్రలోభాలకు గురైనా ఎన్.డి పార్టీ మాత్రం ఏ ప్రలోభాలకూ గురికాకుండా నిజాయితీగా ఉంది అని అనుకోవడానికి లేదిక్కడ. ఎందుకంటే కోటి రూపాయలు ఇవ్వజూపిన కాంగ్రెస్‌తో అది కోటి రూపాయలతో పాటు ఇల్లెందు, బయ్యారం, గుండాల మండలాధ్యక్ష పదవులను కూడా డిమాండ్ చేసింది. ఇల్లెందు, బయ్యారంలను వదులుకోవడానికి టి.ఆర్.ఎస్ ఒప్పుకోక పోవడంతో ఎన్.డి పార్టీకి 'సిద్ధాంత నిబద్ధత' గుర్తుకొచ్చి తటస్థవైఖరి తీసుకుంది. జడ్.పి.టి.సిలనే కాదు ఎం.పి.పిలను కైవసం చేసుకోవడానికి ఎం.పి.టి.సిలను కూడా కొనడానికి అన్ని పార్టీలూ ప్రయత్నించాయి. ఎం.పి.టి.సి సభ్యుల ధర 10 లక్షల పైనే. ఇన్ని లక్షల కోట్ల డబ్బులు గుమ్మరించి అధికారంలోకి రావాలని పోటీపడుతున్న వారు అంతకంటే ఎన్ని రెట్ల డబ్బు సంపాదించుకోవడానికి ఈ పదవుల్ని వాడుకుంటారో ఊహించుకోవడం కష్టం కాదు.

అధికారాన్ని చేజిక్కించుకోవడానికి ఇంకెన్ని రకాల అడ్డదారులు తొక్కగలరో మండలాధ్యక్షుల ఎన్నిక విషయం చూస్తే అర్థమవుతుంది. ఎం.పి.టి.సి సభ్యుల ఎన్నికల వరకు కూటములుగా ఎన్నికల బరిలో నిలిచిన పార్టీలు, ఆ తర్వాతత ఎం.పి.పి పీఠాలను చేజిక్కించుకోవడానికి ఎటువంటి కూటమి నీతికీ లోబడి వుండలేదు. అదిలాబాద్ జిల్లా బోద్ మండలాన్ని తె.రా.స మద్దతుతో తెదే సొంతం చేసుకుంది. దండేపల్లి మండలాన్ని తె.దే.పాలోని ఒక వర్గం కాంగ్రె మద్దతుతో గెలుచుకుంది. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలాన్ని సి.పి.ఐ కాంగ్రెస్‌కు మద్దతునివ్వకుండా తెదేపాతో పొత్తుకుదుర్చుకొని అధికారాన్ని పొందింది. అధికారమే పరమావధిగా పెట్టుకున్న వారు మంచో చెడో ఒకే కూటమికి లోబడి వుండాలనుకోవడం ఎంతైనా అత్యాశే అవుతుంది.

### కాంగ్రెస్ పతనం ప్రారంభం

తె.దే.పాకు ఒక్క సీటు రాదని సవాల్ విసిరి, అలా రాకుండా వుండడం కోసం ఇంత భారీ అవినీతికి పాల్పడినప్పటికీ కాంగ్రెలో ఓటమి ఛాయలు ఈ ఎన్నికల్లో స్పష్టమైంది. మొత్తం జడ్.పి.టి.సి సీట్లలో కాంగ్రెస్ 61 శాతం గెల్చుకుంటే తె.దే.పా 31 శాతం గెలుచుకుంది. అయితే సీట్ల తేడాలు కాకుండా ఓట్ల తేడాలు చూసుకుంటే తె.దే.పా కంటే కాంగ్రె ఆరున్నర శాతం ఓట్లను మాత్రమే అధికంగా పొందగల్గింది. ఈ ఫలితాలు కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలన ప్రభావాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి.

### ఈ ఎన్నికలు సైతం దోపిడీ వ్యవస్థను కాపాడేవే

ఈ ఎన్నికలలో పీడిత వర్గాల నుండీ, సెక్షన్‌ల నుండి వచ్చిన వ్యక్తులే అధికంగా పోటీదారులుగా వుంటున్నారు. ఇది చూసి ఈ ఎన్నికలు ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలకు వ్యక్తీకరణలుగా భావించరాదు. ఈ ఎన్నికల ద్వారా ఏర్పడే మండల, జిల్లా పరిషత్తులు గానీ, గ్రామ పంచాయితీలుగానీ దోపిడీ పాలకవర్గాల విధానాలను శక్తివంతంగా అమలు చేసే సాధనాలుగా వుంటాయి. ఈ ఎన్నికల్లో గెలిచిన పీడిత వర్గాలకు చెందిన వ్యక్తులు సైతం పరాన్నబుక్కులుగా మారి దోపిడీ వర్గాల సేవ చేస్తూ తమ ఆర్థిక, సాంఘీక స్థాయిని పెంచుకుంటున్నారు. వారు సాధారణంగా ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలకు వ్యతిరేకంగా పని చేస్తుంటారు. ఈ కారణాల వల్లనే ప్రజలు ఈ ఎన్నికలను సైతం తమ జీవితాల్లో మార్పు వచ్చే ప్రక్రియలుగా భావించడం లేదు. ఫలితంగా ప్రజల అసంతృప్తి ఎన్నికల బహిష్కరణ, వ్యతిరేక ఓటు వంటి రూపాల్లో వ్యక్తమై ఏ పార్టీకీ అధికారం చేపట్టగలిగే పూర్తి మెజారిటీ దక్కక అవకాశవాద సంకీర్ణ కూటములు అధికారాన్ని చేపడుతున్నాయి. ఈ పరిణామాలు రాజకీయ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తూ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం డొల్లతనాన్ని బహిర్గతం చేస్తున్నాయి. ఈ పరిస్థితిలో ప్రజలను విప్లవ కార్యక్రమాల ద్వారా సాయుధులను చేస్తూ గ్రామ స్థాయి నుండి రాజ్యాధికారం చేపట్టే వైపుగా చైతన్యవంతమైన కృషిని చేపట్టాలి.

# విద్యార్థులపై అమానుష లాఠీచార్జి

చిన్నదయినా, పెద్దదయినా పోరాటం అనే మాటను ప్రభుత్వాలు ఎంతగా సహించలేక పోతున్నాయో జూలై 12వ తారీఖున విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ మరోసారి తెలియజేస్తోంది.

విద్యను ఖరీదయినా సరుకుగా మార్చి పేదలకు అందుబాటులో లేకుండా ఎప్పుడో చేశాయి ప్రభుత్వాలూ, కార్పోరేట్ విద్యా సంస్థలూ కల్సి. ఇప్పుడు విద్యను మధ్యతరగతి ప్రజలు కూడా అందుకోలేక పోతున్నారు. కనుక విద్యార్థులు చదువుకునే హక్కు కోసం పోరుబాట పట్టక తప్పడం లేదు. అందులో భాగంగానే, ప్రభుత్వం ఇష్టానుసారం పెంచిన ఇంజనీరింగ్, ఫార్మసీ ఫీజులను వ్యతిరేకిస్తూ, పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు ఇంజనీరింగ్ కౌన్సిలింగ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. తమల్ని చదువులకు దూరం చేసే చర్యలను వ్యతిరేకించడం, ఆందోళనలు చేపట్టడం విద్యార్థులుగా వారి హక్కు. కానీ నియంతృత్వ పాలనలో ఏ హక్కులూ వుండవు. అందుకే విద్యార్థుల అత్యంత ప్రజాస్వామ్య హక్కును ప్రభుత్వం ఎంతమాత్రం ఉపేక్షించలేదు. పోలీసులచేత ఇష్టారాజ్యంగా లాఠీచార్జీ చేయించింది.



హైదరాబాద్‌లో అమ్మాయిలను ఈడ్చుకెళ్తున్న పోలీసులు

ఈ లాఠీచార్జీలో పోలీసులు విద్యార్థులమీద విపరీతమైన క్రౌర్యాన్ని ప్రదర్శించారు. విద్యార్థులను కసిదీరా ఎక్కడపడితే అక్కడ కొట్టారు. అసహాయంగా పడిపోయిన వారిని కూడా పదే పదే కొట్టారు. పరిగెత్తి పారిపోతున్నవారినీ వెంటబడి దొరకబట్టుకొని మరీ కొట్టారు. ఈ విచక్షణా రహిత లాఠీచార్జీలో ఒక విద్యార్థి నుదురు చీలిపోయింది, ఒక విద్యార్థికి రెండు కాళ్లూ విరిగాయి. ఒక విద్యార్థికి చేతి వేళ్లు విరిగిపోయాయి. ఇక మహిళా విద్యార్థుల పట్ల మగ పోలీసులు అవమానకరంగా ప్రవర్తించారు. మహిళలను తొలగించడానికి మహిళా పోలీసులను వినియోగించాలనే నిబంధలను గాల్లో వదిలేసిన మగ పోలీసులు అమ్మాయిల చున్నీలు లాగేసి రోడ్డుపై బర బరా ఈడ్చుకుంటూ పోయారు. కొందరు విద్యార్థులపై ఉమ్మివేశారు. ఈ లాఠీ చార్జీలో, లాఠీలు విరిగాయంటే పోలీసులు ఎంత క్రౌర్యాన్ని ప్రదర్శించారో తెలుస్తుంది. విద్యార్థులను చెల్లా చెదురు చేసి కౌన్సిలింగ్‌ను జరుపాలి అనే రీతిలో లాఠీచార్జి చేసుంటే ఇంత ఘోరంగా ఉండేది కాదు. అలా కాకుండా ఇక జన్మలో విద్యార్థులు ఆందోళన, పోరాటం అనే మాటను తలుచుకోకుండా చేయడం కోసమే ఇంత క్రూరంగా లాఠీచార్జి చేయించింది ప్రభుత్వం.

అన్ని వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చినందుకైనా ప్రభుత్వం ఈ సంఘటనపై క్షమాపణ చెప్పి ఉండాల్సింది. కానీ ఫీజులు మరీ ఎక్కువ ఏమీ పెంచలేదనీ, విద్యార్థులు కొంచెం ఆలోచించి ఉండవల్సిందనీ, పోలీసులు కూడా కొంచెం సహనం పాటించి ఉండాల్సిందని వై.ఎస్ మాట్లాడాడు. లాఠీచార్జి చేయడం కాకుండా అరెస్ట్ చేసి వుంటే బాగుండేదని కూడా అన్నాడు. అంటే విద్యార్థులు నేరం చేశారనేదే అతని ఉద్దేశం. ఇక డి.జి.పి. స్వరణ్‌జిత్ సేన్ ఆందోళన వెనుక అసాంఘీక శక్తులు ఉన్నాయన్నాడు. కనుక లాఠీచార్జి చేయక తప్పలేదని డి.జి.పి. చెప్పకనే చెప్పాడు. మొత్తంగా వై.ఎస్, సేన్ లిద్దరూ తమ మాటల ద్వారా లాఠీచార్జ్‌కు సాధికారతను కల్పించే ప్రయత్నమే చేశారు.

ఫీజులు తగ్గించుకోవడం అనే చిన్న సమస్య వ్యవస్థ మారడం వంటి పెద్ద సమస్యతో ముడిపడి ఉందని విద్యార్థులు గుర్తించి సామాజిక మార్పుకొరకు జరుగుతున్న పోరులో భాగస్వామ్యం అయినప్పుడే చదువుకునే హక్కు అందరికీ చెందుతుంది.

# బాక్సైట్ గనుల తవ్వకాలకు వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్న పోరాటాలు

సామ్రాజ్యవాదానికి గులాములుగా మారిన పాలకులు దేశ సంపదను సామ్రాజ్యవాదానికీ, బహుళజాతి సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారు. అందులో భాగంగా అనేక వనరులకు నిలయాలైన దేశంలోని అన్ని ఆదివాసీ ప్రాంతాలనూ బహుళజాతి కంపెనీల చేతుల్లో పెట్టదల్చుకున్నారు. ఈ నేపథ్యంలో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ గనులను తవ్వడం కోసం జిందాల్ కంపెనీతో 9 వేల కోట్ల రూపాయల ఒప్పందాన్ని చేసుకుంది. అయితే ఈ వెలికితీత వలన భూమి, నీరు, గాలి కాలుషితమై పర్యావరణం దెబ్బతిని ఇక్కడి ఆదివాసీ ప్రజల మనుగడకే ప్రమాదకరంగా పరిణమిస్తుంది. ఈ ప్రమాదాన్ని గ్రహించిన ఇక్కడి ప్రజానీకం తమ ఉనికిని కాపాడుకోవడం కోసం పోరుదారి పడుతున్నారు. విశాఖ ఏజెన్సీ మావోయిస్టు ఉద్యమ ప్రాంతం బలంగా వున్న ఈస్ట్ డివిజన్‌లో భాగం. కనుక ఈ బాక్సైట్ వ్యతిరేక పోరాటానికి ఇక్కడి మావోయిస్టు పార్టీ నేతృత్వం వహిస్తున్నది. వివిధ రూపాల్లో ఈ ప్రజలు చేస్తున్న ఆందోళనా, పోరాటాలు కింది విధంగా వున్నాయి.

**దారకొండలో రాస్తారోకో:** ఆదివాసీల మనుగడకే ప్రమాదంగా పరిణమించనున్న బాక్సైట్ వెలికితీతకు వ్యతిరేకంగా పోరాడడానికి గుర్తేడు ఏరియాలో పంచాయితీ స్థాయిలో పలు బాక్సైట్ గనుల తవ్వకాల వ్యతిరేక పోరాట కమిటీలు ఏర్పడ్డాయి. వీటి ఆధ్వర్యంలో ఏరియాలోని అన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం జరిగింది. పోస్టర్లు, కరపత్రాలు, సభలు వంటి పలు రూపాల్లో సాగిన ఈ ప్రచారం బాక్సైట్ తవ్వకాల వల్ల జరిగే అనర్థాలు, వైపరీత్యాలు, నిర్వాసిత గ్రామాలు మొదలైన పలు విషయాల గురించి ప్రజల్లో మంచి చైతన్యం కలిగించింది. ఆ తర్వాత 2005 నవంబర్ 14న దారకొండలో 1,500 మంది ప్రజలతో రాస్తారోకో జరిగింది. బాక్సైట్ వ్యతిరేక బ్యానర్లు పట్టుకొని ఊరేగింపుగా నినాదాలు చేస్తూ మధ్యాహ్నం 1.30 నుండి 4 గంటల వరకు రాస్తారోకో నిర్వహించారు. ఈ రాస్తారోకో వార్తలు దినపత్రికల ద్వారా విస్తృతంగా ప్రచారమై ప్రజల్లో బాక్సైట్ తవ్వకాల వ్యతిరేక చైతన్యం మరింత పెరిగింది.

**బహిరంగ సభలు:** ఈస్ట్ డివిజన్‌లోని కోరుకొండ ఎల్.ఓ.ఎస్ పరిధిలో ఏడు చోట్ల జననాట్యమండలి పి.ఎల్.జి.ఎ సభలను నిర్వహించింది. ఆదివాసీ మనుగడను ప్రశ్నిస్తున్న బాక్సైట్ తవ్వకాల్ని వ్యతిరేకిస్తూ ప్రజలందరూ పి.ఎల్.జి.ఎలో భాగం కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చింది. జిందాల్ కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని విరమించుకోవాలనీ, ప్రభుత్వ దోపిడీ విధానాలను వ్యతిరేకిస్తూ వేలాదిగా ప్రజలు బాక్సైట్ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొనాలని జె.ఎన్.ఎం ప్రజలకు పిలుపునిచ్చింది. బాక్సైట్ తవ్వకాల వ్యతిరేకంగా పాటలు, పి.ఎల్.జి.ఎ ఆటపాటలతో ఈ సభలు ఉత్సాహంగా సాగాయి.

**కోరుకొండలో సదస్సు:** ఈస్ట్ డివిజన్ కోరుకొండ ఏరియా కమిటీ పరిధిలోని కోరుకొండ ఎల్.ఓ.ఎస్ ఏరియాలో బాక్సైట్ గనుల తవ్వకాలకు వ్యతిరేకంగా 2006 ఫిబ్రవరి 25న బాక్సైట్ గనుల తవ్వకాల వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో కోరుకొండ గ్రామంలో సదస్సు జరిగింది. సదస్సులో 35 గ్రామాల నుండి సుమారు 2500 మంది ఆదివాసీ ప్రజలు పాల్గొన్నారు. తమ మనుగడకు విఘాతం కలిగించే బాక్సైట్ తవ్వకాలను ప్రాణాలు ఒడ్డయినా అడ్డుకోవాలనీ ఈ సదస్సు తీర్మానించింది.

సదస్సు ప్రారంభానికి ముందు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి, జిందాల్ కంపెనీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలనీ, ప్రభుత్వం జిందాల్ కంపెనీతో బాక్సైట్ వెలికితీతకుకుదుర్చుకున్న ఒప్పందం రద్దు చేసుకోవాలనీ, అడవిపై ఆదివాసీలకు అన్ని అధికారాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ ర్యాలీలో నినదించారు.

**జెర్రెలలో సదస్సు:** గూడెం కొత్తవీధి మండలంలోని జెర్రెల గ్రామంలో 2006 ఫిబ్రవరి 25న బాక్సైట్ గనుల తవ్వకాల వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో సుమారు 1500 మంది ప్రజలు పాల్గొన్నారు. ఆదివాసీల ఉనికికే పెనుముప్పుగా పరిణమించిన బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ఆదివాసీ ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలనీ సదస్సు తీర్మానించింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆదివాసీల జీవితాలను చిన్నాభిన్నం చేసే బాక్సైట్ తవ్వకాలను అడ్డుకోవడానికి సంఘటితంగా పోరాడాలన్నారు. ఆదివాసీ పరిరక్షణ చట్టాలను ప్రభుత్వాలు ఉల్లంఘించి ఆదివాసీల హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. సదస్సుకు ముందు గ్రామంలో ర్యాలీ జరిగింది.

**పెద్దబయలులో సభ:** ఈస్ట్ డివిజన్ కోరుకొండ ఏరియా కమిటీ పరిధిలోని పెదబయలు ఎల్.ఓ.ఎస్ ఏరియాలో బాక్సైట్ గనుల తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఆదివాసీ ప్రజలకు

సంఘీభావం తెలుపుతూ 2006 మార్చిలో బాక్సైట్ తవ్వకాల వ్యతిరేక పోరాట సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో పెదబయలు మండల సెంటర్‌లో సభ జరిగింది. సభలో విద్యార్థులు, ఉద్యోగులతో సహా దాదాపు 500 మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ వెలికితీత వలన వేలాది మంది ఆదివాసీలు నిర్వాసితులవుతారనీ, అడవులు నాశనమై పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతుందన్నారు. భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉందనీ ఫలితంగా తీవ్రమైన నీటి సమస్య ఎదురయి కరువుకాటకాలు సంభవించి ఆకలి చావులకు దారితీసే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు.

దీనివల్ల బాక్సైట్ తవ్వకాలు జరిగే ప్రాంతంలోని ఆదివాసులకే కాకుండా, రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసుల ఉనికికే ప్రమాదం ఉందనే విషయాన్ని యావత్తు ఆదివాసీ ప్రజానీకం గుర్తించాలన్నారు. తమతోటి ఆదివాసీల న్యాయమైన పోరాటానికి మద్దతు తెలుపుతూ తాము ఉద్యమంలో భాగస్తులౌతామనీ సంఘీభావ కమిటీ ప్రకటించింది. అనంతరం ఊరేగింపు నిర్వాహించి, 1/70 చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలనీ, ప్రభుత్వం బాక్సైట్ వెలికితీతకు జిందాల్ కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలనీ, బాక్సైట్ తవ్వకాలను విరమించుకోవాలనీ, అడవిపై అన్ని రకాల అధికారాలు కల్పించాలనే డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక అధికార్లకు అందజేసారు.

**ఎమ్మెల్యే ఘెరావ్ :** ఈస్ట్ డివిజన్ కోరుకొండ ఏరియా కమిటీ పరిధిలో చింతపల్లి మండలం కోరుకొండ గ్రామంలో 2006 జూన్ 13న బాక్సైట్ తవ్వకాల వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్థానిక చింతపల్లి ఎమ్మెల్యే గొట్టేటి దేముడుని ప్రజలు ఘెరావ్ చేశారు. ఈ సందర్భంగా ప్రజలు పోరాట కమిటీ ప్రతినిధులు బాక్సైట్ సమస్య విషయంలో సి.పి.ఐ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అంతేగాకుండా ఆదివాసీ సలహా మండలిలో వుంటూ, ఆదివాసీల జీవితాలను ఛిన్నాభిన్నం చేసే బాక్సైట్ తవ్వకాల కోసం జిందాల్ కంపెనీతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం విషయాన్ని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఒప్పందాన్ని అడ్డుకోవడంలో ఎమ్మెల్యే మెతక వైఖరిపై నిలదీశారు.

కేంద్రంలో కాంగ్రెస్ నాయకత్వంలో వున్న యు.పి.ఎ ప్రభుత్వానికి మద్దతునిస్తూనే, అదే ప్రభుత్వం బాక్సైట్ తవ్వకాల కోసం ముందుకు వస్తుంటే పోరాటం చేస్తామంటూ ప్రజల్లో గందరగోళం రేకెత్తిస్తున్న ధోరణి విడనాడాలనీ డిమాండ్ చేశారు. దీంతో దిక్కుతోచని ఎమ్మెల్యే బాక్సైట్ పోరాటంలో మీవెంటే ఉంటాననీ లిఖిత పూర్వకంగా హామీనిచ్చాడు.

**ఎన్నికల బహిష్కరణ:** ఈస్ట్ డివిజన్ కోరుకొండ ఏరియా కమిటీ పరిధిలో చింతపల్లి మండలం కోరుకొండ గ్రామంలో 2006 జూన్ 13న బాక్సైట్ గనుల తవ్వకాల వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో బాక్సైట్ గనుల తవ్వకాలకు వ్యతిరేకంగా స్థానిక సంస్థల(ఎమ్.పి.టి.సి, సర్పంచ్) ఎన్నికలను బహిష్కరించాలనీ ప్రజలకు పిలుపునిస్తూ సభ జరిగింది. ఈ సభలో సుమారు 500 మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, బాక్సైట్ తవ్వకాల వల్ల ఆదివాసీలు నిర్వాసితులౌతారని, ఇప్పటికే ఒరిస్సాలో నిర్వాసితులౌతున్న వారు పొట్టచేత పట్టుకుని వలస వెళ్ళుతున్నారని, బాక్సైట్ తవ్వకాలు జరిపితే విశాఖ మన్యవాసులకు కూడా ఇదే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.

సభ ప్రారంభానికి ముందు కోరుకొండ గ్రామంలో ప్రజలు తమతమ సాంప్రదాయక ఆయుధాలైన విల్లంబులు, కత్తులు, గొడ్డళ్ళు, బరిసెలు పట్టుకొని భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికీ, జిందాల్ కంపెనీకి వ్యతిరేకంగా, స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించాలనీ, బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడదామని నినాదాలు చేశారు.

> "రాసిన ప్రతిసారి, మాట్లాడిన ప్రతిసారి, పార్టీ శ్రేణులను దృష్టిలో పెట్టుకోండి. వాళ్ళు నిన్ను అర్థం చేసుకోవాలి. నీ పిలుపును విశ్వసించాలి. నిన్ను అనుసరించడానికి సిద్ధమవాలి. నువ్వు ఎవరి కోసమైతే రాస్తున్నావో, ఎవరికోసమైతే మాట్లాడుతున్నావో వారిని ఎల్లప్పుడూ దృష్టిలో పెట్టుకోవాలి".
> "మనం ప్రజలకు అర్థమయ్యే భాషలో మాట్లాడటం నేర్చుకోకపోతే ప్రజలు మన నిర్ణయాలను జీర్ణం చేసుకోలేరు".
>
> **- జార్జి డిమిట్రావ్**

# ఈస్ట్ డివిజన్ పోరాటాలు

### అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలు

**రేకుల పంపిణీ** - ఇళ్ళ నిర్మాణం: గాలికొండ ఏరియా పలకజీడి ఎల్.ఒ.ఎస్ పరిధిలోని పుట్టకోట పెదలంక పాకెట్‌లో 12 గ్రామాల ప్రజల సంక్షేమం కోసం ఆ పాకెట్ ఆర్.పి.సి సిమెంట్ రేకులను సరఫరా చేసింది. 2006లో కొన్ని గ్రామాల్లో ప్రజలు సమిష్టి సహకారంతో ఇళ్ళ నిర్మాణం పూర్తి చేసుకున్నారు.

**కూరగాయలు పండించడం:** ఆదివాసీ ప్రాంతంలో పోడు వ్యవసాయం ప్రధానం. ఇక్కడి ప్రజలు వర్షాధారంతో చోళ్ళు, సామలు, కొర్రలు వంటివి పండిస్తారు. అడవిలో దొరికే ఆకుకూరలు, దుంపలు, వెదురుకొమ్ములు వంటివి సేకరించి ఆహారంగా ఉపయోగిస్తారు తప్ప కూరగాయలు పండించటం అలవాటు లేదు. దీని వలన పౌష్టికాహారం సరిగా అందక ప్రతీ ఏటా వందల మంది అనారోగ్యంతో మరణిస్తున్నారు. ప్రజల్లో దీనిపై అవగాహన కల్పించి పౌష్టికాహారం అందించటం కోసం కూరగాయలు పండించటం నేర్పాలని ఇక్కడి పార్టీ నిశ్చయించుకుంది. దీని కోసం ఒక వ్యవసాయ కమిటీని కూడా ఏర్పాటు చేసింది.

పలకజీడి ఎల్.ఒ.ఎస్ పరిధిలో ఎండకోట, గొందికోట, కాకురుమామిడి, పెదలంక గ్రామాల్లో క్యాబేజి, టమాట, వంకాయ, ముల్లంగి, బెండకాయ, మిర్చి, ఉల్లి విత్తనాలను పంపిణీ చేసి వ్యవసాయ కమిటీ కామ్రేడ్స్ అందుబాటులో వుంటూ కూరగాయలు పండించటం నేర్పించారు. గాబు తీయటం, గొప్పు తవ్వటం, నీళ్ళు పెట్టడం వంటి పనుల్లో ప్రజలందరూ సమిష్టిగా పాల్గొని కూరగాయలను పండించారు.

**చెక్‌డ్యాం నిర్మాణం:** పోడు వ్యవసాయం వలన అధిక శ్రమా, తక్కువ ఫలితం వుంటుంది. దీని వలన ఇక్కడి ప్రజలు ఆర్థికంగా వెనుకబడి వుంటున్నారు. సాగునీటి సౌకర్యం లేక వర్షంపై ఆధారపడటం వలన పంటకు అవకాశం లేదు. చెక్ డ్యాంలు నిర్మించడం వల్ల సాగునీటి సమస్యను పరిష్కరించుకోవడంలో భాగంగా పలకజీడి ఎల్.ఒ.ఎస్ పరిధిలో పాలసముద్రం గ్రామంలో ప్రజలు సమిష్టి శ్రమతో చెక్‌డ్యాంను నిర్మించుకున్నారు. దీనికి సిమెంటును, ఒక పూట భోజనాన్నీ పార్టీ సమకూర్చింది.

### నవ నిర్మాణ సమితి బూటకపు సంస్కరణలను తిప్పికొట్టిన మహిళలు:

ప్రజా పోరాటాలను నీరుగార్చటం, ఉద్యమాల నుండి ప్రజలను పక్కదారి పట్టించటం కోసం ప్రభుత్వం అనేక బూటకపు సంస్కరణలను తీసుకు వస్తోంది. విముక్తి కోసం పోరాడుతున్న మహిళను తమ సమస్య నుండి పక్కదారి పట్టిస్తూ డ్వాక్రా పొదుపు సంఘాలు, గ్రెయిన్ బ్యాంకు(ధాన్య పొదుపు సంఘం)లు లాంటివి తీసుకువస్తోంది. దీంట్లో భాగంగానే ఇక్కడి ఉద్యమ ప్రాంతంలో కూడా మహిళలను మభ్యపెడుతూ నవ నిర్మాణ సమితి అనే సంస్థ ద్వారా గ్రెయిన్ బ్యాంకులను తీసుకురావాలని చూసింది. గాలికొండ ఎల్.ఒ.ఎస్ పరిధిలో కిండంగి అనే గ్రామంలో 10 మంది మహిళలతో గ్రెయిన్ బ్యాంకు నిర్మాణం చేసి ఆరు వేల రూపాయలను ఇచ్చింది. ఈ సంగం ప్రెసిడెంట్‌గా వున్న మహిళ గ్రామంలో అందరి దగ్గరా వసూలు చేసిన చోళ్ళతో(రాగులు) పాటు ఈ డబ్బులను కూడా తన దగ్గరే ఉంచుకుంది. గ్రామ మహిళలు ఈ మోసాన్ని అర్థం చేసుకోలేకపోయారు. ఈ విషయం తెలిసి దళం గ్రామంలో మీటింగ్ పెట్టి లెక్కలతో సహా ఈ మోసాన్ని ప్రజలందరి ముందు పెట్టింది. ఇదే సందర్భంగా ప్రభుత్వ సంస్కరణల్లోని బూటకత్వాన్ని ప్రజలకు అర్థం చేయించింది. దానితో మహిళలంతా ఈ సంఘాన్ని వ్యతిరేకిస్తూ, ఇటువంటి సంఘాలు గ్రామంలో వుండకూడదనీ, అప్పటికి సంఘం దగ్గర వున్న మొత్తం చోళ్ళు గ్రామంలో మహిళందరికీ సమానంగా పంచాలనీ తీర్పు చెప్పారు.

### బాలరేవుల భూ పోరాటం:

గాలికొండ ఏరియాలో ప్రధానంగా కువ్వి, భగత తెగల ప్రజలు నివసిస్తున్నారు. దీంట్లో భగత తెగ ప్రజలు మొదటి నుండి స్థిరంగా వుంటున్నారు. కువ్వి ప్రజలు ఒరిస్సా తదితర ప్రాంతాల నుండి వలస వచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పర్చుకొని జీవిస్తున్నారు. దీని వలన మొదట్లో భగత తెగ పెద్దల అనుమతితో, వారి పెత్తనం కింద భగత, కువ్వి ప్రజలు వుండేవారు. తర్వాత కువ్వి గ్రామాలు కొన్ని వేరయినాయి. ఈ గ్రామాలకు కువ్వి తెగ పెద్దలే నాయకత్వం వహిస్తున్నారు. అయితే ఇప్పటికీ భగత, కువ్వి తెగ ప్రజలు కలిసి వున్న కొన్ని గ్రామాల్లో భగత తెగ పెద్దలు ఆ గ్రామంలో వుండే భగతల పైన, కువ్వి ఇంకా ఇతర తెగల ప్రజలపైన పెత్తనం చలాయిస్తున్నారు. ఇటువంటి గ్రామాలలో బాలరేవుల గ్రామం కూడా ఒకటి. ఈ గ్రామంలో భగత, కువ్వి, కొండదొర, నూకదొర తెగల ప్రజలున్నారు. మొదట ఈ గ్రామంలో భాగంగానే కొత్తవీధి అనే కువ్వి గ్రామం కూడా కలిసి వుండేది. ఈ గ్రామంలో కువ్వి

తెగ ప్రజలకు పొలాలు లేవు. మిగతా తెగల ప్రజలకు కొద్ది కొద్దిగా వున్నా మెజార్టీ భూములు అన్నీ భగత తెగ పెద్దల చేతుల్లోనే వున్నాయి.

బాలరేవులలో పోతరాజు సత్తిబాబుది పెత్తందారీ కుటుంబం. వీరు గతంలో కొత్తవీధి గ్రామ కువ్వి ప్రజలతో కొండ నరికి పొలాలు తయారు చేయించుకున్నారు. ఈ పని చేసినందుకు మూడు సంవత్సరాల కాలం ఆ పొలాల్లో పంటను కొత్తవీధి వాళ్ళు తీసుకునేలా ఒప్పందం చేసుకున్నారు. అయితే పొలాలు తయారయ్యాక ఒప్పందానికి విరుద్ధంగా సత్తిబాబు కుటుంబమే పొలాలను ఆక్రమించి ఆ పంటలను అనుభవిస్తున్నారు. చాలా కాలంగా పెత్తందార్లకు, మునసబుకు భయపడి ఈ అన్యాయాన్ని భరిస్తున్న కొత్తవీధి ప్రజలు ఇక్కడి ఉద్యమం ఇచ్చిన చైతన్యంతో ఆ భూములను స్వాధీనం చేసుకోవటానికి ముందుకు వచ్చారు. ఈ విషయం దృష్టికి వచ్చిన వెంటనే దళం ఈ గ్రామంలో పంచాయితీ నిర్వహించింది. దీంట్లో కొత్తవీధి ప్రజలు, సంఘం ధైర్యంగా నిలిచి సత్తిబాబు కుటుంబం చేసిన మోసాన్ని ప్రజలందరి ముందు మాట్లాడి నిలదీశారు. ఇక నుండి ఆ భూములను తామే సాగుచేసుకుంటామని ఖచ్చితంగా చెప్పారు. ప్రజల తీర్పుకు తలవంచక తప్పదని, దాన్ని వ్యతిరేకిస్తే ప్రజల కోపానికి బలికాక తప్పదని గ్రహించిన సత్తిబాబు కుటుంబం తాము చేసిన మోసం ఒప్పుకుని, ప్రజలను క్షమించమని వేడుకొని ఆ భూములను విడిచిపెట్టారు.

ఇదే గ్రామంలో వుంటున్న కొంత మంది భగత, కువ్వి ప్రజలకు, మిగతా తెగల ప్రజలకు అస్సలు పొలాలు లేవు. ఆ గ్రామ మునసబు పెద్దబ్బాయి కుటుంబం మాత్రం వెళ్ళిపోయిన వాళ్ళ భూములను ఆక్రమించుకుని, వెట్టి చేయించుకుని, మిగతా ప్రజల శ్రమను దోపిడీ చేసి చాలా భూములను సంపాదించుకున్నది. కొత్తవీధి ప్రజలు చేసిన పోరాట చైతన్యంతో ఈ గ్రామంలో ప్రజలు కూడా మునసబు భూములను స్వాధీనం చేసుకోవటానికి సిద్ధమైనారు. దాంతో దళం ప్రజల నుండి భూపోరాట కమిటీ నిర్మించింది. ఆ కమిటీ ఆధ్వర్యంలో పంచాయితీ నిర్వహించి కొన్ని భూములను మాత్రం ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. ఎర్రజెండాలు పాతి ఈ భూముల్లో దుక్కులు దున్ని పంటలు వేసుకున్నారు.

## దైనందిన సమస్యల పరిష్కారంపై కదిలిన ప్రజలు:

ఎం.పి.టి.సి, జడ్.పి.టి.సి, సర్పంచ్ ఎన్నికలలో ఓట్లకోసం కరెంటు, కోర్టులు, స్కూళ్ళు ఇస్తామని చెప్పి, ఓటు వేయకపోతే చోటు లేదనీ ప్రచారం చేసి ప్రజలను బెదిరించి ఓట్లు వేయించుకున్నారు. గాలికొండ ఏరియాలో మెజార్టీ గ్రామాలు ఎన్నికలను బహిష్కరించినా కొన్ని గ్రామాల్లో ఓట్లు వేయించుకోగల్గారు. తీరా గెలిచాక ఎప్పటిలాగే ప్రజల సంక్షేమాన్ని పక్కన పెట్టారు. ఎన్నికల్లో గెలిచాక లోపలి గ్రామాల ప్రజలు ఓట్లు వేయలేదు కాబట్టి వాళ్ళకు కరెంటు సరఫరా బంద్ చేస్తామని రేషన్ కార్డులు ఇవ్వమని అన్నారు. ఈ సమస్యను దళం ప్రజల్లో చర్చించి ప్రజలకు పోరాడాలని పిలుపునిచ్చింది. ఫలితంగా పలకజీడి ఏరియా పరిధిలోని కొయ్యూరు మండలానికి చెందిన గ్రామాల ప్రజలు సుమారు 150 మంది రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల కార్యాలయం ముందు ధర్నా చేశారు. గాలికొండ ఏరియా పరిధిలోని గూడెం మండలానికి చెందిన గ్రామం ప్రజలు పాఠశాల కోసం, కరెంటు కోసం, మధ్యాహ్న భోజన పథకం అమలుకోసం, మండల కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ ధర్నా ముందు అప్పుడే గెలిచిన పంచాయితీ సర్పంచ్‌ను ఈ సమస్యల పరిష్కారం కోసం ఆదివాసీ రైతుకూలీ, ఆదివాసీ విప్లవ మహిళా సంఘాలు వెళ్ళి నిలదీశాయి. ఈ సమస్యలపై పి.ఓకు, కలెక్టర్‌కు మెమోరాండం ఇచ్చారు.

## ప్రజా వ్యతిరేకులను బహిర్గత పరుస్తూ ప్రచార కార్యక్రమం:

గాలికొండ ఏరియాలోని కొన్ని గ్రామాల్లో పెత్తందార్లు, ప్రజలపై పెత్తనం చెలాయిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో సంఘాల నిర్మాణం జరగకుండా, కొన్ని గ్రామాల్లో సంఘాలు వున్నా వాటి కార్యక్రమాలు జరగనీయకుండా ఆటంకపరుస్తున్నారు. రకరకాల పుకార్లు పుట్టిస్తూ పార్టీకి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, సంస్కరణలతో లబ్ది పొందుతూ వాటిని అభివృద్ధి చేస్తున్నారు. ఇటువంటి పెత్తందార్లను, వారు చేస్తున్న అవినీతి, అవకాశవాద కార్యక్రమాలను ప్రజల్లో బహిర్గత పరుస్తూ వివిధ రూపాలలో ప్రచారం చేయాలని ఇక్కడి పార్టీ నిర్ణయించింది. దాంట్లో భాగంగా ప్రజా పంచాయితీలు నిర్వహించి చీడిపెల్లి లచ్చుమయ్య, కేశవరావు, గోపాల్‌రావు వంటి పెత్తందారులను నిలదీసి క్షమాపణలు చెప్పించింది.

## ప్రభుత్వ ఎల్.ఐ.సి. విధానాలకు వ్యతిరేకంగా సభ

దోపిడీ పాలకవర్గాలు విప్లవోద్యమంపై అమలు చేస్తున్న ఎల్.ఐ.సి విధానాలకు వ్యతిరేకంగా గాలికొండ ఏరియాలోని రాజులపాడు, కన్నవరం గ్రామాలలో జె.ఎన్.ఎం బహిరంగ సభను నిర్వహించింది. రాజులపాడులో జరిగిన సభకు 300 మంది ప్రజలు హాజరవ్వగా కన్నవరంలో జరిగిన సభకు 500 మంది ప్రజలు హాజరయ్యారు. శత్రువు తన బహుముఖ దాడిలో భాగంగా విప్లవోద్యమాన్ని నీరు కార్చడం కోసం సరెండర్లను ప్రోత్సహిస్తూ

ప్రజలను మభ్యపెట్టి ఇన్ఫార్మర్లుగా మలుచుకుంటూ, హోంగార్డు ఉద్యోగాలను ఆశ చూపుతూ, సంస్కరణలను ఎరగా వేస్తున్న తీరును ఈ సభల్లో వక్తలు వివరించారు.

ఈ సభలు శత్రు కూంబింగ్‌ల మధ్య మిలీషియా, ప్రజల పెట్రోలింగ్స్, సెంట్రీల మధ్య జరిగాయి. తీవ్ర నిర్బంధం వున్నప్పటికీ ఆదివాసీ మహిళలు చంటిపాపలతో సహా ఈ సభల్లో పాల్గొన్నారు. డప్పులు, తుడుముల వాయిద్యాల చప్పుళ్ళతో నిర్బంధాన్ని గేలి చేస్తూ విజయవంతంగా ముగిసాయి ఈ సభలు.

### తుఫాను బాధితుల నష్టపరిహారం కోసం ధర్నా:

తీవ్ర తుఫాను వల్ల నష్టపోయిన ప్రజలకు నష్టపరిహారంకై ప్రభుత్వాన్ని నిలదీయాలని గాలికొండ ఏరియాలో జె.ఎన్.ఎం విస్తృతంగా ప్రచారం చేసింది. కోట్ల డబ్బులు తుఫాను సహాయం కింద రాజకీయ నాయకులు, అధికారులు స్వాహా చేశారుతప్ప ప్రజలకు చేరింది ఏమీ లేదు. పాలకవర్గాల ఈ అవినీతిని నిరసిస్తూ బాధితులకు తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది స్త్రీ-పురుషులు కొయ్యూరు మండల కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తమ డిమాండ్స్‌ను ఎం.ఆర్.ఒకు మెమోరాండంగా రాసి ఇచ్చారు.

### బలవంతపు పెళ్లికి వ్యతిరేకంగా సభ

గుర్తేడు ఏరియాలో పెద్దమండ్ల గ్రామంలో 17 సంవత్సరాల ఒక యువతిని ముగ్గురు బిడ్డల తండ్రితో పెళ్లి చేయడం కోసం బలవంతంగా పోతారం గ్రామ సంత నుండి లాక్కొచ్చారు. ఈ యువతి ఈ పెళ్లిని వ్యతిరేకించింది. ఈ సమస్యపై ఇరుగ్రామాల ప్రజల్ని సమావేశపర్చి దళం సభ జరిపింది. సభలో అమ్మాయి అభీష్టం మేరకు ఈ పెళ్లిని ప్రజలంతా వ్యతిరేకించారు. బలవంతపు పెండ్లిళ్లను వ్యతిరేకించాలంటూ దళం సభలో ప్రజలకు అర్థం చేయించింది.

### మూఢనమ్మకాలతో జరిగే ఘర్షణల పరిష్కారం

గుర్తేడు ఏరియా బూసకోట గ్రామంలో చేతబడి నెపంతో తరచూ ఘర్షణలు జరుగుతూ వుంటాయి. చేతబడి చేస్తున్నాడనే పేరుతో మంగిరెడ్డి అనే వ్యక్తిని హత్యచేయాలనే నిర్ణయం గ్రామంలో జరిగింది. గతంలో మరో ఇద్దరు వ్యక్తుల్ని ఈ పేరుతో గ్రామం నుండి బహిష్కరించారు. గ్రామంలోని ఈ సమస్యను ప్రజలు దళం దృష్టికి తేవడంతో దళం రెండు గ్రామాల ప్రజల సమక్షంలో ఈ సమస్యను చర్చించింది. కొన్ని వ్యక్తిగత కక్షలను సాకుగా చేసుకొని చేతబడి పేరుతో చంపడం మంచిది కాదని ప్రజలు చర్చించారు. మంగిరెడ్డిని చంపడం తప్పనీ, అతను గ్రామంలోనే జీవించే విధంగా సభ నిర్ణయించింది. గతంలో బహిష్కరణకు గురయినవారు కూడా గ్రామంలోనే బతికే విధంగా నిర్ణయించింది. శాస్త్రీయ విజ్ఞానానికి దూరం కావడం, నిరక్షరాస్యత వంటి పలు కారణాల వల్ల మూఢ నమ్మకాలు ప్రజల్లో పాతుకుపోయాయని దళం ప్రజలకు వివరించింది.

### గిట్టుబాటు ధరల పోరాటం

గుర్తేడు ఏరియాలో గొచ్చెకందుల గిట్టుబాటు ధరల కోసం పోరాట కమిటీలు ఏర్పడ్డాయి. ఈ పోరాట కమిటీలు సభలు, పోస్టర్ల ద్వారా ప్రచార కార్యక్రమాలు చేపట్టాయి. తర్వాత షావుకార్లను పిలిపించి ధరను నిర్ణయించాయి. కుంచాలతో కాకుండా కిలోల లెక్కన కొనాలని డిమాండ్ చేశాయి. పాత అప్పుల పేరుతో గొచ్చకందుల్ని దోచుకునే విధానం రద్దు చేయాలని కూడా డిమాండ్ చేశాయి. షావుకార్లు దిగివచ్చి ప్రజలు నిర్ణయించిన రేటుకు కొంటామని ఒప్పందం చేసుకున్నారు.

### సమస్యల పరిష్కారానికి ధర్నా

గుర్తేడు ఏరియా గూడెం మండలంలోని గుమ్మిరేవుల, దారకొండ పంచాయితీ గ్రామాల నుండి వరద నష్టం, కరువు, అనారోగ్యం వంటి సమస్యలపై ప్రజలు ఆందోళన చేపట్టారు. దాదాపు 130 మంది ప్రజలు కదిలి మండల కేంద్రానికి వెళ్లి ధర్నా చేసి ఎం.ఆర్.ఒకు వినతి పత్రం ఇచ్చారు.

## పోరాట దినాలు

### అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని ఎత్తిపడుతూ...

మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని పురస్కరించుకొని మార్చి 16న మల్కన్‌గిరి డివిజన్ కలిమెల ఏరియాలో ఎనిమిది గ్రామాల ప్రజలతో కొరుబు గ్రామంలో సభ జరిగింది.

ముందుగా 200 మందికి పైగా వచ్చిన ప్రజలతో ర్యాలీ జరిగింది. సభ ప్రారంభం ముందు కా॥ కుమారి (మే 30న ఈ కామ్రేడ్ అమరురాలైంది)పార్టీ జండాను ఆవిష్కరించింది. ఈ సభలో కామ్రేడ్స్ కుమారి, నాగన్న, రామే, అజిత్‌లు మాట్లాడారు. ప్రధానంగా కా॥ కుమారి ఆదివాసీ తెగలోని మహిళల స్థితిగతుల గురించీ, వారు ఎదుర్కొంటున్న పితృస్వామ్యం గురించి మాట్లాడింది. కా॥ రామే మార్చి 8 పోరాట నేపథ్యాన్నీ, ఆ పోరాట

వారసత్వాన్ని కొనసాగించవల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది.

వక్తల ప్రసంగాలతో పితూరి ఏందన దళం(సాంస్కృతిక దళం) పాటలు, ఆటలతో రెండు గంటలసేపు సభ ఉత్తేజకరంగా సాగింది.

ఇదే ఏరియాలో మార్చి 19న నాలుగు వెదురుకూపుల ప్రజలతో ఆంపొదురు గ్రామంలో 'మార్చి 8' సభ జరిగింది.

ముందుగా సుమారు 1000 మంది ప్రజలతో ర్యాలీ జరిగింది. ఆ తర్వాత కా॥ సుకాంతి పార్టీ జెండాను ఆవిష్కరించింది. సభలో మొదటి వక్తగా కా॥ కుమారి స్థానిక మహిళల సమస్యలపై ఎంతో ఉద్వేగంగా మాట్లాడింది. తర్వాత ప్రధాన వక్తగా కా॥ రామే మార్చి 8 నేపథ్యాన్ని వివరించి, ప్రస్తుతం నెలకొని వున్న సమస్యలపై సంఘటితంగా పోరాడటమే మార్చి 8 జరుపుకోవడంలోని ఔచిత్యం అని చెప్పింది.

సభానంతరం సల్వాజుడూంను పార్టీ, ప్రజలు వీరోచితంగా ప్రతిఘటిస్తున్న తీరును పితూరి ఏందన దళం వీధి నాటకంగా ప్రదర్శించడం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

**ఈస్ట్ డివిజన్** గుర్తేడు ఏరియాలో మార్చి 8 సందర్భంగా కరపత్రాలు, పోస్టర్లతో విస్తృతంగా ప్రచారం జరిగింది. మార్చి 8వ తేదీన పంచాయితీ కేంద్ర గ్రామాలైన బొడ్డగండి, పాతకోటలలో బహిరంగ సభలు జరిగాయి.

## విజయవంతమైన అమరవీరుల సంస్మరణ వారం

### ఈస్ట్ డివిజన్‌లో...

*(అమరవీరుల సంస్మరణ వారం సందర్భంగా ఈస్ట్ డివిజన్‌లోని గాలికొండ ఎల్.ఒ.ఎస్ ఏరియాలో జరిగిన పలు కార్యక్రమాలను కింద వరుసగా ఇస్తున్నాం)*

ఈస్ట్ డివిజన్‌లోని గాలికొండ ఎల్.ఒ.ఎస్ ఏరియాలో అమరవీరుల సంస్మరణ వారం కార్యక్రమాలు విప్లవోత్తేజంతో విజయవంతంగా జరిగాయి. సభలను భగ్నం చేయడానికి అదనపు బలగాలను దింపామని, విస్తృతంగా కూంబింగులు చేస్తున్నామని అబద్ధపు ప్రచారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలని ప్రయత్నించారు. అయినప్పటికీ ఆ ప్రచారాన్ని గేలి చేస్తూ గ్రామ గ్రామాన ప్రజలు స్వచ్ఛందంగా అమరుల స్మారక స్థూపాలను నిర్మించి ఎర్రజెండాలను ఎగురవేసి సభలు జరుపుకొని అమరుల ఆశయాలను కొనసాగిస్తామని శపథం చేసారు.

### అమరవీరుల సంస్మరణ వారం నిర్వహణ కమిటీలు:

అమరవీరుల సంస్మరణ వారం కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడానికి ఒక్కో ఆర్.పి.సి పాకెట్ పరిధిలో 9 నుండి 11 మంది సంఖ్యతో కమిటీలు ఏర్పడ్డాయి. అలా నాలుగు పాకెట్‌లలో నిర్మాణమైన ఈ కమిటీలు పాకెట్‌లోని ప్రతి గ్రామంలో స్థూప నిర్మాణాలు జరిగేలా ప్రజలను కదిలించాయి. బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేశాయి. అమరవీరుల కుటుంబాలకు ఆర్థిక సహాయం కోసం ప్రజల వద్ద చందాలు వసూలు చేశాయి. నాలుగు పాకెట్‌లలోనూ పాకెట్ స్థాయిలో సభలను విజయవంతంగా నిర్వహించాయి.

**ప్రచారం:** ఏరియా వ్యాప్తంగా కార్యకర్తలు వారం ముందు నుంచే బ్యానర్లు, కువ్వి, తెలుగు భాషల్లో పోస్టర్లు, కరపత్రాలతో విస్తృతంగా ప్రచారం చేసారు. చిన్నా పెద్దా అందరూ అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగస్వాములు కావడానికి ఈ ప్రచారం ఎంతో ఉపయోగపడింది.

**ప్రకటనలు:** జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు సంస్మరణ వారాన్ని విజయవంతం చేయాలనీ, అమరుల స్మారక స్థూపాలను నిర్మించి సభలూ, ఊరేగింపులు జరుపుకొని నివాళులర్పించాలనీ, అమరుల ఆశయాలు కొనసాగించాలని పిలుపునిస్తూ ఈస్ట్ డివిజన్ కమిటీ, గాలికొండ ఏరియా కమిటీ, జననాట్య మండలిలు పత్రికలకు ప్రకటనలు ఇచ్చాయి.

### అమరవీరుల తల్లిదండ్రుల్ని ఓదారుస్తూ డి.వి.సి రాసిన లేఖలు:

నూతన సమాజ స్థాపన కోసం ప్రజాయుద్ధంలో వీరోచితంగా, సాహసికంగా పోరాడి అసువులుబాసిన తమ బిడ్డల జ్ఞాపకాలతో, కన్నకడుపుకోతతో తల్లడిల్లుతున్న అమరవీరుల తల్లిదండ్రులకూ, బంధుమిత్రులకూ, కుటుంబ సభ్యులకు 'ప్రపంచ పీడిత వర్గం, విప్లవం మీకు తోడుగా వుంటుంది. మీ బిడ్డలవలె మీ కష్టసుఖాల్లో నిరంతరం అండగా వుంటుంద'ని ఓదార్చుతూ, హామీనిస్తూ అమరుల ఆశయ సాధనకై ప్రజాయుద్ధంలో భాగం కావాలని పిలుపునిస్తూ ఈస్ట్ డివిజన్ కమిటీ లేఖ రాసింది. ఇవి వారికెంతో ఊరటనూ, ధైర్యాన్ని కలిగించటంతో పాటు శత్రువుపై కసిని పెంచి అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో వీరి పాత్రను పెంచాయి.

## గ్రామ గ్రామాన అమరుల ప్రతిరూపాలై వెలసిన నూతన స్థూపాలు:

ఎల్.ఒ.ఎస్ పరిధిలోని దాదాపు 40 గ్రామాలలో ప్రజలు సమిష్టిగా అమరుల స్మారక స్థూపాలను నిర్మించుకున్నారు. ఎక్కడో దూరంగా అడవిలో కాకుండా శత్రు నిర్బంధం మధ్యనే సెంట్రీలు పెట్టుకొని అందరికీ కనిపించే విధంగా సంతలకు తిరిగే దారుల్లోనే స్థూపాలను కట్టుకొని ఎర్రటి బ్యానర్లతో అలంకరించారు. ఈ స్థూపాల వద్ద ఎర్రజెండాలు ఎగరవేసి అమరులకు నివాళులు అర్పించి సభలు జరిపారు.

**ఏరియా అమరుల స్థూపం:** అమరవీరుల సంస్మరణ వారోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రజలంతా స్వచ్ఛందంగా చందాలు వేసుకొని నాలుగు గ్రామాలకు చెందిన సుమారు 500 మంది ప్రజలు రెండు రోజులు శ్రమ చేసి సిమెంటుతో ఏరియా అమరవీరుల స్మారక స్థూపాన్ని నిర్మించుకున్నారు. శత్రువు బాగా కేంద్రీకరించిన గ్రామంలోనే నిర్బంధం మధ్యలోనే పని విభజన చేసుకొని సెంట్రీలు పెట్టుకొని ఆడా, మగా, పిల్లలూ, ముసలివారు అందరూ ఈ స్థూప నిర్మాణంలో తమ వంతు కృషి చేశారు.

## ఇంటిముందే కొడుకు స్థూపాన్ని నిర్మించుకున్న తల్లి:

నల్లబెల్లిలో అమరుడైన కా॥ ప్రభాకర్ (సాణా) తల్లి, కునుకూరు గ్రామంలో తన ఇంటి ముందే ప్రజల సహకారంతో పట్టుదలతో ధైర్యంగా కొడుకు స్మారక స్థూపాన్ని నిర్మించి ఆవిష్కరించింది.

## రోడ్డు సెంటర్లలో వెలసిన తాత్కాలిక స్థూపాలు:

అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను భగ్నం చేస్తామని విర్రవీగిన పోలీసుల ప్రకటనలకూ, ప్రచారానికి బుద్ధి చెబుతూ పోలీస్ కేంద్రానికి దగ్గరలోనే తారు రోడ్డుపై జులై 31న పెద్దవలసలోనూ, ఆర్‌వి నగర్‌లోను స్థూపాలు వెలిసాయి. ఎర్రటి బ్యానర్లతో, జెండాలతో అలంకరింపబడి ప్రజలను ఉత్తేజపరిచాయి. పోలీసుల అబద్ధపు ప్రచారం ప్రజల పోరాట దీక్షను ఏమాత్రం సడలించలేకపోయాయి.

## విప్లవోత్తేజంతో విజయవంతంగా జరిగిన సభలు:

ఒక పాకెట్ స్థాయిలో జూలై 29వ తేదీన అమరవీరుల వారోత్సవాల కమిటీ ఆధ్వర్యంలో సంస్మరణ సభ జరిగింది. ఈ సభకు సుమారు 700 మంది ప్రజలు హాజరయ్యారు. ఈ సభను విజవంతంగా నిర్వహించడానికి మిలీషియా రక్షణ ఏర్పాట్లు చేశారు. ఒకరోజు ముందు నుండే పెట్రోలింగ్స్ చేస్తూ, అన్ని గ్రామాల్లో సెంట్రీలు పెట్టుకున్నారు. 'ప్రజావీరులు మృత్యుంజయులు' అని రాసివున్న స్మారక స్థూపాన్ని అమరులు కామ్రేడ్స్ జాంబ్రి, సాణా(ప్రభాకర్)ల తల్లులు ఆవిష్కరించగా అమరుడు కామ్రేడ్ సుదర్శన్ తల్లి ఎర్రజెండాను ఆవిష్కరించింది. అమరుల తల్లిదండ్రులు తమ బిడ్డల జ్ఞాపకాలను కన్నీటితో ప్రజలందరితో పంచుకున్నారు. అమరుల కుటుంబాలకు డి.వి.సి రాసిన లేఖలను సభలో అధ్యక్షుడు చదివి వినిపించాడు. ఈ సభలు శత్రువు నిర్బంధం మధ్యా, తీరికలేని వ్యవసాయ పనులూ, వర్షాల మధ్యనే ఎంతో విప్లవ స్ఫూర్తితో ప్రజలే నిర్వహించుకుంటున్నందుకు విప్లవాభివందనాలు తెలియజేస్తూ ఏరియా కమిటీ ప్రజలకు రాసిన సందేశాన్ని కూడా చదివి వినిపించాడు. జననాట్య మండలి తయారు చేసిన మూడు పాటలక్యాసెట్లను ఈ సభలో అమరవీరుల తల్లిదండ్రులు ఆవిష్కరించారు. మధ్యమధ్యలో జననాట్యమండలి, ఏరియాకమిటీ సభ్యులు పాటలు పాడుతూ సభను మరింతగా ఉత్తేజపరిచారు. అమరుల త్యాగాలను గుండెల నిండా నింపుకొని వారి ఆశయ సాధనకై అంకితమవుదాం అనే స్ఫూర్తితో సభను విజయవంతంగా ముగించుకున్నారు.

మరొక పాకెట్‌లో కూడా 29వ తేదీన ప్రజలు సంస్మరణ సభ జరుపుకున్నారు. ఈ పాకెట్‌లోని అన్ని గ్రామాలకు మధ్యన వున్న ఒక గ్రామంలో నిర్మించుకున్న స్థూపం దగ్గర సభను జరుపుకున్నారు. దాదాపు 400 మంది ప్రజలు ఈ సభలో పాల్గొన్నారు. ఈ సభలో కూడా అమరుల కుటుంబాలకు డి.వి.సి రాసిన లేఖలు ప్రజలకు విప్లవాభివందనాలతో ఏ.సి రాసిన లేఖను చదివి వినిపించారు.

## అమరుల కుటుంబాలకు ఆర్థిక సహాయ సేకరణ:

అమరుల కుటుంబాలకు సహాయాన్ని అందించడం కోసం దాదాపు అన్ని గ్రామాల్లోనూ ప్రజలు స్వచ్ఛందంగా డబ్బూ, వస్తువులూ, ధాన్యం రూపంలో చందాలు వేసుకున్నారు. దీంతో ప్రజలకోసం ప్రాణాలర్పించిన వీరుల కుటుంబాలను ప్రజలే ఆదుకోవాలనీ, ఆర్థిక సహాయాన్ని అందించాల్సిన బాధ్యత తమదేననే చైతన్యం ప్రజల్లో పెరిగింది. అమరుల కుటుంబాలను మనస్ఫూర్తిగా అక్కున చేర్చుకొని ఆర్థిక సహాయాన్ని అందించారు.

ఇదే విధంగా డివిజన్‌లోని కోరుకొండ, గుర్తేడు ఏరియాలో వారం రోజుల పాటు అమరవీరుల సంస్మరణ సభలు జరిగాయి. కోరుకొండ ఏరియా పెద్దబయలు ఎల్.ఒ.ఎస్ పరిధిలోని కోటిపల్లి గ్రామంలో జూలై 30వ తేదీన జరిగిన సంస్మరణ సభలో 100

మంది ప్రజలు పాల్గొన్నారు. కోరుకొండ ఎల్.ఓ.ఎస్ పరిధిలోని బొడ్డలగొంది గ్రామంలో జూలై 28న ఆదివాసీ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అమరవీరుల సంస్మరణ సభలో 100 మంది ప్రజలు పాల్గొన్నారు. ఇదే ఏరియాలోని గూడెం మండలం కొండవల్లి గ్రామంలోనూ ఆదివాసీ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో సంస్మరణ సభ జరిగింది. ఈ సభలలో పాల్గొన్న విప్లవ ప్రజానీకం అమరులకు జోహార్లు అర్పించి వారి ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## మల్కన్‌గిరి డివిజన్‌లో...

ఈ డివిజన్‌లోని మోటు, కలిమెల, పప్పులూరు ఏరియాల్లో అమరుల సంస్మరణ సభలు జరిగాయి. కొన్ని చోట్ల ఈ సభలను ప్రజలే జరుపుకున్నారు. కొన్ని చోట్ల దళాలు జరిపాయి.

కొత్తగా రెండుచోట్ల కలిమెల ఏరియాలో ప్రజలూ, మిలీషియా స్థూపాలు నిర్మించుకున్నారు. 2006 మే 30న కాలనీ టేకుగూడ దగ్గర జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరులైన కామ్రేడ్స్ కుమారి, బిమలల గుర్తుగా ఒకటి, మరొకటి 2006 జూన్ 6వ తేదీన సింగన్నకోట గ్రామ సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరులైన కామ్రేడ్స్ అనిల్, గణపతి, చందూల గుర్తుగా నిర్మించుకున్నారు. ప్రధానంగా ఈ రెండు స్థూపాలవద్ద దళం సంస్మరణ సభలు నిర్వహించింది.

కామ్రేడ్స్ కుమారి, బిమలల స్మరణగా నిర్మించుకున్న స్థూపం వద్ద 250 మంది ప్రజలతో సభ జరిగింది. కామ్రేడ్ బిమల తల్లి పార్టీ జెండానూ, కామ్రేడ్ కుమారి తల్లి స్థూపాన్ని ఆవిష్కరించి సభను ప్రారంభించారు. కామ్రేడ్ నందా అధ్యక్షత వహించిన ఈ సభలో కా॥ కుమారి వదినె కా॥ భీమె మాట్లాడింది. చివరగా కలిమెల దళ కమాండర్ కా॥ నాగన్న మాట్లాడాడు.

సింగన్నకోట అమరులు కామ్రేడ్స్ అనిల్, గణపతి, చందూల గుర్తుగా నిర్మించుకున్న స్థూపం వద్ద ఆగస్టు 2వ తేదీన 1000 మందికి పైగా ప్రజలతో సభ జరిగింది. సభకు ముందు అమరులపై పాటలు పాడుతూ, డాకా వేస్తూ రెండు కిలోమీటర్ల దూరం ర్యాలీ జరిగింది. గత కొద్ది రోజులుగా పడుతున్న వర్షాల వల్ల తోవంతా పాదాలు దిగబడేంత బురద వున్నా, మధ్యలో చిన్నపాటి వాగు వచ్చినా ర్యాలీ ఏమాత్రం చెదరకుండా స్ఫూర్తివంతంగా సాగింది.

కా॥ మాసాల్ జెండా ఆవిష్కరణ, అమరుడు కా॥ దూలాల్ అక్క కా॥ దేవే స్థూపాన్ని ఆవిష్కరించడంతో సభ మొదలైంది. పిమ్మట ఈ సభలో ప్రధానంగా కా॥ రామే మాట్లాడుతూ పొలిట్‌బ్యూరో సభ్యుడు కా॥ షంషేర్ సింగ్ షేరి(కె.ఎస్) నుండి మొన్నటి ఎ.పి రాష్ట్ర కార్యదర్శి కా॥ మాధవ్ వరకూ దేశవ్యాప్తంగా దాదాపు 300 మంది కామ్రేడ్స్ అమరులయ్యారని చెబుతూ వారి త్యాగాలను ఎత్తిపట్టాలని పిలుపునిచ్చింది. ఈ రెండు సభలు కూడా చుట్టూ మిలీషియా గెరిల్లాల ఆంబుష్‌ల రక్షణలో విజయవంతంగా జరిగాయి.

## కా॥ మాధవ్ తదితర కామ్రేడ్స్ సంస్మరణ సభ

జూలై 23వ తేదీన ప్రకాశం జిల్లా నల్లమల అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరులైన కామ్రేడ్స్ మాధవ్ తదితర వీరయోధులనూ, జూన్ 6వ తేదీన సింగన్న కోటలో అమరులైన కామ్రేడ్స్ అనిల్, గణపతి, చందూలను స్మరించుకుంటూ జూలై 24వ తేదీన ఎ.ఒ.బిలో ఒక గెరిల్లా శిబిరంలో కామ్రేడ్స్ సంస్మరణ సభ జరుపుకున్నారు. ఈ సభలో పలువురు కామ్రేడ్స్ మాట్లాడుతూ నూతన వర్గరహిత సమాజంకై వారు నిర్వహించిన పాత్రను, వారి ఆదర్శ జీవితాలను ఎత్తిపట్టారు.

చివరగా కా॥ భాస్కర్ (ఎస్.జడ్.సి కార్యదర్శి) మాట్లాడుతూ ఎ.పి, ఎ.ఒ.బిలలో నిర్బంధ పరిస్థితి చెప్తూ ఏకీకృత కమాండ్‌లో భాగంగా దేశ వ్యాప్తంగా పెరుగుతున్న దాడి తీవ్రతను ఎదుర్కొనే విధంగా మన శక్తులను తర్ఫీదు చేసుకోవాలనీ, మన పోరాట ప్రాంతాల్లోనే కాకుండా బయట మన రాజకీయాలు వేసిన ప్రభావాన్ని సరిగ్గా ఉపయోగించుకుంటూ యుద్ధతంత్రాన్ని రూపొందించుకోవాలని పిలుపునిచ్చాడు.

అలాగే కా॥ మాధవ్ అంచెలంచెల ఎదుగుదలను కామ్రేడ్స్ ముందు వివరిస్తూ అతని 23 ఏండ్ల విప్లవ జీవితాన్నీ, పార్టీలో అతని కృషిని ఎత్తిపట్టాడు. అలాగే కామ్రేడ్స్ అనిల్, గణపతి, చందూలను గుర్తుచేస్తూ పార్టీ అప్పగించిన బాధ్యతలు నిర్వర్తించడంలో వారికున్న నిబద్ధతను ఎత్తిపట్టాడు. కామ్రేడ్స్ అందరికి జోహార్లు చెప్తూ తన ప్రసంగాన్ని ముగించాడు.

# నిరసన దినం

## ఆగస్టు 15ను చీకటి దినంగా పాటిస్తూ....

ఈస్ట్ డివిజన్ కోరుకొండ ఏరియా పరిధిలో పెదబయలు ఎల్.ఒ.ఎస్ ఏరియాలోని తగ్గుపాడు గ్రామంలో 2006 ఆగస్టు 15న ఏరియా కమిటీ ఆధ్వర్యంలో నిరసన సభ జరిగింది. ఈ సభలో సుమారు 100 మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ సభలో వక్తలు మాట్లాడుతూ పంద్రాగస్టు అనేది స్వాతంత్ర దినం కాదని అది కేవలం అధికార మార్పిడి మాత్రమేనని అన్నారు. ఈ దేశంలో

*(తరువాయి 17వ పేజీలో.....)*

# ప్రతిఘటన వార్తలు

## మల్కాన్‌గిరి డివిజన్

### పోలీస్ ఇన్ఫార్మర్లు, భూస్వాముల ఇండ్లపై కరువు దాడులు

మోటు ఏరియాలోని మన్యంకొండ కోయ, తెలుగు, ఒడియా వాళ్లు నివసించే పెద్ద గ్రామం. ఈ గ్రామంలో 30 సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం వచ్చిన సీతారామయ్య, మియాఖాన్ అనే ఆదివాసేతరులు ప్రజల్ని వివిధ రూపాల్లో దోపిడి చేసి భూస్వాములుగా తయారయ్యారు. గ్రామంపై పూర్తి ఆధిపత్యం కలిగి వుంటూ కాంట్రాక్టు పనులు కూడా చేస్తున్నారు. తక్కువ కూలి ఇస్తూ ప్రజలను దోచుకుంటున్నారు. పోలీసు ఇన్ఫార్మర్లుగా మారి సంఘ సభ్యులను అరెస్టు చేయిస్తున్నారు. దళం ఆచూకీని పోలీసులకు చెప్తున్నారు. అంతేగాక సీతారామయ్య కొడుకు గోవిందు, అనాథ అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఐదు సంవత్సరాలు ఆమెతో కలిసి వుండి ఆ తర్వాత పంచాయితీ పెట్టి కొట్టి ఆమెను వూరు నుంచి గెంటివేశాడు. దీనిని వ్యతిరేకించిన సంఘ సభ్యుడినీ, అతని భార్యను కొట్టించాడు. వీరి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు పలు సందర్భాల్లో పోరాడారు. అయినప్పటికీ వీరు బుద్ధి తెచ్చుకోకపోవడంతో జూలై 23వ తేదీన 150 మంది ప్రజలు మోటు దళం ఆధ్వర్యంలో భూస్వాముల ఇండ్లపై దాడి చేసి, నలుగురికి దేహశుద్ధి చేసి వారి ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. వారిని ఊరి నుండి బహిష్కరించారు.

**రెయ్యా దుర్గారావు:** ఇతను విశాఖలో పార్టీ కొరియర్‌గా పని చేశాడు. 2003 అక్టోబర్‌లో పోలీసులు ఇతన్ని అరెస్టు చేశారు. పోలీసుల ఇంటరాగేషన్‌లో కా॥అరుణ్(కౌముది)(ఎ.ఒ.బి.ఎస్.జడ్.సి సభ్యుడు) కాంటాక్టు చెప్పాడు. ఈ ద్రోహి ఇచ్చిన సమాచారంతో పోలీసులు కామ్రేడ్స్ అరుణ్, లత, రమణలను పట్టుకొని బూటకపు ఎన్‌కౌంటర్లలో హత్యచేశారు. ఇతనితో పాటు మరొక ఇద్దర్ని పట్టుకొని విచారించగా ఇతడి ద్రోహం వల్లనే ఇంతటి నష్టం జరిగిందని పార్టీకి అర్థమైంది. దానితో 2006 జనవరిలో పి.ఎల్.జి.ఎ ఇతనికి మరణశిక్షను అమలు చేసింది.

### అపార్చునిటీ ఆంబుష్‌లు:

**పులిపుట్టి:** లక్కయ్య అనే ఇన్ఫార్మర్‌ని పి.ఎల్.జి.ఎ ఖతం చేసిన తర్వాత 40 మంది పోలీసులు కూంబింగ్‌కు వచ్చారు. ఇలా వచ్చిన వారిపై పులిపుట్టి వద్ద పి.ఎల్.జి.ఎకు చెందిన ఐదుగురి టీం కాల్పులు జరుపగా ఒక గ్రేహౌండ్ కానిస్టేబుల్ చచ్చాడు. మరొక హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన 2005 జూలైలో జరిగింది.

**తుంబగూడ:** 2005 డిసెంబర్ 1న పి.ఎల్.జి.ఎ సభలను భగ్నం చేయడానికి వచ్చిన 30 మంది గ్రేహౌండ్స్ పోలీసులపై కాల్పులు జరుపగా ఇద్దరి పోలీసులకు గాయాలయ్యాయి. వారిలో ఒకరికి కాలుపోయింది.

**బూబీట్రాప్:** 2005 పి.ఎల్.జి.ఎ వారం సందర్భంగా భామిని కొత్తూరుల మధ్య దళం బూబీట్రాప్‌ను ఏర్పాటు చేసి ఈ విషయం పోలీసులకు తెలిసేటట్టు చేసింది. సమాచారం తెలిసి వచ్చిన పోలీసులు సంతలోని ప్రజలందర్ని కూడా 'మీ అన్నలు పెట్టిన మైన్లు తీస్తున్నాం చూడండీ' అని బలవంతంగా తీసుకొచ్చారు. ప్రజలు చూస్తుండగా 15 మంది గ్రేహౌండ్స్ పోలీసులు చుట్టూ మూగి మైన్ పైకి లేపారు. మైన్ పూర్తిగ పైకి వచ్చాక ఇ.డి జారి గొయ్యిలో పడింది. దాంతో బిత్తరపోయిన పోలీసులు రోడ్డు మీదనే పొజిషన్లు తీసుకున్నారు. చాలా గందరగోళానికి గురయ్యారు. ఇ.డి జారిపోకపోతె కొందరయినా చనిపోయేవారు. పోలీసుల గందరగోళం చూసి ప్రజలు నవ్వుకున్నారు.

## ఈస్ట్ డివిజన్

### సంఘనాయకుడు రాజారావును హత్య చేసిన పుల్లయ్యకు దేహశుద్ధి:

రాజారావు గాలికొండ ఎల్.ఒ.ఎస్ పరిధిలోని జెర్రిగొంది గ్రామ సంఘ నాయకుడు. ఈ కామ్రేడ్ గ్రామ సమస్యలను పట్టించుకోవటం, పరిష్కరించటంలో చాలా బాధ్యతగా ఉండేవాడు. ఈ గ్రామానికి దగ్గరిలోనే మండపల్లి అనే గ్రామంలో పుల్లయ్య అనే అరాచకుడు విపరీతంగా కల్లు తాగుతూ మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించే వాడు. ఇతను జెర్రిగొంది గ్రామంలో మహిళను వివాహం చేసుకుని కొంత కాలంగా జెర్రిగొందిలోనే వుంటూ అక్కడ మరో మహిళను లైంగికంగా వేధించటం మొదలుపెట్టాడు. దీన్ని ప్రశ్నించి వ్యవతిరేకించిన సంఘ నాయకుడు రాజారావును అడ్డు తొలగించుకోవాలనే ఉద్దేశంతో రాత్రికి రాత్రే కర్రలతో కొట్టి చంపి పాతిపెట్టేశాడు. ఈ విషయం తెలిసిన దళం జెర్రిగొంది, మండ్లపల్లి గ్రామాలతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలను కూడా పిలిచి ప్రజా పంచాయితీ

# ప్రజల ఆగ్రహజ్వాలల్లో కాలిపోయిన 'ఎర్రబోరు'

జూలై 17వ తారీఖున దండకారణ్యంలోని దంతెవాడ జిల్లా ఎర్రబోరు 'రాహత్' శిబిరంపై మావోయిస్టులు చేసిన దాడిదేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ దాడిలో మొత్తంగా 33 మంది చనిపోయారు. దీనితో, అమాయక ఆదివాసీలను మావోయిస్టులు విచక్షణారహితంగా చంపారని పాలకవర్గాలు తీవ్రస్థాయిలో దుష్ప్రచారం చేశాయి. ఈ శిబిరంపై ఎందుకు దాడి చేయవల్సి వచ్చిందో అర్థం కావాలంటే, ఇటువంటి శిబిరాలు ప్రస్తుత సల్వాజుడూం నిర్బంధకాండలో ఎటువంటి పాత్రను నిర్వహిస్తున్నాయో అర్థం కావాలి.

దండకారణ్య ఉద్యమాన్ని అణచివేయడంలో భాగంగా ప్రభుత్వం సల్వాజుడూంను నడిపిస్తోన్న విషయం పాఠకులకు తెలిసినదే. అందులో భాగంగా ఇక్కడి అటవీ ప్రాంతపు గ్రామాల్లోని ప్రజలందర్నీ తీసికెళ్ళి ఎర్రబోరు, కోంట, వింజరం, దోర్నపాల్ వంటి పెద్ద పెద్ద గ్రామాల్లో, చిన్న పట్టణాల్లో ఒకచోట పోగేస్తున్నారు. గ్రామాలను ఖాళీ చేయించి శిబిరాల్లో పెట్టడంలో ప్రభుత్వ ఉద్దేశం ఉద్యమానికి సర్వాంగాలు అయిన ప్రజలను దూరం చేయడమే కాక, ప్రజలను తన చెప్పుచేతల్లో పెట్టుకొని తనకనుకూలంగా మల్చుకోవడమే కాక, ఏ ఆటంకమూ లేకుండా ఈ అటవీ సంపదను సామ్రాజ్యవాదుల, బహుళజాతి సంస్థలకు ధారాదత్తం చేయడం కూడా.

అయితే గ్రామాలను ఖాళీ చేయడం, ప్రజలను తరలించడం అనేది సులువుగా జరిగే అవకాశం లేదు. ఎందుకంటే తాము పుట్టి పెరిగిన గడ్డనీ, ఆ గడ్డపై 25 ఏళ్ళుగా పోరాడుతూ సాధించుకున్న తమదైన అధికారాన్నీ వదులుకొని ప్రభుత్వం ప్రాపకంలోకి వెళ్లడానికి దండకారణ్య విప్లవ ప్రజానీకం ఎవరూ సిద్ధపడే అవకాశం లేదు. వారంతా ప్రభుత్వం మీద ఎన్నడో భ్రమలను కోల్పోయారు. అందుకే ప్రభుత్వం ఇక్కడి ఉద్యమం వల్ల ప్రయోజనాలు కోల్పోయిన దోపిడీ సెక్షన్‌ను చేరదీసింది. వారి ద్వారా ఉద్యమం పట్ల విశ్వాసం బలంగా లేని మరి కొందరిలో భ్రమల్ని కల్పించింది. వీరంతా సల్వాజుడూంలో చేరిపోయారు. అయితే ఇలా చేరిన వారు ఇక్కడి ప్రజానీకంలో కొద్దిశాతం మాత్రమే. ఇక పోలీసులూ, సి.ఆర్.పి.ఎఫ్, నాగా బలగాలూ, సల్వాజుడూం గూండాలూ కల్సి గ్రామాలపై దాడులు చేసి విచక్షణారహితంగా చంపుతూ ఎంతో మంది ప్రజల్ని ఎత్తుకుపోతున్నారు. అలా బలవంతంగా ఎత్తుకుపోతూ ఒకచోట పోగేస్తున్న ప్రదేశాన్ని రాహత్(సహాయ) శిబిరం అంటున్నారు.

ఈ 'రాహత్' శిబిరాలు పోలిస్టేషన్ల చుట్టూగానీ, పోలీస్ క్యాంపుల చుట్టూగానీ ఏర్పాటు చేస్తున్నారు. ఉదాహరణకు ఎర్రబోరు శిబిరాన్నే తీసుకుంటే, ఈ గ్రామంలో ఒక పోలీస్ స్టేషనూ, ఒక సి.ఆర్.పి.ఎఫ్. క్యాంపూ వున్నాయి. వీటి మధ్య ఐదు ఆరువందల గజాల దూరం వుంటుంది. వీటి చుట్టూతా రెండు విడివిడి శిబిరాలను ఏర్పాటు చేశారు. అంటే ఈ పోలీస్ స్టేషన్, క్యాంపుల చుట్టూ పాకలు, టెంట్లు వేసి అందులో మనుషులను కుక్కారు. ఈ రెండు శిబిరాల్లో కలిసి దాదాపు 4,500 మంది ప్రజలు వున్నారు. అంటే ఈ పోలీసు మూకలు తమకు రక్షణ కవచాలుగా తమ చుట్టూ ఇలా ప్రజల్ని వుంచారు. ఇక ఈ క్యాంపుల పరిస్థితి ఎలా వుంటుందంటే సల్వాజుడూంలో 'స్వచ్ఛందంగా' చేరిన వారిలోనూ, బలవంతంగా చేర్చుకున్నవారిలోనూ కొందర్ని ఎంపిక చేసి వారిని గూండాలుగా నియమిస్తున్నారు. అయితే వీరిని గూండాలు అని అనకుండా ఎస్.పి.ఓ.(స్పెషల్ పోలీస్ ఆఫీసర్)లు అని పిలుస్తున్నారు. వీరికి తుపాకుల్ని పేల్చడంలో, ప్రజల్ని కొట్టడంలో, చంపడంలో శిక్షణను ఇస్తున్నారు. వీరిలో కొంత మందికి తుపాకుల్ని కూడా ఇస్తున్నారు. నెలకు 1,500 రూపాయల జీతాన్ని ఇస్తున్నారు. ఈ ఎస్.పి.ఓ.ల పర్యవేక్షణలోనే ఈ శిబిరాలు నడుస్తాయి. బలవంతంగా ఎత్తుకొచ్చిన ప్రజలు పారిపోకుండా చూడ్డానికి ఎస్.పి.ఓలు అనుక్షణం కాపాలా కాస్తారు. శిబిరాల చుట్టూ సెంట్రీలుగా వుంటారు. శిబిరంలోని ప్రజలను మల, మూత్ర విసర్జనకూ, స్నానాలకు వీరే తోలుకుపోతారు. శిబిరానికి కొత్తగా పట్టుకొచ్చిన ప్రజలను కొట్టి లొంగదీసుకోవడం, వారిలోనుండి ఎస్.పి.ఓలను తయారు చేయడం వీరి బాధ్యతే. సి.ఆర్.పి.ఎఫ్, నాగా బలగాలు గ్రామాలపై దాడులకు వెళ్లినప్పుడు ఈ ఎస్.పి.ఓలనూ, శిబిరంలోని ప్రజలను తమకు సహాయంగా తీసుకెళ్తున్నారు.

ఇక శిబిరాల్లోని సామాన్య ప్రజల పరిస్థితి ఘోరంగా వుంటుంది. తమ గ్రామాల్లో, చేలల్లో, అడవుల్లో స్వేచ్ఛా జీవులుగా బతికిన ప్రజలకు ఈ శిబిరాల్లో గడపడం కాన్సంట్రేషన్ క్యాంపుల్లో గడపడం వంటిదే. ప్రతిక్షణం ఎస్.పి.ఒల ఆదలింపులో గడపడం వారికి అత్యంత దుర్భరంగా వుంటోంది. మహిళలకు కూడా పురుష ఎస్.పి.ఓలు చూస్తుండగానే మల,మూత్ర విసర్జన, స్నానం చేయవల్సి రావడం ఎంతో అవమానకరంగా వుంటోంది. వీరు అనుక్షణం లైంగిక అభద్రతలో బతకాల్సిన పరిస్థితి. పోలీసులు, సి.ఆర్.పి.ఎఫ్, నాగా బలగాలు, ఎస్.పి.ఓలు శిబిరాల్లోని మహిళలపై పాల్పడుతున్న అత్యాచారాలకు అంతులేదు. ఫలితంగా వందలాది మంది మహిళలూ, పెళ్లికాని యువతులు గర్భవతులయ్యారు. రాత్రి కాగానే మహిళలు బట్టల్లేకుండా తమ డేరాల్లో పడుకొని వుండాలని సల్వాజుడూం నేతలు

హుకూం జారీ చేశారంటే శిబిరాల్లోని మహిళల పరిస్థితి ఎంత విషమంగా వుందో అర్థం చేసుకోవచ్చు.

ఈ విధంగా సామాన్య ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు ఈ శిబిరాల్లో గడపడం క్షణక్షణ గండంగా మారింది. అందుకే శత్రువు కన్నుగప్పి ఈ శిబిరాలనుంచి తప్పించుకు రావడానికి వాళ్ళు నిరంతరం ప్రయత్నిస్తున్నారు. ఆ ప్రయత్నాలు ఫలించి కొందరు తప్పించుకొని వస్తున్నారు. సాధారణ జనమే కాకుండా బలవంతంగా ఎస్.పి.ఓలుగా మార్చబడినవారు కూడా తప్పించుకు వస్తున్నారు. ఇక్కడి విప్లవోద్యమం కూడా శిబిరాల్లో బందీలుగా వున్న ప్రజలకు తప్పించుకు రమ్మని పిలుపునిస్తోంది. ఆ పిలుపుకు స్పందించి కూడా ఎంతో మంది ప్రజలు తప్పించుకొని వచ్చి విప్లవోద్యమంతో మరింతగా మమేకం అవుతున్నారు. అలా తప్పించుకు వచ్చిన ప్రజలు ఈ శిబిరాలపై తీవ్రమైన అసహ్యాన్నీ, కసిని పెంచుకున్నారు. సల్వాజుడూం దాడులకు గురైన, ఆ దాడుల్లో తమ ఆప్తులనూ, సర్వస్వాన్నీ కోల్పోయిన ప్రజలకు కూడా తమ మీద దాడులు చేస్తోన్న పోలీసులూ, సల్వాజుడూం నేతలూ, ఎస్.పి.ఓలకు రక్షణ కవచాలుగా మారిన ఈ శిబిరాలంటే విపరీతమైన ద్వేషం. అట్లా ప్రజల్లో రగుతున్న కసినీ, ద్వేషాన్నీ వృధాగా పోనీయ దల్చుకోలేదు. దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీ. ప్రజల కసికి ఎంత శక్తి వుంటుందో పాలకవర్గాలకు చాటాలనుకుంది. ఫలితంగా ఈ దాడికి పథకాన్ని రూపొందించింది. సల్వాజుడూం నేతలనూ, క్రూరమైన ఎస్.పి.ఓ.లను శిక్షించడమే ఈ దాడి ఉద్దేశం. ఈ దాడిలో పి.ఎల్.జి.ఎ.కు చెందిన ప్రధాన, ద్వితీయ బలగాలు 112 మంది పాల్గొంటే, మిలీషియా, ప్రజా సంఘాల సభ్యులు కలిసి 600 మంది పాల్గొన్నారు. మొత్తం బలగాలు రెండు బ్యాచీలుగా మారి రెండు శిబిరాలపై ఏక కాలంలో దాడి చేశాయి. స్టేషన్‌లో దాదాపు 30 మంది పోలీసులుంటే క్యాంపులో 60-70 మంది సి.ఆర్.పి.ఎఫ్. బలగాలు ఉన్నాయి. పి.ఎల్.జి.ఎలోని కొన్ని బలగాలు పోలీసులనూ, సి.ఆర్.పి.ఎఫ్‌ను, స్టేషనూ, క్యాంపుల నుంచి బయటకి రాకుండా కాల్పులు జరుపుతూంటే మిగతా బలగాలు క్యాంపులోని వారందరిని బంధించి ఆ తర్వాత వారిలో సల్వాజుడూం ముఖ్యులను గుర్తించి చంపాలనేది, గుర్తించకుండా ఎవరినీ చంపొద్దనేది పార్టీ రూపొందించిన పథకం. ఆ పథకాన్ని అమలు చేయడంలో భాగంగా బలగాలన్నీ ముందుకు కదిలాయి.

అయితే ఈ శిబిరం నుంచి పారిపోయి వచ్చిన వాళ్ళు రాగా, మిగిలిన వాళ్ళు మెజారిటీగా విప్లవ వ్యతిరేకులే. వీరందరికీ ఎప్పుడు దాడి జరిగినా ప్రతిఘటించాలని బాగా నూరిపోశారు నేతలు. అందువల్ల పి.ఎల్.జి.ఎ. దాడి చేయగానే సగం మంది పారిపోగా మిగిలిన వారు బాణాలు, కత్తులు, గొడ్డళ్ళతో ప్రతిఘటించడం మొదలుపెట్టారు. దానితో ఆత్మరక్షణ కోసం పి.ఎల్.జి.ఎ. 24 మందిని చంపవల్సి వచ్చింది. తర్వాత 40 మందిని బంధించి తీసుకువచ్చి, విచారించి అందులోని ఆరుగురిని శిక్షించింది. దాడి ముగించి వచ్చేటప్పుడు ముందే అనుకున్నట్టుగా శిబిరంలోని పాకలను తగలబెట్టారు. అలా తగులబెట్టేటప్పుడు అందరికీ చెప్పినప్పటికీ ఒక మహిళ తన ఇద్దరు పిల్లలతో ఇంటి లోపలే వుండిపోయింది. అది గమనించకుండా ఇండ్లను తగులబెట్టడంతో ఆ ముగ్గురు సజీవ దహనం అయ్యారు. మరో మహిళ కూడా అనుకోకుండా కాల్పుల్లో చనిపోయింది. ఈ నలుగురుకాక మిగతావారంతా శిక్షార్హులే. ఈ శిబిరంలో బందీలుగా ఎన్నో బాధలు, అవమానాలు పొంది, తప్పించుకొని వచ్చి ఈ దాడిలో పాల్గొన్నవారెంతో మంది. వీరు మరింత కసిగా ఈ దాడిలో పాల్గొన్నారు. అందులో భాగంగా ముందుగా కూడదనుకుప్పటికీ పశువుల పాకలు తగులబెట్టడంతో పశువులు చనిపోయాయి. ఈ రెండు సంఘటనలు పొరపాట్లే అయినప్పటికీ వాటి మూల్యం తిరిగి చెల్లించలేనిదని గుర్తిస్తూ పార్టీ క్షమాపణలు కోరుతూ పత్రికా ప్రకటన ఇచ్చింది.

ఈ దాడి శత్రువును ఎంతో బెంబేలెత్తించింది. 100 మంది పోలీసుల అండ చూసుకొని తమకు ఎదురులేదని విర్రవీగిన సల్వాజుడూం నేతలకు, ప్రజాగ్రహాన్ని ఏ తుపాకులూ ఆపలేవని తెల్పివచ్చింది.

ఇక ప్రజల్లో ఈ దాడి మరింత ఆత్మస్థైర్యాన్ని పెంచింది. ఈ దాడి తర్వాత మిగతా శిబిరాల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అన్ని శిబిరాలపై దాడులు చేయాలని, తామంతా దాడుల్లో పాల్గొంటామని ముందుకొస్తున్నారు.

న్యూడెమోక్రసీ, సి.పి.ఎం. వంటి రివిజనిస్టు పార్టీలు మాత్రం ఈ దాడి ఆదివాసీలకు నష్టకరమనీ, మావోయిస్టులు అమాయక ఆదివాసులను చంపుతున్నారనీ, నక్సల్స్, ప్రభుత్వం మధ్య ఆదివాసీలు నలిగి పోతున్నారని పాత పాటే పాడారు. ఈ మాటల ద్వారా ఒక వైపు మావోయిస్టు పార్టీని తిడుతూ మరోవైపు ఆదివాసీ ప్రజలపై తమకు సానుభూతి వుందని వీరు ప్రకటించుకోదల్చుకున్నారు. కానీ ఆదివాసీ ప్రజల ఆగ్రహాన్ని, భవిష్యత్ కోసం ఆయుధాలు పట్టక తప్పని వారి స్థితిని అర్థం చేసుకోవడంలో తమ వైఫల్యాన్ని చాటుకున్నారు.

ఇటువంటి వాదనలను తిప్పికొడుతూ జల్, జంగల్, జమీన్‌లపై తమ అధికారాన్ని కాపాడుకోవడం కోసం ఆదివాసీ ప్రజానీకం మావోయిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేస్తూ మరింత ముందుకు తీసుకుపోవడం తథ్యం.

*( .....60వ పేజీ తరువాయి)*

ఇలా నగర ఉద్యమంలో చురుకైన పాత్ర వహిస్తున్న కాలంలో 1987లో అరెస్టయ్యాడు. 1989లో విడుదలై తిరిగి నగర కమిటీలోకి కోఆప్ట్ అయ్యాడు. 1990లో వరంగల్‌లో పెద్ద ఎత్తున జరిగిన రైతుకూలీ సంఘం మహాసభల నిర్వహణ కమిటీలో వుండి సభలు విజయవంతం కావడంలో ముఖ్య భూమికను పోషించాడు. అదే సంవత్సరం మేలో వచ్చిన తుఫాన్ వలన నిరాశ్రయులైన ప్రజలకు సహాయం కోసం పెద్ద ఎత్తున డబ్బు తదితర వస్తు సామాగ్రి సేకరించి పంపడంలో ప్రముఖ పాత్రను పోషించాడు. 1991 జనవరిలో ఇరాక్‌పై అమెరికా సామ్రాజ్యవాదులు దాడి చేయడాన్ని వ్యతిరేకిస్తూ వీధి నాటికలు, ప్రదర్శనలు, ఊరేగింపులు నిర్వహింప చేశాడు.

1992 వరకూ నగర కమిటీలో కొనసాగుతూ కార్మిక రంగానికీ, ప్రజా సంఘాలకు నేతృత్వం అందించాడు. ఈ కాలంలో అన్ని సెక్షన్ల కార్యకర్తలకు పలు విషయాల్లో రాజకీయ తరగతులు బోధించి మంచి ఉపాధ్యాయుడిగా తయారయ్యాడు. విద్యార్థుల మన్ననలను పొందాడు.

1992 చివరలో క్రాంతి, రాడికల్ మార్చ్ పత్రికల సంపాదక వర్గంలో చేరాడు. ఈ పత్రికల నిర్వహణకు అవసరం అయిన రాజకీయ, సైద్ధాంతిక అధ్యయనాన్ని పెంచుకున్నాడు. ఆనాటి పరిస్థితికి అనుగుణమైన వ్యాసాలను రాసి పత్రికలను రాజకీయంగా సుసంపన్నం చేసేవాడు. ఇదే సమయంలో కవిగా కవితలు, కథలు, పాటలు రాస్తూ విరసం సభ్యుడిగా రాణించి 'మంజీరా'గా ప్రజలకు పరిచయమయ్యాడు. 1995లో జరిగిన కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర కమిటీకి ప్రత్యామ్నాయ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. ఈ కాలంలో తత్వశాస్త్రాన్నీ, మిలటరీ రచనలను అధ్యయనం చేసి పలు క్లాసులు నిర్వహించాడు. పార్టీ ఎదుర్కొన్న రెండవ సంక్షోభ సమయంలో పార్టీ నేతల కెరియరిజం, అవకాశవాద, మితవాద పద్ధతులను ఓడిస్తూ కార్మికవర్గ పని పద్ధతులను ఎత్తిపట్టాడు. ఆయన రచనా సామర్థ్యాలను పరిగణించి ఎ.పి.ఎస్.సి ఆయనను 1995 చివరిలో కా॥ ప్రకాష్ మాష్టర్ నేతృత్వంలో ఎ.పి ప్రచార ఆదోళనా శాఖలో నియమించింది. కా॥ ప్రకాష్ మాష్టర్ అమరత్వం తర్వాత 1996 చివరలో ఆయన దాని బాధ్యతలు తీసుకున్నాడు. ఆయన బాధ్యతలో రాష్ట్ర కమిటీ రాజకీయ పత్రిక క్రాంతి క్రమబద్ధంగా వచ్చేది. ప్రచార, ఆందోళనకు సమర్థవంతమైన సాధనంగా వున్నది. మూడు సంవత్సరాలు క్రాంతి పత్రికకు తన సేవలందించిన తర్వాత విప్లవ యుద్ధంలో నేరుగా పాలుపంచుకోవాలనీ, నాయకత్వం వహించాలనీ కోరుకున్నాడు.

ఉద్యమ అవసరాలరీత్యా 1995లో దండకారణ్యం వెళ్లాడు. డి.కె స్పెషల్ జోనల్ కమిటీలో సభ్యుడిగా వుంటూ ఉత్తర బస్తర్ డివిజన్ ఉద్యమానికి నాయకత్వం అందించాడు. జోన్ ఉద్యమాన్ని అధ్యయనం చేస్తూ నేపాల్ ఉద్యమంలో గెంతులా వస్తున్న మార్పును ఆకళింపు చేసుకుంటూ ఇక్కడి ఉద్యమాన్ని కూడా గెంతురూపంలో అభివృద్ధి చేయడానికి పరితపించేవాడు.

కా॥ శ్రీధర్‌కు హోమియో వైద్యం పట్ల మంచి గురి వుండేది. అందువల్ల హోమియో వైద్యాన్ని అధ్యయనం చేయడంలో విశేషమైన కృషి చేశాడు. ప్రజలకూ, క్యాడర్‌కు అవసరమైప్పుడల్లా హోమియో వైద్య సేవలను అందించాడు.

విప్లవోద్యమాన్ని నిర్మించడానికి, పురోగమింప చేయడానికి కామ్రేడ్ శ్రీధర్ ఎప్పుడూ నూతన సృజనాత్మక పద్ధతులను గురించి ఆలోచించేవాడు. 1999లో ఆంధ్రరాష్ట్ర కమిటీలోకి బదిలీ అయి గుంటూరు జిల్లా ఉద్యమ బాధ్యతలు చేపట్టాడు. రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, జిల్లా కార్యదర్శిగా అంతర్గత సమస్యలను అధ్యయనం చేస్తూ జిల్లా సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను అధ్యయనం చేస్తూ మొత్తం క్యాడర్‌ను సంఘటిత పర్చుతూ సమిష్టి పని పద్ధతులను అభివృద్ధి పరిచాడు. తప్పుడు ధోరణులు సరిదిద్దడం ద్వారా యావత్తు శ్రేణులలోనూ ఐక్యతా స్ఫూర్తిని తీసుకువచ్చాడు. రైతాంగ పోరాటాల ద్వారా ప్రజా సంబంధాలను బలోపేతం చేసుకునేలా మార్గదర్శకత్వం వహించాడు. భూస్వాముల, వడ్డీ వ్యాపారుల, రాజకీయ నాయకుల దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా ప్రజలను కదిలిస్తూ శిక్షింప చేశాడు.

టి.సి.ఓ.సి క్యాంపెయిన్‌లను విజయవంతం చేయడంలో ప్రజా సమస్యలను జోడించి పల్నాడులో ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేశాడు. ఇన్‌ఫార్మర్లనూ, దుష్ట రాజకీయ నాయకులనూ, రేపిస్టులనూ ఏరిపారేయడంలో ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచాడు. ఫాసిస్టు పోలీసుమూకలపై దాడుల వంటి ఎత్తుగడల ద్వారా ప్రజలను యుద్ధంలో భాగం చేశాడు. అతడి నాయకత్వంలో నిర్వహించిన అడిగొప్పుల, నెమలిపురి ఆంబుష్‌లు విజయవంతమై గ్రేహౌండ్స్, ప్రత్యేక పోలీసులు కుక్కచావు చచ్చారు. కరువు దాడుల పోరాటాలకు నాయకత్వం వహించాడు. ఆ దాడుల్లో ప్రజలు బియ్యం, బట్టలు, ధాన్యం మొదలైన నిత్యావసర వస్తువులను స్వాధీనం చేసుకొని తిరిగి శత్రువుకు దొరకకుండా

దాచుకున్నారు. అతడి నాయకత్వంలో జిల్లా పార్టీ బ్యాంకులపై దాడులు చేసి డబ్బులు, బంగారం, తుపాకులు స్వాధీనం చేసుకొని డబ్బులు ప్రజా సంక్షేమానికి వినియోగించింది. కా॥ శ్రీధర్ భూస్వామ్య వ్యతిరేక, కరువు వ్యతిరేక పోరాటాలను సైనిక చర్యలతో జోడించాలన్న పథకం జిల్లాలో అనుకూల ఫలితాలను ఇచ్చింది. యావత్తు రాష్ట్రంలో మంచి ప్రభావం వేసింది. కార్యకర్తల అనుభవం, ప్రజల మనోబలం పెంచడంలో భాగంగా కార్యకర్తలతో నందిగామ పోలీస్ స్టేషన్‌పై దాడి చేయించడం, దళసభ్యుల, కార్యకర్తల ద్వారా అద్దంకి పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి దాదాపు 18 ఆయుధాలు స్వాధీనం చేసుకోవడం వంటి దాడులకు అతడు నేతృత్వం వహించాడు. నర్సరావుపేటలో ఎన్.సి.సి క్యాడెట్ల శిక్షణ కోసం వుంచిన ఎల్.ఎం.జి, 303 రైఫిళ్ళ వంటి 25 ఆయుధాలు స్వాధీనం చేసుకోవడంలో, రకరకాల ఎత్తుగడల ద్వారా శత్రువును నిర్మూలించి ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంలో, మొత్తం బలగాల శక్తియుక్తులను వెలికి తీయడంలో క్రియాశీలక పాత్ర వహించాడు. మొత్తంగా పల్నాడులో ప్రజాయుద్ధాన్ని పెంపొందింప చేయడంలో చురుకైన పాత్రను నిర్వహించాడు. కా॥ శ్రీధర్ చలనశీలత వలన ప్రజాపోరాటాలను సాయుధ పోరాటాలతో కలిపే సృజనాత్మక పద్ధతుల వల్లనూ రెండేళ్లలో జిల్లా ఉద్యమం గణనీయమైన అభివృద్ధిని చవిచూసింది.

చర్చల తర్వాత శత్రువు బహుముఖ దాడులు చేస్తూ, ఉద్యమానికి తీవ్ర నష్టం కలిగిస్తూ, రకరకాల పేర్లతో ప్రైవేట్ ముఠాలను ఏర్పాటు చేసి ప్రజాసంఘాలపై పాశవికంగా దాడులూ, బెదిరింపులూ, హత్యలు చేస్తూ ప్రజలలో భయోత్పాతాన్ని సృష్టిస్తుంటే శత్రు దూకుడుకు కళ్ళెం వేస్తూ చిలకలూరిపేట పోలీస్ స్టేషన్‌పై దాడికి పథకం వేసి విజయవంతం చేశాడు.

2005 సెప్టెంబర్‌లో సెక్రటేరియట్ సభ్యుడుగా ఎన్నికై గుంటూరు, అనంతపురం జిల్లాలను గైడ్ చేస్తూ చర్చల సమయంలో పెరిగిన రిక్రూట్‌మెంట్‌ను రాజకీయంగా, నిర్మాణపరంగా అభివృద్ధిపరుస్తూ పరిస్థితులకు అనుకూలమైన నిర్మాణాలను చేపట్టాడు. ప్లాటూన్లు ఏర్పాటు చేసి సాయుధం చేయడానికి ఆంధ్రా, కర్ణాటక పోలీసుల సంయుక్త దాడులను తిప్పికొడుతూ కర్ణాటక పోలీస్ క్యాంపుపై దాడికి ప్లాన్ చేశాడు. ఉద్యమంలో వస్తున్న ఆటుపోటుల సమయంలో రాజకీయ, మిలటరీ పరిష్కారాలకు అవసరమైన నిర్దిష్ట రాజకీయ అధ్యయనాన్ని పెంపొందించుకున్నాడు.

కా॥ శ్రీధర్ 24 సంవత్సరాల విప్లవ జీవితంలో అలుపెరుగని యోధుడు. వర్గ శత్రువులకు వ్యతిరేకంగానే గాక పార్టీ రాజకీయ పంథాలో తనకు తప్పనిపించినవాటిని మీద కూడా నిరంతరం పోరాటం చేశాడు. పార్టీ రాజకీయ పంథా, పార్టీ అవలంభించిన ఎత్తుగడలలో, పార్టీ పనిశైలిలో లోపాలుగా తను భావించిన వాటి గురించి వివరిస్తూ ఆయన అనేక డాక్యుమెంట్లు రాశాడు. ప్రత్యామ్నాయ సూచనలు చేశాడు. 1993లో ప్రపంచ యుద్ధ ప్రమాదం వున్నదన్న పార్టీ వైఖరిని ఖండిస్తూ ఆయన ఒక వ్యాసం రాశాడు. ప్రపంచవ్యాప్త విప్లవ దాడివల్ల యుద్ధ ప్రమాదం వెనక్కి పోయిందనీ, ప్రపంచ యుద్ధం బద్దలు కావడం దాదాపు అసాధ్యమనీ నొక్కి చెప్పాడు. ఇది మునుపటి భా.క.పా (మా-లె)(పీపుల్స్‌వార్) అధికార పత్రిక పీపుల్స్‌వార్‌లో నాటి సి.ఒ.సి జవాబుతో సహ ప్రచురితమైంది. పార్టీ మౌలిక డాక్యుమెంట్లలో కొన్ని అధ్యాయాలను ఎ.పి రాష్ట్ర మహాసభ కోసమూ, రానున్న కాంగ్రెస్‌లో చర్చ కోసమూ తిరగ రాశారు. ఆయన అమరత్వానికి సరిగ్గా వారం రోజుల ముందు ఆయన మరో డాక్యుమెంటు రాసి సి.సికి పంపించాడు. రాజకీయ అభిప్రాయాలూ వైఖరుల విషయంలో ఆయన రాజీలేని యోధుడు. ఆయన పేరు పొందిన కవి, రచయిత. మంజీరా పేరుతో అనేక కవితలు, వ్యాసాలూ రాశాడు. ఒక్క నిమిషం కూడా వృధా చేసేవాడు కాదు. తక్కువ మాట్లాడేవాడు. సమయం దొరికినప్పుడల్లా రాయడంలోనూ, చదవడంలోను నిమగ్నమయ్యేవాడు. ఆయన చాలా ఎక్కువగా రాసేవాడు. ఈ రెండూ కలెగలిసిన మంచి అధ్యయనశీలి.


కా॥ శ్రీధర్ అమరత్వం పార్టీకీ, ఎ.పిలో విప్లవోద్యమానికీ మాత్రమేగాక యావత్తు దేశానికి గొప్ప నష్టం. పార్టీ చలనశీలమైన ఆర్గనైజర్‌నూ, చక్కని వ్యూహకర్తనూ, సృజనాత్మక ఆలోచనా పరుడినీ, ప్రేరేపించే విప్లవ రచయితనూ, ఒక్క మాటలో చెప్పాలంటే భారత విప్లవాన్ని మరింతగా పురోగమింపజేసేందుకు ఎంతగానో ఉపయోగపడే దోహదాలు అందించగలిగే ఒక గొప్ప మేధావిని కోల్పోయింది.

కా॥ శ్రీధర్‌లోని పట్టుదలనూ, అకుంఠిత దీక్షనూ, చొరవనూ, ముందుచూపునూ స్వంతం చేసుకుంటూ సిద్ధాంతాన్ని ఆచరణలో ఎలా కలపాలో, పెన్నునూ గన్నునూ ఏక కాలంలో ఎలా ఉపయోగించాలో నేర్చుకుందాం. ఆయన ఆశయ సాధనలో పార్టీ, పి.ఎల్.జి.ఎ ఐక్య సంఘటనలను బలోపేతం చేద్దాం. అదే కామ్రేడ్ శ్రీధర్‌కు మనం ఇచ్చే నివాళి.

### శత్రు గుండెలపై పి.ఎల్.జి.ఎ కవాతును నడిపిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యుడు

# కామ్రేడ్ రవి కుమార్ (శ్రీధర్)కు విప్లవ జోహార్లు

కా॥ శ్రీధర్‌ను ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలంలోని పి.ఆర్.సి తండా సమీప అడవుల్లో గ్రేహౌండ్స్ పోలీసులు పట్టుకొని చిత్రహింసలకు గురిచేసి 2006 జూన్ 14వ తేదీన హత్యచేసి ఎప్పటిలాగానే ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లారు. అరెస్టు చేసి కేసులు పెట్టే అవకాశం ఉన్నప్పటికీ మానవ రక్తాన్ని రుచిమరిగిన ఎస్.ఐ.బి, గ్రేహౌండ్స్ హంతక బలగాలచే వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి, జానారెడ్డిలు క్రూరంగా హత్య చేయించారు. కా॥ శ్రీధర్ బతికి వుండడం ఎప్పటికైనా ప్రమాదకరమని భావించడం మూలంగానే పాలకవర్గాలు హత్య చేశాయి.



కా॥ శ్రీధర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శివర్గ సభ్యునిగా, ఆటుపోటులకు గురవుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యమాన్ని రాజకీయ, మిలటరీ పరిష్కాల ద్వారా అభివృద్ధి చేయడానికి తను బాధ్యత వహించిన గుంటూరు జిల్లా ఉద్యమంలో అనేక ప్రయోగాలు చేశాడు.

కా॥ శ్రీధర్(రవి కుమార్) రంగారెడ్డి జిల్లా, తాండూరులో జన్మించాడు. తాండూరులో 10వ తరగతి వరకు విద్యనభ్యసిస్తూ వామపక్ష భావాలవైపు ఆకర్షితుడై, సాహిత్య అధ్యయనంపై అభిరుచిని పెంచుకున్నాడు. హైదరాబాద్‌లోని మసాబ్‌టాంక్ పాలిటెక్నిక్ కళాశాలలో చేరి రివిజనిస్టు రాజకీయాలను అసహ్యించుకుంటూ విప్లవ రాజకీయాలను ఎత్తిపట్టాడు. రాడికల్ విద్యార్థి సంఘంలో చేరి, క్రియాశీలక కార్యకలాపాల్లో నిమగ్నమైనాడు. 1984లో వృత్తి విప్లవకారుడిగా మారి తాండూరు, వికారాబాద్ విద్యార్థి ఆర్గనైజర్‌గా పని చేశాడు. ప్రజా ఉద్యమాలపై అప్రకటిత నిషేధాన్ని కొనసాగిస్తున్న క్రమంలో అప్పటి వరకు బహిరంగంగా పని చేస్తూ వచ్చిన ఆర్.ఎస్.యు బహిరంగంగా పని చేయలేని పరిస్థితి ఏర్పడింది. దానివల్ల ఉన్న అవకాశాలు ఉపయోగించుకొంటూనే వివిధ రూపాలలో కవర్ సంఘాలనూ, ఐక్య సంఘటనలనూ, సమస్యల ప్రాతిపదికపై వేదికలను ఏర్పాటు చేస్తూ, కార్యక్రమాలను నిర్వహించాడు. స్కాలర్‌షిప్, మెస్ ఛార్జీలను పెంచాలనీ, ఫీజులు తగ్గించాలనీ, సీట్లు పెంచాలనీ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఇలా అనేక రకాల పోరాటాలకు నాయకత్వం వహించాడు. 1986లో రిజర్వేషన్లకు అనుకూలంగా మండల్ కమీషన్ సూచనలను అమలుపరచాలని రిజర్వేషన్ సంరక్షణ సమితి ఏర్పాటు చేయడంలో రాష్ట్రవ్యాప్త విద్యార్థులను ఆర్గనైజ్ చేయడంలో మంచి భూమికను పోషించాడు.

ఇదే సంవత్సరం హైదరాబాద్ నగర కమిటీలోకి ఎన్నికయ్యాడు. 1987 వరకూ కార్మిక రంగానికి నాయకత్వం వహించాడు. ఆంప్రో బిస్కెట్స్, ట్రాన్స్‌ఫార్మర్స్ తయారీ కంపెనీల యాజమాన్య దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులను సంఘటితం చేశాడు. హెచ్.ఎం.టి, ఆల్విన్ కంపెనీలను ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వ విధానాలను ఎండగట్టిన పోరాటాలకు నాయకత్వం వహించాడు. బాలానగర్, సనత్‌నగర్, జీడిమెట్ల, పటాన్ చెరువు, రామచంద్రాపురం, ఈ.సి.ఐ.ఎల్, నాచారం, ఉప్పల్ తదితర పారిశ్రామిక ప్రాంతాలలో కార్యకలాపాలను విస్తరింప చేస్తూ కార్మికులను సంఘటితం చేశాడు. అప్పట్లో రాష్ట్రంలో అమలవుతున్న నిర్బంధాన్ని ఎదుర్కోవడంలో భాగంగా ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయాలని 1987లో పార్టీ నిర్ణయించింది. ఆ నిర్ణయంలో భాగంగా కా॥ శ్రీధర్ నాయకత్వంలో హైదరాబాద్ నగరంలోని పారిశ్రామిక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పలు చర్యలు జరిగాయి. పార్టీ ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించుకోవడంలో భాగంగా 87లో నగర కమిటీ ఒక మనీ యాక్షన్ చేసింది. ఈ చర్యలో పెద్ద మొత్తంలో డబ్బూ, రెండు .303 తుపాకులు స్వాధీనమయ్యాయి. ఈ చర్యలో కా॥ శ్రీధర్ చురుగ్గా పాల్గొన్నాడు.

*(తరువాయి 58వ పేజీలో.....)*